"కళాప్రపూర్ణ"

# శ్రీ ఎస్.టి.జి. వరదాచార్యుల వారి రచనలు

— ఒక పరిశీలన

50726

డాక్టర్ ఎస్. పాండురంగ విఠల్ ఎమ్.ఏ., పిహెచ్.డి.
వ్యాకరణ శిరోమణి

గోపీరమణ పబ్లికేషన్స్
తిరుపతి

# 'కళాప్రపూర్ణ' ఎస్.టి.జి. వరదాచార్యులవారి రచనలు—ఒక పరిశీలన


డాక్టర్ ఎస్. పాండురంగ విఠల్

ఎమ్.ఏ., పిహెచ్.డి., వ్యాకరణ శిరోమణి

రిసెర్చి అసోసియేట్ (యు.జి.సి)

సంస్కృతవిభాగము, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ

తిరుపతి.



గోపీరమణ పబ్లికేషన్స్

తిరుపతి

1992

A Study of "Kalāprapūrṇa"
S.T.G. Varadacharya's Works.

By
Dr. S. Panduranga Vithal

First Edition : 1992

Copies : 1000

THE SHELF
TESWARA
RY &
ENTRE.
50726
ATI.

For Copies

Dr. S Panduranga Vithal
Dept. of Sanskrit
S.V. University
Tirupati-517 502 A. P.

This book is published with the financial assistance of Tirumala-Tirupati Devasthanams under their scheme "Aid to Publish Religious Books"

Price Rs. 50/-

Printed at

SRI SATYA SAI PRINTERS
16-2-151C, T.Nagar, Tirupati.

# प्र श स्तिः

**Sāstra ratnākara, Tarka vāchaspati**
**Recipient of President award**
**Prof. N S. RAMANUJATATACHARYA**
**Vice-chancellor**
**Rashtriya Sanskrit Vidyapeetham**
**Tirupati.**

श्रीवेंकटेश्वरविश्वविद्यालये संस्कृतविभागे सहायकानुसन्धातृपदमधितिष्ठता डा. पाण्डुरङ्गविट्ठलमहाशयेन लिखितं "कलाप्रपूर्ण– एम्. टि. जि. वरदाचार्यकृतयः–एक परिशीलनम्" इति शीर्षकाङ्कितं विमर्शरूप प्रबन्ध तेलुगुभाषया विरचितम् अवालोकयम्। श्रीमन्तः एस्. टि जि वरदाचार्याः न्याय व्याकरणादिशास्त्रेषु पण्डिता मद्रास्विश्वविद्यालये M A. (Hons) परीक्षाया सर्वप्रथमश्रेण्यामुत्तीर्णा सुवर्णपतकपुरस्कारंभाज महाकवय. अनेकासु कलाशालासु अध्यापकपदमलंकृत्य 'चिट्टिगूडूरु' नगरे स्वय कश्चित् संस्कृतमहाविद्यालय प्रतिष्ठाप्य तस्यं निर्वाहकाध्यक्षा. सन्त. बहून् संवत्सरान् त निरवहन्। तस्मिन् महाविद्यालये तत्तच्छास्त्रे निष्णातान् प्रख्यातान् विदुष नियुज्य तद्द्वारा बहून् छात्रान् विद्यामजिग्रहन्। तत्राधीतिन छात्रा अपि प्रख्यातपण्डिता. सन्तः अनेकासु संस्थासु उन्नतानि पदान्यधिष्ठाय प्रशंसनीय कर्म कुर्वन्तो विराजन्ते। वरदाचार्याणा सविधेऽधीतवन्तश्छात्रा. बहव । वरदाचार्यै लिखिता गद्यमया पद्यमयाश्च प्रबन्धा भूयांसः। तेषां फणितय मधुमय्यः सरसा सरला. अकृत्रिमाः सहृदयहृदयरञ्जका। एते राष्ट्रपतिना सम्मानिताः।

आबाल्यात् विद्यापरिश्रमिणः अध्ययनभावनाभ्यां शास्त्र-सारार्थान् निर्णीय तान् छात्रेषु संक्रामितवन्तः स्वतःप्राप्तं पैतृकं च धनं कलाशालास्थापनेन विदुषां छात्राणां च पोषणेन संस्कृत-शास्त्राभिवर्धनकर्मणि व्यनुयुञ्जन इमे वरदाचार्याः। एतेषां प्रायो नवतिवर्षात्मक जीवनवृत्तान्तः आदर्शभूत. पावनश्च। अनुश्लोकनीय-महिमान इमे आचार्या इत्यत्र न कोऽपि सशयः कस्यापि।

प्रकृतविमर्शप्रबन्धकर्ता एतेपामाचार्याणां जीवनवृत्तम् एतैः विरचितस्य एकैकस्य प्रबन्धस्य इतिवृत्तम् अन्यत्र अपेक्षित सर्व नवीनविमर्शमार्गमनुसृत्य अस्मिन् सुष्ठु प्राचीकशत्। ग्रन्थोऽय पीएच्. डी. इति उपाध्यर्हतया निर्णीत. इदानी मुद्राप्य प्रकाश्य-मान. सर्वेषा विमर्शकाना प्रमोदाय कल्पते। अय ग्रन्थकर्ता विट्ठलः संस्कृतभापायामपि अनेकान् अनुसन्धानप्रबन्धान् व्यलिखत्। भगवतः वेंकटेशस्य कृपया आयुरारोग्यादिसंपन्नः इत्थंरूपं विमर्श-कर्म कुर्वन् उत्तम पदमधिष्ठाय सर्वेषां बहुमानपात्र भूयादित्याशासे।

—एन्. एम् रामानुजताताचार्य

# FOREWORD

Dr. M. NARASIMHACHARY
Professor & Head,
Dept. of Vaishnavism,
University of Madras,
Madras.

It gives me immense pleasure in writing this Foreword to the Thesis entitled "Kalāprapurṇa Sri S T.G. Varadacharya's Compositions-A Study" submitted to Sri Venkateswara University for the Award of the Degree of Doctor of Philosophy in Sanskrit, by Dr S. Panduranga Vithal in the year 1988. Prepared under the able supervision of Prof. S. B. Raghunathacharya, this study constitutes a solid contribution to the knowledge about a modern scholar of eminence in Sanskrit. It has to be pointed out that some time ago, it was considered a taboo to highlight the contributions of a contemporary person; but thanks to the initiative taken by the supervisor of this project, this important study has been undertaken and completed with remarkable precision and perfection.

Sri S.T.G. Varadacharya belongs to a class of Sanskrit scholars who have a happy combination of traditional learning in Sanskrit and the much-required "modern approach" inherited from the

English learning. He was an original thinker, eminent writer, inspired poet, an outstanding teacher and exemplary administrator, rolled into one. A devoted & beloved disciple of Mm S. Kuppuswami Sastriar & Prof M. Rangacharya, the two stalwarts of traditional Sanskrit learning in those days, Sri Varadacharya passed M.A. (Hons.) in Sanskrit in I Class from the Presidency College, Madras, and won the Gold Medal. That he was a great patriot and admirer of Gandhiji and his Independence Movement etc; add a new dimension to the personality of the Acharya. That he wrote 14works big and small, some originals and some translations, including a pioneering work on Comparative Philology in Sanskrit, is again a significant aspect of his dynamic intellect. That he founded "Sri Nārasiṁha Sanskrit College" in 1923 in his native village and propagated Sanskrit through it is again a work of no small significance.

All these aspects of Sri S. T. G. Varadacharya are very well brought out in the handsome thesis now in our hands. I therefore congratulate the young author, Dr. S Panduranga Vithal for this highly informative and valuable study. I may also observe that works of this kind are a desideratum in these days since many of us are blissfully ignorant of the contributions of our own contemporaries or

authors of recent past, especially so when the writer happens to live outside the borders of our home-state. The present thesis serves as a model for other works of this kind I also urge hereby Dr. Pandu ranga Vithal to bring out many works of significance like this, for the benefit of scholars and teachers alike

*Date*
*6-8-1991* —M. NARASIMHACHARY

# ముందుమాట

ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య
సంస్కృతవిభాగాధ్యక్షులు,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి.

కొందరు వ్యక్తులకు వారున్న ప్రదేశంద్వారా పేరు ప్రసిద్ధి ఏర్పడితే, కొన్ని ప్రదేశాలకు కొందరు వ్యక్తులద్వారా లోకప్రసిద్ధి కలుగుతుంది. కృష్ణాజిల్లాలో చిట్టిగూడూరు ఒక చిన్న పల్లెటూరు. దానికి ఆంధ్రదేశంలోనేగాక భారతదేశమంతట సువిశాల కీర్తిప్రతిష్ఠలను సంపాదించిపెట్టినవారు శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యులవారు. శ్రీ వరదాచార్యులవారి శిష్యులమని, చిట్టిగూడూరు కళాశాల ప్రాచీన విద్యార్థులమని చెప్పుకోవడానికి ఈనాటికి మాకెంతో గర్వంగా ఉంటుంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ"తో సత్కరించినా, సహజంగా "మహోపాధ్యాయ", "కులపతి" బిరుదభాసురులైనా అగర్వ శ్రీమంతులై అసామాన్యమైన సిరిసంపదలు కలిగి ఉన్నా, తరతమభేదం లేకుండా సంస్కృతభాషను నేర్పడానికి తమ జీవిత సర్వస్వాన్ని వినియోగించిన శ్రీ ఆచార్యులవారు నిజంగా ధన్యజీవనులు. వారి వ్యక్తిత్వం ఉదాత్తగంభీరమైనది. వారు చేసిన సరస్వతీ సమారాధనం అనితరసాధ్యమైనది.

స్వగ్రామమైన చిట్టిగూడూరులో శ్రీ నారసింహ సంస్కృత కళాశాలను నెలకొల్పడంలో గాని, శిథిలవ్యవస్థతో ఉన్న ఆంధ్రజాతీయ కళాశాలను తీర్చిదిద్దడంలో గాని, ఆంధ్రప్రదేశ్‌లో ఓరియంటల్

ఉన్నతపాఠశాలలను స్థాపించడానికి ప్రేరణనివ్వడంలోగాని, జాతీయ విద్యావిధానంపైన వారికిగల మక్కువ, మన సంస్కృతి పరిరక్షణలో వారికి గల ఆదరం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. మహాత్మాగాంధీజీ తలపెట్టిన ఉద్యమానికి ప్రెసిడెన్సీ కళాశాల విద్యార్థిగా ఉన్న-రోజుల్లోనే అందరు ఆశ్చర్యపడేటట్లు భూరి విరాళాన్ని ప్రకటించిన ఆచార్యులవారి దేశభక్తిని ఎలా విలువకట్టగలం?

ఒక ప్రక్కన ప్రభుత్వపదవులను నిర్వహిస్తూ సమాజహిత కార్యక్రమల్లో తలమునకలౌతూకూడా మధురమైన కవితాజగత్తును సృష్టించిన ఆచార్యులవారి మృదువైన హృదయస్పందనను మనం వారి రచనలలో అర్థం చేసుకోవచ్చు. తెలుగుశతకసాహిత్యంలోని తియ్యందనాలను ఇతర రాష్ట్రంవారికి అందించాలని వారు చేసిన సంస్కృతశతకానువాదాలు మూలగ్రంథాలను అతిశయించి ఉంటాయనడం అతిశయోక్తి కానేకాదు.

మహాకవి కాళిదాసంటే వారికి పంచప్రాణాలు. వారు చేసినంత కాళిదాస పదపద్మారాధనం ఇంకెవరూ చేయలేదని చెప్పవచ్చు. "సుషుప్తివృత్తం", "సత్యవిజయం" అనే వారి స్వతంత్రకావ్యాలను చదువుతున్నవారికి ప్రతిపదంలోను, ప్రతి కల్పనలోను, ప్రతిప్రయోగంలోను మహాకవి దర్శనమిస్తాడు.

సంస్కృతభాషా ప్రచారానికి అంకితమై ఎన్నో సంస్థలకు సేవ చేస్తూ, కలుషితమైన పట్టణవాతావరణానికి దూరంగా సామాన్యమైన పల్లెలో ఉంటూ, కృషీవలుడుగా కేదారాలను సస్యశ్యామలం చేస్తూ, సాహితీకృషీవలుడుగా కవితాక్షేత్రాలలో రససురభిళాలైన సుపద్యాలను పండించిన పండితవరేణ్యులు మా గురువరేణ్యులు శ్రీమాన్ వరదా-

చార్యుల వారసత్వం వాస్తవమే కాని స్వసంపాదు. అలాంటి మహోన్నత వ్యక్తి చేసిన రచనలపైన సమగ్రమైన పరిశీలన జరుగవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎప్పటినుంచో నా మనసులో ఒక భావన ఉండేది.

విద్వద్వరిష్ఠులైన ఆచార్యులవారి రచనలపై పరిశీలన సామాన్యమైన పనికాదు. వ్యాకరణ-సాహిత్యాల్లో మంచి పరిచయం గల చి. పాండురంగ విఠల్ పరిశోధనకోసం నాదగ్గరకు వచ్చినప్పుడు ఈ అంశాన్ని సూచించాను. అతను మీ ప్రోత్సాహం ఉంటే కష్టమైనదైనా నా పరిశోధనకు అలాంటి విషయాన్నే ఎన్నుకుంటానన్నాడు. అలాగే చాలా కష్టపడి పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సంపాదించాడు.

స్వప్రయోజనాలనాశించి విదేశాలకు వెళ్ళి వారికి సేవచేసే వారెందరో ఉన్నా తను ఉన్న సమాజావసరాలకోసం స్వార్థాన్ని త్యజించి, మనదేశంలోనే ఉండి విజ్ఞానాన్ని అందరికీ పంచిపెట్టిన ప్రముఖ పండితులనుగూర్చి, గ్రంథాలను పరిశోధించడం, వారికి సంబంధించిన కొన్ని అమూల్యమైన విషయాలను వెలుగులోకి తీసుకురావడం విశ్వవిద్యాలయాల్లో తప్పక జరుగవలసిన పని. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సంస్కృతవిభాగంలో ఇలాంటి కార్యక్రమం ఇదం ప్రథమంగా తీసుకోవడం జరిగింది. దానిని ఇతను శ్రద్ధతో పూర్తి చేసి డిగ్రీ తీసుకోవడం కాకుండా తరువాత కూడా అదే రంగంలో కృషిని కొనసాగిస్తూ ఈ పరిశోధన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాడు. ఇతనిని మనసారా అభినందిస్తున్నాను. డాక్టర్ విఠల్ ఇకముందు కూడా మంచిరచనలను చేసి అందరి మన్ననలకు పాత్రుడు కాగలడని ఆశిస్తున్నాను.

మన దేశంలోని విద్యావంతులకు ఆదర్శంగా నిలచిన శ్రీవరదా-చార్యులవారి విశిష్టతను చాటిచెప్పే ఈ పరిశోధన వ్యాసాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ఆర్థికసాహాయ్యమొనర్చిన తిరుమల-తిరుపతి దేవస్థానాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

"ప్రసీద తస్మాన్మయి దైవివాది।"

సత్యేడ్
25-11-1991

—ఎస్. వి. రఘునాథాచార్య

# ప్రస్తావన

పంధొమ్మిదవ శతాబ్దాంతమున పండితవంశమునందు జన్మించి మహామహోపాధ్యాయుల శిష్యులై, మద్రాసు విశ్వవిద్యాలయమున ఎమ్.ఏ. (ఆనర్స్) పరీక్షలో సర్వప్రథములుగ నుత్తీర్ణులై, జాతీయోద్యమమున పాల్గొని, కృష్ణామండలమునందలి చిట్టిగూడూరులో శ్రీనారసింహ సంస్కృత కళాశాలను స్థాపించి శిష్యకామేష్టిని చిట్టచివరి వరకు నిర్విరామముగ నిర్వహించిన ధన్యజీవులు, శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యులవారు. తమ జీవితమునంతటిని సంస్కృతభాషాప్రచారోద్యమమునకు సమర్పించి, ఆంధ్రదేశమునకలంకారభూతులై మహామనీషులై కులపతి పీఠమునధిష్ఠించి చిరస్మరణీయులైన శ్రీ ఆచార్యుల వారిని కళాప్రపూర్ణులనొనర్చి ఆంధ్ర విశ్వవిద్యాలయము తన్ను తాను సమ్మానించుకొనినది.

వారి జీవితమును, రచనలను సమగ్రముగ పరిశోధించి కొన్ని విశిష్టాంశములను ఈనాటి సమాజమునకు తెలియజెప్పుటయే ఈ పరిశీలనకు పరమావధి. దానిని ఈ శోధ ప్రబంధమున ఆరు అధ్యాయములలో కొనసాగించితిని.

అందు ప్రథమాధ్యాయమున శ్రీవరదాచార్యులవారి వ్యక్తిగత సారస్వత జీవితములలోని విశేషములు చక్కగా విశ్లేషింపబడినవి. ద్వితీయాధ్యాయమున వారి స్వతంత్ర గ్రంథములను ఒకదొకటిగ తీసికొని అనేక దృక్కోణములనుండి పరిశీలించుట జరిగినది. తృతీయాధ్యాయమున ఆచార్యులవారు తెనుగునుండి సంస్కృతభాషలోనికి చేసిన అనువాదములపై తులనాత్మక పరిశీలన చేయబడినది.

చతుర్థాధ్యాయమున శ్రీ వరదాచార్యుల వారి జీవితము పైనను, రచనలపైనను సమకాలీనమైన జాతీయోద్యమ ప్రభావమెంతవఱకు గలదని సోపష్టంభముగ విమర్శించబడినది. పంచమాధ్యాయమున సంస్కృతభాషా సాహిత్యములకు శ్రీ ఆచార్యులవారి **అనువాదమెటు-**వంటిదను **అంశము** నిష్కృష్టముగ నిరూపించబడినది.

ఇక ఆరవ అధ్యాయమున ఈ పరిశోధనమున నిగ్గుదేలిన అంశములు ఉపసంహారవ్యాజమున పేర్కొనబడినవి.

సంస్కృత భారతీపదపద్మసమారాధనమున తొంబది సంవత్సరముల నిండు జీవితమును అంకితమొనర్చిన ఒక మహామనీషి కృషిపై ఇదంప్రాథమ్యేన జరిగిన పరిశీలన ఈ పరిశోధన ప్రబంధము. సహృదయులగు విద్వాంసులు ఆమహనీయుని మహోన్నతాదర్శము-లను ఈ శోధప్రబంధమునుండి గ్రహించి స్ఫూర్తినందుదురని నా దృఢవిశ్వాసము.

—ఎస్. పాండురంగ విఠల్

# కృతజ్ఞతలు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సంస్కృత విభాగాధ్యక్షులు మద్గురువరేణ్యులు డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్యులుగారు పరిశోధన రంగమున నన్ను ప్రోత్సహించి నాకొక విశిష్టమైన పరిశోధనాంశమును సూచించినారు. సుగృహీతనామధేయులైన శ్రీ ఆచార్యుల వారు నా పరిశోధనకు పర్యవేక్షకులుగ అంగీకరించుట నా భాగ్యము. వారే అడుగడుగున చేయూతనిచ్చి క్లిష్టమైన ఈ పరిశోధనకార్యమున నన్ను కృతకృత్యునొనర్చినారు. వారికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

బాల్యమునుండి నాకు విద్యాబుద్ధులు చెప్పి నన్ను వృద్ధిలోనికి తీసికొని వచ్చిన మా మామగారు డా॥ కె. గోవిందయ్య గారికి....

నా పరిశోధన కవసరమగు ఎన్నో అంశములను తెలియజేసిన పండితవరేణ్యులు యశఃకాయులు శ్రీమాన్ తట్టా నరసింహాచార్యుల వారికి ...

పిట్టిగూడూరులో పరిశోధన కవసరమగు ఛాయాచిత్రాదులనిచ్చిన శ్రీమాన్ శ్రీ ఎస్. టి. జి. వరదాచార్యుల వారి మనుమడు శ్రీ ఎస్.టి.జి. వరదాచార్యులు (బాబు) గారికి .

నాకెంతో సాహాయ్యమొనర్చిన సంస్కృతవిభాగములోని గురువర్యులు ఆచార్య వి. అంజనేయశర్మ గారికి, డా॥ ఎమ్. ఎస్. నారాయణమూర్తి గారికి, శ్రీ బి.సి. హుస్సేని గారికి, డా॥ కె. ప్రతాప్ గారికి....

అవసరమగు సలహాలనొసంగిన ఆచార్య ఎస్.ఎస్. రామానుజ తాతాచార్యుల (వైస్-ఛాన్సలర్, రాష్ట్రీయ సంస్కృతవిద్యాపీఠం, తిరుపతి.) వారికి .

పరిశోధన కాలమున నాకు ఉపకారవేతనమునొసంగిన UGC వారికి ..

తిరుమల-తిరుపతి దేవస్థానము కార్యనిర్వాహణాధికారులు శ్రీమాన్ ఎం.వి.ఎస్. ప్రసాద్ గారికి .

పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా॥ రావుల సూర్యనారాయణమూర్తి గారికి....

సప్తగిరి సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారికి....

గ్రంథమును చక్కగా ముద్రించి యిచ్చిన శ్రీ సత్యసాయి ప్రింటర్స్ అధినేత రామకృష్ణకు నివియే అభినందనలు.

—ఎస్. పాండురంగ విఠల్

# విషయానుక్రమణి

పేజీ నెం.


| | | |
|---|---|---|
| 1 | ప్రథమాధ్యాయము | 1 |
| | శ్రీవరదాచార్యులవారి జీవితము | 1 |
| | వ్యక్తిగత జీవితము | 1 |
| | వంశము | 2 |
| | జననము | 3 |
| | బాల్యము | 4 |
| | ప్రాథమికవిద్య | 4 |
| | ఉన్నతవిద్య | 6 |
| | ప్రెసిడెన్సీవిద్య | 8 |
| | సంప్రదాయాసక్తి | 10 |
| | త్యాగనిరతి | 11 |
| | ప్రథమోద్యోగము | 12 |
| | గజపతుల ఆహ్వానము | 15 |
| | కళాశాలాధ్యక్ష్యము | 16 |
| | సూపరింటెండెంట్ పదవి | 17 |
| | మద్రాసు కాపురము | 19 |
| | దక్షిణభారత పర్యటనము | 19 |
| | సహాయ నిరాకరణము | 21 |
| | అధ్యక్షపదవి | 22 |
| | కొవ్వూరి కాపురము | 23 |
| | స్థితప్రజ్ఞత్వము | 24 |

| | |
|---|---|
| చిట్టిగూడూరు కళాశాల | 25 |
| పర్ణశాల | 28 |
| వంశాంకురము | 29 |
| పుత్రీవియోగము | 30 |
| సమదృష్టి | 31 |
| దువ్వూరివారు | 33 |
| త్వమన్తఃకరణం మమ | 34 |
| జాతీయ కళాశాలోద్ధరణము | 35 |
| లోర్డ్ ఆఫ్ స్టడీస్ | 36 |
| షష్టిపూర్తి | 37 |
| భద్రాచలనివాసము | 39 |
| విశ్రాంతి | 41 |
| సారస్వత జీవితము | 43 |
| సంస్కృత భాషాధ్యయనము | 43 |
| మహామహోపాధ్యాయ శిష్యరికము | 44 |
| రాయుడుశాస్త్రి సహవాసము | 45 |
| సారస్వతసేవ | 47 |
| గ్రంథరచన | 47 |
| భాషాశాస్త్ర సంగ్రహము | 49 |
| సుషుప్తివృత్తము | 50 |
| న చేద్వాల్మీకిరభవిష్యత్ | 51 |
| సుమతి - వేమన - కృష్ణ - దాశరథి శతకములు | 51 |
| భాస్కర శతకము | 52 |
| శ్రీకాళహస్తీశ్వర శతకము | 52 |
| గాయత్రీ నీతిగీతావళి | 52 |

| | | |
|---|---|---|
| | నరసింహ శతకము | 52 |
| | ఆంధ్రనాయక శతకము | 53 |
| | ప్రాస్తావిక కదంబము | 53 |
| | సత్యవిజయము | 53 |
| | అకాడమీ విశిష్టసత్కృత్యము | 54 |
| | శిలాలేఖనము | 55 |
| 2 | ద్వితీయాధ్యాయము | 57 |
| | స్వతంత్ర గ్రంథములు - వాటి విశిష్టత | 57 |
| | భాషాశాస్త్ర సంగ్రహము | 58 |
| | సుమప్తివృత్తము | 74 |
| | నామవైశిష్ట్యము | 77 |
| | వస్తువైశిష్ట్యము | 78 |
| | నేతృవైశిష్ట్యము | 83 |
| | రసవైశిష్ట్యము | 84 |
| | అలంకారవైశిష్ట్యము | 85 |
| | భావనావైశిష్ట్యము | 91 |
| | భాషావైశిష్ట్యము | 93 |
| | ప్రయోగవైశిష్ట్యము | 94 |
| | సూక్తివైశిష్ట్యము | 98 |
| | వ చేద్వాల్మీకిరతవిష్యత్ | 100 |
| | సత్యవిజయము | 107 |
| | నామవైశిష్ట్యము | 108 |
| | వస్తువైశిష్ట్యము | 108 |
| | నేతృవైశిష్ట్యము | 109 |
| | రసవైశిష్ట్యము | 110 |

| | |
|---|---|
| అలంకారవైశిష్ట్యము | 112 |
| భావనావైశిష్ట్యము | 115 |
| భాషావైశిష్ట్యము | 116 |
| ప్రయోగవైశిష్ట్యము | 117 |
| మూర్తివైశిష్ట్యము | 118 |
| సంభాషణచాతురి | 121 |
| పాత్రచిత్రణ | 123 |
| ప్రాస్తావిక కదంబము | 129 |
| విశాలాక్షి వివాహము | 130 |
| పదశాస్త్రము - భాషాశాస్త్రము | 131 |
| మహాత్మాగాంధికి జై | 131 |
| నవరత్నమాల | 132 |
| తత్త్వకథనమ్ | 133 |
| పదభాషాశాస్త్ర సమన్వయం | 136 |
| స చేద్వాల్మీకిరభవిష్యత్ | 137 |
| పుత్రీవియోగము | 138 |
| అప్రతిగ్రహము | 138 |
| దువ్వూరివారు | 140 |
| నవ వజ్రమాల | 141 |
| పేరివారి షష్టిపూర్తి | 142 |
| పుష్పాంజలి | 142 |
| కందాడైవారి షష్టిపూర్తి | 143 |
| పట్టాభిషేక ప్రశస్తి | 143 |
| "పట్టాభి" పదవి | 144 |
| ఆంధ్రజాతీయ కళాశాల | 145 |

| | | |
|---|---|---|
| | కాళిదాస ప్రతిభ | 145 |
| | సువర్ణపుష్పమాల | 146 |
| | కాశీవారి సామ్రాజ్య పట్టాభిషేకం | 148 |
| | నాగార్జునసాగర్ | 149 |
| | ఎమ్. వి. రాజగోపాల్ | 149 |
| | మహాకాలప్రభావము | 150 |
| | సీతాపరిత్యాగము | 151 |
| | ప్రొఫెసర్ కె. ఆర్. శ్రీనివాసయ్యంగార్ | 151 |
| | స్వాగతపత్రిక | 152 |
| | వయు అఘు భవద్ధామ భగవన్। | 152 |
| | ప్రొఫెసర్ వి. రాఘవన్ షష్ట్యబ్దపూర్తి | 154 |
| | టి. కె. టి. షష్ట్యబ్దపూర్తి | 155 |
| | తప్పగంతులవారి గృహప్రవేశము | 156 |
| 3 | తృతీయాధ్యాయము | 157 |
| | అనువాదములు - తులనాత్మక పరిశీలన | 157 |
| | అనువాదావశ్యకత | 157 |
| | అనువాదరీతులు | 159 |
| | ఆచార్యులవారి అనువాదములు | 161 |
| | శతక స్వరూపము | 162 |
| | శతకోత్పత్తి - వికాసములు | 165 |
| | ఆంధ్రశతక వాఙ్మయము | 166 |
| | అనూదిత శతకవైశిష్ట్యము | 167 |
| | వేమనశతకము | 168 |
| | సుమతిశతకము | 170 |
| | దాశరథిశతకము | 171 |

| | | |
|---|---|---|
| | కృష్ణశతకము | 173 |
| | భాస్కరశతకము | 174 |
| | శ్రీకాళహస్తీశ్వరశతకము | 175 |
| | గాయత్రీ నీతిగీతావళి | 177 |
| | నరసింహశతకము | 177 |
| | ఆంధ్రనాయక శతకము | 178 |
| | ఆచార్యులవారి అనువాదపద్ధతులు | 179 |
| | అనువాదవైశిష్ట్యము | 180 |
| | తులనాత్మక పరిశీలన | 181 |
| | వేమనశతకము | 181 |
| | సుమతిశతకము | 188 |
| | దాశరథిశతకము | 198 |
| | కృష్ణశతకము | 202 |
| | భాస్కరశతకము | 211 |
| | శ్రీకాళహస్తీశ్వరశతకము | 215 |
| | గాయత్రీ నీతిగీతావళి | 218 |
| | నరసింహశతకము | 220 |
| | ఆంధ్రనాయకశతకము | 227 |
| 4 | చతుర్థాధ్యాయము | 231 |
| | శ్రీవరదాచార్యులవారిపై జాతీయోద్యమప్రభావము | 231 |
| | జీవితము | 232 |
| | వేష-భాషలు | 232 |
| | గాంధీజీ ప్రశంస | 234 |
| | ఆంధ్రజాతీయ కళాశాల | 235 |

| | | |
|---|---|---|
| | దక్షిణభారత పర్యటనము | 236 |
| | ప్రభుత్వోద్యోగమునకు రాజీనామా | 236 |
| | సంస్కృత కళాశాలాస్థాపనము | 237 |
| | మహాత్మాగాంధీకి జై | 239 |
| | ఎ. వి. కళాశాల | 240 |
| | రచనలు | 241 |
| | సమష్టివృత్తము | 243 |
| | ఖద్దరు | 244 |
| | మహాత్మ నమస్కారము | 246 |
| | శ్రీరాముని త్యాగశీలము | 247 |
| | భారతదేశవర్ణనము | 248 |
| | భేదోపాయము | 251 |
| | పరంజ్యోతి | 252 |
| | దేశదుఃస్థితి | 252 |
| | యంత్రప్రభావము | 255 |
| | మహాత్మస్తుతి | 255 |
| | స చేదాల్మీకిరభవిష్యత్ | 257 |
| | ప్రాస్తావికకదంబము | 258 |
| | సత్యవిజయము | 258 |
| 5 | పంచమాధ్యాయము | 259 |
| | సంస్కృతభాషా - సాహిత్యములు - ఆచార్యులవారి అనుదానం | 259 |
| | సంస్కృతభాషా ప్రచారము | 259 |
| | నిర్వైతనికోద్యోగము | 260 |
| | విజయనగరము | 261 |

| | | |
|---|---|---|
| | బాలగురురాష్ట్రములు | 262 |
| | కొవ్వూరు | 262 |
| | సంస్కృత కళాశాలా స్థాపనము | 263 |
| | మోదేకుర్రు | 264 |
| | సంస్కృతభాషా ప్రచారిణీసభ | 265 |
| | ఆంధ్ర విశ్వవిద్యాలయము | 265 |
| | జాతీయ కళాశాల | 266 |
| | నిరంతరాధ్యాపనము | 267 |
| | సాహిత్య ప్రసారము | 268 |
| | స్వతంత్ర రచనలు | 269 |
| | అనువాదములు | 270 |
| | శిలాలేఖనము | 271 |
| | ఉపోద్ఘాతములు | 272 |
| | ఆకాశవాణి ప్రసంగములు | 272 |
| | ఉపన్యాసములు | 273 |
| 6 | షష్ఠాధ్యాయము | 274 |
| | ఉపసంహారము | 274 |
| | శ్రీఆచార్యులవారి లేఖ | 276 |
| | ఆచార్యులవారి జీవితమునందలి ముఖ్యఘట్టములు | 278 |
| | ఉపయుక్త గ్రంథావళి (Bibliography) | 279 |
| | మూలగ్రంథములు (Original Works) | 279-288 |
| | పరిశీలనలు (Studies) | 289 |
| | శోధపత్రములు (Research Papers) | |
| | A. English | 292 |
| | B. సంస్కృతం | 298 |
| | C. తెలుగు | 293 |
| | సంకేతపదసూచి (Abbreviations) | 295-297 |
| | English (Abbreviations) | 299 |

# 'కళాప్రపూర్ణ' ఎస్.టి.జి. వరదాచార్యులవారి రచనలు - ఒక పరిశీలన

## 1 ప్రథమాధ్యాయము

### 1.1 శ్రీ వరదాచార్యులవారి జీవితము :

#### 1.1.1 వ్యక్తిగత జీవితము :

"మహోపాధ్యాయ" "ఉభయకవి" "కళాప్రపూర్ణ" బిరుదభాజులగు శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యుల వారు పందొమ్మిదవ శతాబ్దాంతమున జన్మించి ఇరువదవ శతాబ్దమున భారతభారతికి ఎనలేని సేవ చేసిన మహనీయులలో అగ్రగణ్యులు. ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వము, అనుపమానమైన పాండిత్యము, అద్వితీయమైన కవితావైభవము, ప్రభు మంత్రోత్సాహశక్తి విలసితమగు కార్యనిర్వహణ సామర్థ్యము వారికి సహజసుందరమైన అలంకారములు. సుమారు తొంబది సంవత్సరముల వారి జీవితము విద్యాదేవి సేవలో నిమగ్నులైన వారలందరకు అవశ్యానుసరణీయము, అనమానధి విభవము

అఖండలక్ష్మీవిభవము కలిగియుండియు తృప్తితో జీవితమును అతి సామాన్యముగ గడిపిన ఆచార్యుల వారి విశిష్టత ఈ అధ్యాయమున విశ్లేషింపబడుచున్నది.

వారి జీవితమును వ్యక్తిగత - పారవ్యత భేదముతో ద్వివిధముగ విభజింపవచ్చును. ఈ అధ్యాయమున మొదట వైయక్తిక విశేషాంశములతో గూడిన వారి వ్యక్తిగత జీవితము, తరువాత దేవవాదీ సమారాధనమునకు[1] అంకితమైన పారవ్యత జీవితము స్థాలీపులాకముగ అభివర్ణింపబడుచున్నవి.

1.1.1.1 వంశము :

ప్రాచీనకాలమునుండి తెలుగుదేశమున అచ్చటచ్చట శ్రీవైష్ణవ ధర్మము వ్యాప్తిలో నుండినది. తెలుగుదేశపు అనుంగు బిడ్డయైన రామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకుడై రామానుజాచార్యులుగా ప్రసిద్ధినందెను. వీరి కాలమున శ్రీవైష్ణవధర్మము దక్షిణభారతదేశమంతట వ్యాపించెను. ఈనాడు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళభాషా భేదముల ననుసరించి దేశభేదమేర్పడినదికానీ ఒకనాడు ఈ నాలుగు రాష్ట్రములు ఒకే ఒక దక్షిణభారతదేశముగా కలసికట్టుగా నుండెడివి. అప్పుడు తెలుగుదేశమునుండి కొన్ని కుటుంబములు తమిళప్రాంతమునకు తరలిపోయినవి. కొంతకాలము గడువగా తమిళప్రాంతమునుండి కొన్ని వైష్ణవ కుటుంబములు శిష్యుల ఆహ్వానమును పురస్కరించుకొని ఆంధ్రప్రాంతమునకు వచ్చి చేరినవి. అట్లు ఆంధ్రప్రాంతమునకు వచ్చి

---

1. హాదీ మయా కే గమితా హి దాస్యం
సముజ్ఝితా శ్రీరపి సుప్రసన్నా।
అనన్యచిత్తో భవతీం భజామి
ప్రసీద తస్మాన్మయి దైవివాదీ। ప్రా.క.పు. 8.

స్థిరపడిన శ్రీవైష్ణవులందరును ఆంధ్ర వైష్ణవులుగా పిలువబడిరి. వీరికి సంస్కృత - ద్రవిడ వేదములయందు ప్రావీణ్యముండినది. ఉభయ వేదములనాశ్రయించి విశిష్టాద్వైత సిద్ధాంతమును శ్రీవైష్ణవధర్మమును వీరు ప్రవర్తింపజేయుచుండెడివారు. కనుకనే వీరికి "ఉభయవేదాంత ప్రవర్తకులు" అని ప్రసిద్ధి కలిగినది.[2]

ఉభయ వేదాంతప్రవర్తకులైన ఆచార్యవర్యులలో కొందరు దక్షిణాపథమున సుప్రసిద్ధక్షేత్రమగు తిరుమల నుండి ఆంధ్రదేశమున కేతెంచిరి. కనుకనే వారికి "శ్రీమత్తిరుమల" అను ఉపనామమేర్పడినది.[3] ఆనాడు "శ్రీమత్తిరుమల" అను ఉపనామముగల శ్రీవైష్ణవాచార్యులు కొందరు ఆంధ్రదేశమునందలి కృష్ణామండలమున అప్పటప్పట కలరు. కాలక్రమేణ వీరిలో "గుదిమెళ్ళ" అను ఇంటిపేరుగల కొన్ని వైష్ణవ కుటుంబములు ఏర్పడినవి.

"శ్రీమత్తిరుమల గుదిమెళ్ళ" అను ఇంటిపేరుగలవారు బందరు పట్టణమునకు సమీపమునగల చిట్టిగూడూరు అను గ్రామమున కొందరుండిరి. వారిలో శ్రీ నరసింహాచార్యుల వారు పేరెన్నికగలవారు. వ్యవసాయమే ముఖ్యవృత్తిగా గల ఆ గ్రామమున శ్రీమత్తిరుమల గుదిమెళ్ళ నరసింహాచార్యులు సంపన్న గృహస్థులు. వీరు తమ ధర్మపత్నియగు శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారితో అతిథి సమాదరణము మొ॥ గృహస్థాశ్రమ ధర్మములను నిర్వహించుచు పరంపరాప్రాప్తములగు విద్యా - సంపదలను ఆదరముతో పెంపొందించుకొనుచు ఆ ప్రాంతమున పేరు ప్రతిష్ఠల సంపాదించిరి

1.1.1.2 జననము :

శ్రీ నరసింహాచార్య దంపతుల గృహస్థజీవనము ఆనందముగా

---

2. కు.పు. 3.

3. కు.పు. 3.

కొంతకాలము గడచినది. వారి పితృదేవతల పుణ్యఫలముగా ఆంధ్రావని భాగ్యవిశేషముగా శ్రీమత్తిరుమల గుదిమెళ్ల నరసింహాచార్యుల వారికి శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారి యందు నందన నామ సంవత్సర శ్రావణ శుద్ధ దశమినాడు (6-8-1892) అనూరాధానక్షత్రమున ప్రథమ సంతానము కలిగినది. ఆ తొలిబిడ్డయే శ్రీవరదాచార్యులవారు.[4]

1.1 1.3. బాల్యము :

శ్రీవరదాచార్యులు దినదినప్రవర్ధమానులగుచుండిరి. ఈ బిడ్డ తరువాత ఈ దంపతులకు అలమేలుమంగ తాయారమ్మ అను ఆడుబిడ్డ కలిగినది. విధివిలాసములు మన భావనలకందనివి. శ్రీవరదాచార్యుల వారికి తొమ్మిదవ సంవత్సరము జరుగుచుండగనే మాతృ వియోగము కలిగినది. పసిబిడ్డలైన వరదాచార్యులను మంగతాయారమ్మను పైకి తీసికొనివచ్చుటకు కుటుంబభారమును నిర్వహించుటకు శ్రీనరసింహాచార్యుల వారికి శ్రీమతి ఆండాళ్ళమ్మగారు సహధర్మచారిణి అయినది. ఆమెకు ఒకే ఒక ఆడుబిడ్డ కలిగినది. ఆమె పేరు రాఘవమ్మ.[5]

శ్రీవరదాచార్యులకు శ్రీమతి ఆండాళ్ళమ్మ సవతితల్లి అయినను తల్లిలేని లోటు లేకుండా ఆమె స్వంత కొడుకుగానే ఈయనను పెంచి పెద్ద చేసినది."వరదయ్యా" అని ఆమె ఆప్యాయతతో వరదాచార్యులను పిలుచుచుండెడిదట.తల్లిలేని బిడ్డయైన శ్రీవరదాచార్యుల హృదయమున శ్రీమతి ఆండాళ్ళమ్మయే మాతృమూర్తిగా నిలబడిపోయినది.[6]

1 1.1.4. ప్రాథమిక విద్య :

శ్రీమత్తిరుమల గుదిమెళ్ళవారి వంశము ఏనాటి నుండియో లక్ష్మీ-

---

4. సా. సు. ల. పు. 73.
5. కు. పు. 4.
6. అందులోనే పు. 5.

సరస్వతులకు నివాసభూమి. లోకమున అక్కాచెల్లెళ్ళకు పొత్తుకుదురుట అరుదైన విషయముకదా! లక్ష్మీ-సరస్వతులకు పొత్తుకుదురుటకూడా ఎంతో అరుదుగా కనబడును. కానీ ఈ పద్ధతికి అపవాదముగా శ్రీమత్తిరుమల గుదిమెళ్ళవారి వంశము గణుతికెక్కినది.

సంపదలున్నవారికి చదువు అబ్బుటగాని, చదువుకొన్నవారికి సిరి-సంపదలు ఉండుటగాని ఆశ్చర్యకరమైన విషయము. అందువలననే పెద్దలు "సంగతం శ్రీసరస్వత్యోః ఏకసంశ్రయదుర్లభమ్" అని చెప్పుదురు. కానీ శ్రీవరదాచార్యుల వారి విషయమున ఈనానుడి పొరపాటుగా మారినది. తల్లిలేని బిడ్డయై గారాబముగా పెరుగుచున్న లక్ష్మీపుత్రుడగు వరదాచార్యులను సరస్వతి వరించుట ఆయన భాగ్య విశేషము. కాదుకాదు మనదేశము యొక్క భాగ్యవిశేషము. ఘనదేశ చరిత్ర కెక్కిన చాలామంది మహనీయులలో ఎవ్వరో రవీంద్ర నాథ ఠాగూర్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారిని విడిచిపెట్టినచో మిగత వారందరును చాలా వరకు బాల్యమున పేదరికమును చవిచూచిన వారే. కానీ వరదాచార్యులు అగర్భ శ్రీమంతుడైనను బాల్యమునుండియు గారాబమునకు లోటులేకపోయినను వినయసంపదలు పెంచుకొనుచు విద్యోపార్జనము పైననే మొగ్గు జూపెను.

శ్రీవరదాచార్యుల ప్రాథమిక విద్యాభ్యాసము స్వగ్రామమునకు దగ్గరలోనున్న గూడూరులో జరిగినది. ఇది మచిలీపట్టణమునకు నాలుగు మైళ్ళ దూరమున కలదు. గూడూరులోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించుచున్న సమయముననే శ్రీవరదాచార్యులు తమ తండ్రియగు శ్రీనరసింహాచార్యుల వారివద్ద, మేనమామయగు శ్రీకట్టా వేంకటరంగరామానుజాచార్యుల వారి వద్ద సంస్కృతాంధ్రముల నభ్యసించిరి. అట్లు చిన్నవయసుననే శ్రీవరదాచార్యుల వారిలో సంస్కృతాధ్యయన బీజము నాటుకొనినది.

1.1.1.3. ఉన్నత విద్య :

గూడూరు నందు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొనిన వరదా చార్యులు ఉన్నత విద్యనభ్యసించుటకై మచిలీపట్టణమునందలి హిందూ హైస్కూలులో చేరిరి. ఉన్నత విద్యాభ్యాసమునందు కూడా సంస్కృత మును ఒక పాఠ్యాంశముగా అధ్యయనము చేసిరి. ఆ కాలమునందే సంస్కృత భాషా సాహిత్యముపై వరదాచార్యుల వారికి ఎంతో అభి మానము కల్గినది, ఎట్లైనను సంస్కృతభాషలో బాగుగా కృషిచేసి ప్రావీణ్యము సంపాదించవలెనను కోరిక అంకురించినది. ఉన్నత పాఠశాలలో విద్యను పూర్తి చేసిన తరువాత అనాటి నోబుల్ కళాశాలలో వరదాచార్యులవారు ఎఫ్.ఏ. కోర్సులో చేరిరి. ఎఫ్.ఏ. కక్ష్యలో పాఠ్యముగా సంస్కృతము లేనందున గణితశాస్త్రమును ప్రధాన విషయముగా తీసికొనివారు మొదటి సంవత్సరమును పూర్తి చేసిరి.

కానీ అంతవరకు క్రమముగా చదువుకొనిన సంస్కృత సాహిత్య ముతోపరిచయము ఈ కోర్సులో లేకపోయెనే అని వారెంతగనో చింతించిరి. వరదాచార్యులవారు ద్వితీయవర్షపు చదువులారంభించునాటికి నోబుల్ కళాశాలలో క్రొత్తగా ఎఫ్. ఏ. కోర్సులో సంస్కృతమును ప్రధా నాంశముగా ప్రవేశపెట్టిరి. వారికి అభిరుచిగలపాఠ్యాంశము లభించుటచే రెండవ సంవత్సరములో చేరక మరల సంస్కృతమును ప్రధానముగ తీసికొని మొదటి సంవత్సరమునే చదివిరి. ముమ్ముందు వారు నిర్వ హింపబోవు సంస్కృతభాషా సముద్ధరణోద్యమమునకు ఎఫ్.ఏ. కోర్సులో జరిగిన ఈ మార్పు నాందీవాక్యమును పలికినది. రెండు సంవత్సరముల ఎఫ్.ఏ. కోర్సును, 1909-1911 సం॥లో పూర్తిచేసి ప్రథమశ్రేణిలో పరీక్ష యందుత్తీర్ణులైరి.

మానవ జీవితమున ఒక్కొక్కప్పుడు అనూహ్యమైన సంఘటనలు తటస్థించు చుండును. ఏది ఎప్పుడు ఎందుకు జరుగునో మన మనస్సునకు

అర్థమగు విషయముకాదు. భగవత్సంకల్పములు ఎప్పుడెవ్వడు ఎట్లట్లు కార్యరూపమును ధరించునో మానవునకు అంతు చిక్కదు. ఇందరులో శ్రీవరదాచార్యులవారి విద్యాభ్యాసము జరుగు చుండగనే వారి తండ్రి గారగు నరసింహాచార్యులవారు పరమపదించిరి. అంతవఱకు తండ్రి గారు చూచుకొనుచున్న కుటుంబ వ్యవహారములను ఇక ఎవ్వరు నిర్వహింతురను నది ముఖ్యమైన సమస్య అయినది.

అగర్భ శ్రీమంతులైన శ్రీవరదాచార్యుల వారి ఆస్తిపాస్తులను పాడి పంటలను చక్కగా చూచుకొనుట ఒక సంస్థానమును నిర్వహించి నంతటి పని. అంతవఱకు ఎంతో అభిమానముతో సాగించిన విద్యను ఆచార్యుల వారు తిరిగి కొనసాగించవలెనన్న పుష్కలమైన వ్యవసాయమును సామర్థ్యముతో నిర్వహించుటకు ఎవరు ముందుకు వత్తురు? విద్యావ్యాసంగమును మాని వారే ఈ కుటుంబ భారమును మోయ వలసివచ్చినది. కానీ వారికి నశ్వరమైన ఈ సిరి సంపదలపై కంటే అనశ్వరమైన విజ్ఞాన సంపాదనమునందే ఆసక్తి మెండుగా నుండెను. విద్యలపై వారికి గల అభిరుచిని బాగుగ గ్రహించిన మేనమామ శ్రీరంగరామానుజాచార్యులవారు నిలబడి ఇంతటి కుటుంబ భారమును మోయుటకు సిద్ధపడెను.

శ్రీరంగరామానుజాచార్యుల వారి స్వగ్రామము గూడూరు. ఆయన లౌకిక ప్రజ్ఞాధురీణుడు. సంపన్న గృహస్థు. వ్యవసాయ నిర్వహణమున ఆరితేరిన చేయి. సంస్కృతాంధ్ర సాహిత్యముల పారమునెరింగిన మనీషి. ఎంత కష్టమైన పనినైనను చక్కగా నిర్వహింప గల్గిన వ్యవహార దక్షుడు. కనుకనే అటు గూడూరు నందు స్వకుటుంబ భారమును మోయుచు, ఇటు చిట్టిగూడూరునందు తన మేనల్లుని కుటుంబమును కంటికి రెప్పవలె కాపాడెను. శ్రీవరదాచార్యుల వారికి తల్లి లేని లోపమును పినతల్లి ఆండాళ్ళమ్మ తీర్చుచూ ఇంటివ్యవహారముల

నిర్వహించుచుండగా ; తండ్రిలేని లోటును కనపడనీయక మేనమామ అండదండల నందించుచు సంసారపు బరువు బాధ్యతలను నిర్వహించు చుండెను.

శ్రీరంగరామానుజాచార్యుల వారికి ప్రథమపుత్రిక శ్రీ లక్ష్మమ్మ ఒకానొకశుభముహూర్తమున తమ కుమార్తెను మేనల్లునకొసంగి ఆయన వైభవోపేతముగా వివాహమును జరిపించెను. జన్మతః ప్రాప్తమైన లక్ష్మి కానీ, తన అర్ధాంగి లక్ష్మమ్మ కానీ శ్రీ వరదాచార్యుల సరస్వతీ సమారాధన యజ్ఞమునకు అడ్డురాలేదు. ప్రాక్తన జన్మవిద్యలను తిరిగి పొందుటకు ఈ లౌకిక విఘ్నములు అడ్డుతగులలేదు.

1.1.1 6 ప్రెసిడెన్సీ విద్యాభ్యాసము :

ఆనాడు మనదేశమునకు దాపురించిన దౌర్భాగ్యమువలన స్వస్థాన వేషభాషలయందు గౌరవము సడలిపోయినది. అనేక సంవత్సరములు పరాయి పాలనలో మగ్గిన ఈ దేశమున ఇంగ్లీషులో నాలుగు ముక్కలు వచ్చినవానికి ఏదో ఒక ఉద్యోగము దొరికెడిది. పరంపరా ప్రాప్తమైన మన విద్యలను, మన సంస్కృతిని లెక్కచేయక ప్రభుత్వము వారిచ్చు ఉద్యోగములకు, వాటివలన లభించు కాసులకు ఆశపడి ప్రతి వాడును ఇంగ్లీషు చదువులకై పరుగెత్తుచుండెను. ఇంగ్లీషు చదువులు ఊరక లభించునవి కావు. ధనికులైనవారు ఆనాడు పెద్ద చదువులకొరకు రాజధానీనగరమునకు పోవుచుండిరి. చెన్నపట్టణమే దక్షిణభారత దేశమునకు అప్పటి రాజధాని. చెన్నపట్టణము తెలుగు నేలకు విసిరి వేసినట్లు ఒక అంచలో ఉండుటవలన రాజధానీ నగరమునకు పెద్ద చదువులకై ఎక్కువమంది తెలుగువారు పోలేకపోయిరి.

రాజధాని కళాశాల ఆనాడు దక్షిణ భారతదేశమున ప్రసిద్ధమైన విద్యాసంస్థ. మేధావులు, సంపన్నులైన వారికే అందులో ప్రవేశము

లభించెడిది. మేనమామ అందించిన ప్రోత్సాహముతో శ్రీవరదాచార్యుల వారు పెద్దచదువులు చదువుటకు మద్రాసునందలి రాజధానీ కళాశాలలో చేరగల్గిరి.

అప్పటి చదువులలో ఎమ్.ఏ., (ఆనర్స్) పట్టము ఎంతో ఉన్నతమైనది. అందులో ఉత్తీర్ణత సంపాదించవలెనన్న ఎంతగనో శ్రమపడవలయును. ఆనాడు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో శ్రీ వరదాచార్యుల వారికి పేరుపొందిన మహామహులిద్దరు ఆచార్యులైరి. అందులో ఒకరు "దర్శనకళానిధి" "మహామహోపాధ్యాయ" "శాస్త్ర రత్నాకర" "విద్యావాచస్పతి" అయిన ప్రొఫెసర్ ఎస్. కుప్పుస్వామి శాస్త్రిగారు.7 వీరు ప్రాచీన అర్వాచీన పద్ధతులలో అన్ని శాస్త్రముల యందు కృషిచేసి లబ్ధప్రతిష్ఠులైనవారు. ఇంకొకరు మహాపండితులు చతుశ్శాస్త్రనిష్ణాతులు ప్రొఫెసర్ ఎమ్. రంగాచార్యులవారు. ఇంకను దిట్టలైన ఆచార్యులెందరో రాజధానీ కళాశాలలో వీరిని తీర్చిదిద్దిరి. ఇటువంటి దిగ్దంతులైన అధ్యాపకుల మార్గదర్శనమున ఆచార్యులవారు వ్యాకరణ శాస్త్రమును ప్రధాన విషయముగా స్వీకరించి 1911 - 1914 సంగలలో ఎమ్.ఏ.(ఆనర్స్) పరీక్షలో ప్రథమశ్రేణిలో సర్వప్రథములుగా ఉత్తీర్ణులైనందుకు వీరికి మద్రాసు విశ్వవిద్యాలయము "స్వర్ణపతకమును"ను బహూకరించినది.

మద్రాసులో 3 సంగములు ఆనర్స్ చదువుచున్న రోజులలో విరామ సమయమున ఆచార్యులవారు మహోద్దండపండితులైన శ్రీకాందూరి

---

7. విద్యావాచస్పతిరితి సంగైః దర్శన కళానిధిర్యతిభిః ।
ప్రభుభిర్మహామహోపాధ్యాయో గురుభిః కులపతిశ్చ ॥
ప్రా.క.పు. 2.

తాండవ కృష్ణమాచార్యులవారిని చిట్టిగూడూరులో తమ ఇంటిలోనుంచు కొని విశిష్టమైన శాస్త్రాంశములను వారి వద్ద అభ్యసించెడివారు.

1.1.1.7 సంప్రదాయాసక్తి :

అప్పటికే మనదేశమున దేశీయములగు వేషభాషలయందు గౌరవము తగ్గిపోయినది. దాస్యమున మగ్గిన ఈ దేశములో ఇంగ్లీషులో నాలుగుముక్కలు మాట్లాడువారికే ఉద్యోగము లభించెడిది. ఆ ఉద్యోగములయందలి ఆసక్తితో తరతరాలుగా దేశీయమైన చదువులనభ్యసించువారుకూడా వాటిని వదలి ఆంగ్లభాష నభ్యసించుటకై అఱ్ఱులు చాచిరి. ఆంగ్లభాషలో ప్రావీణ్యమెంతమందికి లభించినదో కానీ జుట్టు కట్టులలో ఆంగ్లేయుల ననుకరించుట ఆనాటి నాగరికుల లక్షణమైనది. "కొత్తొక వింత పాతొక రోత" యన్నట్లు ఆంగ్లేయుల వేషభాషలు జనబాహుళ్యము నాకర్షించినవి. విద్యార్థుల అవతారములే మారిపోయినవి. అట్లు మారని వారందరు ఛాందసులను ముద్రపడినది.

సమాజము ఇంతవడిగా మారుచున్నను శ్రీవరదాచార్యులవారిపై దాని ప్రభావముపడలేదు. చిట్టిగూడూరులో ఏ వేషములో నుండెడివారో అదే వేషము బందరునందును, మద్రాసునందును, నిలబడినది. ఆంగ్ల విద్యను చదివినంతమాత్రమున నామరూపములను మార్చుకొనవలసిన పనియేమున్నది. శ్రీ వరదాచార్యుల వారికి బాల్యమునుండియు స్వదేశీయసంప్రదాయములపై ప్రీతి హెచ్చుగనుండెడిది. ఇంటిలో తల్లిదండ్రుల సన్నిధిలోఎట్లుండెనో దూరప్రాంతమున ప్రెసిడెన్సీ కళాశాలలో కూడా అట్లేయుండవలయునని వారి ఆశయము. ఇతరులను చూచి అనేక వికారములకు గురియగుట, ఆంగ్లేయుల ననుకరించుట, సంప్రదాయములను కాలరాచివేయుట, భారతీయ సంస్కృతికి ద్రోహము చేసినట్లని శ్రీ ఆచార్యుల వారి అభిప్రాయము. అంతమాత్రముచేత వార

ప్రవేశించిన మాత్రాన ఉన్నతికి ప్రాగవలెనను మౌఢ్యము వారి కున్నదని అనుకొనరాదు. ఆధునికతలోని మంచిని గ్రహింపవలెనని. ప్రాచీన పద్ధతులలోని చెడును వదలివేయవలెనని ఆయన సిద్ధాంతము, ఆకు చెప్పులు వేసికొని జుట్టుముడితో ఊర్ధ్వపుండ్రములతో చొక్కా ధోవతులతో ఆయన ప్రెసిడెన్సీ కాలేజి విద్యార్థిగా రాణించెను. ఇతరుల ననుకరించుటకు స్వసంప్రదాయమునందుకు బలి పెట్టవలెనని ఆచార్యుల వారి తలంపు.

నిజముగా వేషమనునది భౌగోళిక పరిస్థితులను బట్టి శీతోష్ణాది వాతావరణమును బట్టి ఏర్పడును. ఉష్ణదేశములో నుండు భారతీయులు గూడ అతిశీతలదేశవాసులగు ఆంగ్లేయుల వేషముల నంటించుకొనుటకు తాపత్రయపడుటకన్నా మూర్ఖత వేరులేదు. జుట్టు, బొట్టు, కట్టు ఈ మూడింటి యందు నూటికి నూరుపాళ్ళు భారతీయత ఉట్టిపడునట్లు శ్రీవరదాచార్యుల వారి విద్యార్థిదశ గడచినది.

1.1 1.8 త్యాగనిరతి :

ఆగర్భ శ్రీమంతులైన ఆచార్యుల వారిలో వదాన్యత చిన్నతనము నుండియే వికసించినది. లోకమున ధనికులగు వారిలో దాతృత్వము మృగ్యముగ నుండును. దాతృత్వముగలవారు చాలావఱకు ధనాధికులుగా నుండరు. విద్యార్థిదశలోనే ఆచార్యులవారి త్యాగగుణము ఆదర్శ శిఖరమున భాసించిన ఉదంతమొకటి జరిగినది.

గాంధీ మహాత్ముడు దక్షిణాఫ్రికాలో శిక్షణ శిబిరముల నేర్పాటుచేసి శాంతి సమరమును నడపుచున్న రోజులవి. అచటి సత్యాగ్రహ నిర్వహణమునకై "నేను భారతీయుడను కనుక భారతీయులనే విరాళములు కోరుదున"ని మహాత్ముడనుకొనెను. బాపూజీ నుండి మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజికి ఒక ధృవపత్రము వచ్చెను. ఆనాటి ప్రెసిడెన్సీ కాలేజి విద్యార్థులు అయిదురూపాయలనుండి పదహారు రూపాయల వఱకు విరాళములను ప్రకటించిరి, ఆ సందర్భమున దేశభక్తి

పూర్ణహృదయులగు శ్రీవరదాచార్యులవారు దక్షిణాఫ్రికాలోని భారతీయుల కష్ట నష్టములను గ్రహించి చందాపట్టికలో 500 రూపాయలను విరాళముగా వ్రాసిరి. అది పొరపాటున పడిన అంకె అయి యుండవచ్చునని కళాశాలాధ్యక్షులు ఆచార్యుల వారిని పిలిపించి అడిగిరి. వరదాచార్యులవారు– "అది పొరపాటు కాదనియు బుద్ధి పూర్వకముగనే వేసినాననియు, ఒకవారము రోజులలో పైకమునిత్తుననియు" చెప్పి అద్దెఇంటినుండి టెలిగ్రాం మనియార్డరు ద్వారా తెప్పించి జమకట్టిరి. విద్యార్థిదశలోనే వారికి గల త్యాగ నిరతికి అబ్బురపడి ఎంతో ఆచార్యులవారిని పలువిధముల ప్రశంసించిరి. వారి త్యాగ గుణమును, దేశభక్తిని మెచ్చుకొనుచు మహాత్ముడే వారికొక అభినందన పత్రము పంపెను. ఈ సంఘటన బాల్యమునందే వారికి గల వదాన్యతకు దేశభక్తికి ప్రబలతార్కాణము.[8]

ఇట్లు ఉత్తమాదర్శములతో శ్రీవరదాచార్యులవారు ప్రెసిడెన్సీలో మూడు సంవత్సరములు విద్యాభ్యాసమొనర్చి నిర్విరామముగ కృషి చేసి చివరి సంవత్సరము ఎమ్.ఏ. (ఆనర్సు) పరీక్షలో ప్రథమ శ్రేణిలో సర్వప్రథములుగ ఉత్తీర్ణులై పారితోషికముగా సువర్ణపదకమును పొందిరి.

1.1.1.9 ప్రథమోద్యోగము :

బందరు పట్టణము తెలుగుగడ్డలో ప్రశస్తిగాంచినది. సాహిత్య సభలకు ఆపట్టణము పెట్టినదిపేరు. అది చెళ్లపిళ్లవంటి మహాకవులు సంచరించిన నేల. అరువై సంవత్సరముల కాంగ్రెస్ చరిత్రను రచించిన శ్రీపట్టాభివంటి దిగ్గంతులు ఆ పట్టణమున నుండిరి. జాతీయ వార పత్రికయగు "కృష్ణాపత్రిక"ను నడిపి పేరు ప్రతిష్ఠలనందిన

8. తు. పు. 12.

శ్రీముట్నూరి కృష్ణారావుగారు అచటనే నివసించు చుండిరి. బందరు, రాజకీయములకు ఆటపట్టయి యుండెను. పట్టాభివంటి పేరు మోసిన విజ్ఞులకు ఆంగ్లసాహిత్యము నేర్పిన రఘుపతివంటి రసజ్ఞులు ఆ పట్టణమునకు పేరు తెచ్చిరి.

భారతీయ రాజకీయోద్యమముతో బందరునకు ప్రత్యేక సంబంధము కలదు బంగాళములో రాష్ట్ర విభజన సమస్య ఈ దేశమును కలవర పరచెను. విద్యార్థులు రాజకీయములలో పాల్గొనరాదని ప్రభుత్వము నిషేధించెను. దేశములో పాఠశాలా బహిష్కరణోద్యమము ప్రారంభ మయ్యెను. అప్పుడే జాతీయ కళాశాలలను స్థాపించవలయునను ఆలోచన నాయకుల హృదయములలో కలిగెను. ఒక్క తూర్పు బంగాళములోనే ఇరువదినాలుగు జాతీయ కళాశాలలను స్థాపించిరి.

ఆంధ్రదేశములో కూడా జాతీయ కళాశాలలను స్థాపించవలెనను ఆలోచన బందరుపట్టణములోని దేశనాయకుల మనసులో మెదిలెను. ఆ రోజులలో డా॥ బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశమున బందరు, రాజ మహేంద్రవరము వంటి పెద్ద పట్టణములలో జాతీయ కళాశాలల ఆవశ్య కతను గూర్చి గొప్పగా ఉపన్యసించిరి. జాతీయ విద్యా బీజములను బందరులో నాటినవాడు ఆ మహానుభావుడే. అసంకల్పము అంకురితమై పల్లవితమై, పుష్పితమై ఆంధ్రజాతీయ కళాశాల రూపమున ఫలితముగా రూపొందెను.

ఈ సంస్థకు మూలస్తంభములు ముగ్గురు. ఒకరు కాంగ్రెస్ నాయకులైన డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు. కృష్ణా పత్రిక సంపాదకులు శ్రీముట్నూరి కృష్ణారావుగారు రెండవవారు. వృక్షశాస్త్ర పరి శోధకులు, మహావ్యక్తులు, వదాన్యులైన శ్రీకోపల్లె హనుమంతరావు పంతులుగారు మూడవ వారు. ముఖ్యముగా ఈ సంస్థకు మూలభూతులు శ్రీకోపల్లె హనుమంతరావు పంతులుగారు. ఆయనే ఈసంస్థ, సంస్థయే ఆయన అన్న రోజులు కూడా కలవు.

ఈ సంస్థలో ఆంగ్లేయుల విద్యా ప్రణాళికకు భిన్నముగా విద్యార్థి హృదయములకు వికాసము కలిగించునట్లు ఒక జాతీయ విద్యాప్రణాళిక ఏర్పాటు చేయబడెను. శిల్పశాస్త్రమునకు, సాహిత్యమునకు, లలిత కళలకు ఈ సంస్థయందు ప్రాముఖ్యమివ్వబడెను. లలితకళలలో ముఖ్యమగు చిత్రకళను ఇచ్చట నేర్పెడివారు. వివిధ చిత్రవర్ణములుగల అందమైన తివాచీలను తయారుచేయుట ఈసంస్థయొక్క ప్రత్యేకత. ఈ విధముగ ఆంధ్రజాతీయ కళాశాల భారతీయకళలకు నెలవై యొప్పారుచుండెను. ఈనాడు రాజకీయరంగములో పేరప్రతిష్ఠలను గాంచిన పెద్దలెందరో ఆనాడు ఆ కళాశాలలో అడుగుపెట్టినవారే. ఆ కళాశాలను 1907 వ సంవత్సరమున గాంధీమహాత్ముడు చూచి ఆనందించి అభినందించెను.

ఎమ్.ఏ. (ఆనర్సు)లో ఉత్తీర్ణులై స్వగ్రామము చేరిన వరదాచార్యులవారు తాత తండ్రులనుండి సంక్రమించిన క్షేత్రములలో వ్యవసాయము చేసుకొనుటతప్ప మరియొక సాహిత్యవ్యవసాయమును ప్రారంభించలేదు. వారు సాహితీకృషి సలుపుటకు ఆలోచించు సమయమున "ఆంధ్రజాతీయ కళాశాల" వారి దృష్టిపథమునకు వచ్చినది. వెంటనే ఆచార్యులవారు కోపల్లెవారిని పట్టాభి గారిని కలుసుకొని కృష్ణారావు గారితో సంప్రతించి "నేను మీ విద్యాసంస్థలో సంస్కృత సాహిత్యమును విద్యార్థులకుబోధింతును. జీతభత్యములు నాకివ్వవలసిన పనిలేదు. నిర్వేతనికముగ విద్యనుపదేశించుటయే నాముఖ్యలక్ష్యముగా పెట్టుకొన్నాను." అని తమ అభిప్రాయమును వెల్లడించిరి. పట్టాభి ప్రభృతులు శ్రీఆచార్యులవారి అభిలాషకు స్వాగతమునలుకగా 1914లో ఆంధ్ర జాతీయ కళాశాలలో వారు సంస్కృత సాహిత్యమును బోధించుటకు ప్రాధ్యాపకులుగ చేరిరి. ఆచార్యుల వారి జాతీయోద్యమాసక్తి

నిస్వార్థసేవాభావము కొద్దిరోజులలోనే వారిని ఆంధ్ర జాతీయ కళాశాల కార్యకర్తలలో నొకరుగ జేసినవి.

ఆంధ్రజాతీయ కళాశాలలో అనాడు 1. శ్రీ ప్రమోద్‌కుమార్ ఛటర్జీ 2. శ్రీ అడవి బాపిరాజు 3. శ్రీ ఈరంకి వెంకటశర్మ అని ముగ్గురు కళాకారులుండెడివారు. వారిలో ఈరంకి శర్మగారి జీతము 250రూ॥లు అది చాలదని ఆయన కళాశాలను వదలి వెళ్ళవలెననుకొనుచుండగా శ్రీ వరదాచార్యులవారు అట్లు వెళ్ళవలదని, తాను నెలకు 50/- పంపుదు నని చెప్పి కొంతకాలము వారచటనే పనిచేయునట్లు చేసిరి. జాతీయ కళాశాలపై వారికిగల ప్రేమకు, తోటి వారికి సహాయపడుదృష్టికి ఇదొక నిదర్శనము మాత్రమే.

1.1.1.10 గజపతుల ఆహ్వానము :

విద్యావిహార పదవి అనే పేరుగాంచిన విజయనగరము అనాడు సకలకళలకు, సమస్త విద్యలకు నెలవై అలరారుచుండెను. ఆ నగర మును రాజధానిగా చేసుకొని శ్రీ ఆనందగజపతి మహారాజు విజయనగర సామ్రాజ్యమును పరిపాలించుచుండిరి. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలిం చిన విజయనగరసామ్రాజ్యము రతనాలసీమయగు "రాయలసీమ" లోనిది. ఈ విజయనగర సామ్రాజ్యము "సర్కారు" జిల్లాయగు విశాఖ పట్టణములోనిది. ఈ మధ్యనే విజయనగరము ప్రత్యేకజిల్లా ప్రతిపత్తిని పొందిన విషయము మనకందరకు తెలిసినదే.

వ్యక్తులలో గుణగణ సౌరభమున్నచో అది సహజముగనే దశ దిశల గుబాళించును. శ్రీఆచార్యుల వారి ఉత్తమ వ్యక్తిత్వము, ప్రతిభా పాండిత్యములు, సహృదయత ఆనోట ఆనోట ఆంధ్రదేశమంతయు వ్యాపించినవి. గజపతుల పాలనలో విజయనగరమున ఒక ఆంగ్ల కళాశాల ఒక సంస్కృత కళాశాలయు కలవు. ఆంగ్లకళాశాలకు అధ్యక్షు

లగు శ్రీ కిళాంబి రామానుజాచార్యులవారే సంస్కృతకళాశాలకు కూడా అధ్యక్షులుగ నుండిరి. సంస్కృతసాహిత్యమునందు నిష్ణాతులైనవారి ఆధ్యక్ష్యమున్నచో సంస్కృతభాషతగినంతఅభివృద్ధికివచ్చునను ఆలోచన గజపతులకేర్పడినది. వెంటనే శ్రీ వరదాచార్యులవారి పేరు వారి మనస్సున మెదలినది. విజయనగరము విచ్చేసి తమ సంస్కృత కళాశాలకు అధ్యక్షము వహించి, సంస్కృతభాషకు తామొనర్చు సేవలకు చరితార్థతను కల్పించవలెనని శ్రీ వరదాచార్యులవారిని గజపతులు 1914 లో సాదరముగ ఆహ్వానించిరి.

1.1.1.11 కళాశాలాధ్యక్ష్యము :

విజయనగరప్రభువుల విశిష్టాహ్వానమును మన్నించి శ్రీ వరదాచార్యులవారు 1914 జూలై నెలలో సంస్కృత కళాశాలోపాధ్యక్షపదవిని చేపట్టిరి.[9] పేరుకు ఉపాధ్యక్షపదవియే కాని శ్రీ ఆచార్యులవారు సంస్కృతకళాశాల పరిపాలనము ముకుటములేని మహారాజుగాసాగించిరి

ఆంధ్రదేశములో విజయనగరము మొదటినుండియు విద్యానగరముగా ప్రఖ్యాతి చెందినది. ఆ కళాశాలలో జగద్విఖ్యాతులు మహామహోపాధ్యాయులు శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రి గారు శ్రీ వఝల చిన సీతారామస్వామిశాస్త్రి గారు మొదలగు పండితులుండిరి. వీరు వివిధ శాస్త్రములందు కృతభూరిపరిశ్రములగు పండితులు. ఆ సంస్థ మొదట సంస్కృత పాఠశాలగా ఉద్భవించి శ్రీ ఆచార్యులవారి అధ్యక్షమున 1915 వ సంవత్సరమున కళాశాలగా అవతరించెను. ఆ కళాశాలలో సాహిత్య శాస్త్రము, వ్యాకరణ శాస్త్రము, న్యాయ శాస్త్రము, వేదాంత శాస్త్రము, మీమాంసాశాస్త్రము, సంగీతము మొదలగు అనేకశాస్త్రములను బాగుగా బోధించెడివారు. శ్రీ వరదాచార్యుల వారి పరిపాలనాదక్షతను

---

9. స్వీ చ. పు. 76.

శిక్షార్హ ప్రోత్సాహము గుర్తించి కళాశాల కార్యకలాపములన్నియు పూర్తిగా జరిపితే నవ్వుండినవి. అనేక ప్రదేశములనుండి వచ్చిన విద్యార్థులు విజయనగర సంస్కృత కళాశాలలో చేరి ఆయా శాస్త్రములలో దిగ్గంతుల వంటి పండితులవద్ద అనేక శాస్త్రములను అభ్యసించెడివారు.

శ్రీవరదాచార్యులవారు విజయనగర సంస్కృత కళాశాలకు అధ్యక్షులై కాక, దానితో పాటు ఛాత్రశాలనందున (Hostel) విద్యార్థులకు సరియైన భోజనవసతులు సమకూరుచున్నవో లేదో గమనించవలెనని శ్రీ ఆనందగజపతి అభిలషించిరి. ఆచార్యులవారు విద్యాలయమును భోజనాలయమును సమానముగా చూచుకొనుచుండెడివారు పాకశాలలో ఏ మాత్రము ఒడిదుడుకులు రాకుండ మొదట భోజనమును ఆచార్యుల వారు పరీక్షించి తరువాత విద్యార్థులకు పెట్టించు చుండెడివారు. తన ఇంటిలోని అన్నము పాటు పేద విద్యార్థులకు పథ్యపానములుగా ఇచ్చెడి వారు. ఇంతటి ఉదారజీవితమును చాలా కొద్దిమంది అవలంబింపగలరు కదా!

శ్రీఆచార్యులవారు గాంధేయవాదులు. అప్పటివారి నెల జీతము రెండువందల రూపాయలు. దానిని వారు తీసికొనక పేద విద్యార్థుల అవసరముల కొఱకు ఉపయోగించి తన ఖర్చుకు డబ్బు చిట్టిగూడూరు నుండి తెప్పించుకొనెడివారు. చిన్న పెద్ద అనుకొనక బాలరామాయణము మొదలు మహాభాష్యమువరకు ఎన్నో ముఖ్య పాఠ్యపుస్తకములను శ్రీవరదాచార్యులవారే బోధించుచుండెడివారు.

### 1 1.1. 12 సూపరింటెండెంట్ పదవి :

శ్రీవరదాచార్యులవారు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యార్థిగా గడించిన పేరుప్రతిష్ఠలు, ఆపైన విజయనగర సంస్కృత కళాశాలకు 19 4-1920 సం ల మధ్య ఉపాధ్యక్షులుగా ఆయన విద్యారంగము నకు చేసినసేవలు ఆనాటి పెద్దల మన్ననలకు పాత్రమైనవి. మద్రరాష్ట్ర

ఉన్నత విద్యాశాఖాధికారి ట్రిడిమూకైనను శ్రీఆచార్యులవారి యోగ్య తను గుర్తించి ఆనాటి విద్యాలయ పర్యవేక్షకుడుగా (Superintendent of Sanskrit Studies) ఆహ్వానించి నియమించెను.

ఆనాటి మద్రాసురాష్ట్రము ఈనాటి మద్రాసు రాష్ట్రముకాదు ఈనాడు తమిళనాడు కేరళ-కర్నాటక-ఆంధ్రప్రదేశ్ అని నాలుగు రాష్ట్రములుగా విభజింపబడిన భూభాగమంతయు ఆనాడు మద్రాసు రాష్ట్రముగా వ్యవహరింపబడినది దీనికే అవిభక్త మద్రాసు రాష్ట్రమని (Composite Madras State) పిలిచెడివారు. ఒక విధముగా దక్షిణభారత దేశమంతటను నిండియున్న సంస్కృతోన్నత పాఠశాలలు, సంస్కృత కళాశాలలు వేదపాఠశాలలు ఆచార్యులవారి పర్యవేక్షణలోనికి వచ్చినవి. వీరిపరిపాలనాకాలమున అనేక విద్యాలయములు క్రొత్తగా స్థాపింప బడినవి. ముందివెలసిన విద్యాలయములకు ఆర్థికసాహాయ్యము చేయ బడినది ఈ నాలుగు ప్రదేశములయందు సంస్కృతభాష ఎంతగా అభి వృద్ధి చెందవలెనో అంతగా అభివృద్ధి చెందినది.

శ్రీఆచార్యులవారు పర్యవేక్షకులుగా నున్న సమయమున సంస్కృత భాష కేవలము కొందరికే సంబంధించినది కానని అది భారతీయులందరి భాషయని పలుచోట్లనొక్కి వక్కాణించిరి. వారు సంస్కృత భాషకు సేవ చేయవలయునను అభిలాషతో ఈ ప్రభుత్వోద్యోగమును స్వీకరించిరే కాని ధనసంపాదనకొఱకు కాదు. ఆంధ్ర-కన్నడ-కేరళ-తమిళదేశముల లోని సంస్థలను పర్యవేక్షించవలెనన్న హోదా పైన, అధికారదర్పము పైన ధనసంపాదన పైనను ఎక్కువ మక్కువ ఉండవలెను. కాని వీరికి విద్యార్థిదశనుండియు సామాన్య జీవితమును గడుపుచూ ఉన్నతమైన భావనలతో ఉండుటయే అలవాటు కనుక వీటిపైన మమకారములేదు.

శ్రీఆచార్యులవారి ప్రభుత్వోద్యోగము కత్తిమీద సాముకంటిది. ఒక ప్రక్క తెల్లదొరల మాటలను అతిక్రమించకుండా ఇంకొక ప్రక్క

సంస్కృతభాషకు దాని అభ్యుదయమునకు కృషిచేయు సంస్థలకు అన్యాయము జరుగకుండా ఎంతో జాగరూకతతో వారు ఈ ఉద్యోగమును నిర్వహించిరి. బహుముఖ పాండిత్యముతో పాటు లోకజ్ఞులు కూడా గనుక బహుజనోపకార భావనతో వారు ఆ పదవిలో రాణించిరి.

దక్షిణ భారతదేశమునందలి సంస్కృత విద్యాసంస్థల బాగోగులను గూర్చి విచారించు మహాధికారము వారిచేతిలో నుండియు పర్యవేక్షణ సమయమున నిరాడంబరమైన వేషమును ధరించెడివారు. అనాటి వారి వేషమును గూర్చి "కులపతి" అను పుస్తకమున ఎంతో చక్కగా అభివర్ణింపబడినది.1

1.1.1. 13 మదరాసు కాపురము :

శ్రీవరదాచార్యులవారు అనాటి ప్రభుత్వము వారొసంగిన సూపరింటెండెంట్ పదవిలో చేరి మదరాసు కేంద్రస్థానముగ పెట్టుకొని ఆయా ప్రాంతములలో పర్యటించుచుండిరి. వారు 1920 సంIలో వారి గృహలక్ష్మి శ్రీమతి లక్ష్మమ్మ గారితో మదరాసులో కాపురము పెట్టి కొంతకాలముండిరి.

1.1.1. 14 దక్షిణ భారత పర్యటనము :

ఈనాడు దక్షిణభారతదేశమున గల నాలుగు రాష్ట్రములను అనాడు

---

1 పింజపోసిన సన్నని ఖాసీ ధోవతి; జరిగంచు ఉత్తరీయము వల్లెవాటు విశాలమైన నెమ్మొగముతో తెల్లని నామముల నడుమ, ఎఱ్ఱని కుంకుమబిలువుబొట్టు. గోష్పాదమువంటి జుట్టు కాళ్ళకు అడిచెప్పులజోడు, ముంగలనొక అరవ బంట్రోతు, ఈ పైభంగిలో విచ్చేసిన అయనను జూచి సంస్కృతపాఠశాలల "సూపరింటెండెంట్" అని ముందుగ నెవ్వరును భావింపలేరు.

కు. పు. 38.

ఇతర రాష్ట్రములగా అవిభక్త మద్రాసు రాష్ట్రమునగ ఉండెడిదని ముందే (పు. 18) చెప్పితిని. కనుక 'ఆచార్యులవారి' పర్యవేక్షణ పరిధి కన్యాకుమారి నుండి శ్రీకాకుళము వఱకును కొట్టాయము నుండి కొల్హాపూర్ వఱకును గలదు. ఒక తమిళ బంట్రోతు వెంటరాగా వారు మామూలు వేషముతో సంస్కృత విద్యాసంస్థలు గల ప్రతియూరికిని వెళ్ళి అచ్చటి ఉపాధ్యాయుల యోగక్షేమములను, విద్యార్థుల కష్టనష్టములను విచారించి తారతమ్యపరమగు సహాయమును చేయుటకు ప్రభుత్వము వారికి సిఫారస్ చేయుచుండిరి

ఆనాడు తెల్లవారిచేతిలో అధ్వాన్నముగా తయారైన ప్రాచ్య విద్యల దుఃస్థితిని గూర్చి- "ఉదయిని"లో ఇట్లు ప్రస్తావించబడినది-

"జాతీయనాయకుల పోరుపడలేక ఎప్పటి కప్పుడు కన్నీరు తుడిచినట్టుల ప్రాచ్యభాషల విషయమై ఏవేవో ఇన్ని సదుపాయములు చేయుచున్నట్లు విదేశప్రభుత్వము నటించును. విద్యారంగములో "కీలకము" తమ చేతిలో పెట్టుకొని కుక్కకు రొట్టెముక్క వేసినట్టులేవో యిన్నిరూకలు ప్రాచ్యవిద్యలకని పంచెదరు. ఈ దేశములో అధికారము చూపి వసూలు చేసిన నూరు రూపాయలలో తొంబదిరూపాయలకు పైగా ఓడలలో ఇంగ్లాండు చేరవలయును. ఆ పదిలో ప్రభుత్వాంగమునకని, ప్రజలకని, పంపకము చేయుగా దానిలో కేవలము ప్రాచ్యవిద్యల పోషణకై దక్కునది ఒక్క యేగానియో, కానియో, అ కాసులు ప్రోవుచేసియిచ్చి యీ మొత్తముతో ప్రాచ్యవిద్యలకు "ధారకము"

CENTRAL LIBRARY
50126

రాయుడని యుద్యోగులను నిర్ణయించెను[1].

దక్షిణ భారతమునందలి నాలుగు ప్రాంతములలోగల పాఠశాలలను కళాశాలలను పరీక్షించి అప్పట వరకు పాఠ్యప్రణాళికను క్రమబద్ధమొనర్చి, అభిరుచిగల ప్రాంతములయందు క్రొత్తవానిని నెలకొల్పి వానికి ప్రభుత్వసహాయముండునట్లు చూచుట ఆచార్యులవారి కర్తవ్యము. పండితవరేణ్యులు, సహృదయ శిరోమణులగు శ్రీవరదాచార్యులవారి పదవిలో నుండుట అటు పండితులకు, ఇటు సహృదయులకు గూడ అనల్పానందము నందించినది. అంత పెద్ద హోదాలో నుండియు వారు నిరాడంబరమైన వేషముతో నిరహంకారమైన ప్రవృత్తితో నిర్మలాంతఃకరణముతో మందహాస వదనముతో ఎంతో సామాన్యమైన వ్యక్తివలె కనపడెడివారు. నిండుకుండ తొణకదని కదా! పెద్దలమాట.

1.1.1. 15 సహాయనిరాకరణము :

శ్రీవరదాచార్యులవారు మనసా వాచా కర్మణా జాతీయభావముల కంకితమైనవారు విద్యార్థిదశలోనే గాంధీమహాత్ముని ఉద్యమ ప్రభావము వారిపై ఎంతగనో కనపడినది. అటువంటి జాతీయ దృక్పథముగల మనిషి ప్రభుత్వపు నౌకరిలో ఎంతకాలముండగలడు!

గాంధీజీ సల్పిన నిరంతర కృషివలన క్రొత్త క్రొత్త ఉద్యమములు ఆసేతుశీతాచలము వ్యాపించినవి. ఆయన ప్రయోగించిన జయభేరి పల్లెపట్టులలోని వారికి కూడ నిత్యనూతనోత్సాహమును కలిగించి జాతి కొఱకు తమ సర్వస్వమును త్యజించుటకు సిద్ధమొనర్చినది. సహాయ నిరాకరణ మానాటి వారికొక తారక మంత్రమయ్యెను. విదేశవస్త్ర బహిష్కరణము సర్వసాధారణమయ్యెను. శాసనోల్లంఘనము ప్రజలకు

---

1. కు. పు.26-27.

మహోపదేశమయ్యెను. ప్రభుత్వమునకు పన్నులు కట్టకుండుట గొప్ప నినాదమయ్యెను. అసిధారావ్రతము వంటి ఈ జాతీయోద్యమములు ఆనాటి భారతీయులకగ్ని పరీక్షలయ్యెను.

స్వార్థపరులైన కొందరు విద్యార్థులు లాభనష్టములు లెక్కలు వేసుకొనుచు గూర్చుండిరేగానీ ప్రజావాహిని జాతీయోద్యమోన్ముఖమై పరవళ్ళు త్రొక్కెను. తెల్లవారి దొరతనము ఎన్ని ఘోరములైనను చేసి ఉద్యమములను అణచివేయుచుండెను. పాంచాల రాష్ట్రమున జాతీయోద్యమము జయజయ ధ్వానములతో నలరారుచుండెను. డయ్యరు పేవాని దుష్టకల్పనవలన పంజాబులో మారణహోమపు మంట లెగసెను అమృతసరము అయోమయ పరిస్థితిలో పడిపోయెను. పెత్తనము చేయుచున్న తెల్లవారికి పిచ్చెక్కినట్లాయెను. పంజాబు బయలుదేరిన నాయకులను బట్టి జైళ్ళలో వేసిరి. స్త్రీలను, బాలురను, వృద్ధులను చిత్రహింసలకు గురిచేసిరి. గాంధీజీ ఉద్యమమొక ఊపు నందు కొనెను.

పంజాబు హత్యలను గూర్చి ప్రజలలో పాటలతో పద్యములతో ప్రచారమారంభమాయెను. సహాయనిరాకరణోద్యమమే ఆపరిస్థితులకు కారకమంత్రమయ్యెను. పట్టాభివంటి జాతీయ నాయకుల మార్గ దర్శనమున పెరిగి పెద్దవారైన శ్రీవరదాచార్యులవారు ఇంతటి దారుణ కాండ దేశమున జరుగుచుండగా ఎట్లు ప్రభుత్వోద్యోగమును చేయ గలరు? సంస్కృతభాషనుద్ధరించుటకుపయోగించు సూపరింటెండెంట్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్ పదవి కూడా వారికి జాతీయ సహాయనిరాకర ణోద్యమము ముందు పెద్దదిగా కనపడలేదు. ఎవ్వరినీ సంప్రదించకనే వారు ఆ పదవికి 1921లో రాజీనామా చేసి మద్రాసు నుండి చిట్టి గూడూరు చేరిరి.

### 1.1.1. 16 అధ్యక్షపదవి :

గోదావరి తీరమున కొవ్వూరులో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము

కలదు. ఆంధ్రదేశమునందలి సుప్రసిద్ధమైన కళాశాలలలో కొవ్వూరు కళాశాల ఒకటి. న్యాయవాదిగా పేరు మోసిన శ్రీతల్లాప్రెగడ సూర్య నారాయణరావు పంతులు ఆ కళాశాల ప్రారంభకులు. ఆంధ్రదేశము నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు ఆకళాశాలలో చదువుకొను చుండిరి. అధ్యాపకులు సమర్థులైనను యాజమాన్యము సరిగాలేక కళాశాల సరిగా జరుగకుండెను.

మద్రాసులో ప్రభుత్వోద్యోగము విడచి స్వగ్రామమైన చిట్టి గూడూరులో విశ్రాంతి తీసికొనుచున్న శ్రీవరదాచార్యుల వారిని 1922 సం॥లో ఆ కళాశాలకు అధ్యక్షులుగ ఆహ్వానించిరి. నిర్వేతనికముగ ఆచార్యులవారు ఆ పదవిని అంగీకరించిరి.

1.1.1. 17 కొవ్వూరు కాపురము :

విజయనగర ప్రభువుల ఆస్థానమున సంస్కృత కళాశాలకు అధ్యక్షము నిర్వహించి,మద్రాసు రాష్ట్రమునకంతటికి సూపరింటెండెంట్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్‌గా పనిచేసిన ఆచార్యులవారు విద్యాబోధనలోను సంస్థలను పరిపాలించుటలోను అప్పటికే చాలినంత అనుభవమును గడించిరి. కనుక ఈ కళాశాలాధ్యక్షము వారికి నల్లేరుపై బండివలె నుండెను. చిట్టిగూడూరు నుండి కాపురము కొవ్వూరుకు మారినది. కాని వారి కుటుంబమునకగు ఖర్చులన్నియు చిట్టిగూడూరు నుండియే వచ్చును. వేతనము నివ్వవలెనని కళాశాల యాజమాన్యమునకు అభి ప్రాయమున్నను తీసుకొను ఉద్దేశ్యము శ్రీవరదాచార్యులవారికిలేదు.

శ్రీవరదాచార్యులవారి వంటి దక్షుల పరిపాలనలో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము మహోన్నతముగ తీర్చిదిద్దబడెను. విజయ నగరము నుండి సమర్థులైన పండితులను రావించి కళాశాలలో అధ్యాపకులుగ నియమించిరి. విశ్వవిద్యాలయమేర్పాటుచేసిన ప్రాచ్యపరీక్షలకన్నింటికి విద్యార్థులను చేర్చుకొనిరి పేదలగు విద్యార్థులకు గ్రాసవాసముల

ఏర్పాటు చేసిరి. గుణవంతులగు విద్యార్థులు విద్యావంతులు గూడ నైనచో శ్రీఆచార్యులవారు ఎంతో ఆనందపడెడివారు.అంతవఱకు ఆచార్యులవారికి సంతానములేదు. విద్యార్థులనే వారు తమ సంతానముకంటె మిన్నగా చూచుకొనెడివారు.

### 1.1.1.18 స్థితప్రజ్ఞత్వము :

ఆచార్యులవారు కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణవిద్యాపీఠమును అభివృద్ధిచేయు సందర్భమున ఒక సంఘటన జరిగినది. అదివారి స్థితప్రజ్ఞతకు తార్కాణమువంటిది గాన ఇట పేర్కొనుట ఉచితము.

ఒకప్పుడు స్థితప్రజ్ఞుడైన సర్దార్ వల్లభాయిపటేల్ కోర్టులో పెద్ద కేసును వాదించునపుడు భార్యపోయెనని తంతిరాగా దానిని తీసుకొని జేబులో నిడుకొని నిర్వికారముగ వాదన పూర్తిచేసి, కేసును గెలిపించెనని వింటిమి. అట్లే శ్రీవరదాచార్యులవారి జీవితమునందును ఒక సంఘటన జరిగినది.

ఒకరోజు ఆచార్యులవారు కక్ష్యలో పాఠము చెప్పుచుండిరి.ఇంతలో ఒక తంతివార్త వచ్చెను. ఆలూన దానిని చదువుకొని యథాపూర్వముగా పాఠమును పూర్తిచేసి ఆరోజు సాయంకాలము ఊరికి ప్రయాణమైరి."పుట్టిన సంతానము పోయినదని" ఉదయము తంతి వచ్చినట్లు విన్న సన్నిహితులు విచారపడుట కంటే వింతపడుట జరిగినది. ఆహా! ఆచార్యులవారు ఎంత స్థితప్రజ్ఞులని ఆనాడు ఆశ్చర్యపడనివారులేరు.[1]

దుఃఖములు చుట్టుముట్టినపుడు వికారముచెందని మనస్సు, సుఖములయందు స్పృహలేకుండుట,రాగము,భయము,క్రోధము లేకుండుట

---

1. తు. పు. 39.

కదా! స్థితప్రజ్ఞలక్షణము.[1] ఆచార్యుల వారి స్వభావమెంతో గంభీరమైనది. వారి మనస్సు ఇటువంటి వికారములకతీతమైనది ఈ సంఘటన వారి స్థితప్రజ్ఞత్వమునకు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. వారి జీవితములో నిర్వికారముగా వారు వ్యవహరించిన ఘట్టములింకెన్నియో కలవు

ఆంధ్ర గీర్వాణవిద్యాపీఠ పరిపాలనమున తల్లాప్రెగడ వారిదే పై పెత్తనము. విద్యాప్రమాణ పరిపాలనమున శ్రీవరదాచార్యులవారిదే పైచేయి. ఇద్దఱు స్వతంత్ర ప్రవృత్తిగలవారు. ఒకరు స్థానికముగా బలవంతులు. ఇంకొకరు జగమెరిగిన బ్రాహ్మణుఱు. రెండు కత్తులు ఒక ఒఱలో ఇమడనట్లు వారిరువురి మధ్య అభిప్రాయ భేదము లేర్పడినవి ఆచార్యుల వారికి పారతంత్ర్యమన్న గిట్టదు. స్వతంత్ర ప్రవృత్తి ఆయనకు సహజము. ఆయన జీవితమే అటువంటిది. అభిప్రాయముల కలియుట లేదని గుర్తించిన వెంటనే ఆచార్యులవారు కళాశాలాధ్యక్ష పదవిని విరమించుకొని తనవెంటవత్తునన్న ఒకరిద్దఱు అధ్యాపకులతోను, కొందఱు విద్యార్థులతోను గోదావరీ తీరమును వీడి కృష్ణాతీరములోని బందరు ప్రయాణమైరి.

1.1.1.19 చిట్టిగూడూరు కళాశాల :

గుణవంతుడైన ఒక వ్యక్తి వలన అతని వంశమంతయు ఎట్లు గొప్పగా ప్రకాశించునో అట్లే మహోన్నతాదర్శములు గల ఒక మనిషి వలన అతని మంచి పనుల వలన ఆ ఊరికే పేరు ప్రతిష్ఠలు ఏర్పడును. బందరునకు ఐదుమైళ్ళు దూరములో ఊరు, పేరులేని ఒక చిన్న

---

1. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః
వీతరాగ భయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే॥
భ.గీ. 2.56.

గ్రామము కలదు. దానిపేరు చిట్టిగూడూరు. షుమారు నలువది ఇండ్లు గల ఆ గ్రామములో ఆచార్యులవారి కుటుంబము తరతరాలుగా సంపన్న కుటుంబము. శ్రీఆచార్యుల వారికి స్వంత వ్యవసాయము కలదు. ఆ గ్రామములోనికే పెద్ద రైతులగు ఆచార్యులవారివద్ద వ్యవసాయపు పనులు చేసికొనుచు జీవితము నుగడుపువారే అచట చాల మంది కలరు. ఆ ఊరిలో అక్షరాస్యులను లెక్కపెట్టుటకు చేతివేళ్ళు ఎక్కువే అగును. ఒకరిద్దరు మాత్రము ఒందరు చదువులు చదివినవారుండిరి. పురోహితుడు గానీ, వైద్యుడుగానీ, మంగలి గానీ, చాకలిగానీ, కుమ్మరిగానీ ఏ ఒక్కరును ఆ ఊరిలోలేరు. అంతటి కుగ్రామము శారదాపుత్రులగు శ్రీవరదాచార్యులవారి వంటి సత్పుత్రులనుగని సత్ప్రవాసమును గడించినది

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అని కదా ఆర్యోక్తి. అది ఎంత కుగ్రామమైనను శ్రీవరదాచార్యులవారికి జన్మభూమి కనుక అది వారికి స్వర్గముకన్నా మిన్నగనే కనుపించినది. విశ్వవిద్యాలయములతోనూ, ప్రభుత్వములోని విద్యాశాఖతోనూ వారికి సన్నిహిత సంబంధము కలదు. శ్రీవరదాచార్యులవారి మనసులో తమ స్వగ్రామమైన చిట్టిగూడూరునందే స్వతంత్రముగా ఒక సంస్కృత కళాశాలను స్థాపించి సంస్కృతభాషకు సేవ చేయవలయునను సంకల్పము మెరసినది. కొవ్వూరు నుండి తనతోపాటు వచ్చిన ఒకరిద్దరు అధ్యాపకులతోను ప్రాచ్యపరీక్షలకు అన్ని సంవత్సరములలోను చదువు విద్యార్థులతోను 17-7-1923వ తేదిన వారి తండ్రిగారి పేర శ్రీనారసింహ సంస్కృత కళాశాలను ప్రారంభించిరి. వారి సంకల్పము స్వార్థరహితము, లోకకల్యాణకరము అయినది గనుక ఆ గ్రామమునకు అంతటి గౌరవము కలిగినది. వారి స్వగృహమునందే అధ్యాపకులను, విద్యార్థులను అట్టిపెట్టుకొని పోషించుచూ మొదట కళాశాలను ప్రారంభించిరి.

అప్పటికి శ్రీవరదాచార్యులవారికి సంతానము కలుగలేదు. వారు

సంతానము కలుగు లేతవయస్సులో మన్నవ్వరికి విద్యార్థిసంతతికి కావలసిన గ్రాసవాసముల కొఱకు తమ స్వంతపొలములు కొంత పేరు పంచి వ్రాసి ఇచ్చిరి. ప్రభుత్వపు పరిగణనమును కళాశాలకు సంపాదించుటకై కొంత మూలధనమును కళాశాలపేరుతో పంచి ఇచ్చిరి. ఆ కళాశాలకు వారే కార్యదర్శిగా, అధ్యక్షులుగా వ్యవహరించి తన ఇంటినే కళాశాలా భవనముగను, ఇంటిలోని కొన్ని భాగములను అధ్యాపకులకు నివాసముగను ఇంటిప్రాకారములోని కొన్ని భవనములను విద్యార్థి వసతిగృహములుగను చేసి దానికొక యథార్థ గురుకులముగా రూపొందించిరి.

ఇందరు అధ్యాపకులు విద్యార్థులతో కళాశాలను స్థాపించటవలన ఊరుపేరూలేని ఆ గ్రామమునకు కళ కాంతి ఏర్పడెను. మొదట కొవ్వూరు నుండి తనతోపాటు వచ్చిన శ్రీదువ్వూరు వెంకటరమణశాస్త్రి గారిని ఆంధ్రవిభాగాధిపతులుగను, శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులవారిని సాహిత్యాచార్యులుగను, శ్రీమాన్ కరిరామానుజాచార్యుల వారిని వ్యాకరణశాస్త్ర ప్రధానాచార్యులుగాను నియమించి తాము అధ్యక్షులుగా నుండి మిగత పాఠములన్నింటిని వారే బోధించుచూ కళాశాలాభివృద్ధికి ఎంతగనో కృషి చేసిరి.

తెలుగుదేశములోని ప్రాచ్యవిద్యాకళాశాలలలో విజయనగరము తరువాత చిట్టిగూడూరు కళాశాలకుపేరు ప్రతిష్ఠలు వచ్చుటకు శ్రీవరదాచార్యులవారి అనన్యసామాన్యమైన కృషి ముఖ్యకారణము. మద్రాసు, అన్నామలై, మైసూరు విశ్వవిద్యాలయములలో ప్రాచ్యవిద్యాశాఖలతో శ్రీవరదాచార్యులవారికి సంబంధముండెడిది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తును గూర్చి వేఱుగా చెప్పవలసిన పనిలేదు. సంస్కృతాంధ్రముల మంచి చెడ్డలు తెలిసిన శ్రీరామలింగారెడ్డిగారికి, శ్రీవరదాచార్యులవారి ప్రతిభా పాండిత్యము లెన్నడో తెలియును. ఆంధ్ర విశ్వకళాపరిషత్తునందు

సంస్కృత భాషావిషయకమైన ఏసమస్యవచ్చినను శ్రీఆచార్యుల వారే దానిని పరిష్కరించవలెను.

సంస్కృతకళాశాలయే కాదుగా, కాని సంస్కృత కళాశాలగా ఉన్నప్పటికిని విశ్వవిద్యాలయ నియమనిబంధనలననుసరించి కళాశాల కొక కమిటీని వరదాచార్యులవారు నియమించిరి. ఆ కమిటీకి శ్రీకెడింబి హనుమంతరావు పంతులుగారు అధ్యక్షులు ఇంకను ఆంగ్లసంస్కృత భాషాభిమానులు కొందరు ఆ కమిటీలో సభ్యులుగా నుండిరి. శ్రీవరదాచార్యులవారు ఆ సంస్థకు కార్యదర్శి-అధ్యక్షుల బాధ్యతలను నిర్వహించుచుండిరి.

1.1.1. 20 వర్ధశాల :

బందరులో పురాణమువారు సంపన్న గృహస్థులు. ఆ వంశస్థుడైన వెంకటప్పయ్య పంతులు ఆ పట్టణమునందు మొట్టమొదట బి.ఏ.పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెనని పట్టపుటేనుగుపై ఊరేగించినారట. ఆయన సంతానములో సూరిశాస్త్రిగారొకరు ఈయన కూడా బి.ఏ. పరీక్షయందు త్తీర్ణుడై తండ్రిగారు న్యాయవాదిగా గడించిన ఆస్తిపాస్తులను చూచుకొనుచు కాలముగడుపుచుండెను. ఈయన కళాప్రియుడు. "నాట్యాంబుజము" వంటి విమర్శగ్రంథములను తెలుగులో రచియించెను.

చిట్టిగూడూరునకు రెండుమైళ్ళదూరమున తమ పొలమునందు చిన్న ఊరినే నిర్మించెను. దానికి "వర్ధశాల" యని నామకరణము చేసెను. దూరప్రయాణముచేయు బండ్లు బాటసారులు అచ్చట కొంతసేపు సేదదీర్చుకొని పోవుచుందురు. అచటనొక కోదండరామాలయమును, దానికెదురుగ నొక నాట్యశాలను ఆయన నిర్మించెను. ఆయన వచ్చినపుడు నివసించుటకొక అతిథిగృహము, దానికి చేరువలో ఒక సరోవరము, చుట్టూ అనేక లతానికుంజములు, పెరిగిన పూలచెట్లతో ఆ ప్రాంతము నిజముగా వర్ధశాలవలెనే భాసించుచుండెను. అచ్చట

ముఖ్యముగా నుండి చుట్టూగల వందల ఎకరములను సాగులోనికి తేవలె యునని ఆయన ఆకాంక్ష. కాని ఆర్థికముగా సంభవించిన ఒడిదుడుకుల వలన ఆయన అభిలాష నెరవేరలేదు. పాడుపెట్టినచో అదంతయు నాశనమై పోవునను భయముతో శ్రీవరదాచార్యులవారిని సంస్కృత కళాశాలను అందులోనికి మార్చి ఆ భవనముల నుపయోగించుడని కోరెను. వెంటనే ఆచార్యులవారు కళాశాలను వర్ధకాలకు మార్చి అచ్చటనే పాఠవాదులను సాగించిరి.

అట్లు కళాశాల జరుగుచుండగా అచట నొక సంఘటన జరిగినది. గాంధీజీ ఉద్యమము భారతజాతినంతను ఉత్సాహపరచుచున్న రోజులవి. ఖద్దరు ధరించిన వారెల్లరు రాజద్రోహులను భావము ఆనాటి ప్రభుత్వమునకుండెడిది. ఒక నాడొక ప్రభుత్వోద్యోగి వర్ధకాల ప్రక్కగా కారులో పోవుచుండ "మహాత్మాగాంధీకి జై" అని ఎవరో ఒక విద్యార్థి నినాదమొనర్చెను. అంతే; కొంత సేపటిలో రెండు బస్సుల నిండుగ రిజర్వుపోలీసులు వర్ధకాలకు వచ్చి "ఎవ్వడురా గాంధీయన్నవాడు?" అనుచు లాఠీచార్జి చేసిరి. ఆ వార్త ఆచార్యులవారికి చేరెను. వారు వెంటనే బయలుదేరి వచ్చి పోలీసులకు నచ్చచెప్పి పంపిరి. వారి శిష్యవాత్సల్యమటువంటిది.

1.1.1. 21 వంశాంతరము :

శ్రీవరదాచార్యులవారు నారసింహ సంస్కృత కళాశాలను 1923వ సంవత్సరమున స్థాపించిరి. అంతకుముందునుండి వారు ఆంధ్ర జాతీయ కళాశాలలోను, విజయనగర సంస్కృత కళాశాలలోను, సూపరింటెండెంట్‌గా దక్షిణ భారతదేశమంతటను, ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము నందును విద్యాదేవికి అహర్నిశలు మనసా వాచా కర్మణా సేవ నందించుచుండిరి. ఆమె ప్రసన్నయైనది సరస్వతీ దివ్యానుగ్రహము

వలననే శ్రీలక్ష్మాంబావరదాచార్య దంపతులకు 1927లో సంతానాంకుర ముదయించెను.[1] ఆ బిడ్డకువారు నరసింహాచార్యులను తమ తండ్రిగారి పేరునే పెట్టిరి.

ఒక రకముగా శ్రీవరదాచార్యులవారి తొలి సంతానము శ్రీనారసింహ సంస్కృత కళాశాల. ఆ దంపతులకు ద్వితీయ సంతానమే శ్రీనరసింహాచార్యులు. గుణగణములలోను రూపురేఖలలోను శ్రీనరసింహాచార్యులు తండ్రిని పోలిన బిడ్డగనే ప్రకాశించెను. కాళిదాసు చెప్పినట్లు కారణగుణములు కార్యమును సంక్రమించుటలో ఆశ్చర్యమేముండును?[2]

1.1.1. 22 పుత్రీవియోగము :

కొన్ని నాళ్ళకు ఆచార్యులవారికి ఒక పుత్రిక జన్మించెను. ఆమెకు వారు లక్ష్మీనరసమ్మ అని తమ పినతల్లిగారి పేరును పెట్టిరి. కాని ఆమె ఎక్కువ కాలము జీవించలేదు. 1939లో ఆమె కాలముచేసెను. ఆ బాధతోనే శ్రీఆచార్యులవారు వారి గురువులకిట్లు వ్రాసిరి-

---

1. చిరం త్వద్భావత్యః కృతసుకృతైః శిష్యతతిభిః
మయా తచ్ఛుశ్రూషా సుచిరమదదాద్యంతకలికమ్।
ప్రమోదస్థానం మే యదయ మమురక్తోఽగ్రజగదే
కిమన్యత్కాంక్ష్యం మే నయలఘు భవద్ధామ భగవన్॥
ప్రా.క.పు. 25.

2. రూపం తదోజస్వి తదేవ వీర్యం
తదేవ నైసర్గిక మున్నతత్వమ్।
న కారణాత్స్వాద్బిభిదే కుమారః
ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్॥
ర.వం. 5.37.

పథి సంసరణస్య సంద్భశే
తనయో మే తనయేతి యే దృశౌ।
నికిలో విహితోఒస్మి ప్రైరిణా
విధినా నిర్దయమన్యయా తయోః॥1

క్రమముగా పెరిగి పెద్దవాడైన శ్రీనరసింహాచార్యులు సంస్కృతాంధ్రాంగ్లభాషలలో ప్రావీణ్యమును సంపాదించెను. ఆంధ్ర విశ్వవిద్యాలయమునందలి భాషాప్రవీణ, విద్యాప్రవీణ, ఎమ్.ఏ. పరీక్షలయందు సర్వప్రథముడుగా ఉత్తీర్ణుడై,పండితపుత్రుడుగా కాక తండ్రికి దీటైన తనయుడని పేరు ప్రతిష్ఠలను సంపాదించెను. ఆగర్భ శ్రీమత్త్వము, అధికారము, పైతృకపుత్రత్వము మొ॥నవి ఎన్నియున్నను శ్రీవరదాచార్యులవారి పెంపకమున నరసింహాచార్యులు వినీతుడైన పండితుడుగ వంశప్రతిష్ఠ నినుమడింపజేయు వ్యక్తిగా తీర్చిదిద్దబడెను. ఈయనకు తండ్రిమాట యన్న శిలాశాసనము. తల్లితండ్రులకు సేవలు చేయుటయన్న పరమోత్సాహము. అటు పందల ఎకరములలో వ్యవసాయమును పర్యవేక్షించుచు, ఇటు కళాశాలకు అధ్యక్షుడుగా విద్యార్థుల బాగోగులను గమనించుట శ్రీనరసింహాచార్యులకు వెన్నతో బెట్టిన విద్యయయ్యెను.

1.1.1. 23 సమదృష్టి :

జమీందారులుగనున్న వరదాచార్యులవారి కుమారుడైన శ్రీనరసింహాచార్యులకు ఇంకొక జమీందారులు ఆస్తిపాస్తులతో ధనకనక వస్తువాహనములతో కన్యనిత్తుమని ముందుకు వచ్చుటలో ఆశ్చర్యమేమియు లేదు. కానీ వరదాచార్యులవారి దృష్టివేరు. ఆయన భౌతికముగ ఎంత సంపన్నులో ఆయన మనస్సు అంత సంస్కార సంపన్నము. ఒక పేదకుటుంబమునుండి గుణవతియైన అమ్మాయిని దీసికొనివచ్చి

1. ప్రా.క.పు 11.

వారు తమ కోడలుగ జేసికొనిన సంఘటన వారి విశాలదృష్టిని చాటి చెప్పుచున్నది.

ఒకప్పుడు బంధువుల ఇంటిలో వివాహమునకు వారొక పల్లెకు వెళ్ళిరి. ఆ పెండ్లి సందర్భమున ఇరుగు పొరుగువారి బాలిక ఆచార్యుల వారికంట పడినది. ఆమెను గూర్చి విచారించగా ఒక పేదయింటి పిల్లగా తెలిసినది. వారాయనకు సన్నిహిత బంధువులు కాదు. సిరి సంపదలలో హస్తిమశకాంతరమున్నది. వెనుక ఎప్పుడో ఆచార్యుల వారికి కలిగి కొన్నాళ్ళు పెరిగి పోయిన ఆడబిడ్డ పోలికలు ఆమెలో వారికి కనుపడినవి వెంటనే పెద్దలను బిలిచి ఈమెను నాకోడలిగ నావెంట బంపుడని అడిగిరి ఆచార్యులవారి ఔదార్యమునకు వారు ఉబ్బితబ్బిబ్బులైరి. బంధువులందరు ఆమె అదృష్టమునకు అభి నందించిరి. ఆ అమ్మాయిని వెంటనిడుకొని చిట్టిగూడూరు తీసికొని వెళ్ళి సుముహూర్తమున కుమారునికిచ్చి వివాహము జరిపించిరి. ఆమె పేరు శ్రీమతి లక్ష్మికాయారు. అత్తమామలను తల్లిదండ్రులకంటే మిన్నగాచూచిన పరమసాధ్వి ఆఇల్లాలు తరువాత కాలమునశ్రీఆచార్యుల వారు కోడలిని కొడుకును ఎంతగనో ప్రశంసించిన సందర్భముకలదు.[1] ఆ కుటుంబమున ఆమె అడుగిడిన వేళావిశేషమేమో మూడుపువ్వులు ఆరుకాయలుగా పిల్లాపాపలతో ఆ సంసారము అభివృద్ధిచెందినది.

1. పతిప్రీతా దారా వినయమధురః ప్రాజ్ఞతనయః
స్నుషా పుత్రీకృత్యా కులసుకృతపాకః సుతసుతాః।
ఇమే సంపృక్తా మే దధతి సుభగం సంసృతి పథం
కిమన్యత్కాంక్ష్యం మే నయలఘు భవద్ధామ భగవన్॥
ప్రా.శ.పు 26.

## 2. ద్వితీయాధ్యాయము :

### 2.1 స్వతంత్ర గ్రంథములు-వాటి విశిష్టత

శ్రీవరదాచార్యులవారి గ్రంథరచన బహుముఖమైనది. వీరి రచనలను 1. విమర్శాత్మకములు 2. స్వతంత్రకవితారూపములు 3. అనువాదరూపములు అని మూడువిధములుగా విశ్లేషించుకొన వచ్చును. అందులో విమర్శాత్మక రచన "భాషాశాస్త్రసంగ్రహము." రెండవ విభాగమునకు చెందిన స్వతంత్రకవితారూపరచనలు మూడు కలవు. అవి- 1. సుషుప్తివృత్తము 2. న చేద్వాల్మీకిరభవిష్యత్ 3. సత్యవిజయము అనునవి. ఇక మూడవ విభాగమునకు చెందిన అనువాదములు తొమ్మిది. అవి- 1. వేమనశతకము 2. సుమతి శతకము 3. దాశరథిశతకము 4. కృష్ణశతకము 5. భాస్కరశతకము 6. శ్రీకాళహస్తీశ్వరశతకము 7. గాయత్రీ నీతిగీతావళి 8. నరసింహ శతకము 9. ఆంధ్రనాయకశతకము అనునవి. ఆచార్యులవారు ఈ శత కములను తెనుగునుండి సంస్కృతములోనికి అనువదించిరి. ఇవి పేరుకు అనువాదములే అయినప్పటికి స్వతంత్ర రచనలతో సమానముగ కన పడుచున్నవి. వీనిని గూర్చి విపులముగ మూడవ అధ్యాయములో (3.1) చర్చింతును.

మొదటి రెండు విభాగములకు చెందిన రచనలను గూర్చి

ఈ అధ్యాయమున ప్రస్తావించవలసియున్నది. భాషాశాస్త్రసంగ్రహము విమర్శాత్మకమైనది. కనుక కావ్యములవలె దానిని గూర్చి ఎక్కువగా సమీక్షించుట అంతగా అవసరమైనదికాదు. కాని అప్పటికి గల భాషా శాస్త్ర పరిశోధనలను దృష్టిలో నుంచుకొని సంస్కృతభాషలో ఇదం-ప్రాథమ్యేన ఆచార్యులవారు చేసిన రచన కనుక స్థాలీపులాకము గ దానిని పరిశీలింతము.

అప్పుడప్పుడే రూపురేఖలను దిద్దుకొనుచున్న భాషాశాస్త్రమును గూర్చి సంస్కృతభాషలో వీరు చేసిన రచన "భాషాశాస్త్రసంగ్రహము" భాషాశాస్త్ర వాఙ్మయమునందు సంస్కృతభాషలో ఇదే మొదటి రచన అని చెప్పవచ్చును. దీనిని వీరు 1916లో రచించినప్పటికిని నూతన శాస్త్రముగాన వెంటనే ప్రకటించలేదు తరువాత వారి ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్. కుప్పుస్వామిశాస్త్రిగారి ఆశీర్వచనములతో 1933లో ప్రచురించిరి. ఈరచన శాస్త్రీయము ప్రామాణికమని పండితులచే కొనియాడబడినది. దీని తరువాతనే శ్రీ ఆర్.ఎస్. వెంకటరామశాస్త్రి గారి "భాషాశాస్త్రప్రవేశిని" 1938లో వెలువడినది. భాషాశాస్త్రసంగ్రహ ప్రమేయమును దాని స్వరూప స్వభావములను గూర్చి కొంత పరిశీలింతము.

2.1.1 భాషాశాస్త్రసంగ్రహము :

భాషాశాస్త్రసంగ్రహమను ఈ గ్రంథము పది అధ్యాయములుగా విభజించబడినది. ఆ అధ్యాయములలో క్రమముగా 1. భాషాశాస్త్ర లక్షణప్రయోజనాదికము 2. భాషోత్పత్తి 3. వర్ణసముత్పత్తి 4. భాష-లిపి, 5. పదసంవిధానకృతమగు భాషా విభాగము 6. భాషలవంశ విభాగము 7. జాతి-భాష 8. భాషాపరిణామము 9. శక్తి 10. సంస్కృత వర్ణసమామ్నాయము-మూలభాషయందు దాని ప్రకృతి, అను పది అంశములు కూలంకషముగా చర్చించబడినవి.

శ్రీవరదాచార్యులవారి దృష్టి చాలానిశితమైనది. వైయాకరణులకు భాషాశాస్త్రజ్ఞులకును మధ్యగల భావనాభేదమును ఈ క్రింది శ్లోకము నందు వీరెంతో చక్కగా పరిశీలించిరి—

లాఘవమనురుంధానో భూశార్థముపేక్షతే పదాభిజ్ఞః।
అంశే నివిష్టదృష్టి రజ్యతి వాచ్యే తు భాషావిత్॥

వైయాకరణులు లాఘవమునందలి ఆదరణచే సత్యమును ఉపే-క్షింతురు. వీరు లాఘవాభిమానులు కనుకనే"అర్ధమాత్రాలాఘవం పుత్రో-త్సవం మన్యన్తే వైయాకరణాః" అను ప్రసిద్ధి ఏర్పడినది. ఇక భాషా శాస్త్రజ్ఞులు లాఘవమును దృష్టిలో నుంచుకొనక సత్యాన్వేషణకొఱకై గౌరవావహమైన మార్గముసైనను అనుసరించుటకు వెనుకాడరు. ఆచార్యవారెంత చక్కగా వారిద్దరి మనస్తత్త్వమును నిర్ధరించి చెప్పి-నారో పై శ్లోకమున మనము గమనింపవచ్చును.

భాషాశాస్త్రతత్త్వమును సూక్ష్మాతిసూక్ష్మమైన దృష్టితో విశ్లేషణ చేయు ఈ భాషాశాస్త్రసంగ్రహమునకు ఆచార్యులవారి గురువర్యులు దక్షిణభారతదేశమునందు సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు "మహా మహోపాధ్యాయ", "విద్యావాచస్పతి" బిరుదాంకితులు, పాశ్చాత్యుల చేతిలో రూపుదిద్దుకొనుచున్న భాషాశాస్త్రమును, ఒకప్రదాశిక నేర్పరుచు కొని మద్రాసు విశ్వవిద్యాలయమున బోధించు ప్రొఫెసర్ ఎస్.కుప్పుస్వామి శాస్త్రి మహోదయులు "ముందుమాట"ను వ్రాసి శిష్యుని ప్రయత్నమును బహువిధముల శ్లాఘించిరి.

శ్రీశాస్త్రివర్యులు తమ ముందుమాటలో భాషాశాస్త్రతత్త్వమును పరిశీలించువారికి సూచనలా అన్నట్లు ఒకటి రెండు మాటలనిట్లు వ్రాసిరి-

---

1. భా.శా.సం. పు. 1.

"ఏషా చ పరతః ప్రాచీన సంప్రదాయమనుసృత్య శాస్త్రైర్థిమ క్రామ్యద్భిః సర్వైరపి వివిధముఖః పరిశీల్యమానా విచారసారస్యమహతే అభ్యారోహాయ కల్పేత. యే నామ శ్రద్దధతే- "సంస్కృతం నామ దైవీవాగన్వాఖ్యాతా మహర్షిభిః" ఇతి, సిద్ధేశబ్దార్థ సంబంధే శాస్త్రేణ ధర్మనియమః" ఇతి "మునిత్రయానుగృహీతాన్వాఖ్యానే శబ్దప్రపంచో వ్యవస్థిత" ఇతి చ - తేఽపి ఊహాపోహ కుశలా స న జానీయుః — పరినిష్ఠితార్థమాత్ర విషయా దృష్టిరన్యా, అన్యాదృశీ చ మూలతత్త్వాన్వేషణౌపయికీ విమర్శదృష్టిరితి, ద్వే అపి తే దృష్టీ సమవలంబ్యైవ విపులో గహనశ్చ భాషాప్రపంచః పరీక్షణీయ ఇతి; తదర్థం చ నాలం విజ్ఞాయ "సంస్కృతభాషా వర్తతే" ఇతి, అపి తు "సా వర్ధతే విపరిణమతే చ బహుధా" ఇతి జ్ఞానమావశ్యకమితి చ.[1]

శ్రీవరదాచార్యులవారు ఈ గ్రంథమును వ్రాసి పదునారు సం॥లు గడచినను దీనిని ముద్రించలేదు. వారి గురువర్యులు శ్రీ కుప్పుస్వామి శాస్త్రిగారు ఆమూలాగ్రముగ పరిశీలించి "ప్రకాశ్యముపనేయోఽయం" అని అనుమతినొసంగిన తరువాతనే దీనిని ప్రకాశింపజేసిరి. అనాటిసచ్ఛిష్యులకు సద్గురువులపైగల భక్తిశ్రద్ధలు అటువంటివి.

ఆచార్యులవారు "మహామహోపాధ్యాయులైన శ్రీ కుప్పుస్వామి శాస్త్రిగారి వంటి విద్వత్తల్లజులవద్ద చదువుకొనియును, M.A. (Hons) పరీక్షయందు ప్రథమశ్రేణిలో సర్వప్రథములుగ ఉత్తీర్ణులయ్యును, పాశ్చాత్య పండితుల రచనలనన్నింటిని చదివి ఊహాపోహలతో కొన్ని క్రొత్త విశేషములను ఉద్భావన చేసి, ఈ గ్రంథమును వ్రాసినప్పటికిని తమ విజ్ఞప్తిని ఎంత వినయముతో చేయుచున్నారో మనమొకసారి గమనించియే తీరవలయును. చూడుడు—

1. భా.శా సం. Foreword.

"అతిగహనో విషయోఽయం గహనతరాఽసౌ తథాఽపి గ్రన్థః।
ఉభయం తత్త్వవివక్షుర్మన్దోఽహం కిం న సాహసికః

అందువలననే వారు అన్ని సంవత్సరములు ఉదాసీనముగా నున్నారట. ఎంతటి సంయమనమో చూడుడు।

భాషాశాస్త్రముపై ఆనాటికి సంస్కృతభాషలో ఎటువంటి గ్రంథములు వెలువడలేదని బహుశః ఆచార్యులవారిదే మొదటిగ్రంథము కావచ్చునని ఇంతకు ముందే చెప్పితిని. వీరు శాస్త్రీయమైన పద్ధతిలో ఈ రచన నొనర్చిరి. ఇందలి వాక్యములు మీమాంసా న్యాయాది శాస్త్రములందువలె అతిసంక్షిప్తములు. అన్యూనానతిరిక్తములు అర్థగంభీరములును అయి యున్నవి.

ప్రథమాధ్యాయము భాషాశాస్త్రముయొక్క లక్షణమును ప్రయోజనమును గూర్చి విచారించినది. ఈశాస్త్రమును సమీక్షించుటకు కావలసిన ప్రశ్నలను వేసుకొనిన తీరును గమనించినచో లక్షణపరిష్కార పద్ధతులను అవలంబించు శాస్త్రకారుల మార్గమును వీరెంతగా జీర్ణించుకొనిరో మనకర్థము కాగలదు.[1]

---

1. కిం నామ శాస్త్రమ్? శాస్త్రమనుగమకమ్, అనేకానుగత ధర్మప్రతిపాదకం వా. అతఃపదార్థానాం సాధర్మ్యవైధర్మ్యాభ్యాం విభాగః క్రియతే; విభాగేష్వేతేషు విద్యమానా నియమాశ్చ కథ్యన్తే. ఏవం చాస్మిన్ భాషాశాస్త్రేఽస్మదాలోచితానాం భాషాణాం, సంవిధానంచరిత్రం వివరిణామాః సాధర్మ్యవైధర్మ్యతత్కారణాని చ విచార్యన్తే. భాషాయాః ప్రభవః కింస్వరూపః? భావప్రకాశనం వివిధ భాషాసు కథం నిర్వర్త్యతే? కిమితి కథం చ ప్రథమతః సంబద్ధాః భాషాః కాలక్రమేణ విప్రకృష్టా దృశ్యన్తే? భాషాభిః సముదాయతో వైకైకశో వా సమనుభూతాః వివరిణామాః కిం నియతాః? తథా చేత్కే తే నియమాః? కిం బహవః? కిమిత్యస్మాభిరేవమేవ సంభావ్యతే నాతోఽన్యథా? ఇత్యేతే అన్యే చ ప్రశ్నాః అత్ర భవన్తి. ఏషాం సమాధానమేవ ఏతచ్ఛాస్త్రస్య ప్రమేయమ్
భా. శా. సం. పు. 3-4.

రెండవ అధ్యాయము భాషోత్పత్తిని పరీక్షించినది. ఇందు వీరు భాష మానవసృష్టయను భావమును యుక్తియుక్తముగ ప్రతిపాదించిన తీరు అనన్యసాధారణము. ఇందులో వీరుపయోగించిన ఉదాహరణములు సర్వసాధారణములు, అతిసులభములు. భాషాభ్యాసమునకు భాషా శ్రవణము కారణమగుచున్నది. వినుచున్న భాషనే బాలుడనుకరించును. ఏ భాషను అనుకరించనివాడు చివరకు ఏ భాషనూ మాట్లాడలేడు. అతడు కేవలము చేష్టలద్వారానే తన భావమును తెలియజేయ ప్రయత్నించునని ఆచార్యులవారు ఈ అధ్యాయమున నిరూపించిన పద్ధతి ఎంతో హేతుబద్ధముగనున్నది.[1]

వర్ణసముత్పత్తికి సంబంధించినది మూడవ అధ్యాయము. వర్ణసముత్పత్తి ఎట్లు జరుగుచున్నదో ఇందు శాస్త్రీయముగ ప్రతిపాదించబడినది. విద్యార్థులకు స్పష్టముగ అర్థమగుటకు ధ్వనియంత్రచిత్రమును వేసి వర్ణోత్పత్తికుపయోగించు ముఖాంతర్గతమగు అవయవములనన్నింటిని తగిన సంస్కృత పదములతో సూచించిరి.

ఆచార్యులవారికి పాణినీయముపై మక్కువ ఎక్కువ. వర్ణసముత్పత్తిని వివరించు సందర్భమున పాణినీయమును బహుధా ప్రశంసించిరి.[2]

---

1 "భాషాశ్రవణం భవతి తచ్ఛిక్షణం ప్రతి కారణమ్. శ్రూయమాణైవ భాషా బాలేనానుక్రియతే. యత్కించిద్భాషాశ్రవణాభావే తు స్వకపోలకల్పితాః పరాగ్రాహ్యాః కేచనావ్యక్తధ్వనయః ఉచ్చార్యన్తే. కింతు స్వాశయ సర్వస్య ప్రకాశకానాం శబ్దానామభావాచ్చేష్టాభిరేవ భూయసస్తానావిష్కరోతి. ఏవ మస్మిన్నుపదృశ్యతే చేష్టాబాహుల్యం శబ్దవైరల్యంచే"తి.
భా. శా. సం. పు. 7.

2. ఏవమేవ ప్రథమతః వర్ణానాం స్వరవ్యంజన విభాగః, వ్యంజనేషు స్పర్శాన్తస్థాది విభాగః, స్పర్శేషువర్గవిభాగశ్చాద్యతనేష్వపి పాశ్చాత్యవర్ణసమామ్నాయేషు నోపలభ్యంత ఇతి తదపేక్షయా సంస్కృత వైయాకరణానాముత్కర్షో వ్యక్తీభవతి.
భా శా.సం. పు. 15.

నాలుగవ అధ్యాయమున వివిధభాషలలోని శబ్దములనుచ్చరించుటకుపయోగించు లిపిని గూర్చి చేయబడిన చర్చ ఆచార్యులవారి మౌలిక విమర్శ చాతుర్యమును తెలియజేయుచున్నది. శబ్దార్థముల కెట్లు సాంకేతికమగు సంబంధము కలదో లిపికి వర్ణములకు గూడ నట్లె సాంకేతికమైన సంబంధము కలదు. అందువలననే విద్యార్థికి పాఠశాలలో భాషకంటె ముందు లిపినభ్యసించుట నేర్పుదురు. వాఙ్మయమునకును లిపికిని గల సంబంధమును పరామర్శించుచు నదిద్వారా సముద్రములో ప్రవేశించునట్లు లిపిద్వారా వాఙ్మయాంబుధిలో ప్రవేశింపవలెనను కాళిదాసవాక్యమును[1] ఆచార్యులవారు పేర్కొనుట వారి సమయజ్ఞతను చాటుచున్నది.

వర్ణములకు మొదట లిపిలేదు. అది తరువాత సాంకేతికముగ కల్పింపబడినది. అభిప్రాయములకు చేష్టలు, చిత్రములే స్వతః ప్రకాశకములైన సాధనములు. భాష సాంకేతికమైన సాధనము మాత్రమేనని ఆచార్యులవారు సోదాహరణముగ అందు నిరూపించిరి. చీనా, ఈజిప్టు దేశములలో ఉపయోగింపబడిన లిపులు, వాటి స్వరూప స్వభావములను గూర్చి ఇచట వారు విశదీకరించిరి. లిపి సాంకేతికముగ పదములద్వారా లేక పరంపరగా పదార్థబోధక కాగలదను అంశము ఈ అధ్యాయమున సోపపత్తికముగ ఉపపాదింపబడినది.

అయిదవ అధ్యాయము భాషావిభాగమును గూర్చి వివరించుచున్నది. భాషలను వర్గీకరించుటకు ముందు, పదమనగానేమి? అది ఎట్లు పుట్టుచున్నది? దానిలో అవయవములేవి? అవి పదముగా పరిణమించుటకు ఎటువంటి సంయోగమపేక్షింపబడుచున్నదను అంశములను లోకము

---

1. లిపేర్యథావద్గ్రహణేన వాఙ్మయం
నదీముఖేనేవ సముద్రమావిశత్॥
ర.వం. 3.28.

లోని భాషలన్నింటిని దృష్టిలో నుంచుకొని విచారింపవలెను. పద స్వరూపము భాషలలో వివిధముగ కన్పడినచో దానిని బట్టి ఆయా భాషలను విభజింపవలెను. ఇదియే పదసంవిధానకృత భాషావిభాగ మనబడునని ఆచార్యులవారు ఈ అధ్యాయమున సుస్పష్టముగ ప్రతి పాదించిరి.

తరువాత వారు ఆంధ్రభాషలోని పదస్వరూపమును సమగ్రముగ నిరూపించిరి. చీనా భాషలో విశేషార్థబోధను పదములే చేయుచున్నవని, అందులోని పదములు ఏకాచ్కధాతువులని పదముల స్థాననియమముచే కొన్ని విశేషార్థములు అందు బోధింపబడుచున్నవని, కనుకనే చీనా భాష ప్రథమావస్థలోనున్నదని, దీనిని (Radical) "ధాతుమయి" అని అందురని విశదపరచిరి. చీనా భాషను Isolating, Monosyllabic అని కూడా వేంకటరామశాస్త్రి పేర్కొనుచున్నారు. సంస్కృతాది భాషలలో విశేషార్థబోధకములగు ఎన్నియో ప్రత్యయములేర్పడినవని అందు వలన ఈ భాషలు తృతీయావస్థలో నున్నవని ప్రతిపాదించిరి. ఈ భాషలలో ప్రకృతిప్రత్యయములు నీరక్షీరములవలె అవిభాజ్య ములుగా నుండుటచే ఇవి (Amalgamating) సంకీర్ణభాషలని, గ్రీకాది భాషలు ఈ విభాగమున చేరునని తెలియజేసిరి. అట్లే ఆంధ్రాదిభాషలలో విశేషార్థబోధకములైన పదములు స్పష్టమైన మూలప్రత్యయములు కలవగుటచే, ప్రకృతి ప్రత్యయవిభాగము సుకరమని, అవి తిల తండులములవలె నుండుటచే (Agglutinating) సంసృష్ట భాషలగు చున్నవని నిరూపించిరి. టర్కిష్, జపనీస్, భాషలు ఈ విభాగములో చేరునని భాషాశాస్త్రప్రవేశిని పేర్కొనినది.[1]

అట్లే (Pantu) బాంటూ భాష పూర్వప్రత్యయ అని ఆంధ్రాదిభాషలు

---

1. భా.శా.ప్ర. పు. 8.

పరప్రత్యయులని, మలే, భాష ఉభయప్రత్యయు అని, చీనా భాష శైశ-వావస్థలోను, ఆంగ్లభాష వార్ధకదశలోను ఉన్నవని సోపష్టంభముగ ఈ అధ్యాయమున ప్రతిపాదించిరి.

అధ్యాయాంతమున పదసంవిధానకృత భాషావిభాగమునిట్లు రేఖాచిత్రముద్వారా ప్రదర్శించిరి—

భాష

ప్రత్యయప్రాగభావవతి - ధాతుమయి Radical

సంయుక్త Synthetic ప్రత్యయసహితా Inflectional

స్పష్టమూలప్రత్యయ-సంసృష్ట AGGLUTINATING | అస్పష్టమూలప్రత్యయ-సంకీర్ణ AMALGAMATING

పూర్వప్రత్యయ | ఉభయప్రత్యయ | పరప్రత్యయ

విభక్త - Analytic - ప్రత్యయధ్వంసవతి.

భాషల వంశములను విభజించునది ఆరవ అధ్యాయము. మానవులలో ఒక మూలపురుషుని పుత్రులు, పౌత్రులు, వారి సంతానము అతని వంశముగ చెప్పబడుచున్నట్లు భాషలలోకూడ మూలభాష - జన్య భాషలు వాటి పరస్పర సంబంధము వాటి వంశములు ఇందు నిరూపించ బడినవి.

జన్యజనకభావము సమానప్రతిపత్త్వమను భేదముచే జ్ఞాతిత్వము రెండువిధములని, తండ్రి కొడుకులకు గల జ్ఞాతిత్వము మొదటి దని, మిగత జ్ఞాతులందరకు గలది రెండవదని ఈ అధ్యాయమున ఆచార్యులవారు చక్కగా విశ్లేషించిరి. ఈ భాషలకు సంస్కృతము మూలభాష అను అభిప్రాయము సరికాదని అట్లె మూలభాషను ఇండో జర్మానిక్(Indo Germanic)అనుటయు సరిగాలేదని [Indo Keltic]అనుట లోను అతివ్యాప్తి దోషమేర్పడుచున్నదని, కనుక ఇండో-యూరోపియన్ (Indo-European)అనినచో అవ్యాప్తి అతివ్యాప్తులుసంభవించుచున్నవని పూర్వాపరావధులు సరిపోవు సరియైన పేరు దొరకుటలేదని పేర్కొనిరి. కాని తరువాతి అధ్యాయములు పరిశీలించినచో Indo-Germanic అను వ్యవహారమునే వీరనుసరించినట్లు తెలియుచున్నది. ఎల్. బ్లూంఫీల్డ్, తారాపోర్వాలాలు దీనిని Indo - European అనినచో విస్తృతమైన పరిధిని తెలియజేయునని భావించినారు.[1]

---

1. The name Indo-Germanic (now used chiefly by German Scholars and a few others out side Germany) was coined at a period when Indian Languages in the East&Germanic in the west marked the bounds of this family. But since that period new branches have been recognised, and Keltic now forms the western limit. It is obviously impossible to keep on changing names as the limits extend further. The name Indo-European is accepted now by practically all English and most of the non-German European writers and might be admitted as being the least open to objection.

E. S. L. P. 269.

శ్రీవరదాచార్యులవారు భాషల వంశవిభాగమునొక చిత్రపటము ద్వారా స్పష్టముగా వివరించినారు. అందులోను వారు Indo-Germanic అనియే మూలభాషను వ్యవహరించినారు. శ్రీకుప్పుస్వామి శాస్త్రి గారి శిష్యులైన శ్రీవెంకటరామశాస్త్రిగారు కూడా తమ "భాషాశాస్త్రప్రవేశిని"లో మూలభాషను ప్రిమిటివ్ ఇండోజర్మానిక్ టంగ్ అని పేర్కొనిరి.[1] దీనిని బట్టి Indo-Germanic అను వ్యవహారము శ్రీకుప్పుస్వామిశాస్త్రి గారికిని సమ్మతమని తెలుచున్నది. కాని చాలామంది భాషాశాస్త్రపరిశోధకులు Proto-Indo-European = PIE అని మూలభాషను పేర్కొనినారు.[2]

---

1. సేయం మాతృభాషా Primitive Indo-Germanic tongue ఇతి కథ్యతే.

   భా. శా. ప్ర. పు. 21.


2. Bloomfield, L : Language, P. 312.


ఇండో జర్మానిక్ భాషా వంశవృక్షము.

ఇండో జర్మానిక్ భాష

Indo - Germanic

భాషాగణములు






PRIMITIVE INDO EUROPFAN

ఈ వంశ విభాగమును కారాబొర్వాల్.[1] ప్రభృతులు వేఱుగ చేసి యున్నారు[2].

అక్ష్వపరిణామము (Ablaut or vowel gradation) అన్నిభాషలకు సమానధర్మము. సంస్కృత వ్యాకరణమునందలి గుణవృద్ధి సంప్రసారణములతో సంవాదమునందుచున్న ఈ అక్ష్వపరిణామము ఆరు విధములని ఆచార్యులవారు విశదపరచిరి. కారాబొర్వాల్[3] మొ॥ వారిచే

1. ESL. P. 271.
2. ISL. P. XXIV.
3. The word 'ablaut' means literally 'Change of the Vowel Sound'. And all most all writers use the word in the Sense of 'Vowel-gradation' as well.
ESL. P. 173.

ఇట్లే అచ్పరిణామము వివరింపబడినది[1]. ధాతువులలోను సర్వనామముల యందును సంఖ్యావాచకముల యందును పితృ-మాతృ-భ్రాతృ-రూప సంబంధబోధకములయందును వృక, అవి, గవాది మృగ బోధకముల యందును ఇండోజర్మానిక్ భాషలకు పరస్పరము సంవాదము కనపడు చున్నదని వివరించిరి.

ఏడవ అధ్యాయమున జాతికి భాషకు అవినాభావాభావము సాధింపబడినది. భాషాప్రయోగము వక్తృ-శ్రోత అను ఇద్దఱిపై ఆధార పడియుండును. అనగా భాష జనసమూహమునందు ఏర్పడి, అభివృద్ధి చెందుచు మార్పునందుచుండును. భిన్నభిన్నదేశీయులు భిన్నభిన్న భాషలను మాట్లాడువారు ఒకచోట కలిసియుండునపుడు భాషకు అభేద మేర్పడును. భిన్న జాతీయులు ఒకే భాషను మాట్లాడునట్లు ఏక జాతీయులు విభిన్న ప్రాంతములలో నుండి విభిన్నభాషలను మాట్లాడుట సంభవించు చున్నది. కనుక జాతికి భాషకు ఏవిధమైన అవినాభావము లేదని ఈ అధ్యాయమున ఆచార్యులవారు నిరూపించిరి.

ఎనిమిదవ అధ్యాయమున భాషాపరిణామము వివరింపబడినది. శిశువు ఇంద్రియములద్వారా ఎట్లు రూపరసాది జ్ఞానములను పొందు చున్నాడో వృద్ధవ్యవహారము వలన శబ్దార్థజ్ఞానమెట్లు కలుగుచున్నదో ఇందు సోదాహరణముగ నిరూపింపబడినది. 1. లాఘవికస్వభావము 2. అతిదేశికస్వభావము 3. స్పష్టప్రతిపాదన స్వభావము ఈ మూడు భాషాపరిణామ కారణములని ఇతరులచే పేర్కొనబడినది కాని ఇవి ముఖసుఖ-స్మృతిసుఖ - శ్రుతిసుఖ రూపములగు సుఖప్రభేదములని

---

1. The word 'ablaut' means literally 'Change of the Vowel Sound, Allmost all writers use the word in the sense of 'Vowel gradation' as well vowel gradation in one of the distinguishing Characteristics of IE Languages.
   ISL. P. 166

ఆచార్యులవారు నిరూపించిరి. అట్లే భాషావిపరిణామ ప్రతిబంధకములు- 1. గతానుగతికత్వము 2. విద్యాభ్యసనములని పేర్కొనిరి. తరువాత భాషావిపరిణామము 1. వర్ణలోపము 2. వర్ణాగమము 3. వర్ణాదేశము 4. వర్ణవ్యత్యయమని నాలుగు విధములని సోదాహరణముగ ప్రతిపాదించిరి.

తొమ్మిదవ అధ్యాయమునకు ఆచార్యులవారు "శక్తి" అని పేరు పెట్టిరి. అధ్యాయప్రారంభమున భాషను[1] నిర్వచించి, భాషా విచారమనగా శబ్దార్థ విచారమని స్పష్టీకరించిరి. శబ్దమునకు గల అర్థ ప్రకాశనశక్తి సహజమా? ఆరోపితమా? అని వికల్పించి పద-పదార్థములకు గల సంబంధమే శక్తి అని నిర్ధారణచేసి, అది ఈశ్వరేచ్ఛారూపమను ప్రాచీనమతమును కేవలేచ్ఛారూపమను అధునికమతమును పేర్కొని, ఇచ్ఛయే శక్తి అను మతమే భాషాశాస్త్రజ్ఞులకు సమ్మతమని నిరూపించిరి. తరువాత శబ్దపరిణామమువలె అర్థపరిణామము కూడ సంభవించుచున్నదని ప్రతిపాదించి, అర్థములకు పరస్పర సాన్నిధ్యము- 1. సామాన్య విశేషభావము 2. కార్యకారణభావము 3. అవయవావయవిభావము 4. సామీప్యము 5. సాదృశ్యము 6. తాత్స్థ్యము 7. తాదర్థ్యము 8. వైపరీత్యము మొ॥ సంబంధములచే నియమించబడుచున్నదని సోదాహరణముగ నిరూపించిరి. వీనియందు 1. కాదాచిత్కత్వము 2. ముఖ్యార్థసహభావము 3. కైవల్యమను మూడు అవస్థలు కనబడుచున్నవని విస్తరముగ ప్రతిపాదించిరి.

"సంస్కృత వర్ణసమామ్నాయము-మూలభాషలో దాని ప్రకృతి" అను అంశమును పదవ అధ్యాయమున నిరూపించిరి. గ్రీక్ లేటిన

---

1. భాషా నామ భావప్రకాశకో వర్ణాత్మకః శబ్దః.
భా.శా.సం. పు.47.

సంస్కృతాంగ్లాది భాషలలో కనబడు సాదృశ్యమును పరిశీలించిన వీటికి మూలభాష ఇండోజర్మానిక్ అను దానిని తప్పక కల్పించవలసి వచ్చుచున్నది. మూలభాషలోని పదములను ఈ భాషలలోని సమాన వర్ణస్వరూపమును బట్టి నిర్ణయించవచ్చును. శ్రీఆచార్యులవారు తమ పాణినీయవ్యాకరణశాస్త్ర పాండిత్యమును, నవీన భాషాశాస్త్రవైదగ్ధ్యమును మేళవించి ఈ అధ్యాయమున కొన్ని కారికలను వ్రాసి మూలభాషాస్వరూపమును ఇదమిత్థముగా నిరూపించిరి.

భాషాశాస్త్రమునందు ధ్వని నియమములకు ఎంతో ప్రాధాన్యము కలదు. ధ్వనినియమమును టుకర్ ఇట్లు నిర్వచించియున్నాడు-

A Phonetic law of language is a Statement of the regular Practice of that language at a Particular time in regard to the treatment of a Particular sound or group of sounds in a Particular Setting.[1]

శ్రీసంపదాచార్యులవారు ఈ క్రింది కారికల ద్వారా భాషాశాస్త్రమునందు సుప్రసిద్ధములైన మూడు ధ్వని నియమములను ప్రతిపాదించిన తీరు పండిత జన ప్రశంసలకు పాత్రమైనది-

సకారే వా తటస్థాతి యకారేకారయోస్తథా।
ఉక్తాభ్యాంచ కవర్గాభ్యాం చవర్గస్యోద్భవో యతః॥

సకారే, తటస్థాతి, యకారే, ఇకారే వా పరే పూర్వోక్తాభ్యాం కణ్ఠ్యమాధ్యమికవర్గాభ్యాం చవర్గో భవతి (Law of Palatalization)[2] తాలవ్య నియమమును సంగ్రహముగ సూత్రప్రాయముగ ఇట్లు నిర్వచించుట

1. Tucuker. T G.: Introduction to the Natural History of language. P 306, LONDON, 1908.

2. భా.శా.ప్ర. పు. 57.

ఆచార్యులవారి శబ్దశాస్త్రపై దుష్యమునకు ప్రతీకయగుచున్నది. Palatalization అను పదమును మొదట 1875లో Vilhelm Thomsen ప్రయోగించినాడు.[1]

మూలభాషలోని మూర్ధన్యవర్ణములు ద్రావిడభాష నుండి తీసికొనబడినవికాని, లేక ద్రావిడభాషా సాహచర్య సంస్కారమువలన ప్రయోగింపబడినవిగానీ అయి ఉండవచ్చునని Bishop Cold well ప్రతిపాదింపగా ఫ్రాన్స్ దేశీయుడగు FORTUNATOV[2] దానిని ఖండించి వేదముల యందే మూర్ధన్యవర్ణములు కలవని, అవి ద్రావిడభాషనుండి రాలేదని నిరూపించినాడు దానినే Fortunatov's law అందురు. ఆచార్యుల వారు Fortunatov's lawను నిరూపించుచు ఈ క్రింది కారికలను చెప్పిరి-

రకారాద్యా లకారాద్యా తవర్గే పరతాం గతే।
ఉభయుదాదథ సంజాతం టవర్గం హి విదుర్బుధాః॥
తత్రాద్యం ప్రాకృతద్వారా షకారాత్తస్య డో భవేత్।
జ (Z) దగేభ్యో భవేదస్య జఘా దశ్చ జఘా చ ఢః॥[3]

Fortunatov's lawను Burrow పునః పరిశీలించి నిగ్గుతేల్చినాడు. ఈ నియమమునకు సంబంధించిన వాదోపవాదముల సారాంశమును ఎమ్.ఎస్.ఎన్. మూర్తి సంగ్రహించిరి[4]. సుప్రసిద్ధమైనGrassman's law ను వర్ణించుచు ఆచార్యులవారు ఈ కారికను వ్రాసిరి-

---

1. భా. శా.ప్ర. పు. 56.

2. The Premitive Indo-Germanic dentals in Combination With l become cerebrals in the Aryan., but in combination with r they do not under go the change.
   భా.శా.ప్ర. పు. 61.

3. భా శా సం. పు. 57.

4. ISL P. 147.

తుపూ తుపోః క్రమాత్ప్యత్తామన్త్ర్యర్ద్వేష్వపి క్రమః।
తురీయశ్చ భవేత్తత్ర తృతీయః తర్కసన్నిభః॥

ఇట్లు వ్యాకరణశాస్త్ర సాహాయ్యముతో భాషాశాస్త్రము నందలి తత్త్వములను శాస్త్రీయమైన పద్ధతిలో సమీక్షించి సంస్కృతభాషలో ఆచార్యులవారు రచించిన గ్రంథమే భాషాశాస్త్రసంగ్రహము. గ్రన్థాన్త్రమున వారు సంస్కృత-గ్రీక్-లేటిన అంగ్లభాషలలోని విభిన్నపదముల సాదృశ్యములను చూపుచు ఇండోజర్మానిక్ పదములను ఊహించుచు ఇచ్చిన పట్టిక భాషా శాస్త్రమునందు పరిశోధనలు జరుపు విద్యార్థులకు ఎంతగనో మార్గదర్శకమగుచున్నది.

2.1.2 సుషుప్తివృత్తము :

సనాతన ధర్మపరాయణులకు, సంప్రదాయమును గౌరవించు వారికి సామాజికస్పృహ లేదని ఈనాడు సాహిత్యవిమర్శకులుగా చలామణి అగుచున్న కొందరిలో ఒక అపోహ కలదు. అది నిజముగా అపోహ మాత్రమేనని శ్రీవరదాచార్యులవారి "సుషుప్తివృత్తము"ను పరిశీలించినచో ప్రతివానికిని అర్థమగును.

శ్రీవరదాచార్యులవారు సంప్రదాయ బద్ధమైన శ్రీవైష్ణవ కుటుంబములో జన్మించినారు. మనసా-వాచా-కర్మణా సనాతనధర్మమును నమ్మి వేష భాషలలోను ఆలోచనా విధానమునందును, ఆబాల్యము స్వసంప్రదాయమునకు జాతీయ విధానములకు కట్టుబడి తమ జీవితమును అంకితభావముతో గడిపినారు. చుట్టూ ఉన్న సమాజపరిస్థితులు, దాస్యశృంఖలాబద్ధమగు భారతజాతి అనుభవించుచున్న హీనస్థితి వారి హృదయమును కలచివైచినది. సంస్కృతభాషా వాఙ్మయాభిజ్ఞులగుటచే ప్రాచీనభారతదేశచరిత్ర సంస్కృతి ఒకవైపు వారి స్మృతి పథములో మెరయుచున్నది. ఇంకొకవైపు పారతంత్ర్యముతో పరాయి పాలనలో మగ్గిపోవుచున్న స్వదేశీయులు అనుభవించు బాధలు మనసును ఆవేశపరచినవి. శ్రీవరదాచార్యులవారిలోని కవి హృదయము

CENTRAL LIBRARY
UROPAVL 50726

ఉప్పొంగినది; విచలితమైనది. వారిది సహజముగ గుంభిత[illegible] గమక సహృదయహృదయానంద వర్ధనమగు వ్యంజన[illegible]రు. "శోకః శ్లోకత్వమాగతః" అని ధ్వనికారుడన్నట్లు[1] ఈ దేశమునకు సంబంధించిన ప్రాచీన వైభవము, సమకాలీనమైన హీనదశ కావ్యావతరణమునకు పునాదియైనది. "సుషుప్తివృత్తమను" కమనీయకావ్య ముద్భవించినది.

సుషుప్తివృత్తమను ఈ ఖండకావ్యమును ఆచార్యులవారు 1937 లో ప్రకటించిరి. ఇందు 1. భారతదేశవర్ణనము 2. పరంజ్యోతి దర్శనము 3. పురుషోత్తమ సందేశము అను మూడు సర్గలు కలవు. ఈ ఖండకావ్యమున ఆచార్యులవారి రచన విపులార్థగర్భితమైన వ్యంగ్య మర్యాదలో చక్కని చిక్కని వైదర్భీరీతిలో సాగినది.

శ్రీవరదాచార్యులవారు తమ రచనలగు భాషాశాస్త్రసంగ్రహము నందును, సుషుప్తివృత్తము నందును గురువర్యులు ప్రొఫెసర్ ఎస్. కుప్పుస్వామిశాస్త్రిగారి తొలిపలుకులు తప్ప ఇతరుల అభిప్రాయములను ముద్రించలేదు. దీనివలన ఆచార్యులవారి గురుభక్తి, ఆత్మవిశ్వాసము వ్యక్తమగుచున్నది. అది నిజమేకదా! అంతేవాసి యోగ్యతా యోగ్యతలను గూర్చి సరియైన సమీక్షను గురువు చేయగలరు గాని ఇతరు లెట్లు చేయగలరు? అథవా ఏ కొంతవరకో చేయగలిగినను అవి అర్థవాదములు కావని సమాజమెంతవరకు నమ్మగలదు? ఇక గురువే అర్థవాదము చేసినచో నన్న ప్రశ్నలేకపోలేదు. కాని ప్రస్తుత మీ గురుశిష్యుల ప్రస్తావనలో అర్థవాదములకు తావులేదనుమాట ముమ్మాటికి నిజము.

1. కావ్యస్యాత్మా స ఏవార్థస్తథా చాదికవేః పురా।
క్రౌంచద్వంద్వ వియోగోత్థః శోకః శ్లోకత్వమాగతః॥
ధ్వన్యా. 1.5.

శ్రీ కుప్పుస్వామిశాస్త్రి గారికి తమ శిష్యులైన శ్రీవరదాచార్యుల వారిపై ఎంతటి సౌహార్దము, ఆదరము, వాత్సల్యము కలవో ఈ పుస్తకమునకు వారు వ్రాసిన FORE WORD లోని మాటలలో స్పష్టముగ తెలియుచున్నది.[1]

శ్రీశాస్త్రిగారు ఎంతో ఆప్యాయతతో ఆదరణతో 'my friend' Colleague and former Pupil' అని వ్రాసిన మాటలు శ్రీవరదాచార్యులవారు సాధించిన అభివృద్ధికి గురుభక్తికి, వారికి ఆచార్యులవారిపై గల మన్ననకు నిజమైన తార్కాణములు. అంతేగాక ఉత్తమ గురుశిష్య సంబంధమునకు వీరిద్దరి అనుబంధమొక ఆదర్శము.

ఆచార్యానుగ్రహము లేనిదే శిష్యుడెంత ప్రతిభాశాలియైనను పరిశ్రమియైనను రాణించుట కల్ల. తనకు ఆచార్యాశీర్వచనము లభించినాదని శిష్యుడు పొందిన ఆత్మప్రత్యయము శ్రీవరదాచార్యులవారి గురునమస్కారమను ఈ దిగువ శ్లోకములో ప్రతిఫలించుచున్నది.

పరశ్శత చ్ఛాత్ర జనస్య యస్య
స్తుతా గిరో మే ప్రథమావతారాః।
గురుస్స మేఽత్రైవ ముపక్రమోక్త్యా
శివం బ్రవీతీతి జితం మయా హి॥[2]

1 I have much Pleasure in acceding to the request of my friend, Collegue and former Pupil Mr. S.T.G Varada-charya, M.A., Principal Narasimha Sanskrit College, chittigudur. Masulipatnam, that I should write a short fore word to his Sanskrit Poem सुषुप्ति वृत्तम्.

సు. వృ. FORE WORD.

2. సు.వృ. గురునమస్కారః.

శ్రవ్యకావ్యమును గాని రూపకమునుగాని సమీక్షించునపుడు నామౌచిత్యము, వస్తువు, నాయకుడు, రసము, అలంకారములు, భావనలు, భాష, ప్రయోగములు మొదలగు అంశములను విమర్శకుడు దృష్టిలో నుంచుకొనవలెను.[1] సుషుప్తి వృత్తమను కావ్యమున ఈ అంశ-ముల విశిష్టత ఎటువంటిదో ఇచట నోదాహరణముగా పరిశీలింతము.

2.1.2.1 నామ వైశిష్ట్యము :

కవియగు శ్రీవరదాచార్యులవారు ప్రాచీన భారతీయ సంస్కృతి క్షీణదశను స్మరించి వికల మనస్కులై నిద్రించిన తరువాత స్వప్నమున పరంజ్యోతి రూపమున పురుషోత్తముడు దర్శనమొసంగి ఈ దేశ దుఃస్థితికి కారణములను వివరించి, దీనినుండి బయట పడుటకు తగిన సందేశమునందించిరి. కనుక స్వప్నమువంటి సుషుప్తియందు జరిగిన దానినాధారముగా జేసికొని వ్రాయబడిన కావ్యము గాన దీనికి "సుషుప్తి వృత్తమ"ని పేరిడిరి. "సుషుప్తౌ" వృత్తమధికృత్య కృతం కావ్యం "సుషుప్తివృత్తమ్" అని దీని వ్యుత్పత్తిని చెప్పుకొనవచ్చును.

జాగ్రత్-స్వప్న-సుషుప్త్యవస్థలలో గాఢనిద్రకు సుషుప్తియనిపేరు. సుషుప్తియందుస్వప్నాదులు రావని ప్రతీతి.కాని ఇచట సుషుప్తి పదమును స్వప్న పర్యాయముగా కవి ప్రయోగించి నటుల తెలియుచున్నది.[2]

---

1. వస్తు నేతృరసాస్తేషాం రూపకాణాం హి భేదకాః.
   ప్ర.య.భూ. పు. 87.

2. తద్వృత్తం త్వవగతవాన్ సుషుప్తివృత్తమ్.
   సు.వృ. 3.43.

అంతేకాక లౌకికవిషయములకు స్వప్నప్రతిభాస కలిగినట్లు పురుషోత్తమ సందర్శనమునకు సుషుప్తిదశయే యోగ్యమైనదను భావన కవికి ఉండియుండవచ్చును. పరమాత్మైక్య రూపమగు మోక్షమునకు సుషుప్తిని ఉదాహరణముగా పేర్కొనుచున్నారుకదా! శ్రీఎస్. కుప్పుస్వామి శాస్త్రిగారు తమ తొలిపలుకులలో "పశ్యన్తః స్వప్నవృత్తేఽస్మిన్"[1] అని స్వప్నపదమునే ప్రయోగించిరి.

2.1.2.2 వస్తువైశిష్ట్యము :

ఏ ప్రబంధమునకైనను వస్తువు శరీరమువంటిది.[2] శరీరము యొక్క బాగోగులనుబట్టియే మిగతా అంశముల ప్రకాశాప్రకాశములుండును. సుషుప్తివృత్త కథావస్తువు చాలా విచిత్రమైనది. ఒక నాణెము రెండువైపుల రెండురకములుగా నున్నట్లు భారతదేశమునకు సంబంధించిన ప్రాచీన వైభవముము ప్రథమసర్గలో సగమువరకు వర్ణించి, అటువంటి దేశము ఈనాడు ఆంగ్లేయుల పాలనలో ఎటువంటి దుర్దశకు దిగజార్చబడినచో మనహృదయములకుహత్తుకొనునట్లు మిగతసగమును వ్రాసిరి. పరంజ్యోతియగు పరమేశ్వరుడే ఈ దేశమును కాపాడవలెనని ప్రార్థించి నిద్రించినట్లు చెప్పుచూ సర్గను పూర్తిచేసిరి. ఈ సర్గకు "భారతదేశ వర్ణనము"ను పేరు సముచితముగా నున్నది.

ఇక రెండవసర్గ స్వప్నమునందు పరంజ్యోతి దర్శనమైనదని చెప్పుటతో ప్రారంభమైనది. ఆ జ్యోతి క్రమముగా కరచరణాద్యవయవ

---

1. సు. వృ. Foreword.

2. వస్తు యశాస్యప్రబంధస్య శరీరం కవి కల్పితమ్।
ఇతివృత్తం తదేవాహుర్నాట్యాభినయ కోవిదాః॥
భా. ప్ర. 7. 225.

ములతో పురుషోత్తమరూపమును పొందినది. కవి పురుషోత్తమ స్తుతి గావించినారు. ఈస్తుతి భగవంతుని అనేక కళ్యాణగుణములను ఎత్తిన అద్దమువంటిది అంతేకాదు; భగవంతుని స్వరూపస్వభావములను స్వభావ సిద్ధమైన సహజధోరణిలో వర్ణించుట అలంకారికముగా పోల్చి చెప్పుట ఈసర్గలో కనవడుచున్నది. కొన్నిచోట్లఖిందాస్తుతికూడా ఈసందర్భమున చోటు చేసికొనుట గమనించదగిన విశేషము.[1] ఈ సర్గకు కవి "పరంజ్యోతి దర్శన"మని తగిన పేరు పెట్టినారు.

ఈ కావ్యమున చివరి సర్గకు పురుషోత్తమసందేశమని పేరు. ఇందులో కవికి పురుషోత్తముడిచ్చిన సందేశము స్పష్టముగా అభివర్ణింప బడినది. భారతదేశము ఇటువంటి హీనస్థితికి దిగజారుటకు కారణములు మొదట వివరింపబడినవి. "నీచైఃస్థితావత్రజనోఽస్తి మూలమ్" అను మకుటముతో నాలుగు శ్లోకములలో[2] దేశమునకు పట్టిన ఈ నీచస్థితికి

---

1. సర్వస్యముక్త్యా సహ మేఽపి ముక్తిః
   సృష్ట్యాదికాత్కర్మణ ఇత్యుదీక్ష్య।
   స్వీయాధికారాచ్యుతి మీహమానో
   జగద్ధితం నూనముపేక్షసే త్వమ్॥
   సు. ప్ర. 2.36.

2. అనాదరం ద్వేషమపి ప్రకీయే
   ప్రాప్యాఖిలే వస్తుని వీతబుద్ధిః।
   పరస్య సంబంధిని బద్ధరాగో
   నీచైః స్థితావత్రజనోఽస్తి మూలమ్॥
   శబ్దప్రమాణం చ తథాపవర్గః
   పరప్రకారాయ ఖలస్య సృష్టిః।

అత్యన్యమాత్మానమపి ప్రతార్య
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

ప్రత్యక్షమానం చ తథానుమానం
ప్రమాణయన్ కుత్సిత తర్కధీరః।
కామార్థయోరేవ నిబద్ధదృష్టిః
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

మదాత్మజాతేషు జనేషు కాంశ్చిత్
ఉపేక్ష్య శక్తావపి దుఃస్థితాన్యః।
దయావిహీనో నిజకర్మభోజీ
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

సు. వృ. 3. 8-11.

కారణములు రేఖాచిత్రమునందువలె చూపబడినవి. "స్వధర్మే నిధనం శ్రేయః" అను భావము వ్యక్తీకరింపబడినది.[1] శరీరము, బుద్ధి, ఆత్మ, ఈ మూడింటికి బలములను చేకూర్చుకొన్నవారి తరతమ భేదములను తెలియజేసి అందులో ఆత్మబలముగల మహాత్ముడు రాక్షసులమండి లోకమును ఎట్లు కాపాడగలడో చెప్పబడినది. ఇచట మహాత్మశబ్దము "జాతిపిత మహాత్మగాంధి"ని దృష్టిలో నిడుకొని కవి ప్రయోగించిరి. అట్లే రాక్షసపదము తెల్లవారిని పరామర్శించుచున్నది.

యంత్రమునకు మానవుడెట్లు బానిస అగుచున్నాడో వివరించి చిట్టచివఱన మహాత్ముని గుణగణములు ప్రశంసింపబడినవి.[2] కవి నిద్ర నుంచి మెలకువ తెచ్చుకొని బయటకువచ్చి చూచునంతకి రాజమార్గమున అన్నది దేశభక్తులు కొందఱు దేశభక్తి గీతములను ఆలపించుచు వెళ్ళు-చుండుట కనపడును. అంతటితో కావ్యము పరిసమాప్తమగును.

---

1. వర్ణాశ్రమస్తే విహితక్రియాః స్యుః
   సన్తస్తి భర్తార ఇవాత్మవత్న్యః
   సీదన్తి రక్తాస్తు పరిక్రియాసు
   నరా ఇవాన్య ప్రమదాసు నూనమ్॥
   సు. వృ. 3.16.

2. జయ జయ దుష్టనిబర్హణ
   జయ జయ శిష్టజనావన।
   జయ జయ దృప్త విమర్దన
   జయ జయ పాతితపాలన॥
   జయ జయ భారతమండల
   జయ జయ భూత మహోదయ।

ఈ సుషుప్తివృత్తమునందలి కథావస్తువు కవికల్పితము. భారత దేశవర్ణనము పేరుగల మొదటిసర్గలో ప్రాచీన భారతదేశసంస్కృతి 1937 నాటి భారతదేశస్థితి చక్కగా వివరింపబడినది. మనదేశౌన్నత్యము తగ్గిపోవుచున్నదని బాధపడుచున్న కవికి పురుషోత్తముడు స్వప్నమున జ్యోతిగా దర్శనమిచ్చుట ద్వితీయసర్గలోని కథావృత్తము పురుషోత్తముడు మానవజాతికి అందించిన సందేశమే తృతీయసర్గ యందలి విషయము. ఈ కావ్యమునందలి రెండు మూడు సర్గలు కవి స్వప్నావస్థలో అనుభవించిన విషయమును అభివర్ణించుచున్నవి. ప్రథమసర్గలోని వర్ణనమంతయు కవి జాగ్రదవస్థలో చెప్పినవిషయమే.

---

జయ జయ భంగుర దుఃస్థిత
జయ జయ సుస్థిరభావిక॥

హన్తర్యహింసాం విషమే చ సత్యం
జయేచ నమ్రత్వముపాదదానమ్।
దోషం ద్విషన్తం న తు దోషవన్తం
మృష్యన్తమాత్మన్యపభాషమాణమ్ ॥

స్వం శోషయన్తం పరపోషణాయ
స్వతోఽల్పవస్త్రం పరవస్త్రవృద్ధ్యై।
పత్నీ ద్వితీయం స్వజితాత్మకాయై
పరత్రదోషే కథితాత్మదోషమ్॥

స్వయం తరన్తం పరతారణాయ
పునానమాత్మానమథాన్యశుద్ధ్యై।
జగత్ప్రదీపం యశసా సుగంధిం
భద్రాయ నః పాతు స దేవ దేవః ॥

సు. వృ. 3. 35-39.

### 2.1.2.3 నేతృవైశిష్ట్యము :

ఈ కావ్యమునకు నేత అనాటు ప్రపంచ ప్రసిద్ధికలిగి భారతదేశ స్వాతంత్ర్యమునకు కృషి చేసిన గాంధీమహాత్ముడు. కవి ఆవిషయమును వ్యంగ్యముగా చెప్పినను తొలిపలుకులలో శ్రీశాస్త్రిగారు వాచ్యముగనే చెప్పినారు.[1]

మహాత్ముడు ధీరోదాత్త లక్షణలక్షితుడు.[2] ఆచార్యులవారి దృష్టిలో వామనమూర్తియైన పురుషోత్తముడు. అహింసా సిద్ధాంతమునకు మూలస్తంభము, సత్యవాక్పరిపాలన తత్పరుడు, వినయశీలి, దోషద్వేషియేగాని దోషముగల వ్యక్తిని ద్వేషించనివాడు తనను నిందించిన వారిని కూడ క్షమించగలిగినవాడు.ఆచార్యులవారి మాటలలో మహాత్ముని పరిశీలింతము-

హన్తర్యహింసాం విషమే చ సత్యం
జయే చ నమ్రత్వముపాదదానమ్।
దోషం ద్విషన్తం న తు దోషవన్తం
మృష్యన్త మాత్మన్యపభాషమాణమ్॥[3]

ఇంతటి విశిష్టతలుగల నాయకుని వలన సుషుప్తివృత్తకావ్యము శోభించినది.

---

1. Soul force of mother-India, as Great Personatily of Mahatma Gandhi, who may be sald to from a blend of the Alambana.
   సు.వృ. FORE WORD.

2. మహాసత్త్వోఽతి గంభీరః క్షమావానవికత్థనః।
   స్థిరో నిగూఢాహంకారో ధీరోదాత్తః స సమ్మతః॥
   ప్ర.యు.భూ. 1.28.

3. సు.వృ. 3.37.

2.1.2.4 రసవైశిష్ట్యము :

ఏ కావ్యమునందైనను రసము ప్రధానమైనది. రసమునను-సరించియే ఆ కావ్యరచన సాగును. సుషుప్తివృత్త కావ్యము శాంతరస ప్రధానమైనది. నాట్యశాస్త్రమున భరతుడు శాంతరసమునకు స్థాయీ భావము శమమనియు, అది మోక్షప్రవర్తకమనియు తత్త్వజ్ఞాన-వైరాగ్య ఆశయశుద్ధ్యాదులు విభావములనియు, యమము, నియమము, అధ్యాత్మధ్యానము, ధారణ, ఉపాసన, సర్వభూతదయ, మొ॥ అనుభావములనియు నిర్వేదము, స్మృతి, ధృతి, సర్వాశ్రమశౌచము, స్తంభము, రోమాంచము మొ॥నవి వ్యభిచారి భావములనియు ప్రతిపాదించినాడు. ఇంకను శాంతరస స్వరూపమును భరతుడు విపులముగ నాట్యశాస్త్రమున పేర్కొనినాడు.[1]

సుషుప్తివృత్తమునకు FORE WORD వ్రాసిన శ్రీ ఎస్. కుప్పుస్వామిశాస్త్రిగారు రసమును గూర్చి ఇట్లనిరి-

This is a lyric which moves, with delightful effect on the sylvan quiet, content and purity of mother India's inward life as its motif and culminates in mahatmic 'Shanta as its dominating Rasa.[2]'

---

1. బుద్ధీంద్రియ కర్మేంద్రియేభ్యః సంరోధాఽధ్యాత్మ సంస్థితోపేతః।
సర్వప్రాణి సుఖహితః శాన్తరసో నామ విజ్ఞేయః॥
న యత్ర దుఃఖం న సుఖం న ద్వేషో నాఽపి మత్సరః।
సమః సర్వేషు భూతేషు స శాన్తః ప్రథితో రసః॥
భావా వికారా రత్యాద్యాః శాంతస్తు ప్రకృతిర్మతః।
వికారః ప్రకృతేర్జాతః పునస్తత్రైవ లీయతే॥
నా.శా. పు. 104.

2. సు.వృ. FORE WORD.

ఈ కావ్యమునందు భరతుడు పేర్కొనినట్లు శాంతరసనిష్పత్తికి కావలసిన స్థాయిభావము విభావములు[1], అనుభావములు,[2] వ్యభిచారి భావములు ఆయా సందర్భములందు చక్కగా వర్ణించబడి శాంతరసము సహృదయానందమును కలిగించుచున్నది.

### 2.1.2.5 అలంకార వైశిష్ట్యము :

లోకమున ఒక కన్యకు హారాద్యలంకారములెట్లు శోభను కలిగించునో

---

1. పాదౌ మయా తే గమితా హి దాస్యం
సముజ్ఝితా శ్రీరపి సుప్రసన్నా।
అనన్య చిత్తో భవతీం భజామి
ప్రసీద తస్మాన్మయి దైవి వాణి॥
సు.వృ. 1.6.

2. మనోరథస్యాపి న గోచరో యః
కథం న సిద్ధ్యేత్స్వ భువోఽవలోకః।
ఇత్యాత్మభాగ్యే క్షణమప్రతీతో
వీతప్రమోదో వితథత్వ బుద్ధ్యా॥

ఉత్తిష్ఠ వత్సేతి నిశమ్య వాక్యం
గంభీరమభ్రస్తనితం యథాఽహమ్।
ఉత్థాయ తేనాభిహితో విధాత్రా
వత్స ప్రపన్నోఽస్మి విభుస్త్వ వేతి॥

హస్త్యహింసాం విషమే చ సత్యం
జయే చ నమ్రత్వముపాదదానమ్।
దోషం ద్విషస్తం న తు దోషవన్తం
మృష్యన్త మాత్మన్యవభాషమాణమ్॥
సు.వృ. 2.9 , 14: 3.37.

కావ్యకన్యకు కూడ ఉపమాద్యలంకారములచే శోభాతిశయము కొన గూర్చును.[1] "అలంక్రియతే ఒనేనేత్యలంకారః" అని అలంకారశబ్ద వ్యుత్పత్తి. అలంకారములెన్నియున్నను ఉపమాలంకారమే అన్నింటికి మూలమని ఆలంకారికుల అభిప్రాయము.[2] కనుకనే కవికులగురువు కాళిదాసు తన కావ్యములయందు ఉపమాలంకారప్రయోగమున అనితర సాధారణమైన నైపుణ్యమును ప్రదర్శించెను. అందువలననే లోకమున "ఉపమా కాళిదాసస్య" అను ప్రసిద్ధికూడ అతనికి ఏర్పడెను.

కాళిదాస సాహితీసంపదులగు శ్రీవరదాచార్యులవారు తమ కావ్యమున గూడ ఉపమాలంకారమును ప్రసిద్ధమైన ఇతరాలంకారము లను ప్రయోగించి కావ్యశోభనినుమడింపజేసినారు. ఉదాహరణకు కొన్నింటిని ఇచట పరిశీలింతుము.

2.1.2.5.1 ఉపమాలంకారము :

ఉపమానోపమేయములకు ఇవాది శబ్దములతో సాదృశ్యము చెప్పబడినచో ఉపమాలంకామగును.[3] సుషుప్తి వృత్తముపశ్రీఆచార్యుల

---

1. హారాదివదలంకారాస్త్రత్రస్యురుపమాదయః॥
   ప్ర.యు.భూ. 2.2.

2. ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్ర భూమికాభేదాన్।
   రంజయతి కావ్యరంగే నృత్యన్తీ తద్విదాం చేతః॥
   చి.మీ.పు. 33.

3. ఉపమా యత్ర సాదృశ్య లక్ష్మీరుల్లసతి ద్వయోః॥
   హృదయే ఖేలతోరుచ్చైః తన్వంగి స్తనయోరివ॥
   చంద్రా. 5.11.

వారు అనేక సందర్భములయందు ఎన్నియో ఉపమాలంకారములను ప్రయోగించినారు-

1. మహాత్మనో మానసవద్విశాలః[1].

2. ప్రకాశిన్త నిర్మాణ ఇవ ప్రదేశః[2].

3. గంభీరమప్రస్తనితం యథాఽహమ్[3].

2.1.2 5.2 ఖండశ్లేషాలంకారము :

ఒకే కొమ్మకు రెండు పండ్లున్నట్లు,ఒకే పదమునకు రెండర్థములు చెప్పినచో ఆ అర్థములు రెండు వాక్యములలో విడి విడిగా అన్వయించినచో దానిని ఖండశ్లేష అనవచ్చును.[4]

ఖండశ్లేషాలంకారమును ఈ క్రింది మహాత్మ నమస్కారమున ఆచార్యులవారు ప్రయోగించినారు-

నమః కపటయాచ్ఞితే ధృత వామన మూర్తయే।
పురుషోత్తమ. భూతాయ బలిదర్ప విదారిణే॥[5]

---

1. మ.వృ. 1.8.

2. అందులోనే 1.26.

3. అందులోనే. 2.14.

4. ఖండశ్లేషః పదానాం చేత్కైకం పృథగర్థతా।
ఉత్పలద్యూరి కీలాలః శుశుభే వాహినీ పతిః॥
చంద్రా. 5.63.

5. మ. వృ. 1.4.

**2.1.2.5.3 దీపకాలంకారము :**

దేహలీదీపన్యాయమునను సరించి దీపకాలంకార మేర్పడినది. ప్రస్తుతాప్రస్తుత విషయములకు సమానత్వమేర్పడినపుడు దీపకాలంకార మగును.[1] శ్రీవరదాదార్యులవారు ఈ క్రిందిశ్లోకమున ఒకే క్రియా పదముతో దీపకాలంకారమును ప్రయోగించిరి-

సంత్రాతు మిష్టం పితరం స్వకాల్యే
పితుర్వచః పాలయితుం వ్రజాశ్చ।
వ్రజాన్సమారాధయితుం చ దారాన్
తత్యాజ యస్తం ప్రణమామి భూపమ్॥[2]

**2.1.2.5.4 అతిశయోక్తి :**

సంబంధము నిజముగా లేకపోయినను ఉన్నట్లు చెప్పుట సంబంధాతిశయోక్తియగును.[3] ఈశ్లోకమున ఆచార్యులవారు సంబంధా తిశయోక్తిని ప్రయోగించినారు-

---

1. ప్రస్తుతాప్రస్తుతానాంచ తుల్యత్వే దీపకం మతమ్।
   మేధాంబుధః సుధామిందుర్విభర్తి వసుధాం భవాన్॥
   చంద్రా. 5.53.

2. సు.వృ. 1.5.

3. సంబంధాతియోక్తిః స్యాత్తదభావేఽపి తద్వచః।
   పశ్య సౌధాగ్ర సంసక్తం విభాతి విధు మండలమ్॥
   చంద్రా. 5. 44.

యస్యాశ్రమాంబూని న శక్నువన్తి
శృంగాది మర్త్యాః సశరీరమాప్తుమ్॥[1]

2.1.2.5.5 ఉత్ప్రేక్ష :

గోపనము లేకుండా హేతువుగాని, ఫలముగాని స్వరూపముగాని సంభావన చేయబడినచో అది ఉత్ప్రేక్షాలంకారమగును.[2] నూనం మొ॥ ఉత్ప్రేక్షా వాచకములు ప్రయోగింపబడినచో దానిని అగూఢోత్ప్రేక్ష అని అందురు.

ఈ క్రింది శ్లోకమున ఆచార్యులవారు అగూఢోత్ప్రేక్షను ప్రయోగించినారు-

యో నూనమూఢో భవతి క్షితేర్గోః
రత్నౌషధిక్షీర నిధానభూతమ్।
వత్సం హిమాద్రిః కథమన్యథా తు
తస్మై స నిత్యం స్పృశ సన్నిధానః॥[3]

2.1.2.5.6 రూపకము :

ఉపమాన చిత్రముతో ఉపమేయ భిత్తి సర్వథా వ్యాపకమగుచో

---

1. సు.వృ. 1.12.
2. ఉత్ప్రేక్షోన్నీయతే యత్ర హేత్వాదిర్నిహ్నుతిం వినా।
   త్వన్ముఖ శ్రీకృతే నూనం పద్మైర్వైరాయతే శశీ॥
   చంద్రా. 5.29.
3. సు.వృ. 1.18.

దానిని రూపకాలంకారమందురు.[1] "రూపయతీతి రూపకమ్" లేక "రూపవత్కరోతీతి రూపకమ్" అని రూపక శబ్ద వ్యుత్పత్తి. ఈ కావ్యమున చాల రూపకాలంకారములను ఆచార్యులవారు ప్రయోగించినారు-

క్షిణే వటుత్వే జరయా హి దేహం
వశ్యత్వమాయాతి రుజాక్రిమీణామ్।[2]

2.1.2.5.7 సందేహాలంకారము :

సందేహము విషయమైనపుడు దానిని సందేహాలంకారమందురు.[3] ఈ కావ్యమునందలి సందేహాలంకారమునొక దానిని పరిశీలింతుము-

స్వప్నః కిమేషోఽస్తి కిమింద్రజాలో
మాయా భవేద్వా మతి విభ్రమో వా।[4]

2.1.2.5.8 అర్థాన్తరన్యాసము :

ముఖ్యార్థమునకు సంబంధించిన అర్థాన్తరమును సమర్థించుటకే అర్థాన్తరన్యాసాలంకారమని పేరు.[5]

---

1. యత్రోపమాన చిత్రేణ సర్వథాప్యుపరజ్యతే
   ఉపమేయమయీభిత్తిః తత్ర రూపకమిష్యతే॥
   చంద్రా. 5.18.

2. సు.వృ. 1.49,

3. స్యాత్స్మృతి భ్రాన్తి సందేహైస్తదేవాలంకృతిత్రయమ్
   చంద్రా. 2.10.

4. సు వృ.2.10.

5. భవేదర్థాన్తరన్యాసోఽనుషక్తార్థాన్తరాభిధాః
   హనుమానబ్ధిమతరత్ దుష్కరం కిం మహాత్మనామ్॥
   చంద్రా. 5.68.

ఇందులో సామాన్యము ద్వారా విశేషము సమర్థింపబడును.

ఈ కావ్యకన్యను అర్థాన్తరన్యాసములతో కవి అలంకరించిన తీరు చాలా విశిష్టమైనది. చూడుడు-

1. అంగేషు కాయే బహుషు స్థితేషు
   హృద్యేవ జాగర్తి వరాత్పరో హి॥[1]
2. ప్రజానురాగాద్ధి నృపస్య భూతిః॥[2]
3. భేదో హి నీతిర్విజయే బహూనామ్॥[3]
4. నిర్మాతు కామో హి నవీనసౌధం
   నిపాతయత్యేవ పురాణ గేహమ్॥[4]

ఇట్లు ఈ కావ్యమున అలంకారములెన్నియో ప్రయోగింపబడి కావ్య-శోభను అనేకవిధముల ఇనుమడింపజేసినవి. సంగ్రహముగ కొన్నింటిని మాత్రమే ఇచ్చట పేర్కొంటిని.

2.1.2.6 భావనావైశిష్ట్యము :

సుషుప్తివృత్తకావ్యమునందు కవి భావనలువివిధమైనవి.విశిష్టమైనవిగా కనవడుచున్నవి. కావ్యోద్ఘాతమున మహాత్మగాంధీని కపట యాచకుడు, బలిదర్పమును పోగొట్టినవాడు, పురుషోత్తముడైన వామన మూర్తిగా చెప్పుటలో ఎంతో సమున్నతమైన భావన మనకు గోచరించు చున్నది

---

1. సు. వృ. 1.9.
2. అందులోనే. 1.51.
3. అందులోనే. 1.52.
4. అందులోనే. 2.28.

నమః కపటయాచిత్రే ధృత వామనమూర్తయే।
పురుషోత్తమ భూతాయ బలిదర్పవిదారిణే॥

గాంధిమహాత్ముడు పొట్టివాడు, దేశస్వాతంత్ర్యమును కపటముగా యాచించినవాడు, పురుషోత్తముడు తన అహింసాసిద్ధాంతముతో సత్యాగ్రహోద్యమముతో బలవంతులైన బ్రిటీషు వారి దర్పమును పోగొట్టినవాడు. కనుక ఈ నాలుగు విశేషణములు మహాత్ముడైన గాంధిమహోదయునకు వామనమూర్తికి చక్కగా సరిపోవుచున్నవి. ఆహా! ఆదార్యుల వారి భావన ఎంత విశిష్టమైనది!

ఇంకొక విశిష్టమైన భావన — భారతదేశము భూమండలమునకు గుండెకాయవలె ఉన్నదట. మహాత్ముని మనస్సువలె విశాలమైనదట విశ్వంభరకు హృదయస్థానము కనుక ఇది జగన్నాథునకు నివాసభూమి అయినదట. "శరీరమునందు ఎన్ని అవయవములు ఉన్నప్పటికిని పరాత్పరుడు ఎల్లప్పుడు హృదయమునందే నివసించును కదా! అని ఆదార్యులవారు భావించుట యుక్తి-యుక్తముగను విశిష్టముగను కనబడుచున్నది.[1]

---

1. దేశః ప్రసిద్ధో భరతస్య నామ్నా
వంశస్య కర్తుః కురుపాండవానామ్।
మహాత్మనో మానసవద్విశాలో
భువోఽస్తి మధ్యే హృతయాయమానః॥

మానం జగన్నాథ నివాస భూర్యో
విశ్వంభరాయా హృదయస్వరూపః।
అంగేషు కాయే బహుషు స్థితేషు
హృద్యేవ జాగర్తి పరాత్పరో హి॥
సు. వృ. 1. 8-9.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।
భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥[1]

అనికదా! భగవదుక్తి. అంతేకాదట - ప్రతియుగమునందు దుష్టులను శిక్షించుటకై ఈ భారతభూమియందు పదిసార్లు అవతరించి దీనిపై తనకు గల పక్షపాతమును విష్ణుదేవుడు స్పష్టమొనర్చినాడట—

యుగే యుగే సంభవతాం క్షయస్య
దుష్టాత్మనాం వ్యాజవశేన విష్ణుః।
దశాఽపి వారానవతీర్య యత్ర
స్వపక్షపాతం విశదీచకార॥[2]

2.1.2.7 భాషావైశిష్ట్యము :

శ్రీవరదాచార్యులవారి భాష శుద్ధమైనది. వ్యాకరణబద్ధమైనది. సుషుప్తివృత్తమను ఈ కావ్యము వారి ప్రథమకృతి అయినప్పటికిని అందులో వారు ప్రయోగించినభాష చాలాపరిణతమైనదిగా కనిపించును. వారి వాక్యనిర్మాణమునందు శాస్త్రీయమైన క్రియాపదములకు లోపముండదు. కాళిదాస వాక్యముల ప్రభావము వారి భాషలో కొట్టవచ్చినట్లు కనబడును. కాళిదాసు భాషవలెనే ఆచార్యులవారి భాషకూడా లలితమైనది, గమనించుడు—

యస్యాభ్రచుంబీని న శక్నువన్తి
శృంగాదిమర్త్యాః పరశీరమాప్తుమ్।
హిమాలయో రక్షితవత్స ఏషః

1. భ. గీ. 18.61.
2. సు. వృ. 1.10.

యము త్తరస్యాం దిశి దుర్జనేభ్యః ।[1]

ఈ శ్లోకమును చూచినచో అల్పాక్షరములుగల పదములతో అనల్పార్థమును అందించగల శక్తి ఆచార్యులవారి భాషలో సమృద్ధిగా ఉన్నదని స్పష్టమగుచున్నది. కనుకనే వారి గురువర్యులు తొలిపలుకులలో కాళిదాసు అనుసరించిన వైదర్భీరీతి ఈ కావ్యమునందు చూచి మేమెంతో ఆనందపడుచున్నామని చెప్పిరి.[2]

**2.1.2.8** ప్రయోగవైశిష్ట్యము :

శ్రీఆచార్యులవారి అభిమానకవి కాళిదాసు. కాళిదాస సాహిత్య ప్రభావము వీరి రచనలపైన ఎంతగానో కనపడుచున్నదని పూర్వమే చెప్పితిని. వీరి ప్రయోగములనుపరిశీలించినచో అవి కాళిదాసకావ్యము లలో ఎక్కడో ఒకచోట తప్పకకనబడగలవు. ఉదాహరణమునకు ఒకటి రెండు ఘట్టములను గమనించుడు—

"వంశస్యకర్తుః కురు పాండవానామ్"[3]

"యస్యాభ్రచుంబీని న శక్నువన్తి"

---

1. సు. వృ. 1.12.

2. Mr. Varadachari has succesfully employed in his poem many of the good elements of Lalidasan Vaidarbhi, snch as an appropriate tempo and a happy consonence of sound and sence ____________

వైదర్భీతల్లభస్యేమాం కాళిదాసస్యపద్ధతిమ్।
పశ్యన్తః స్వప్నవృత్తేఽస్మిన్ దిష్ట్యావరామహే వయమ్॥
సు. వృ. Fore word.

3. సు. వృ. 1.8.

"హిమాలయో రక్షతి వత్స ఏషః"
"యముత్తరస్యాం దిశి దుర్జనేభ్యః"[2]

ఇచట "వంశస్యకర్తుః" అనుట "వంశస్య కర్తారమనంతవీర్యం" అను కాళిదాస ప్రయోగమును, హిమాలయమును "వత్స ఏషః" అనుట—

"యం సర్వశైలాః పరికల్ప్యవత్సం"[3] అను ప్రయోగమును స్మృతికి తెచ్చుచున్నవి. అట్లే "ఉత్తరస్యాందిశి" అనుటయు కాళిదాస పదారాధన ప్రభావమే.[4]

అట్లే రెండవసర్గలో పురుషోత్తముని వర్ణించుచు ఆచార్యుల వారిట్లనిరి—

"వృత్తిస్తు విస్మాయయతే తవైషా"[5] ఈ ప్రయోగము రఘు వంశములోని "విస్మాయయన్ విస్మిత మాత్మవృత్తౌ"[6] అను కాళిదాస ప్రయోగ ప్రభావముతో చేయబడినది.

పురుషోత్తముడు ఆచార్యులవారిని స్వప్నమునచేసిన సంబోధన— "ఉత్తిష్ఠ వత్సేతి నిశమ్యవాక్యం"[7]

---

1. సు. వృ. 1.12.
2. అందులోనే. 1.12.
3. కు. సం. 1.2.
4. అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా. అందులోనే. 1.1.
5. సు. వృ. 2.25.
6. ర. వం. 2.33.
7. సు. వృ. 2.14.

ఇది మాయాసింహ-దిలీప సంభాషణానంతరము కాళిదాసు చేసిన ఈ క్రింది ప్రయోగచ్ఛాయవలె కనబడుచున్నది-

"ఉత్తిష్ఠ వత్సేత్యమృతాయమానం
వచో నిశమ్యోత్థిత ముత్థితః సన్"[1]

పురుషోత్తముని వర్ణించుచు ఆచార్యులవారు చేసిన-

"ఫలానుమేయం సదపి ప్రతీమః"[2]

అను ప్రయోగము రఘువంశమునందలి ఈ క్రింది శ్లోకమును గుర్తునకు తెచ్చుచున్నది-

"ఫలానుమేయాః ప్రారంభాః"[3]

సుషుప్తివృత్తమునందలి ద్వితీయసర్గలో పురుషోత్తమవర్ణనము చేయుచు ఆచార్యులవారు-

"శరీరహేతుర్జననీ పితా చ
గోప్తా నృపశ్చాత్మహితో గురుశ్చ"[4]

అనివారు. దీనిని వినినవారికి రఘువంశములోని ఈ క్రింది శ్లోకార్థము జ్ఞప్తికి వచ్చును-

---

1. ర.వం. 2.61.
2. సు.వృ. 2.19.
3. తస్య సంవృతమంత్రస్య గూఢాకారేంగితస్య చ।
ఫలానుమేయాః ప్రారంభాః సంస్కారాః ప్రాక్తనా ఇవ॥
ర. వం. 1. 20.
4. సు.వృ. 2. 24.

"ప్రజానాం వినయాధానాద్రక్షణాద్భరణాదపి|
స పితా పితరస్తాసాం కేవలం జన్మహేతవః"[1]।

సుషుప్తివృత్తనందలి తృతీయ సర్గలో పురుషోత్తమసందేశ ప్రారంభమున–

"శుచిస్మితా వర్ధిత దన్తికాన్తిః"

అని ఆచార్యులవారు ప్రయోగించిరి. ఇందులోని "శుచిస్మిత" అను ప్రయోగము మాఘుని శిశుపాలవధమునందు కూడా కనపడు చున్నది.[2]

పురుషోత్తమ సందేశమున ఆచార్యులవారు "వామా భవేయుః విటశబ్దభాజః"[3] అనుచోట "వామాః" అని ప్రయోగించిరి. ఇది అభిజ్ఞాన శాకున్తలమున "వామాఃకులస్యాధయః"[4]అను కాళిదాస ప్రయోగ ప్రభావముతో చేయబడినది.

1. ర.వం. 1.24.

2. సితం సితిమ్నా సుతరాం మునేర్వపుః
విసారిభిస్సౌధమివాథ లంభయన్|
ద్విజావలీ వ్యాజ నిశాకరాంశుభిః
శుచిస్మితాం వాచమవోచదచ్యుతః||
శి. వ. 1.25.

3. పురాకృతేనైవ భజన్తి లోకే
జాయాః స్వకీయా సుముజాః క్రియాశ్చ|
స్వీయాసు తుష్టా వశినో భవన్తి
వామా భవేయుః విట శబ్దభాజః||
సు.వృ. 3,15.

4. యాన్త్యేవం గృహిణీపదం యువతయో వామాః
కులస్యాధయః
అ.శా. 4.18.

ఈ కావ్యాంతమున చంద్రాస్తమయమును సూర్యోదయమును ఆచార్యులవారిట్లు వర్ణించిరి—

గచ్ఛత్యస్తం శశిని వివదిషైకతో జన్మభూమేః
ఉద్యన్మార్తౌ విలసతి రవౌ శ్రేయసీ వాన్యతోఽస్యాః॥[1]

ఇది శాకుస్తలములోని యాత్యేకతోఽస్త శిఖరం[2] అను శ్లోకచ్ఛాయలో నడచినది.

2.1.2.9 సూక్తి వైశిష్ట్యము :

సుషుప్తి వృత్త కావ్యమున అయత్నసిద్ధమైన మధురాతి మధురములగు సూకులకు లోటులేదు.

ప్రజానురాగమువలననే రాజ్యముయొక్క విభవము వృద్ధినందునను ఈ సూక్తిరత్నమును చూడుడు- "ప్రజానురాగాద్ధి నృపస్య భూతిః"[3], ఇతరులలో ఐకమత్యమున్నంతవఱకు స్వార్థపరుం

---

1. గచ్ఛత్యస్తం శశిని వివదిషైకతో జన్మభూమేః
ఉద్యన్మార్తౌ విలసతి రవౌ శ్రేయసీవాన్యతోఽస్యాః।
మందం వాతే చలతి సురభౌ దాక్షిణే మిత్రవచ్ఛ
ప్రీత్యాసిక్తాః నగరతరుభైర్వ్యాపితే రాజమార్గే॥
సు.వృ. 3 44.

2. యాత్యేకతోఽస్త శిఖరం పతిరౌషధీనా
మావిష్కృతోఽరుణపురస్సర ఏకతోఽర్కః।
తేజోద్వయస్య యుగవద్ వ్యసనోదయాభ్యాం
లోకో నియమ్యత ఇవాత్మ దశాన్తరేషు॥
అ. శా. 4.2.

3. సు.వృ. 1.51.

అటులు సాగవు అందువలన వారి ఐకమత్యమును చెడగొట్టి భేదబీజము లను నాటి భేదోపాయముతో కార్యసిద్ధిని సంపాదించుట వారి అలవాటు. దీనినే ఆచార్యులవారిట్లు మధురమైన సూక్తిగా పొందుపరచినారు-

"భేదో హి నీతిర్విజయే బహూనామ్"[1] భగవంతుడు జగత్తులను సృష్టించి, పోషించి, తనలో లయింప జేసుకొనును. దానిని ఆచార్యుల వారు ఇట్లు చమత్కరించుచున్నారు-

నిర్మాతుకామో హి నవీన సౌధం
నిపాతయత్యేవ పురాణగేహమ్[2]

అది నిజమే! క్రొత్త ఇంటిని నిర్మింపదలచినాడు అక్కడగల పాత ఇంటిని పడగొట్టుట తప్పనిసరికదా!

ఆచార్యులవారు సుసంపన్న వ్యవసాయదారులు. భగవంతుడు జగత్తులకు ప్రళయము కల్పించుటను ఇంకొక వ్యావసాయికోదా- హరణతో సమర్థించుచున్నారు-

విధిత్సయా కిం సలిలాశయస్య
న ఖన్యతే భూః కలమప్రరోహః[3]

ఇటువంటి సూక్తులు సుషమ్తిసృత్తమున అనేకములవు. వాటిలో సమాజపరమైన అంశములలోను, శాస్త్రీయాంశములలోను ఆచార్యుల వారి అనుభవము, నిశితదృష్టి మనకు గోచరించుచున్నది.

---

1. అందులోనే. 1.52.

2. సు.వృ. 2.28.

3. అందులోనే, 2.29.

2.1.3 న చేద్వాల్మీకిరభవిష్యత్ :

"న చేద్వాల్మీకిరభవిష్యత్" అంటే "వాల్మీకి లేకపోయినట్లైతే" అని భావము. వాల్మీకి ఆదికవి,ఆయన కావ్యము శ్రీమద్రామాయణము ఆదికావ్యము. అది రఘుకులతిలకుడగు శ్రీరామచంద్రుని చరితము లౌకిక సంస్కృత వాఙ్మయమునకే గాక భారతీయ భాషాసాహిత్య-ములకే రామాయణము మూలభూతమైనదనుటలో సందేహములేదు. ఒక విధముగా భారతీయులకు రామాయణముతో అవినాభావ సంబంధమున్నదని చెప్పవలెను. మన జీవనసరళిలోను, ఆలోచనా విధానమునందును, సంస్కృతిలోను ఇంతెందుకు; దైనందిన వ్యవహారములయందు కూడా రామాయణప్రభావము మనపై ఎంతో కల-దని చెప్పక తప్పదు. ఈ సత్యమును పలుగురికిని చాటి చెప్పవలెనను ఉద్దేశ్యముతోనే శ్రీవరదాచార్యులవారు "న చేద్వాల్మీకిరభవిష్యత్" అను లఘుకావ్యమును రచించినారు.

మద్రాసు సంస్కృత ఎకాడమీ వారు 1938లో శ్రీరామనవమి మహోత్సవసందర్భమున ఒక సాహితీసభను ఏర్పాటు చేసినారు శ్రీఆచార్యులవారిని వాల్మీకిపై ప్రసంగించవలసినదిగా ఆహ్వానించి నారు. వారి ఆహ్వానమును అంగీకరించి శ్రీఆచార్యులవారు ఈ లఘు కృతితో వాల్మీకి వైభవమును సహృదయానందజనకముగా నిరూపించినారు.

ఈ కావ్యమున పలుబదిమూడు శ్లోకములున్నవి. అందు మొదటి శ్లోకము సుపప్తివృత్తములోని రెండవ సర్గలో ఇరువదవ శ్లోకముగా,

---

1. కుర్వాణమేకం వరసం చ కావ్యం
ప్రష్టారమాహుర్విబుధాః కవీంద్రమ్|
అనంతరూపం చ విచిత్రమేకత్
జగత్స్రజన్తం క ఇతీద్మహే త్వామ్॥
సు.వృ. 2.20.

మన్నది. అది సృష్టికర్తయైన భగవంతుని ప్రార్థన. రెండవశ్లోకము అనితరసాధారణమైన త్యాగమహిమతో అద్వితీయుడై దేవదేవుడైన శ్రీరామచంద్రునిస్తుతి[1]. ఈ శ్లోకము కూడ మొట్టమొదట సుమప్తివృత్తో ద్ఘాతమునందే ఇవ్వబడినది. తరువాత శ్రీఆచార్యులవారు తన వినయమును ప్రకటించు వ్యాజముతో కవిత-విమర్శ అను రెండు అంశముల స్వరూప-స్వభావములను ఇట్లు చక్కగా నిరూపించినారు-

విమర్శః కవితాచేతి ద్వంద్వం యది సుసంగతమ్।
ప్రసువీత రసం హృద్యం సమ్మోదాయ సచేతసామ్॥
సవిమర్శాత్మకస్వేర్మాన్యః కవితావాన్విమర్శకః॥
కవిమేతాదృశం స్తోతుం క్షమ ఈదృగ్విమర్శకః॥
యుస్త్వేతద్ద్వితయం నాస్తి కవితా చ విమర్శనమ్।
సోఽహ మీశేఽధమః స్మర్తుం కథం తం ప్రథమం కవిమ్?[2]

"విమర్శలేని కవితగాని, కవితాహృదయము లేని విమర్శగాని రాణించవు. కవిలో విమర్శ-కవితాశక్తి ఈ రెండును తగినంతగా ఉన్నచో సహృదయహృదయామోదమును కలిగించు కవితావాహిని వెల్లివిరియును. విమర్శదృష్టిగల కవికి కవితాదృష్టిగల విమర్శకునికి భేదములేదు. అటువంటి మహాకవిని స్తుతించవలెనన్నచో అంతటి విమర్శకునికే శక్యమగును. ఇక నా సంగతి ఏమిటనగా-అటువంటి

---

1. సంత్రాతుమిష్టం పితరం వ్యథార్తం
పితుర్వచః పాలయితుం ప్రతాప్య।
ప్రజాప్పమారాధయితుం చ దారాన్
తత్యాజ యస్తం ప్రణమామి భూపమ్॥
సు.వృ. పు. 2.

2. ప్రా.క. పు. 8.

కవితాశక్తి నాకులేదు విమర్శనశక్తి అంతకంటేలేదు., అటువంటి నేను ఆదికవి వాల్మీకిని స్మరించుటకు ఎట్లు సమర్థుడను కాగలను?"- ఇవి ఆచార్యులవారి మాటలు. ఇచ్చట ఆదికవిలోని గుణగణములను చెప్పుటతోపాటు అంతటి మహానుభావుని నావంటివాడెట్లు వర్ణించగలడని తన వినయమును వ్యక్తీకరించినారు.

నైయాయికులు అన్వయవ్యాప్తిని-వ్యతిరేకవ్యాప్తిని ప్రతి పాదించినారు. శ్రీవరదాచార్యులవారికి న్యాయశాస్త్రమునందు కూడా చక్కనిప్రవేశమున్నదనుటకు అన్వయవ్యతిరేకములను ఈ దిగువ వారు నిర్వచించిన తీరు చక్కని ఉదాహరణమగుచున్నది–

యస్య సత్త్వేఽస్తితా యస్య
తదభావే న తత్ స్థితిః।
అన్వయ-వ్యతిరేకస్య
మూలం ప్రాహుర్విపశ్చితః॥[1]

"యత్సత్త్వే యత్సత్త్వం.,యదభావే యదభావః"అని అన్వయ-వ్యతిరేకములను న్యాయశాస్త్రమునందు నిర్వచించుచున్నారు. వాల్మీకి స్తోత్రవ్యాజముతో అన్వయమును విశదీకరించుచున్నారని వాల్మీకి గుణ గణములను, శక్తిసామర్థ్యములను, ప్రతిభావ్యుత్పత్తులను ఇట్లు నిరూపించినారు–

వేదములకు ఓంకారమువలె, మానవులకు మనువువలె కాలమును బట్టి గుణగణములనుబట్టి నీవు కవులందరికి ఆదికవివి. శోకమునుండి శ్లోకమెట్లుపుట్టినదను శంక, పంకమునుండి పుట్టిన పద్మమువంటి "మానిషాద ప్రతిష్ఠాంత్వం" అను శ్లోకము ద్వారా ఉపశమించుగాక!

---

1. ప్రా.క. పు. 8.

భారతమును పంచమవేదమనినారు. నీకృతి శ్రీమద్రామాయణమును ఆదికావ్యమనినారు. ప్రభు మిత్ర సమ్మితమైన భారతముకంటె కాంతాసమ్మితమైన రామాయణమహాకావ్యము చాలా ఉత్కృష్టమైనది. మహాభారత ప్రతిపాద్యుడైన భగవాన్ శ్రీకృష్ణుడు గీతాగానమొనర్చి ధర్మాధర్మములనుపదేశించినాడు కాబట్టి పండితులే ఆయన తత్త్వమును గ్రహించగలుగుచున్నారు నీ కావ్యనాయకుడైన శ్రీరాముడు ధర్మమును ఆచరించి చూపుటవలన పామరులు కూడా ఆయనను సేవించుచున్నారు. అద్దము తనముందున్న వస్తువునే ప్రతిబింబింపచేయగలదు. నామమాత్రమగు వస్తువును కూడా నీ కావ్యమునందు మేము దర్శించవచ్చును. కాలక్రమేణ చిత్రపటము వెలసిపోవును. కాని నీ కావ్యశోభ ఎంతకాలము గడిచినప్పటికిని పెరుగుచున్నది కాని తరుగుటలేదు. బ్రహ్మదేవుని సృష్టి కొంతకాలమునకు జీర్ణమై నశించిపోవును కాని నీ సృష్టికి జరాలక్షణము లేదు., ఇక ప్రళయమను మాటెక్కడిది.[1]

ఇట్లు వాల్మీకి ప్రతిభను అనేకవిధములుగ కొనియాడి టీకాకు కవి ఇట్లు చెప్పుచున్నారు-

రామాత్కిం భవతః కీర్తిః త్వత్తో వాస్యేతి సంశయో।
వినిర్ణయే క్షమః కుర్వే పక్షద్వయ పరిగ్రహమ్॥[2]

కావ్యనాయకుడైన శ్రీరామునివలన కవియగు నీకు కీర్తి ప్రతిష్ఠలు లభించినవా? లేక ఆదికవియైన నీవలన నాయకుడైన శ్రీరామునికి పేరు ప్రతిష్ఠలు కలిగినవా। అను సంశయమేర్పడినది. రెండు పక్షములను తీసికొని రెండిని సిద్ధాంతములుగానే చేయగలుగుట ఇచ్చట ఆచార్యులవారి సునిశిత ప్రతిభకు ప్రబల నిదర్శనము.

---

1. ప్రా.క. పు. 9.

2. ప్రా.క. పు. 9.

భగవంతునికంటె భగవత్సాన్నిధ్యమును చూపించగల గురువును గొప్పవాడుగా బుద్ధిమంతులు చెప్పుచున్నారని, విశ్వస్థితికి హేతువు శ్రీరాముడైతే ఆయన స్థితి నీ అధీనమునందున్నదని చమత్కారముగా ఇట్లు నిరూపించినారు-

రామో విశ్వస్థితౌ హేతుః త్వదధీనా చ తత్స్థితిః।
స్థానే గురుం గరీయాంసం ప్రాహుర్దేవాన్మనీషిణః॥[1]

ఆచార్యులవారిప్రతిభ అనన్యసామాన్యమైనది. "సైన్యముతో కూడా యుద్ధమునందు అస్త్రములనెన్నింటినో ప్రయోగించి రాముడు రావణుని వధించినాడు మఱి నీవో ఒక్కడివే ఒక్కమాటతో ఎందఱినో రావణాసురులను ఇప్పటివరకు చంపినావు చంపుచున్నావు. ఇక ముందు కూడా చంపగలవు" అను భావమును ఎంతచక్కగా గైర్వాణిలో పొదిగినారో మనము గమనించి తీరవలెను.

ససైన్యోఽస్త్రైః జఘానైకం రామః సంయతి రావణమ్।
వాచైకస్త్వం ఘనానన్తాన్ అహన్ హంసి హనిష్యసి॥[2]

రామాయణము పిల్లలకు సులభముగా అర్థమగునట. పెద్దలకు ఎంతటికీ అర్థముకాదట. అనగా ఎవరి స్థాయికి తగినట్లు వారు అందులో ఉన్న అమృతరసమునాస్వాదించుటకు వీలుగ రచింపబడినదని భావము శ్రీవరదాచార్యులవారి అర్థగంభీరమగు మాటలలో ఈ సత్యము మనకు సాక్షాత్కరించుచున్నది-

బాలానాం సుగమోఽసి త్వం వృద్ధానాం తు సుదుర్గ్రహః।
కస్తే తులాం సమారోహేత్ త్వద్వర్ణ్యాన్నాయకాత్పరః॥

---

1. ప్రా.క. పు. 9.

2. అందులోనే. పు. 10.

న భీషయసి కించిజ్ఞం న విత్తైః పరిభూయసే।
యథాధికారమూర్ఖాణాం విత్తదోష్యవశం వృతైః॥

నీవు వర్ణించిన నాయకుడు శ్రీరామచంద్రుడు తప్ప అసలు నీతో ఎవరయ్యా తులతూగగల్గుదురు?

ఇట్లు వాల్మీకి వాగ్వైభవమును అనేక కోణములనుండి తంలఘు కృతిలో శ్రీఆచార్యులవారు చక్కగా ప్రశంసించినారు. చిట్టచివర "అసలు నీ సాన్నిధ్యమున్నట్లైతే ఇతర కవులతో మాకు పని యేమున్నది? ఒకవేళ నీ సాన్నిధ్యమే లేకపోయినప్పుడు కూడా ఇతర కవులతో మాకేమి ప్రయోజనము కలుగును" అని వాల్మీకి రచనయగు రామాయణము యొక్క గొప్పదనమును నిరూపించినారు.[2]

ఎవరి పైనా వంతీయని "నీకు సామ్రాజ్యము కావలెనా? లేక వాల్మీకి కావలెనా? కోరు కొమ్మని అడిగినతో గుణవత్తరుడవైన నిన్నె తప్పక కోరుకొందును" అని సత్వరమై సముపాగతసామ్రాజ్యముకన్న వాల్మీకి సాహితీ సామ్రాజ్యమునకుగల వైశిష్ట్యమును కవి చక్కగా ప్రతిపాదించినారు.[3]

---

1. ప్రా.క. పు. 10.

2. సన్నిధిస్తవ చేదస్తి కిమన్యైః కవిభిర్మమ।
సన్నిధిస్తవ చేన్నాస్తి కిమన్యైః కవిభిర్మమ॥
ప్రా.క. పు. 10.

3. సామ్రాజ్యం రోచతే కింతే వాల్మీకిర్వేతి భాషితః।
మానం త్వమేవ దోషజ్ఞో వృణుతే గుణవత్తరమ్॥
అంతులోకే. పు. 10.

అంతవఱకు అన్వయపద్ధతిలో వాల్మీకి ఉనికివలనకలిగిన విశేషములను అభివర్ణించి వ్యతిరేకపద్ధతిలో వాల్మీకి లేకపోయినట్లైతే ఈ ప్రపంచము ఎలా ఉండి ఉండేదో కవి చక్కగా వివరించినారు—

నావర్త్స్యద్యది వాల్మీకిః నాభవిష్యంస్తతో ధ్రువమ్।
కవయః కవికర్మాణి ప్రమోదాశ్చ సచేతసామ్ ॥
రామో విష్ణోర్వివర్తోఽపి తద్భక్త్యాచ భతీర్ణవః ।
మహోత్సవోయం న్మూలః మత్కవిత్వప్రదర్శనమ్;
అభవిష్యత్తమో విశ్వగ్రావణశ్చ గృహే గృహే।[1]

"ఆదికవి వాల్మీకి లేకపోయినట్లైనచో కవులు ఉండియుండువారు కాదు. కవులులేరు కాబట్టి కావ్యములును ఉండియుండెడివికావు. కావ్యములులేవు కాబట్టి సహృదయులకు ఆనందమే ఉండెడిదికాదు. విష్ణ్వంశసంభూతుడైన శ్రీరాముడుండేవాడు కాడు. ఆయనయందు భక్తితో భవసాగరమును దాటు రామభక్తులును ఉండేవారు కాదు. ఇప్పుడునిర్వహింపబడే శ్రీరామనవమీమహోత్సవముకాని,ఆసందర్భంలో నేను చెప్పిన ఈ కవితగాని ఉండేదికాదు. అయితే మఱి ఏమిఉండేది? లోకమంతయు అజ్ఞానాంధకారము నిండిఉండేది ప్రతి ఇంటియందును రావణుడు తిష్టవేసి ఉండేవాడు" అని వ్యతిరేకవిధానమున వాల్మీకిలేని లోకమునుగూడా ఎంతో విచిత్రముగా వర్ణించినారు ఆచార్యులవారు.

మొత్తముమీద ఈమాదిరి రచనలు సంస్కృతభాషలో రాలేదనియే చెప్పవలెను. ఆదికవి ఆదికావ్యము లేకపోయినట్లైతే సమాజము, సాహిత్యము ఏమై ఉండెడిదను భావనకలుగుటయే ఒక అపురూపమైన విషయము దానిని ఆలంబనముగా పెట్టుకొని వాల్మీకిని, రామాయణ-

1. ప్రా. క. పు. 11.

ముసు, శ్రీరాముని పరిశీలనాత్మక పద్ధతిలో చక్కగా వర్ణించిన అను-
కృతి "న వేద్యాల్మీకిరథవిద్మహే." ఆకారము చిన్నదైనప్పటికిని పాఠకులు బాగుగా ఆలోచించి తెలుసుకొనదగిన విశేషములు ఇందులో కోకొల్లలుగా ఉన్నవి.

2.1.4. సత్యవిజయము :

శ్రీవరదాచార్యుల వారి స్వతంత్ర రచనలలో సత్యవిజయమను కావ్యము చాలా విశిష్టమైనది. హరిశ్చంద్రుని కథాభాగమును మహాభారతమునుండి తీసికొని కమనీయమైన శైలిలో శ్రీ ఆచార్యులవారు రచించిన కావ్యమే సత్యవిజయము. ఇందు నాలుగు సర్గలున్నవి. మొదటిసర్గలో నలుబదిరెండు శ్లోకములు, రెండవసర్గలో అరువది తొమ్మిది శ్లోకములు మూడవసర్గలో ముప్పది శ్లోకములు, నాల్గవసర్గలో నలుబది తొమ్మిది శ్లోకములు ఉన్నవి. ఈ కృతి సత్యారాధన తత్పరు-డైన శ్రీరామచంద్రునకు సమర్పించబడినది. "మీ వంశము సత్యమున కంకితమైనది. నీవు తండ్రిమాటను సత్యమొనర్చుటకు హస్తగతమైన రాజ్యమును వదిలిపెట్టినావు. నీకే ఈ సత్యవిజయమును సమర్పించుచున్నాను. పరిగ్రహించుము"ని కృతిసమర్పణము చేయబడినది.1

ఈ కావ్యమును ఆచార్యులవారు 1935లో సగమువరకు రచించి వారు తరువాత వారి ప్రియశిష్యులు "కళాప్రపూర్ణ" బమ్మశ్రీ దువ్వూరి

---

1. సత్యారాధనతత్పరా వ్యూహ తయో నాథాః కులే భాస్వతః
తాతస్త్వాం తనయం జహౌ ప్రియతమం ప్రాణాంశ్చ సత్యప్రియః
రాజ్యం హస్తగతం జహే చ భవతా సత్యాయ వాచః పితుః
యుష్మత్పూర్వజపూత సత్యవిజయం శ్రీరామగృహాణస్వ మత్ ।
స. వి. కృతిసమర్పణమ్.

వెంకటరమణశాస్త్రిగారి నిర్బంధముతో అసంపూర్ణముగా ఉండిపోయిన కావ్యమును పూర్తి చేసి 1972లో ప్రకటించినారు.[1]

2.1.4.1 నామవైశిష్ట్యము :

ఈ కావ్యమునకు సత్యవిజయమను పేరు ఎంతో సముచితముగా నున్నది. "సత్య" అను నామైకదేశముతో "నామైకదేశే నామగ్రహణమ్" అను న్యాయమననుసరించి సత్యహరిశ్చంద్రుని తీసికొని సత్యనిష్ఠతో అతడు సంపాదించిన విజయమును సత్యవిజయమని పేర్కొనవచ్చును. అట్లుకాక సత్యమునకే ఈ కథలో విజయము లభించినది. కావున సత్యవిజయమని కూడా చెప్పుకొనవచ్చును. ఎట్లు చెప్పినప్పటికిని సత్యవ్రతమును ఆచరించిన వ్యక్తి విజయమైనను లేక సత్యమే సాధించిన విజయమైనను సత్యవిజయమే అగుచున్నది. సత్యమునకు కట్టుబడి అద్వితీయమైన త్యాగమును ఒనర్చిన దేవదేవుడైన శ్రీరామచంద్రునకు ఈ కావ్యమును అంకితము చేయుట, మంగళాచరణమున ఆయన త్యాగపరంపరను అభివర్ణించుచు ప్రార్థనచేయుట ఎంతో ఉచితముగా నున్నది.[2]

2.1.4.2 వస్తువైశిష్ట్యము :

కథావస్తువు కావ్యశరీరమని ఇంతకుముందు ప్రకరణమున చెప్పితిని. సత్యవిజయ కథావస్తువు చాల విశిష్టమైనది. అర్థశాస్త్రోదితమున ననుసరించి పరిపాలనము గావించు రాజు ఎవ్వడో ఒకప్పుడు అసత్యమును పలుకవలసిన వస్తుంది తప్పనిసరి. కాని అటువంటి క్షత్రియవరేణ్యుడు

---

1. స. వి. నివేదనమ్.

2. స. వి. మంగళాచరణమ్

కూడ సత్యారాధనము చేసి చివరకు తన భార్యను అమ్ముటకాక తనను తాను అమ్ముకొను నీచస్థితికి దిగజారినాడు. అయినప్పటికి సత్యమును అవలీలమైనను తప్పలేదు.

ఈ కథాగమనములో పరిశీలనాశ్చర్యపరచు మలుపులెన్నియో గలవు. వసిష్ఠ-విశ్వామిత్రుల భీషణప్రతిజ్ఞలు, అక్రితుడగు త్రిశంకు మహారాజు పుత్రుడు హరిశ్చంద్ర దని తెలిసియు వసిష్ఠునిపై ఆగ్రహములో విశ్వామిత్రుడు అతనిని అసత్యవాదిగా నిరూపింతునని ప్రతిజ్ఞ చేయుట, దానికొరకు ఎన్నోవిధముల ప్రయత్నించుట, హరిశ్చంద్రుడు అడవిపాలగుట,చివరకు కాశీపట్టణము చేరి కాలకౌశికునకు తన భార్యను అమ్ముట, వీరబాహువునకు తనను తాను అమ్ముకొనుట, ఆ ధనము నంతను నక్షత్రకునకొసంగుట రోహితాశ్వుని మృతి, శ్మశానమునంతము కొంటు నగరమునకు వచ్చిన చంద్రమతిపై హత్యానేరము ఆరోపింపబడుట. రాజాజ్ఞప్రకారము చంద్రమతి మెడ నరకుటకు హరిశ్చంద్రుడు ప్రయత్నించుట, విశ్వామిత్రుడుప్రత్యక్షమై హరిశ్చంద్రుని నివారించి ఈ బాధలన్నియు తాను కల్పించినవని, బ్రహ్మర్షి వసిష్ఠుడే గెలిచినాడని, తాను ఓడిపోయితినని అంగీకరించుట మొదలగు సంఘటనలు ఎన్నియో కలవు.

ఆచార్యులవారు ఈ కథను సంగ్రహముగా నాలుగు వర్గలలో వ్రాసిరి. మహాభారతములోని కథను తీసికొని వీరు తన కావ్యములో కొన్ని మెరుగులు దిద్దినారు.

**2.1.4.3 నేతృవైశిష్ట్యము :**

సత్యవిజయ కావ్యనాయకుడు సత్యహరిశ్చంద్రుడు. ఇతడు సూర్యవంశము న కలంకారభూతుడు, ధీరోదాత్తుడు, సకల సద్గుణము-

లకు గణినందినవాడు. అటువంటి నాయకుని ఒక మహోదాత్తవ్యక్తిగా నాయకమణిగా సత్యవిజయమున శ్రీవరదాచార్యులవారు రూపొందించినారు.

సత్యవ్రత భంగము కలుగకుండా జీవితమున ఇన్ని అగ్నిపరీక్షలను ఎదుర్కొన్న ఘనత మానవజాతి చరిత్రలో హరిశ్చంద్రునికొకనికే దక్కును. ప్రబంధములకు, కవులకు కీర్తిప్రతిష్ఠలు కలుగవలెనన్న ఉత్తమపురుషుడగు నాయకుని కావ్యమునందు వర్ణించవలెను. ఉత్తమ నాయకుని గుణవర్ణనమువలననే కావ్యము, కవి స్థిరమైన ప్రతిష్ఠనందుదురు.[1] సత్యవిజయ కావ్యమున హరిశ్చంద్రుని ధీరోదాత్త నాయక లక్షణములను అనేక సందర్భములలో కవి కీర్తించును.

సత్యైకదృష్ట్యా భజతోఽర్థకామౌ
మనీషిణస్తస్య న సంగహేతూ।
ధర్మస్య రక్షాం చ విధత్త ఏవ
తటౌ సుబద్ధావివ నిర్ఝరస్య॥[2]

అంతటి విశిష్టవ్యక్తి నాయకుడు గనుక ఈ కావ్యము ఉత్తమ లక్షణలక్షితమైనది.

2 1.4.4 రసవైశిష్ట్యము :

“రస్యతే ఆస్వాద్యతే ఇతి రసః” అను వ్యుత్పత్తివలన పాఠకులచేత

1. ప్రబంధానాం ప్రబన్ధౄణామపి కీర్తిప్రతిష్ఠయోః।
మూలం విషయ భూతస్య నేతుర్గుణనిరూపణమ్॥
ప్ర. య. భూ. ఉల్లా. 7.

2. స. వి. 1.7.

ఆస్వాదింపబడునది. గనుక దీనికి రసమని పేరేర్పడినది, రసానుభూతిని పొందిన మానవుడు ఆనందము ననుభవించునని తైత్తిరీయోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది—

"రసం హ్యేవాయం లబ్ధ్వా ఆనన్దీ భవతి. రసో వై సః"[1]

కవీశ్వరులు రససిద్ధినంది కావ్యములను రచింతురు. అప్పుడది ప్రతిపదమధురమై సహృదయుల హృదయముల నానందింపజేయ జాలును. సత్యవిజయమున శాంతము ప్రధానరసము. శాంతరస స్వరూపమును భరతుడు తన నాట్యశాస్త్రమున ఎట్లు వివరించెనో పూర్వపు ప్రకరణమున పేర్కొనినాను. జయదేవుడు తన చంద్రాలోకమున శాంతరసమునకు స్థాయీభావము, నిర్వేదమనినాడు[2] దృఢ నిర్వేదమువలన కలుగు సుఖమే శమమనబడును. కనుకనే సాహిత్యదర్పణము "నిరీహావస్థలో స్వాత్మవిశ్రాంతివలన కలుగుసుఖమే" శమమని నిర్వచించుచున్నది.[3] ఈ కావ్యమున శమమను స్థాయి భావము తదంగములతో గూడి ఎట్లు శాంతరసత్వమునందుచున్నదో చక్కగా ప్రతిపాదింపబడినది [4]

---

1. తై. ఉ. 2.7.
2. నిర్వేదస్థాయికః శాన్తః సత్సంగాది విభావభూః।
   క్షమాది కామభావోయం స్తంభాది వ్యభిచారికః ॥
   చంద్రా. 6.13.
3. శమో నిరీహావస్థాయాం స్వాత్మవిశ్రామజం సుఖమ్.
   సా. ద. 3-180.
4. శశామవర్షేణ వినా దవానలో
   మునేస్తు చింతా పవృధే తదీక్షణాత్। స.వి. 2.63.
   మౌనిశ్రుణుచాప్ప భవబంధనతల్ప మోక్షం
   ప్రేప్సుర్జగామ శివధామ విభావిశాశమ్। అందులోనే. 2.69.

న కామయే దుఃఖహృతిం సుఖం వా
న చార్థయే రాజ్యమథాపి కీర్తిమ్।
ప్రసీద లోకేశ విధేహి శక్తిం
సత్యం శపన్తం చ నిషేవితుం మేః।[1]

2.1.4.5. అలంకారవైశిష్ట్యము :

రమణీమణులకు హారాద్యలంకారములెట్లు రమణీయతను ఇను-మడింపజేయునో కావ్యరమణికి ఉపమాద్యలంకారములట్లు శోభాతిశయమును కలిగించును. దీనిని గూర్చి ఇంతకు పూర్వపు ప్రకరణమున (2.1.2.5) వర్ణించియున్నాము.

ప్రకృతము సత్యవిజయమున శ్రీవరదాచార్యులవారు ఎన్నియో అలంకారములను ప్రయోగించినారు. అయత్నసిద్ధములైనవి గనుక అవి కావ్యమునకు కమనీయతను సాధించినవి. ఇచట ఆచార్యులవారు ప్రయోగించిన కొన్ని అలంకారములను దిఙ్మాత్రముగా ఉదాహరింతును-

2.1 4.5.1 ఉపమ :

మఱ్ఱిచెట్టు ఊడలతో బాగా విస్తరించినట్లు సూర్యవంశము హరిశ్చంద్రునిచే పెంపువహించి ప్రతిష్ఠనందినదని ఇట్లు చక్కని ఉపమను ప్రయోగించినారు-

(1) భాస్వత్కులం యేన కృతప్రతిష్ఠం
ప్లక్షః ప్రరోహైః యథా ప్రవృద్ధః॥[2]

---

1. స.వి. 3.6.

2. అందులోనే. 1.4.

ఇంకొన్ని ఉదాహరణలను పరిశీలింతుము—

(2) ధర్మస్య రక్షాం చ విధత్త ఏవ
తటౌ సుబద్ధావివ నిర్ఝరస్య||[1]

(3) విరోధి సత్త్వా ఇవ శుద్ధసత్త్వమ్।[2]

(4) యథాగమోఽత్ర ప్రస్తుతం జగర్జ|[3]

(5) పాదాహతః ప్రజ్వలితః ఫణీవ|[4]

2.1.4 5.2 రూపకం :

రూపకాలంకారస్వరూపమును గూర్చి ఇంతకు పూర్వమే (2.1. 2.5 6.) వివరించితిని. సత్యవిజయమున రూపకాలంకారములు ఎంతో చక్కగా అమరినవి. చూడుడు—

1. ప్రభుః ప్రజానాం నరవిష్ణురేషః|[5]

2 స్వచిత్ర్యగూన స్తబకస్తనావతాః
ప్రవాలతామ్రాంశుక వర్ధిత శ్రియమ్|
స రమ్యశాఖా కరశోభితాం తమః
ప్రతాని సీమాదధతీం దదర్శ తమ్ః[6]

విచిన్త్య కోపానలముద్వమన్నివః[7]

1. స.వి. 1.7
2. అందులోనే. 1.8
3. అందులోనే. 1.23
4. అందులోనే. 3 12
5. అందులోనే. 1.10
6. అందులోనే. 2.13
7. అందులోనే. 2.23

2.1.4.5.3 అతిశయోక్తి :

అతిశయోక్త్యలంకారము ఇదివఱకే [2.1.2.5.4] వివరింప బడినది. ఈ కావ్యమున అతిశయోక్త్యలంకారము చాలాచోట్ల ప్రయోగింపబడినది.

1. వనస్థలీ సా నిజగాద రాగతః
శకున్తశబ్దైర్మధురైః సుఖాగతమ్॥[1]

2. వభౌ స నేత్రమయ్యైస్తమింద్రియైః।[2]

3. చచాల పాదన్యసనాహతా మహీ।[3]

2.1.4.5.4 ఉత్ప్రేక్ష :

ఉత్ప్రేక్షాలంకార స్వరూపము వెనుకటి ప్రకరణమున వివరింప బడినది. సత్యవిజయమునందు ఉత్ప్రేక్షాలంకారములకు లోటులేదు. కొన్నింటిని ఇచ్చట ఉదాహరింతుము-

1. ప్రతీక్షితో మాం చిరమాయయావయం
కదా పునః ప్రాప్స్యతి మాం మదీశ్వరః।
ఇతి ప్రమోదాధిక దుఃఖమోహితా
విచేష్టితాఽభూద్వనరాజిరేకతః॥[4]

2.1.4.5.5 అర్థాన్తరన్యాసము :

సత్యవిజయమున చక్కని అర్థాన్తరన్యాసాలంకారములను ఆచార్యులవారు ప్రయోగించినారు. చూడుడు-

---

1. స.వి. 2.5
2. అందులోనే. 2.10.
3. అందులోనే 2.24.
4. అందులోనే. 2.16.

1 నియోగతశ్శిష్యజనే హి లోకే
గురుః ప్రసాదం ప్రకటీకరోతి।[1]

2. బలిగ్రహీత్వా ధరణీశ ఏవ
భర్తా హి లోకాభ్యుదయ క్రియాణామ్।[2]

3. ప్రియోపభోగైకఫలా హి రమ్యతా।[3]

4. నహి ప్రచండః పవనః ప్రచాలనే
మహీరుహస్యేవ మహీభృతః క్రమః।[4]

2.1.4.6 భావనావైశిష్ట్యము :

సత్యవిజయ కావ్యమునందలి భావనలు ప్రసన్న రమణీయము లైనవి. కావ్యమును చదువుచున్నప్పుడు అందు ఆచార్యులవారు చూపించిన భావనలలోని ఔచిత్యత ఎంతగనో పాఠకులనాకట్టుకొను చున్నది.

హరిశ్చంద్రుడు అంతఃశత్రువులను జయించెనట. కనుక అతనికి బాహ్యశత్రువులే లేరట. ఎంత చక్కని భావనయో గమనించుడు-

"న చారయస్త్వ జితాన్తరారేః"[5]

ఇట్లే ఇంకొక భావనను పరిశీలించుడు-

హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి అర్ఘ్యాదుల నొసంగి అర్పించి తనను ఆదేశించమని అడుగుచున్న సందర్భము-

కృతప్రియం మాం భవదాగమేన
నియుజ్య భూయః ప్రియమాహర త్వమ్।
నియోగతశ్శిష్యజనే హి లోకే
గురుః ప్రసాదం ప్రకటీకరోతి॥[6]

---

1. స.వి. 1 33.
2. అందులోనే. 1.39.
3. అందులోనే. 2.12.
4. అందులోనే. 2.31.
5. అందులోనే. 1.6.
6. అందులోనే. 1.33.

ఆచార్యులవారు ఈ సందర్భమును చక్కగా ఉపయోగించుకొని నారు. "శిష్యునకు విద్యైనను పనిచెప్పుటద్వారా గురువు అతనిపై తనకు గల అనుగ్రహమును ప్రకటించునట." ఎంత అపురూపమైన భావనయో ఆలోచించుడు.

ఈ కావ్యమునందు ఇటువంటి నూతనమైనభావనలు ఎన్నోకలవు- ఒకటి రెండు మాత్రము ఉదాహరించితిని.

2.1.4.7 భాషా వైశిష్ట్యం :

శ్రీవరదాచార్యులవారి భాష ప్రసన్న మధురమైనది, గంభీర-మైనది. ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకము, అర్థాంతరన్యాసమువంటి అలంకారములు శ్రీ ఆచార్యులవారి భావకు పెట్టని అలంకారములుగా ప్రకాశించుచుండును వారి రచన వైదర్భీరీతిలో సాగును. ఆచార్యుల-వారికి వ్యాకరణశాస్త్రమునందు చాలాప్రీతి. సిద్ధాన్తకౌముదినుండి మహా-భాష్యమువరకు గల వ్యాకరణగ్రంథములను వారెంతోమంది విద్యార్థు-లకు అనేకమార్లు బోధించినారు. శిజన్త ప్రయోగములతో పరిపుష్ట-మైనది వారిభాష. "న రేఖయాఽపి చ్యుతిమన్వనీత" (1-2) "ధూర్తో ధి వేయం యది న స్తువీయ," [1-21] "వహాతు సా నేత్రవ యైస్త మిన్ద్రియైః," [2-10] "న తేన సత్కృస్త్యవిమృశ్య కారిణః", (2-24) "వరాంగనానాం విముఖత్వ మీయుషాముపాత్తజన్మాస్తకులే మహీ-భుజామ్", (2-47) "పేప్పర్జగామ శివధామ విభాసి కాశీమ్" (2-69) కర్తుం తథానోఽగకిరన్వమంన్త" (3-13) "అతి నిద్రాం సహతే న తే గృహే," (4-2) "ప్రాక్షేపి స్ఫురిత సుగంధి పుష్పవృష్టిః", [4-48] మొ॥ ఉదాహరణలు.

ఇట్లు ఈ కావ్యమునందు సుసంస్కృతమై సుసంపన్నమై రమ-ణీయమై అనల్పకల్పనా విలసితమైన భాష ప్రయోగింపబడినది.

**2.1.4.8 ప్రయోగవైశిష్ట్యం :**

శ్రీవరదాచార్యులవారి కావ్యములలో కాళిదాస ప్రయోగములు కోకొల్లలు. ఈ కావ్యమున వారి ప్రయోగములు చాలా విశిష్టమైనవిగా కనబడుచున్నవి. "వసిష్ఠుడు పలికెను"అనుటకు "జగ్రాహవచోవసిష్ఠః"[1] అనినారు". "వచః జగ్రాహ" అనుట ఎంతో విశిష్టమైన ప్రయోగము.

హరిశ్చంద్రుని వర్ణించుచు "రాజన్వతాముత్తరకోసలానామ్"అని అందురు. ఇది "రాజన్వతీమాహురనేన భూమిమ్"[2] అను కాళిదాసు పలుకుబడిని అనుకరించుచున్నది. అట్లే "బాహూ కిణాంకౌ"[3] "పృథులం చ వక్షః" "యతినాం ధురిత్వం సంకీర్త్యమానః"[4] "నిరంతరాయా భవతః ప్రసహ్య శివాయ కచ్చిజ్జగతాం మహర్షే"[5] "సవనార్థమర్థీ"[6]

---

1. స. వి. 1.3.

2. ర.వం. 6.22.

3. జ్ఞాస్యసి కియద్భుజో మే రక్షతి మౌర్వీకిణాంక ఇతి.
   అ. శా. 1.13.

4. అపాంసులానాం ధురికీర్తనీయా
   ర.వం. 2.2.

5. శివాని వస్తీర్థజలాని కచ్చిత్
   అందులోనే. 5.8

6. గుర్వర్థమర్థీ శ్రుతపారదృశ్వా
   అందులోనే. 5.24

"అర్థపతిః"[1] "ప్రియోపభోగైక ఫలా హి రమ్యతా",[2] "అలం మహీపాల మధుస్పృతా తవ",[3] "శశామవర్షేణ వినాదవానలః",[4] "కలమ ప్రరోహా"[5] "విలలాప ప్రలలాప చోచ్ఛ్రైః"[6] ఇత్యాది ప్రయోగములు కాళిదాస సాహిత్య ప్రభావమువలన ఏర్పడినవే.

2.1.4 9 సూక్తి వైశిష్ట్యము :

కావ్యములలో కవి నిక్షేపించిన సూక్తులు లోకమును ఉపదేశించుటకు, అస్తవ్యస్తముగానున్న సమాజమును తీర్చిదిద్దుటకు ఉపయోగించును. సత్యవిజయమను ఈ కావ్యమున సందర్భోచితముగా ఎన్నో సూక్తులు సహజసుందరముగా రూపుదిద్దుకొన్నవి. అర్థకామము లను మనము సత్యనిష్ఠతో సేవించినచో అవి సంగహేతువులు కావు.

---

1. కించిద్విహస్యార్థ పతిం బభాషే
 ర. వం. 2.46.

2. ప్రియేషు సౌభాగ్యఫలాహి చారుతా
 కు.సం. 5.1

3. అలం మహీపాలః తవశ్రమేణ
 ర.వం. 2 34

4. శశామ వృష్ట్యాపి వినా దవాగ్నిః
 అందులోనే 2.14

5. కలమా ఇవ తే రఘుమ్
 అందులోనే 4.37

6. విలలాప వికీర్ణమూర్ధజా
 కు. సం. 4.4.

ధర్మమునుకూడ కాపాడగలవను ఉపదేశము ఈ సందర్భమునుండి మనకు లభించుచున్నది.

సత్త్వైకదృష్ట్యా భజతోఽర్థకామౌ
మనీషిణస్తస్య న సంగహేతూ।
ధర్మస్య రక్షాం చ విధత్త ఏవ
తటౌ సుబద్ధావివ నిర్ఝరస్య॥[1]

తన ఆస్థానమునకు విచ్చేసిన విశ్వామిత్రుని అర్ఘ్యపాద్యాదులతో అర్చించి కర్తవ్యమును ఆజ్ఞాపించమని హరిశ్చంద్రుడు ప్రార్థించు సందర్భమునగల ఒక మంచి సూక్తి—

"నియోగతశ్శిష్యజనే హి లోకే
గురుః ప్రసాదం ప్రకటీకరోతి"[2]

శిష్యునిపై తనకు గల అనుగ్రహమునకు నిదర్శనముగా గురువు ఈ పని చేయుమని ఏదో ఒక పనిని ఆదేశించును. తనకు ఇష్టుడైన శిష్యునికే గురువు ఏదైనా ఒక పనిని అప్పగించుట జరుగును.

"బలిగ్రహీతా ధరణీశ ఏవ
భర్తా హి లోకాభ్యుదయ క్రియాణామ్"[3]

పన్ను వసూలు చేయు రాజు లోకాభ్యుదయమును సాధించు అనేక ప్రజాహితములను చేపట్టి ప్రజాకళ్యాణమునకు కంకణము కట్టుకొన వలెను.

---

1. స. వి. 1.7
2. అందులోనే 1.33
3. అందులోనే 1.39

"ప్రియేషు సౌభాగ్యఫలా హి చారుతా"[1] ఏ ప్రియురాలి అందచందములకైనను ప్రియుడు అనుభవించినప్పుడే ప్రయోజనము సిద్ధించును.

"కియచ్చిరం దగ్ధుమలం భవేచ్ఛిఖీ
భరస్య నిర్మూలయితుం ప్రభంజనః"[2]
"న హి ప్రచండః పవనః ప్రచాలనే
మహీరుహస్యేవ మహీభృతః క్షమః"[3]

"ప్రియం స్వయం శ్రేయస ఏవ యస్త్యజేత్
స ఏవ శిష్యో భవితా ప్రియో గురోః"[4]

"నిర్మాతుకామో హి నవీనసౌధం
నిపాతయత్యేవ పురాణగేహమ్"[5]

విధిత్సయా కిం పలితాశయస్య
న భస్మతే భూః కలమప్రరోహే"[6]

సత్యవిజయము అను ఈ కావ్యమునందు ఇటువంటి లోకోక్తులెన్నో సందర్భోచితముగా కవిచే పొందుపరచబడినవి.

---

1. స.వి 2.12
2. అందులోనే 2.30
3. అందులోనే 2 31
4. అందులోనే 2.49
5. అందులోనే 3 4
6. అందులోనే 3.5

2.1.4.10 సంభాషణ చాతురి :

ఈ కావ్యప్రారంభమున సభలో దేవేంద్రుడు ఎన్ని కష్టములొచ్చినప్పటికిని మాటతప్పనివాడు ముల్లోకములలో కలడా? అని ప్రశ్నించును.[1] దానికి సమాధానముగా వసిష్ఠుడు "రాజశ్రేష్ఠుడైన హరిశ్చంద్రుడు సత్యసంధుడని"[2] ఎనిమిది శ్లోకములలో అతడి సత్యనిష్ఠను ప్రశంసించును. ఈ మాటలను ఎంతో సహజసుందరముగా కవి అభివర్ణించినారు. వసిష్ఠుని ప్రతిజ్ఞను ప్రతిఘటిస్తూ విశ్వామిత్రుడు ఆరు శ్లోకములలో "హరిశ్చంద్రుడు అసత్యవాది" అని నిరూపించగలగని శపథము చేయును.[3] దానికి బ్రహ్మర్షి వసిష్ఠుని సమాధానము దాని పైన

1. కుత్రాపి లోకత్రితయేఽత్ర కశ్చి
ద్ధన్యోఽభివంద్యో జగతాం స కశ్చిత్।
యోఽచిన్తనీయాసు విపత్సు సత్యా
న్న లేశయాపి చ్యుతి మభ్యుపైత॥
స. హ. 1.2

2. సత్యం వరం స్వార్థ విఘాత హేతుః
నాసత్యమాత్మోపహతౌ నిదానమ్।
ఇతి స్థిరత్వాత్సుధియో ధియోఽస్య
ద్వేషోఽర్థశాస్త్రేష్వనృతాదిదుష్టేః
అందులోనే 1.5

3. స్వయాజ్యమేష ప్రియ సత్యముక్త్వా
నాహం తథేతి స్వయమభ్యుపైతి।
శ్రద్ధేయమీదృగ్వచనం కథం స్యా
దసత్యవాదీ నియతం స భూపః॥
అందులోనే 1.15

రాజర్షి విశ్వామిత్రుని ప్రతిజ్ఞ ఆవేశములతో నిండిన నాటకీయ పద్ధతిలో సాగినవి.[1]

తరువాత విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని ఆస్థానమునకు వెళ్ళును. ఆయనకు స్వాగతవచనములు పలికి మహారాజు కుశలప్రశ్నలు వేయును. ఇక్కడ జరిగిన సంభాషణ రఘువంశములోని రఘు-కౌత్సుల సంభాషణను గుర్తు చేయుచున్నది.[2] హరిశ్చంద్రుడడిగిన కుశలప్రశ్నలకు మహర్షి సమాధానము చెప్పుచు తన యజ్ఞమునకు కావలసిన ధనసాహాయ్యమును అర్థించును.[3]

ఈ కావ్యమునందలి సంభాషణలలో విశ్వామిత్రుడు రాజును

---

1. అలం సుధర్మాధిగతా బహూక్త్యా
తీర్ణప్రతిజ్ఞో యది కౌశికస్స్యాత్।
యజ్ఞోపవీతం ప్రవిహాయ ముండః
ఖరాధిరూఢో విచరేద్వసిష్ఠః॥
స. వి. 1.22

2. కాయేన వాచా మనసాపి శశ్వద్
యత్సంభృతం వాసవధైర్యలోపి।
ఆపాద్యతే న వ్యయమన్తరాయైః
కచ్చిన్మహర్షేస్త్రివిధం తపస్తత్॥
ర. వం. 5.5

3. త్వాం దీర్ఘకాలేన మహాసవేన
ప్రాపం యియక్షుస్సవనార్థమర్థీ।
స. వి. 1.39

నిందించుచు అడవిలో మాట్లాడిన మాటలు ఎంతో సహజముగా కన-పడుచున్నవి—

మనోజ్ఞవేషో విశ్రుతాంతరశ్చ యో
రహం త్వమాధార ఇవ ప్రపద్యసే।
సరోజరమ్యా వినిలీన సక్రకో
న చేన సశ్యన్త్యవిమృశ్యకారిణః॥[1]

అట్లే హరిశ్చంద్రుడు విశ్వామిత్రుని బ్రతిమలాడుకొను సందర్భము గమనించుడు—

మలం హిరణ్యస్య విధాయ భస్మసా
ద్విశుద్ధిమేవాతనుతే యథానలః।
తథా మమాఘం ప్రవిమృజ్య శుద్ధతాం
దధాతి నైష్ఠుర్యమహో గురోస్తవ॥[2]

విశ్వామిత్రుడు రాజునకుచెప్పు సమాధానమునందు రఘువంశము నందలి సింహ-దిలీపుల సంభాషణచ్ఛాయలు బాగుగా కనబడుచున్నవి.[3]

**2 1.4.11 పాత్రచిత్రణ :**

**2.1.4.11.1 హరిశ్చంద్రుడు :**

ఈ కావ్యమున హరిశ్చంద్రుడు - చంద్రమతి - విశ్వామిత్రుడు-

---

1. స. వి, 2.29
2. అందులోనే 2.36
3. అలం మహీపాల! మధుశ్రుతా తవ
ప్రగల్భవాచా నృపసంపదర్థయా।
వినీతి రమ్యాపి ముఖేఽగ్రగామినా
విషేణ సా వృశ్చికవద్భయంకరీ॥
అందులోనే 2.39

వసిష్ఠుడు అను నాలుగు ప్రధానపాత్రలు. అందులో ధీరోదాత్తస్వభావు డగు హరిశ్చంద్రుని సుగుణములరాశిగా, సత్యము కొఱకు తన సర్వస్వమును చివరకు తనను కూడా వదులుకొనే మహోన్నతవ్యక్తిగా శ్రీవరదాచార్యులవారు చిత్రీకరించినారు. హరిశ్చంద్రుని ధర్మనిష్ఠ, దయాశీలము, వినయము అడుగడుగున మనకు ఈ కావ్యమునందు గోచరించుచున్నవి.

కృతప్రియం మాం భవదాగమేన
నియుజ్య భూయః ప్రియమాహరస్వ।
నియోగతశ్శిష్యజనే హి లోకే
గురుః ప్రసాదం ప్రకటీకరోతి॥[1]

ఆ రాజు వినయమునకు ఈ శ్లోకమొక చక్కని ఉదాహరణము. మాతంగకన్యలను తిరస్కరించి హరిశ్చంద్రుడు తన ధర్మనిష్ఠను చాటిన సందర్భమును పరికించుడు—

వరాంగనానాం విముఖత్వమీయుషా
ముపాత్తజన్మాస్మి కులే మహీభుజామ్।
తదగ్నిసాక్ష్యేణ గృహీత పాణితో
హృదాపి నాన్యామలమస్మి వీక్షితుమ్॥[2]

ఇట్లు హరిశ్చంద్రుని పాత్రను ఆచార్యులవారు సకలగుణగణాకరముగా ఈ కావ్యమున తీర్చిదిద్దిరి.

2.1.4.11.2 చంద్రమతి :

దానదాసీజనముచే అనేకోపచారములనందుకొన్న మహారాణి

1. స. వి. 2.33
2. అందులోనే 2.47

చంద్రమతి. పురోహితుని కుటుంబమునకు దాస్యముచేసినది. ఆసందర్భ-
మును ఆచార్యులవారిట్లు వర్ణింతురు—

"ముఖాభిధాత్రీ విహితం విధాత్రీ
పురా నియోక్త్రీ త్వధునా నియోజ్యా"¹

యజమాని నిద్రలేవక మునుపే లేచి ఒకరు చెప్పకనే అన్ని
పనులు పూర్తి చేయు దాసిగా చంద్రమతి ఎంతో గంభీరప్రభావమును
ప్రదర్శించినది.² ఎన్ని కష్టములొచ్చినప్పటికిని పతిభక్తిని పతివ్రత
నిష్ఠయైన పతిశాసనమును అనుసరించుటయే తన ధర్మముగాభావించిన
మహిళామతల్లి ఆమె. నాలుగవ సర్గలో చంద్రమతి మాటలలో తాను
అనుభవించిన బాధలన్నింటిని వివరించుసందర్భము మూర్తీభవించిన
క్షమాదేవతను మనకు సాక్షాత్కరింపజేయుచున్నది.³

---

1. స. వి. 3.15

2. సుప్తేప్యముత్తిష్ఠతి పూర్వమేవ
పశ్చాత్ గృహిణ్యాశ్చ కరోతిసుప్తిమ్।
వినా నియోగం కురుతే చ సర్వం
స్వస్వామినాపేవమసేవతైషా॥
అందులోనే 3 27

3. భర్త్రాహం సుధియోజ్ఝితా సుతవయా దాస్యప్రవణాత్వచిత్
పుత్రార్థం ధృతదేహకా చ విధినా తేనాపి రిక్తీకృతా।
నిస్వార్థత్వవాయు ఘాతుకవరేణానేన సంప్రేరితా
తులాకర్థం ప్రయతీ పతి వ్యముషితం ప్తేనైర్భలాద్గ్రాహితా॥
అందులోనే 4.36

### 2.1.4.11.3 విశ్వామిత్రుడు :

అతికోపనుడు, మహాతపస్వి విశ్వామిత్రుడు. బ్రహ్మర్షి వసిష్ఠుని మాటలు అతనికిగిట్టవు. తనకు ఆశ్రితుడు, మిత్రుడైన త్రిశంకునిపుత్రుడు హరిశ్చంద్రుడు. కాని వసిష్ఠుడాతనిని సత్యవ్రతుడని పొగడుటను సహింపలేకపోయినాడు అతనినసత్యవాదిని చేయగలనని ప్రతినపూని-నాడు. కఠినాతికఠినముగా పరీక్షించినాడు. చివరకు నేనే ఓడిపోయినా నని అంగీకరించినాడు. వసిష్ఠునితో ప్రతిజ్ఞ[1] చేయు సందర్భమున విశ్వామిత్రుని మాటలను గమనించుడు—

కిమత్ర పూర్వస్య కృతజ్ఞతేయ
మాదాస్యమానం ప్రతికామతా వా,
యత్స్తూయతేఽయం క్షితిపస్సుధర్మా
ముఖే మృషారోపితసత్యవాదః॥[2]

భోభో స్సురాధీశ దివౌకసశ్చ
వసిష్ఠ పక్షో విజయీ యదిస్యాత్।
మయా హి మాద్రో వచనాశనేన
తప్తే తపస్యర్ధమియాత్స భూభృత్॥[3]

---

1. తథాఽపి యద్వ్యాగ్రగహత స్త్వకియం
   న తద్యుక్తం ప్రతిసంహరేత్త్వమ్।
   త్వచ్ఛృంగభంగం నృపసత్యభంగా-
   త్కర్యామియం మే హ్యచలా ప్రతిజ్ఞా॥
   స. వి. 1.17
2. అందులోనే 1.13
3. అందులోనే 1.24

ఈ శ్లోకములో అతని కోపవ్యాఖ్యానము, వసిష్ఠుని ఎట్లైనను తక్కువచేయవలెననెడి తలంపు స్పష్టమగుచున్నవి. సత్యమే జయించిన దని తానే ఓటమిని అంగీకరించుచు విశ్వామిత్రుడన్న మాటలలో అతని వ్యక్తిత్వము మనకు అర్థమగున్నది—

అలం హరిశ్చంద్ర సతీవధేన
బ్రహ్మర్షిణా తేన జితోఽస్మి సత్యమ్।
యథాప్రతిజ్ఞం తపసో దదేఽర్ధం
తుభ్యం హిమాద్రౌ చిరసంచితస్య॥[1]

విశ్వామిత్రుని కోపము వసిష్ఠుని పైననే గాని హరిశ్చంద్రుని పైన కాదను విషయము ఈ శ్లోకమున స్పష్టమగుచున్నది. తాను లోగడ చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి తన తపశ్శక్తిని సగమాతనికివ్వజూపుటద్వారా విశ్వామిత్రుని సత్యనిష్ఠ మనకు తెలియుచున్నది.

2.1.4.11.4 వసిష్ఠుడు :

సత్యగుణమునకు ప్రతీక బ్రహ్మర్షి వసిష్ఠుడు. లోకమున ఎటు-వంటి కష్టకాలమునందైనను సత్యనిష్ఠచెడని వ్యక్తి ఎవరని ఇంద్రుడు సభలో ప్రశ్నించగా "హరిశ్చంద్రుడ"ని వసిష్ఠుడు వెంటనే సమాధానము చెప్పెను ఆయన హరిశ్చంద్రుని గుణగణములను సంభిమనముతో ప్రశంసించును.[2] విశ్వామిత్రుడు తననెంత అవమానించి మాట్లాడినను వసిష్ఠుడు నిండుకుండవలె తొణుకు బెణుకు లేక మేరుసమానధీరుడై యుండును. ఆ సందర్భమున వసిష్ఠునిలోగల స్థితప్రజ్ఞత సభవారి-

1. స. వి. 4.43

2. అందులోనే 1.4.10

కెల్లరకు ఆశ్చర్యమును గొల్పును "విశ్వామిత్రునకు. హరిశ్చంద్రుని పై వైరములేదు. నేను అతనిని స్తుతిచేయుటవలన ఇంతటి అర్భాటమును చేయుచున్నాడ"ని సభకు వసిష్ఠుడు వినయముతో విన్నవించును.1

సత్పురుషులలో గల గుణమును తెలిసికొనలేకపోయినచో నేను మూర్ఖుడనగుదును. గుణాధికుల గుణములను గ్రహించియు సమయ-మున దానిని గూర్చి తెలియజేయకపోయినచో ధూర్తుడనగుదునని" పలుకుచు వసిష్ఠుడు తన హేతుబద్ధమైన ప్రవృత్తిని ఆవిష్కరించు చున్నాడు.2 చివరకు ఆయన చేసిన ప్రతిజ్ఞయు సాత్త్వికతనే తెలియ జేయుచున్నది గాని రాజస-తామస లక్షణములందులో కనబడుటలేదు 3

సత్యవిజయమునందు వసిష్ఠుని పాత్ర చాలా చిన్నది. అయినను ప్పటికి ఆచార్యులవారు వసిష్ఠుని ఒకధీర-గంభీర స్వభావముగల జ్ఞానిగా స్థితప్రజ్ఞునిగా సత్త్వనిధిగా తీర్చిదిద్దినారు. హరిశ్చంద్రుని సత్య-వ్రతమును విశ్వామిత్రుడు పరిహసించుట వసిష్ఠుడు సహించలేడు. అతని మనస్తత్త్వమును కవి చక్కగా వర్ణించినారు.4 సత్త్వనిధి

---

1. స. వి. 1.18
2. గుణం న విద్యాం యది సత్సుసక్తం<br>మూర్ఖత్వమేవాపతితం భవేన్మే।<br>విదన్గుణం చాపి గుణాధికానాం<br>ధూర్తో భవేయం యది న స్తువీయ॥<br>స. వి. 1.21
3. అందులోనే 1.22
4. అలం సుధర్మాధిగతా బహూక్త్యా<br>తీర్ణప్రతిజ్ఞోయది కౌశికస్స్యాత్।<br>యజ్ఞోపవీతం ప్రవిహాయముణ్డః<br>ఖరాధిరూఢో విచరేద్వసిష్ఠః॥<br>అందులోనే 1.22

వసిష్ఠుడు. "అయన చేసిన ప్రతిజ్ఞకు సుధర్మ భయవిహ్వల అయినది"[1] అంటారు కవి. అంతటి వ్యక్తిత్వముగల ధీరాగ్రేసరుడుగా వసిష్ఠుడు ఈ కావ్యమున నిరూపించబడినాడు—

నిశమ్య సత్త్వైకనిధేః ప్రతిజ్ఞాం
ఘోరాం సుధర్మా భయవిహ్వలాభూత్।
రాజర్షిరప్యేధిత మన్యురేవం
యథా గజోఽత్ర స్తనితం జగర్జ॥

2.1.5 ప్రాస్తావికకదంబము :

శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యులవారు 1930వ సం॥ నుండి 1968వ సం॥ వరకు అప్పుడప్పుడు ప్రస్తావవశముగా వ్రాసిన శ్లోక ఖండికలనన్నింటిని కూర్చి 1970లో ప్రచురించిన సంకలనమే "ప్రాస్తావికకదంబము."

ఇందులో చిన్న, పెద్ద ఖండికలు సుమారు 30 వఱకు ఉన్నవి ఈ ఖండికలలో కొన్ని ఆయా సంవత్సరములలో పత్రరూపముగానో పుస్తకరూపముగానో ముద్రించబడినవే. కొన్ని ఖండికలు ఒక్క శ్లోకముతోను మఱికొన్ని ఎక్కువ శ్లోకములతోను కనబడుచున్నవి. ఇవి ఆయా సందర్భములలో వ్రాయబడినవి కాబట్టి, వీటిలో వస్తువైవిధ్యము కావలసినంత కనబడుచున్నది.

వీటిని స్థూలముగా నాలుగువిధములుగా విభజించుకొనవచ్చును- 1. ప్రార్థనారూపములు 2. ప్రశంస లేక అభినందన రూపములు 3. ఖండనరూపములు 4. వైరాగ్య రూపములు. మొత్తముమీద

---

1. వ. వి. 1.23

అన్నిటియందును కవి ప్రతిభ పుష్కలముగా ప్రతిబింబించుచుండును. సమయమునకు, సందర్భమునకు, వ్యక్తులకు తగినట్లు చమత్కారముగా చెప్పుటయను సాధారణలక్షణము ఈ ఖండికలలో మనకు ప్రతిపదమునందును సాక్షాత్కరించుచున్నది.

ఈ ప్రకరణమునందు ప్రాస్తావికకదంబమునందలి ఖండికలన్నింటిని విడివిడిగా పరామర్శింతును.

2.1.5.1 విశాలాక్షి వివాహము :

దక్షిణభారతదేశమునందలి సుప్రసిద్ధ సంస్కృత పండితులలో ప్రొఫెసర్ పి.పి.ఎస్ శాస్త్రి గారి పేరు వినని వారుండరు. వారి పూర్తి పేరు పి పి. సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. వీరు మద్రాసు ప్రెసిడెన్సీకళాశాలయందు భాషాచార్యులుగా పనిచేసినారు. సంప్రదాయపద్ధతిలో సంస్కృతభాషాధ్యయన మొనర్చిన శ్రీ శాస్త్రిగారు ఆధునికపరిశోధన రీతులలో గూడ ప్రొఫెసర్ మెగ్డొనెల్ వద్ద ఆక్స్ఫర్డ్‌లో కొంతకాలము శిక్షణను పొందినారు. శ్రీ శాస్త్రిగారి కుమార్తె విశాలాక్షి వివాహసందర్భమున 1930వ సంవత్సరమున నవదంపతులను ఆశీర్వదించుచు శ్రీ ఆచార్యులవారు పంపిన శ్లోకమిది—

> ఏకోఽహం సుందర ఇతి మోద్వహ గర్వం సఖీ విశాలాక్షీ।
> ఇతి శౌరిః కృతనిందః పాయాత్సుందర విశాలాక్ష్యౌ॥

ఇక్కడ వరుని పేరు సుందరం. వధువుపేరు విశాలాక్షి. ఈ ప్రకరణమునకు తగినట్లుగా ఆచార్యులవారు ఎంత చక్కని భావనాగర్భితమైన శ్లోకరత్నమును ఉపాయనముగా పంపించినారో పరిశీలించుదు—

---

1. ప్రా.క. పు. 1

ఓ సుందరరేఖా! నేనొక్కడనే అందగాడనని గర్వించకు! నీ సఖి విశాలాక్షి అనగా చాలా అందగత్తె, అని నిందించిన శౌరి ఈ సుందర విశాలాక్షులను కాపాడుగాక! అని కవి హృదయము.

2.1.5.2 పదశాస్త్రము-భాషాశాస్త్రము :

భాషాశాస్త్రసంగ్రహమును వ్రాయుచు ఆచార్యులవారు వ్యాకరణ శాస్త్రస్వరూపమును భాషాశాస్త్రస్వరూపమును ఎంతో యుక్తియుక్తముగా ఉపోద్ఘాతమున ఉపపాదించినారు. ఇటువంటి శాస్త్రములలో నేను ప్రవేశించవలెనను కొనుట సాహసమని చెప్పుచు రెండుశాస్త్రముల స్వరూపమును ఎంతో చక్కగ ఈ ఖండికలో రెండు శ్లోకములలో చెప్పినారు.

లాఘవమనురుంధానో భూశార్థముపేక్షతే పదాభిజ్ఞః।
అంత్యేనివిష్టదృష్టి రక్ష్యతి నాద్యే తు భాషావిత్॥[1]

వ్యాకరణశాస్త్ర-భాషా శాస్త్రస్వరూపములను ఇంతకంటెను సంక్షిప్తముగా సమన్వయభావముతో చెప్పుట అసాధ్యమేమో!

2.1.5.3 మహాత్మాగాంధీకి జై :

ఈ ఖండికలో ఒకే శ్లోకమున్నది. దీనిని ఆచార్యులవారు 1933లో రచించినారు. ఆనాటికి మనదేశము స్వతంత్రము కాలేదు. పరాయివారి పరిపాలనలో మగ్గిపోవుచున్నది. సత్యాగ్రహాయుధముతో మహాత్ముడు శాంతిసమరము నడుపుచున్నరోజులవి. ఏనోటవిన్నను ఒకటే మాట— "మహాత్మాగాంధీకి జై" అని ఆమాట విన్నవెంటనే లాఠీలు పరిగెత్తు-చుండెడివి. జైళ్ళు నిండిపోయేవి. దానినిబట్టి ఆనాటి దేశస్థితిని తెల్ల

---

1. ప్రా.క. పు. 1

వారి వల్ల మనసును మనము అర్థముచేసుకొనవచ్చును. అనాటి పరాయి ప్రభువులు గాంధీమహాత్ముని ప్రస్తావించినచో కోపగించుకొనెడివారు. ఆయనను నిందిస్తే దేశభక్తులైనసంస్థానాధీశులు కోపగించుకొనెడివారు. సంస్థానాధీశులేమిటి? నిజంగా ఆ శ్రీపతికూడా ఉగ్రుడయ్యేవాడు. అటువంటి దేశపరిస్థితులలో జాతిపిత మహాత్మాగాంధీకి పరోక్షముగా ఆచార్యులవారిట్లు నమస్కారము చేయుచున్నారు—

భూపతిర్భూషయా యస్య
శ్రీపతిర్నిస్దయా తథా।
కుప్యతోఽవాచ్య నామానం
స్మృత్వాఽఽరం త్వాం నమోఽస్తుతే॥[1]

2 1.5.4 నవరత్నమాల :

ఈ శతాబ్దారంభమున మనదేశంలో సంస్కృత భాషాభివృద్ధికి అవిశ్రాంతముగా కృషిచేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారిలో "మహామహోపాధ్యాయ", "శాస్త్రరత్నాకర", "విద్యావాచస్పతి", "శాస్త్ర కలానిధి", ప్రొఫెసర్ ఎస్. కుప్పుస్వామి శాస్త్రిగారు ప్రథమగణ్యులు. వారు శ్రీమాన్ వరదాచార్యులవారికి గురువర్యులు. శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారి శిష్యులమని ఆత్మప్రత్యయముతో చెప్పుకోవడం ఈనాటికి మనం కొద్దిమందిలో చూడగలుగుతున్నాము. అటువంటి ఆచార్యవరేణ్యులు 1935లో ఉద్యోగవిరమణ చేసినారు. ఆ సందర్భమున వారి ప్రియశిష్యులు శ్రీవరదాచార్యులవారు ఒక నవరత్నమాలను శ్రీవారికి బహూకరించినారు. నవరత్నమాలలోగల తొమ్మిది శ్లోకములు నిజముగా నే రత్నములు.

---

1. ప్రా. క. పు. 1

"అధీతమధ్యాపితమార్జితం యశః
తథాపి నూనం శ్రమ ఏవ సంశ్రుతః।
విధేహి తస్మాన్మయి నిర్వృతిం పరాం
ప్రపన్న ఏవం విదుషా న పాతు వః॥"[1]

శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారి బిరుదులు ఇలా ప్రశంసింపబడినాయి—

విద్యావాచస్పతిరితి సంగ్రైః దర్శన కళానిధిర్యతిభిః
ప్రథుభిర్మహామహోపాధ్యాయో గురుభిః కులపతిశ్చ।
బహు ధైవం భూయోభిర్పదితస్పన్నైతకోఽద్వితీయశ్చ
బిభృషే బ్రహ్మన్! బ్రహ్మణ ఆథామథవాతదేవాసి॥[2]

శ్రీశాస్త్రిగారి ప్రథమశిష్యుడనని ఆచార్యులవారు సాభిమానంగా ఇలా చెప్పుకున్నారు—

ప్రథమస్తే శిష్యాణాం వరదాఖ్యో మహత్త్వయోపశ్రుతః।
నిరతిశయాం త్వయి భక్తిం గురూత్తమైవం ప్రకాశయతి॥[3]

2.1.5.5 తత్త్వకథనము :

ఆంధ్రదేశంలో "మహామహోపాధ్యాయ", "కళాప్రపూర్ణ", బ్రహ్మశ్రీ తాతా సుబ్బరాయశాస్త్రిగారి పేరు వినని సంస్కృతపండితు లుండరు. శ్రీశాస్త్రి గారికి "రాయుడుశాస్త్రి" అనే ప్రసిద్ధనామముండేది. విజయనగరమహారాజ సంస్కృత కళాశాలలో ప్రధాన పండితులుగా పనిచేసి అపర పతంజలులుగ వ్యాకరణశాస్త్రపారావారాన్ని మధించి

1. ప్రా. క. పు. 2
2. అందులోనే పు. 2
3. అందులోనే పు. 3

ఎందరినో మహావైయాకరణులుగా తీర్చిదిద్దినఘనత వీరికిదక్కుతుంది. ఈనాటికి రాయుడుశాస్త్రులుగారి శిష్యులమనిచెప్పుకునే విద్వత్తల్లజులు మనదేశంలో అక్కడక్కడా ఉన్నారు. శ్రీ శాస్త్రిగారికి 1935లో షష్టి-పూర్తి మహోత్సవము జరిగినది. అందులో "మహామహోపాధ్యాయ", "కులపతి" బ్రహ్మశ్రీ కుప్పుస్వామిశాస్త్రిగారు కూడా పాల్గొని రాయుడు శాస్త్రిగారిని అభినందించినారు. ఆ మహోత్సవసభలో శ్రీవరదాచార్యుల వారు 29 శ్లోకములను "తత్త్వకథనమ్" అనే పేరుతో శ్రీ రాయుడుశాస్త్రి గారికి సమర్పించినారు. విజయనగరమహారాజ సంస్కృత కళాశాలకు శ్రీవరదాచార్యులవారు అధ్యక్షులుగా ఉన్నపుడు శ్రీ రాయుడుశాస్త్రి గారు ప్రధాన పండితులుగా అక్కడ పని చేసినారు. ఆ స్నేహమును పురస్కరించుకొని వారిని షష్టిపూర్తి సందర్భంలో శ్రీ ఆచార్యులవారు అభినందించినారు.[1]

రెండుమూడురోజులు శ్రీ వరదాచార్యులవారు శ్రీ రాయుడు శాస్త్రిగారి వద్ద న్యాయకుసుమాంజలిని చదివినారట. అందువలన శ్రీ శాస్త్రిగారిపైన ఆచార్యులవారికి గురుగౌరవం ఉండేది. దానిని జ్ఞాపకం చేసుకొంటూ ఇలా అంటారు—

ద్విత్రాణ్యహాని కుసుమాంజలి మధ్యగీషి
త్వత్సన్నిధౌ తదపి మేఽసి గురుర్గరీయాన్।

---

1. ఆవాం సుమిత్రే ఉపవింశవర్షం
కలాలయే విశ్వకలాలయే చ।
తదత్ర సంస్కారవిధౌ త్వదర్థే
పద్యస్రజే। మే మమతాభిమానః॥

ప్రా. క. పు. 4

అస్త్రం సుశిక్షితవతాం తు వదాదిశాస్త్రం
కోవామ నాసి విదుషాం హి వరశ్శతానామ్।

మహాకవి కాళిదాసప్రభావం శ్రీఆచార్యుల వారిపైన అడుగడుగునా కనబడుతుంది.

కుశాగ్రమేధా సదృశః వరిశ్రమః
వరిశ్రమార్హా తవ పాండితీ తథా।
పాండిత్యమ్యూనం విషయే విమర్శనం
విమర్శతుల్యా కృతికర్తృతాపి చ॥[2]

ఈ శ్లోకము చదివిన వెంటనే—

ఆకారసదృశఃప్రజ్ఞః ప్రజ్ఞయా సదృశాగమః।
ఆగమైస్సదృశారంభ ఆరంభసదృశోదయః॥[3]

అను కాళిదాసశ్లోకము తప్పక పాఠకుల హృదయసీమలో మెరుస్తుంది. ఆచార్యులవారి పలుకుబడులుముద్దులొలుకుతూ ఉంటాయి. శ్రీరాయుడుశాస్త్రిగారు పతంజలి పరిపూర్ణాంశసంభూతులని వారి అభిప్రాయము. అందుకే ఇలా చెబుతారు—

“పతంజలేస్త్వం చ పరావిభూతిః”[4]

దేశంలో ఎందరు గురువులున్నా శిష్యాలికన్య స్వయంవరంలో నిన్నే వరిస్తుందా? లేదా? అనే విషయమును ఆమెనే అడిగి సజ్జనుల

---

1. ప్రా. క. పు. 4
2. అందులోనే పు. 4
3. ర. వం. 1.15
4. ప్రా.క. పు. 4

తెలుసుకోవలేను". అంటూ ఎంత చమత్కారంగానో వారిపట్ల శిష్యులకు గల అభిమానమును వ్యక్తీకరించారు—

శిష్యాలికన్యా గురుమస్థితేను
స్వయంవరార్థిన్యభిమానవత్సు।
త్వామేవ శాస్త్రా వృణుతే న చేత్
తామేవ వృష్ట్వా సుజనా విదన్తు॥¹

అది నిజమేకదా! సువాసనలు వెదజల్లు సుగంధపుష్పమువలెనుండి హృదయముగల గురువును వెదకుకొని శిష్యులు అన్తేవాసులు కావలెనని ప్రయత్నిస్తుంటారు.

ఇట్లు ఆచార్యవరేణ్యులుగా విజయనగరమహారాజ సంస్కృత కళాశాల కీర్తి చంద్రికలను దిగంతాలకు వ్యాపింపజేసిన మహనీయులు మహామహోపాధ్యాయులు శ్రీతాతా సుబ్బరాయశాస్త్రి మహోదయులను అభివందిస్తూ "నేను సత్యాన్నే చెబుతున్నాను. ఇందులో ఎటువంటి అతిశయోక్తికి అవకాశములేదని" ఆత్మప్రత్యయముతో ఆచార్యులవారు రచియించినలఘుకృతితత్త్వకథనము. నిజముగా ఈపేరుఅన్వర్థమైనది.

2.1.5 6 పద-భాషాశాస్త్రసమన్వయము :

1938లో అఖిలభారత ప్రాచ్యపండితుల పరిషత్తు (All India Oriental Conference) తిరువనంతపురంలో జరిగినది కార్యకర్తలు ఆసమావేశమునకు శ్రీవరదాచార్యులవారిని ఆహ్వానించినారు. ఆసభలో శ్రీవరదాచార్యులవారు వ్యాకరణశాస్త్రమునకు సమన్వయమును సాధించుచు పదునారుశ్లోకములను చెప్పి పండితులను ఆహ్లాదపరిచినారు

ఆచార్యులవారు శాస్త్రమును చెప్పినప్పటికిని ఎంతో కమనీయముగా చమత్కారముగా చెప్పుట పరిపాటి. ఆసభలో వల్లవారు

---

1. ప్రా.క. పు. 4

తెల్లవారు కలసి ఉన్నారు అంటే భారతీయపండితులు పాశ్చాత్య పండితులు కలసిఉన్నారనన్నమాట. ఈ కలయికను ఎంతో చక్కగా ఆలంకారికముగా వర్ణించినారు-

సితాసితౌ సుధీవర్గౌ సంగతౌ నిర్ఝరావివ|
ప్రయాగ ఇవ పుర్యస్యాం పునీతాం నోఽతిపావనౌ॥

ప్రయాగక్షేత్రము త్రివేణీ సంగమస్థానము. పేరుకు త్రివేణీ సంగమమన్నప్పటికిని అక్కడ అందటికీ కనపడేటట్లు కలిసేనదులు రెండే రెండు. స్వచ్ఛమైన గంగానది, నల్లగాఉండే యమునానది. ఆలా ఉందట తిరువనంతపురం.

ఆ సంవత్సరం AIOC అధ్యక్షుడు Thomas అను పాశ్చాత్య పండితుడు. అందువలననే నా ఉపన్యాసమునకు ఈ అంశమును ఎన్ను కున్నానని చెప్పి[1], వైయాకరణులకు భాషాశాస్త్రవిదులకు దృష్టిభేదమే తప్ప వస్తుభేదం లేదని ఆచార్యులవారు చెప్పినారు-

దృష్టావేవ విభేదోఽస్తి
పదభాషావిదోర్మిథః|
సాధం ప్రాచీ ప్రతీచీభ్యాం
మధ్యస్థం వశ్యతో రివ॥

2.1.5.7. న చేద్వాల్మీకిరభవిష్యత్ :

మద్రాసుసంస్కృతఅకాడమి వారి శ్రీరామనవమీ మహోత్సవ

---

1. విజ్ఞానధామ్నో మహితస్య భామనః
సమ్మేలనాధ్యక్షపదాయ సా కృతిః|
ప్రచోదయన్మాం వరదేశస్య వస్తునః
ప్రాచ్యప్రతీచ్యార్థ సమన్వయైషిణః॥
ప్రా.క. పు. 4.

సభలో చదివిన అనుకృతి "న వేద్మ్యల్మికిరణవిష్యత్" ఇందులో పది ఐది మూడుశ్లోకములు కలవు. దీనిని గూర్చి ఇంతకు పూర్వమే(2.1.3) వివరించినాము.

2.1.5 8 పుత్రీవియోగము :

శ్రీవరదాచార్యులవారికి ఒక కుమారుడు ఒక కుమార్తె కలిగినారు. కుమార్తె 1939లో మరణ మందించినది. ఆ సందర్భంలో వారి గురువర్యులు శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారికి వ్రాసిపంపిన మూడు శ్లోకములు ఇచ్చట ప్రస్తావించబడినవి. వియోగినీ వృత్తంలో నడచిన ఈశ్లోకములు కాళిదాసు రఘువంశ, కుమారసంభవములలో నడిపించిన వియోగినీ వృత్తములను జ్ఞాపకమునకు తీసుకొనివచ్చుచున్నవి.

పథి సంస్మరణస్య సంద్భశే
తనయో మే తనయేతి యే దృశౌ।
వికలో విహితోఽస్మి వైరిణా
విధినా నిర్దయమన్త్యయా తయోః॥1

2.1.5.9 అప్రతిగ్రహము :

తిరుమల తిరుపతి దేవస్థానములవారు నడుపుతున్న శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాలకు ఎంతో ఉన్నతమైన చరిత్ర గలదు. శ్రీవరదాచార్యులవారిని ఆకళాశాలకు అధ్యక్షులుగా రమ్మని 1941లో ఆహ్వానము వెళ్ళినది. ఆ సమయమున దానికి సమాధానముగా నాలుగు శ్లోకములు వ్రాసి పంపినారు. అవే "అప్రతిగ్రహః" అనే ఈ శీర్షికలో ఉన్నశ్లోకములు.

---

1. ప్రా.క. పు. 11.

స్వగ్రామమైన చిట్టిగూడూరులో శ్రీనారసింహ సంస్కృత కళాశాలను స్థాపించి ఆ కళాశాలకు అధ్యక్షులుగా ఉన్న ఆచార్యులవారు దానిని వదిలిపెట్టి తిరుపతిలోని కళాశాలకు అధ్యక్షులుగా ఎట్లు రాగలరు? అనుమానమునకే ఆయన ఎంతో చక్కగా ఇట్లు సమాధానమును వ్రాసి పంపినారు.

యష్ట్వా జగృహే యేన జీవితావధికే క్రతౌ।
సోఽహమర్హోస్మి నాన్యస్య యాజకత్వ పరిగ్రహే॥
ఆహూతా పతితీర్థత్ర త్యక్త్వా ప్రత్యక్షదేవతాః।
ఆతిథ్యం శ్రీశితుర్వాపి నిర్వేష్టుం నాహముత్సహే॥
యత్యమే విత్తనైస్స్వహ్యోద్యూత్యనోఽప్యాసీద్ధ్యహే స్థితిః।
వార్ధకే తస్య తత్సక్త్యా తత్త్యాగః కిమసాంప్రతమ్॥[1]

ఆయన తనజీవితమును ఒక పవిత్రమైన యజ్ఞంవలె భావించి నారనడానికి ఈ సందర్భమొక చక్కని దాహ్హరణమనవచ్చును. "జీవితాంతము అవిచ్ఛిన్నముగా నిర్వహించవలసిన క్రతువునకు యజమానిగా ఉన్ననేను, ఇంకొక క్రతువునకు యాజకత్వమును పరిగ్రహించుటకు పనికిరానుగదా"! అనడంలో ఎంతో ఔచిత్యము కనబడుచున్నది తమ కళాశాలపై వారికున్న గౌరవము కూడా ఇక్కడ స్పష్టమగుచున్నది.

అట్లే "నేనాహ్వానించిన ఇందఱు అధ్యాపకులు విద్యార్థులనే ప్రత్యక్ష దేవతలైన అతిథులను వదిలిపెట్టి, సాక్షాత్తు లక్ష్మీపతి ఆతిథ్యమునకు ఆహ్వానించినప్పటికి దానిని స్వీకరించుటకు నేనుత్సాహపడుటలేదు" అను మాటలలో వారికి తమ కళాశాలలోని అధ్యాపకులపైన విద్యార్థుల పైన ఎంతటి గౌరవభావముకలదో విశదమగుచున్నది. ఇచట "శ్రీశితుః ఆతిథ్యం" అనుట సాభిప్రాయముగా కనబడుచున్నది. వారిని

---

1. ప్రాం.క. పు. 12.

ఆతిథ్యమునకు పిలిచినది నిజముగానే శ్రియః పతి అయిన శ్రీనివాస మూర్తి కదా!

"నాకు ధనకాంక్ష లేకపోవుటచేత యవ్వనమునందే నేను ఇంటిలో ఉన్నాను. ఇప్పుడు వార్ధకము నడచుచున్నది. ఈ వయసులో ధన కాంక్షతో ఇంటిని వదిలిపెట్టిరావడం ఉచితంకాదుకదా!" అనుటవలన చిన్నవయస్సులోనే వారికి ధనసంపాదనాభిలాష ఉండేదికాదని భగవద్దత్తమైన సిరిసంపదలతో తృప్తిపడటం వారిలో బాల్యమునుండే ఉన్న సుగుణమని అర్థమగుచున్నది.

ఇచ్చట ప్రస్తావించబడిన మూడుశ్లోకములలో వారి జీవితమునకు సంబంధించిన ముఖ్యాంశములు కొన్ని వెలుగులోనికి వచ్చుచున్నవి.

2.1.5.10. దుప్పూరివారు :

"కళాప్రపూర్ణ" శ్రీదుప్పూరి వేంకటరమణశాస్త్రిగారు శ్రీవరదాచార్యులవారికి విజయనగర సంస్కృతకళాశాలలో ప్రథమశిష్యులు. వారు చిట్టిగూడూరులోని శ్రీనారసింహసంస్కృతకళాశాలలో పద్దెనిమిది సంవత్సరములు ప్రధానాధ్యాపకులుగా పనిచేసి 1941లో ఆంధ్ర విశ్వవిద్యాలయమువారి ఆహ్వానముపై అచటి తెలుగు విభాగమునందు అధ్యాపకులుగా ప్రవేశించినారు. ఆసందర్భమున వారికి చిట్టిగూడూరులో వీడ్కోలుసభ ఘనముగా నిర్వహింపబడినది, ఆ సభలో శ్రీశాస్త్రిగారి శిష్యులు, మిత్రులు వారిని ఎంతగానో అభినందించినారు. అప్పుడు ఆచార్యులవారు ఈక్రింది శ్లోకమును ఆశువుగా చెప్పినారట.

పండితా ఇంద్రియాణ్యేవ త్వమన్తఃకరణం మమ।
అంతర్బహిశ్చ రమ్యోఽపి స త్వం విస్మర్యసే కథమ్॥

---

1. ప్రా.క. పు. 12.

"కళాశాలలోని ఇతర పండితులందరు నాకు ఇంద్రియములవంటి వారు. నీవు అంతరంగికుడవుకాన అంతఃకరణస్థానీయుడవు బయటకు ఎంతరమ్యమైన రూపముతో కనబడుచున్నావో హృదయమునందు కూడా అంత రమ్యమైనవాడివి. అటువంటి నిన్ను మరచిపోవడం ఎలా సాధ్యమౌతుంది? " ఈ మాటలలో శాస్త్రిగారిపైన ఆచార్యులవారికి గల వాత్సల్యము, ఆదరము, గౌరవము, ఆత్మీయత, కొట్టవచ్చినట్లు కనబడుచున్నవి.

2.1.5.11 నవ వజ్రమాల :

నవ వజ్రమాలలో పేరుకు తగినట్లు తొమ్మిది శ్లోకములున్నవి. 2,3, 5 శ్లోకములు[1] విజయనగర మహారాజసంస్కృతకళాశాల వజ్రోత్సవ సందర్భంలో శ్రీఆచార్యులవారు పంపినవి. శ్రీవరదాచార్యులవారు 1914 నుండి 1920 సంవత్సరందాకా ఈ కళాశాలకు ఉపాధ్యక్షులుగా పని చేసినారు. పేరుకు ఉపాధ్యక్షులన్నమాటేగాని సంస్కృతకళాశాల కార్యక్రమ నిర్వహణమంతా వారే చూసుకొనేవారు డిగ్రీ కళాశాలకు శ్రీమాన్ కిళాంబి రామానుజాచార్యులవారు. అధ్యక్షులుగా ఉండేవారు సంస్కృతకళాశాల కూడా వారి ఆధ్యక్ష్యంలోనే నడుస్తుండేది. కాని సంస్కృత పండితులధ్యక్షులైతే కళాశాల అభ్యుదయమును పొందగలదని విజయనగరం ప్రభువులు శ్రీవరదాచార్యులవారిని ఆహ్వానించినారు. తప్పనిసరి పరిస్థితులవలన వారిని ఉపాధ్యక్షులని పిలిచెదివారేకానీ అధ్యక్షకృత్యమంతా వారే నిర్వహించెడివారట అట్లు ఆరు సంవత్సరములు అచట పనిచేసినారు,

ఆ కళాశాలకు 1940లో వజ్రోత్సవము జరిగినది. ఆ సందర్భమున ప్రచురించిన విశేషసంచికలో శ్రీవరదాచార్యులవారు ఆరు సంవత్సరములు అచట పనిచేసిన ప్రసక్తి రాకుండా చేసినారు అప్పటి

1. ప్రా.క. పు. 13.

కళాశాలాధ్యక్షులు. అందరికీ ఆశ్చర్యము కలిగినది ఆచార్యులవారు మిన్నకున్నారు. తరువాత 1943లో ఆకళాశాల వార్షికోత్సవమునకు ఆచార్యులవారు ముఖ్యాతిథిగా వెళ్ళినారు. అప్పుడు మిగతా ఆరు శ్లోకములు వ్రాసి ముద్రించి ఆ సభలో చదివి జరిగిన విషయమును వివరించినారు. వ్యక్తిపేరు చెప్పకుండగనే వ్యంగ్యమర్యాదతో "సాక్షిణః స్వామినాం కే" అని చెప్పి ఆనాటి కళాశాలాధ్యక్షులను వదిలివేసినారు. అంతేకాకుండా వాచ్యము నింద్యమని నన్ను వాచ్యముచేయక వ్యంగ్యము చేయవలెనని నాపేరు ఆ సంచికలో లేకుండా చేసినారే గాని మీకు నిజముగా వేరే భావము లేదుకదా! అని సచమత్కారంగా ఆనాటి అధ్యక్షులను సమర్థించినారు.[1]

2.1.5.12 పేరివారి షష్టిపూర్తి :

విజయనగరమహారాజ సంస్కృతకళాశాలలో ప్రధాన న్యాయాధ్యాపకులుగా పనిచేసిన వారు శ్రీపేరి లక్ష్మీనారాయణశాస్త్రిగారు. వారు ఆచార్యులవారికి ప్రియమిత్రులు. 1941లో వారికి షష్ట్యబ్దపూర్త్యుత్సవము జరిగినది. ఆసందర్భమున వారిని అభినందించుచు వ్రాసిన మూడు శ్లోకములు ఈఖండికలో కలవు.

2.1.5.13 పుష్పాంజలిః :

పిఠాపురం మహారాజావారు సాహిత్యమునకు కళలకు ఎనలేనిసేవ

---

1. వాచ్యం నింద్యం ప్రథమగణనాం వ్యంగ్యమేవార్థ్యతీతి
త్వం మే వార్తాముపకృతివరో వాచ్యతాం న వ్యనైషీః।
సూక్త్యబ్ధిస్తే విబుధమథితో దుస్సహం కాలకూటం
సూతే పశ్చాన్మధురమమృతం క్షమ్యతాం చాపదోషః॥
ప్రా. క. పు. 14

చేసినారు. వారి ఆస్థానంలో ఎందరో మహాపండితులుండేవారు. ఆంధ్ర-దేశంలో పేరెన్నికగన్న సంస్థానాలలో పిఠాపురం సంస్థానం అద్వితీయ-మైనది. పిఠాపురం రాజా శ్రీసూర్యారాయేంద్ర బహద్దర్ వారికి జరిగిన షష్టిపూర్త్యుత్సవంలో వారిని అభినందిస్తూ చెప్పిన అయిదు శ్లోకాలు ఈ పుష్పాంజలిలో ఉన్నాయి. అన్నింటిలోను ఈ దిగువశ్లోకం ఎంతో చమత్కారమైనది.

హాసీహర్మ్యే విహితవసతిః లాల్యతే సాదరం సా
దేశ్యామాంధ్రీమపి సతతం కోశదానేన రాజన్।
దేవీజ్యేష్ఠా హతవిధివశాద్విప్రయుక్తా కృశాంగీ
రుష్టైర్వాష్పైర్గలితవచసాధ్యాయతి త్వాం దయాయై॥

"సంస్కృతభాషను చిన్నచూపు చూడవద్దు" అను అభ్యర్థనను ఎంత అందముగా ఇందులో ఇమిడ్చినారో మనమూహించుకొనవచ్చును.

2.1.5.14 కందాడై వారి షష్టిపూర్తి :

విజయనగరం మహారాజసంస్కృతకళాశాలలో కొంతకాలం ప్రధాన వ్యాకరణాధ్యాపకులుగా పనిచేసినవారు శ్రీమాన్ కందాడై వెంకట రామాచార్యులవారు. వారి షష్టిపూర్తి సందర్భంలో శ్రీవరదాచార్యుల వారు చదివిన నాలుగు శ్లోకములు ఈ ఖండికలో ఉన్నాయి.

2.1.5.15 పట్టాభిషేక ప్రశస్తి :

విజయనగరం మహారాజా శ్రీ పి.వి.జి. రాజు గారి షష్టిపూర్తి సందర్భమున శ్రీ ఆచార్యులవారు వారిని అభినందించుచు చదివిన అయిదు శ్లోకములు ఈ ఖండికలో ఉన్నవి. ఇందులో స్వార్థపరులైన

1. ప్రా. క. పు. 15

దుష్ట జలజంతువులతో ఆకులమైన రాజ్యార్ణవమును వివేకమనే నౌకతో దాటమని వారు చేసిన సూచనకు ఆనాడు ఎంతో విలువ ఉన్నది.

స్వార్థమాత్ర సమాసక్త దుష్టయాదస్సమాకులమ్।
వివేక నౌకయా రాజన్! రాజ్యార్ణవమిమంతర॥

అట్లే ప్రజలకొఱకు రాజ్యలక్ష్మి-సంతానముకొఱకు గృహలక్ష్మి అని తెలియజెప్పి ఈ శ్లోకముకూడా ఎంతో సమయస్ఫూర్తిని తెలియ జేయుచున్నది.

ప్రజార్థస్త్వం శ్రియముద్వోఢా
ప్రజాయై స్త్రియముద్వహ।
పరార్థం ఖిద్యమానస్య
సన్తు తే సర్వసమ్పదః॥[1]

2.1.5.16 "పట్టాభి" పదవి :

"పట్టాభి" అనే ప్రసిద్ధనామంతో దేశసేవచేసిన మహోన్నత నాయకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య. ఈయన నివాస స్థలము మచిలీపట్టణము. కాంగ్రెస్ అధ్యక్షపదవి వీరిని వరించినది. ఆ సందర్భంలో ఆచార్యులవారు రెండు శ్లోకరత్నములను వారికి బహూకరించినారు. నిజముగా అవి రత్నములే.[2]

---

1. ప్రా. క. పు. 17
2. గురుప్రదత్తా పదవీ ప్రపేదే
యాన్యైస్త్వయా స స్వయమార్జితైవ।
అవాన్తర క్షుద్రఫలేష్వసక్త!
యోగీవ పారం పరమం గతస్త్వమ్॥
భోగిరాజ నిషణ్ణౌ తౌ సీతారామావహర్నిశమ్।
పట్టాభిషిక్తౌ పాయాస్తాం త్వాం స్వతుల్యం జగన్ముదే॥
అందులోనే పు. 17

2.1.5.17 ఆంధ్రజాతీయ కళాశాల :

మనదేశమునకు స్వాతంత్ర్యము వచ్చుటకు ముందు కొందరు మహనీయులు యువకులలో జాతీయతను పెంపొందించుటకు కొన్ని జాతీయ కళాశాలలను అచ్చటచ్చట స్థాపించినారు. అలా స్థాపింపబడినదే బందరులోని ఆంధ్రజాతీయ కళాశాల. దానిని కష్టపడి నెలకొల్పినవారు శ్రీ కోపల్లె హనుమంతరావుగారు. కాలక్రమేణ అ కళాశాలలో ఆంధ్రవిశ్వకళాపరిషత్ పాశ్చాత్యప్రదాశికను బోధించు ఏర్పాట్లు జరిగినాయి. అప్పటి ఆంధ్ర జాతీయ కళాశాల కార్యదర్శి శ్రీ వరదాచార్యులవారు, ఆ సమయమున అందించిన కార్యదర్శి నివేదిక ఈ ఖండికలో పదకొండు శ్లోకములలో రూపొందినది.

2.1.5.18 కాళిదాసస్య ప్రతిభా :

కవికులగురువు మహాకవి కాళిదాసు. మద్రాసులో జరిగిన మహాసభలో ఆయన ప్రతిభనుగూర్చి శ్రీవరదాచార్యులవారు ప్రసంగించినారు. ఆ సందర్భంలో వారు రచించిన పన్నెండు శ్లోకాలు ఈ ఖండికలో ఉన్నాయి.

"లలితమైన సృష్టినే చేసి నీవు ఈ జగత్స్రష్టను అతిశయించినావు. ఓ! కాళిదాస మహాకవీ! నిజంగా ఔచితీమూర్తి వైననీవు వాకు సంసేవ్యుడవు" అని ఎంత చక్కగానో కాళిదాసును స్తుతిచేసినారు—

లలితామేవ వితన్వన్ సృష్టిం ప్రష్టారమప్యతిశయానః।
ఔచిత్యామూర్తిర్మే భజనీయః కాళిదాసః త్వమ్॥[1]

కాళిదాస కావ్యముల గొప్పదనమును అనేక కోణములనుండి కవి ఈ ఖండికలో చక్కగా సమీక్షించినారు. మానవజీవితంలో ముఖ్యమైన

1. ప్రా.క. పు. 19.

ఘట్టములన్నియును ఈ కావ్యములలో చోటుచేసుకొన్నవి. అవి పాఠకులను ఎంతగనో ఆకర్షించుచున్నవని ఆ మహాకవిప్రతిభను ప్రశంసించినారు.

ఇంకొకచోట కాళిదాసును ఆదికవి వాల్మీకికి వారసుడని ఇట్లు అభివర్ణించినారు–

వాల్మీకేస్తనయోఽసి కావ్యకరణే తస్మాద్యదాసాదితం
రిక్థం భూరి తదాత్మశక్తియతనైః స్వర్ణాద్రిసారంకృతమ్।
త్వత్పుత్రా గతతేజసస్సమభవం స్తుష్టాస్తు పిత్ర్యైర్ధనైః
ప్రాయః స్యాద్గతిరీదృశీ జనిమతాం లోకాధికేభ్యో భువి॥[1]

ఈ శ్లోకాంతమున చక్కని అర్థాంతరన్యాసాలంకారముతో లోకతత్త్వమును ఎంతో చక్కగా వింగడించినారు.

2.1.5.19 సువర్ణపుష్పమాల :

"కలౌ వేంకటనాయకః" అని జగత్ప్రసిద్ధి. ఆనందనిలయుడైన ఆదేవదేవుని విమానమునకు 1956లో బంగారుపూత వేసినారు. దాని మహాసంప్రోక్షణ సమయమున శ్రీవరదాచార్యులవారు సువర్ణపుష్పమాలను శ్రీనివాసుని పాదపద్మములకు సమర్పించినారు. ఇందులో పదిహేడు శ్లోకములున్నవి. ఒక్కొక్కశ్లోకము నిజముగా అక్షర రత్నములు పొదిగిన స్వర్ణకమలమే.

దీనికి డాక్టర్. ఎస్.బి. రఘునాథాచార్యులుగారు పద్యానువాదముచేసి తెలుగులో "ఆమోద"వ్యాఖ్యానమును వ్రాసిరి. తిరుమల తిరుపతి దేవస్థానము 1980లో దీనిని ప్రచురించినది.

---

1. ప్రా.క. పు. 20

భక్తులు భక్తితో దీనిని సమర్పించినప్పటికి సమానముగనే స్వీకరింతువు. వారిభక్తి కాని ముఖ్యముకాని సమర్పించు వస్తువు కాదని, శివునకు సమర్పించిన మొక్కుబడి జుట్టును కూడా నీవు పరిగ్రహించి భక్త ప్రియుడవని నిరూపించుకొనుచున్నావని ఎంతో చక్కగా శ్రీవేంకటేశ్వరుని సౌలభ్యగుణమును ఇట్లు నిరూపించినారు.

కేశాంశ్చ సౌవర్ణశతాని తుల్యం భక్తార్పితాని ప్రతిగృహ్ణతాత్వమ్।
భక్తప్రియత్వం ప్రథితం హి యేన శ్రీవేంకటేశం తమహం
ప్రపద్యే॥[1]

ఈ ఖండికలోని శ్లోకములన్నియును "శ్రీవేంకటేశం తమహం ప్రపద్యే" అను మకుటముతో ఉన్నవి. ఎవరివలన మనకు భయముండునో ఎవరిపైన భక్తియుండునో అతడే ఈ లోకమును చక్కగా పరిపాలించ గలుగువాడు. అందువలననే శ్రీనివాసుడు శుద్ధసత్త్వమయు దైవప్పటికిని స్థితికర్త కావున కొంత రజోగుణమును గూడా ధరించుచున్నాడని ఇట్లు స్తుతించినారు—

యతో భయం యత్ర చ భక్తిరప్తి
స ఏవ లోకం ప్రభవేద్వినేతుమ్।
స్థిత్యై య ఏవం బిభృతే రజోఽపి
శ్రీవేంకటేశం తమహం ప్రపద్యే॥[2]

కోట్లకొలది సంపదను అర్థిస్తున్నావు. మళ్ళీ కోట్లకొలది నీభక్తులకు అనుగ్రహిస్తున్నావు. దీనిద్వారా ధర్మార్థములను పురుషార్థములను ఎట్లు సేవించవలయునో మాకునేర్పుచున్నావని సహజసుందరముగా

1. ప్రా.క. పు. 21.

2. అందులోనే, పు. 21.

అభివర్ణించినారు.[1] అట్లే పరకీయమైన పాశ్చాత్య శాసనంపై మోజుతో నిజపైభవహేతువు, స్వీయమైన దైవవాణిని వదిలివేసి తప్పుచేయు చున్నావు. మళ్ళీ నీవే ఏదిధర్మమో ఆలోచించి న్యాయం చెయ్యమని యాచిస్తూ శ్రీఆచార్యులవారు సంస్కృతభాషకు ఆయన ఆస్థానమున జరుగుచున్న అన్యాయమును నిష్కర్షగా తెలియజేసినారు[2]. ఈ శ్లోకము ద్వారా శ్రీఆచార్యులవారి ముక్కుసూటి స్వభావము మనకు స్పష్ట మగుచున్నది.

## 2.1.5.20 కాశీవారి సామ్రాజ్యపట్టాభిషేకము :

"అవధాని శిరోమణి" మధ్వశ్రీ కాశీకృష్ణాచార్యులుగారు. ఆంధ్ర ప్రదేశ్ ఆస్థానకవులుగా జగత్ప్రసిద్ధినందినవారు. వారికి ఆంధ్రప్రదేశ్ లోని సంస్కృతపండితులందరుకలసి గుంటూరులో సంస్కృత సామ్రాజ్య పట్టాభిషేకోత్సవమును జరిపించినారు ఆ సందర్భమున శ్రీవరదాచార్యులవారు వారికి అభినందించుచు చదివిన పద్యములు మూడు ఈ ఖండికలో ఉన్నవి.

---

1. యః కోశేశః సంపదమాదదానో
దదచ్చ తాం కోటిశ ఏవ శాస్తి।
ధర్మార్థసంసేవన రీతిమస్మాస్
శ్రీవేంకటేశం తమహం ప్రపద్యే॥
ప్రా.క. పు. 22.

2. హార్ద్యాదిరక్తో నిజభూతిహేతుం
స్వీయాం త్యజన్ వాచమసాధుకారీ।
ధర్మ్యం విధేహీత్యనయాచ్యతే యః
శ్రీవేంకటేశం తమహం ప్రపద్యే॥
అందులోనే. పు. 22.

"నీవు వృద్ధులను యువకులను చేస్తున్నావు. విజ్ఞులను అజ్ఞులను చేస్తున్నావు. మొదటిది అభివందనీయమే, కాని రెండవది తగినపనేనా? అని చమత్కారంగా వారి పాండిత్యమును ఉత్సాహమును ప్రశంసించినారు.[1]

"శాస్త్రములలోను, కావ్యములలోను, సంగీతములోను కవిత్వము నందును జీవాత్మ-పరమాత్మ స్వరూప జ్ఞానమునందును నీకు నీవేసాటి" అంటూ ఇలా ప్రశంసిస్తున్నారు.

కావ్యశాస్త్రే ఉభే భాషే సంగీత కవితే తథా|
ఆత్మద్వయం చ తేఽస్తి ద్వైతం తే సర్వతోముఖమ్||[2]

2.1.5.21 నాగార్జునసాగర్ :

మనదేశంలో ఉన్న సేతువులలో (Dam) నాగార్జునసాగర్ చాలా పెద్దది. ఒక కవిసమ్మేళన సందర్భంలో చాలామంది కవులు అచట చేరారు. అపుడు ఆచార్యులవారు యుక్తియుక్తముగ కృష్ణానదీ జలమును, సేతువును, సముద్రమును దృష్టిలో నుంచుకొని ఒక శ్లోకమును చెప్పిరి. అందలి చమత్కారమును గమనించి కవులందరు ఆచార్యులవారిని ప్రశంసించిరి.

2.1.5.22 ఎమ్. వి. రాజగోపాల్ :

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్ డిరక్టర్‌గా శ్రీఎమ్.వి.రాజగోపాల్

1. వృద్ధాన్యూనః కరోషి త్వం విజ్ఞానజ్ఞాంస్తథోఽపి చ|
అత్రాద్యమభివంద్యం నః కిమన్యత్ప్రాంప్రతం తవ||
ప్రా. క. పు. 23

2. అందులోనే పు. 23

ఉండేవారు. వారు ఒకప్పుడు శ్రీనారసింహసంస్కృతకళాశాలను సంద ర్శించుటకు చిట్టిగూడూరు విచ్చేసినారట. అపుడు శ్రీవరదాచార్యుల వారు వారినిట్లు అభినందించినారు—

శాన్తామూర్తిః నయనసుభగా సుప్రసన్నాంగభీరా
శుద్ధా వాణీ శ్రవణమనసోః హారిణీ కర్మదాక్ష్యమ్॥

భక్తిః పూజ్యేష్వనుపమదయా పాణినీయేషు యస్య
శ్రీశః శ్రేయో దిశతు భవతే రాజగోపాలః సర్వమ్॥[2]

కాళిదాసు కమనీయశైలి ఈ రచనలో ప్రతిఫలించుచున్నది.

2.1.5.23 మహాకాలప్రభావము :

ఈ లోకమున కాలమునకు అతీతులెవరూ ఉండరు. కాలము జరిగి పోయినవాటిని జరగబోయేవాటిని సృష్టించుచున్నది. సమస్తమును తనయందే లీనము చేసుకొనుచున్నది. అటువంటి మహాకాలస్వరూపుడైన భగవంతునకు నమస్కారమని కాలస్వరూపమును ఈ ఖండికలోని చిన్న శ్లోకమునందు ఎంతో చక్కగా సమీక్షించినారు.[3]

---

1. కృష్టిః కర్షసి కిం ప్రసన్నమధురం క్షారాంబుధిం మే జలమ్
నైతత్తే మమ వత్సరేవ తనసో మేఘాయ హృత్వా దదౌ।
తస్మాత్త్వం భువమాగతస్య నహి మే భర్త్రేఽర్పదే దోషితా
వ్యత్వం మే జనజీవనాపహరణాత్ త్వం సేతునా వార్యసే॥
ప్రా.క. పు. 23.

2. అందులోనే. పు. 23.

3. యః కరోతి భవద్భూతం భవిష్యచ్చ తథాభవత్।
స్వలీనసకలాయాస్మై కాలాయ మహతే నమః॥
అందులోనే పు. 23.

2.1.5.24 సీతాపరిత్యాగము :

లోకమాత సీతను శ్రీరామచంద్రుడు పరిత్యజించినాడు. ఆ పరి-త్యాగము సామాన్యుడైన పౌరుడు తన భార్యను వదిలివేయుట వంటిదికాదు. ప్రజానురంజనముకొఱకు తనప్రాణములకంటె మిన్న, నిండు చూలాలు అయిన భార్యను ప్రజాధిపతి పరిత్యజించడం లోకాప వాదమునకు, వ్యక్తిగతమైన బాధ్యతకు మధ్యలో నలిగిన మహనీయు డైన మహీపతి చరిత్ర ఉత్తరరామచరిత్ర. దానిని గూర్చి శ్రీఆచార్యుల వారు ఇలా అన్నారు-

"శుద్ధినికోరే ప్రజలకొఱకు రాజు చేసుకున్న ఆత్మవిమర్శ, లోకము కొఱకు తనను పరిత్యజించిన భర్తను అపార్థం చేసుకొనకపోవడం, తనకు ఇష్టంలేకపోయినప్పటికిని అన్నఆజ్ఞను అనుజుడు అనుసరించడం, దుఃఖాన్తమైన కథతో శాంతిని సాధించడం"ఇవి హితగర్భమైన సీతాపరి త్యాగకథలోని విశేషములు.[1]

2.1.5.25 ప్రొఫెసర్. కె.ఆర్. శ్రీనివాసయ్యంగార్ :

ఆంధ్రవిశ్వవిద్యాలయము అనేక రాజకీయములతో అస్తవ్యస్త పరిస్థితులలో ఉన్నపుడు ప్రొఫెసర్ కె.ఆర్. శ్రీనివాసయ్యంగార్ వైస్-

1. ప్రజాభిరాత్మనో రాజ్ఞో విమర్శః శుద్ధిమిచ్ఛుభిః।
ప్రజానాం రంజనం రాజ్ఞా స్వీయదోషప్రమార్జనాత్॥
లోకార్థమపరాద్ధస్య పత్యుః పత్న్యాచ మర్షణమ్।
అగ్రజాజ్ఞా విధాయిత్వమనుజస్యాప్రియేష్వపి॥
విరసాన్తేన వృత్తేన యత్ర శాంతేశ్చ కల్పనమ్।
హితేచ్ఛవో విజానన్తు హితగర్భామిమాంకథామ్॥
ప్రా.క. పు. 24.

ధాన్పులర్‌గా నియమింపబడినారు. అప్పుడు వరదాచార్యులవారు శ్రీఅయ్యంగారిని సాభిప్రాయముగా, సచమత్కారంగా ఇలా అభినందించారు-

> కాళరాత్రిరతీతైవ శ్రీనివాసోదయాద్ధ్రువమ్।
> విద్వజ్జన మహోజ్జ్వాని వికసన్తి జగన్మదీ॥[1]

2.1.5.26 స్వాగతపత్రిక :

శ్రీకంచికామకోటి పీఠాధిపతి శ్రీజగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి శ్రీవరదాచార్యులవారి ఆహ్వానం మేరకు చిట్టిగూడూరు విచ్చేసినారు. వారికి శ్రీఆచార్యులవారు పలికిన స్వాగతవచనములు ఈ ఖండికలో పదిశ్లోకములలో ఉన్నవి

"ఆశ్రమాలన్నింటిలోను తురీయాశ్రమం ఉత్తమమైనది. అట్లు సన్న్యాసమును స్వీకరించిన వారిలో జ్ఞాన-వైరాగ్య-భక్తులవలన మీరు ఉత్తములని విజ్ఞుల ఆశయము"ని ఆచార్యులవారు చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామివారిని ఇట్లు అభినందించుచున్నారు-

> ఆశ్రమేషు తురీయోఽగ్ర్యః తత్రస్థేష్వగ్రిమో భవాన్।
> జ్ఞాన వైరాగ్యభక్తిభ్యో విజ్ఞానామేష ఆశయః॥[2]

2.1.5.27 నయః లఘు భవద్ధామ భగవన్॥

జీవితంలో చాలామందికి అనేకవిధాలైన అసంతృప్తులు కలుగుతాయి. ఇంకనూ ఏదో చేయవలెననే ఆరాటము, ఏదో చేయనేలేదను అసంతృప్తి చాలామంది వృద్ధులలో మనం చూస్తూనే ఉంటాం.

---

1. ప్రా.క. పు. 24.

2. అందులోనే. పు. 24.

కానీ పూర్ణకాములైన శ్రీవరదాచార్యులవంటి తృప్తులు, విరక్తులు అరుదుగా ఉంటారు "కృతకృత్యాః ప్రతీక్షన్తే మృత్యుం ప్రియమివాతిథిమ్" అని పెద్దలు చెప్పినట్లు "నేను చేయవలసినదింకేమున్నది? నన్ను నీవరమపదానికి తీసుకొనివెళ్ళుమని" వారు భగవంతుని ప్రార్థించిన పదువారగు శ్లోకముల ఖండిక "నయః లఘు భవద్ధామ భగవన్!" అనేది. ఈపద్యాలకు మకుటముకూడ ఇదే అగుట ఒక విశేషము.

1969లో ఆచార్యులవారికి చాలా తీవ్రమైన జబ్బుచేసినది. వారు జీవింతురను నమ్మిక చాలమందికి లేనేలేదు. కానీ భగవదనుగ్రహము వలన వారికి ఆరోగ్యముకలిగినది. తీవ్రజ్వరంలో[1] వారు భగవంతుని ప్రార్థిస్తూ—

"నేను ఈ పనులు పూర్తిచేసినాను. శక్తివంచన లేకుండా నీకు సేవనొనర్చినాను. ఇక నాకు ఏకోరికలేదు నన్ను నీలో చేర్చుకొనరాదా! అని ప్రాధేయపడినారు. ఈ శ్లోకములు శ్రీవరదాచార్యులవారి సంగ్రహ జీవితమునకు ప్రతిబింబమువంటివి. ఒక విధముగా ఈ ఖండిక శ్లోక రూపమైన వారి "ఆత్మకథ" అని, వారి హృదయమునందలి "ఆవేదన" అని చెప్పవచ్చును.

పితుః ప్రాప్తం రిక్థం బహుగుణమకార్యాత్మకృషితః
పరద్రవ్యం నాకాంక్షం తృణమపి వివర్జ్యం విషసమమ్।
విసృష్టః షష్ఠాంశః సుకృతివిదయే సంభృతధనే

---

1. తీవ్రజ్వరపీడనతః శయ్యాయాం శాయితేన బహుదినపాన్।
ప్రలపితమేతం తత్తద్వివశీభూతేన వరదేన॥
ప్రా.క. పు. 27.

కిమన్యత్కాంక్ష్యం మే నయః అఘు భవద్ధామ భగవన్॥[1]

వారి కుటుంబమును గూర్చి రెండుమాటలు-

పతిప్రీతాదారా వినయమధురః ప్రాజ్ఞతనయః
స్నుషా పుత్రీకృత్యా కులసుకృతపాకాః సుతసుతాః।
ఇమే సంపృక్తా మే దధతి సుభగం సంవృతివథం
కిమన్యత్కాంక్ష్యం మే అయః నఘు భవద్ధామ భగవన్॥[2]

చివరి శ్లోకమున "ఈ రోగము రాబట్టి నీచింతన కలిగినది. ఆరోగ్యము కలిగిన తరువాత కూడా నీస్మరణ ఎల్లప్పుడూ కలిగేటట్లు అనుగ్రహించమని" ఎంతో చక్కగా భగవంతుని ఇలావేడుకుంటున్నారు-

నమోరోగాయగురవే[3] త్వచ్చిన్తాహేతవే విభో।
ఆరోగ్యేఽపి తథా మేఽస్తు బుద్ధిస్త్వయ్యనపాయినీ॥

2.1.5.28 ప్రొఫెసర్. వి.రాఘవన్ షష్ట్యబ్దపూర్తి :

మద్రాసు విశ్వవిద్యాలయంలో సంస్కృత విభాగాచార్యులుగా ఉండి సంస్కృతసాహిత్యరంగమునకు ఎనలేని సేవచేసిన మహామనీషి ప్రొఫెసర్.వి. రాఘవన్. వీరు శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారి శిష్యులు. శ్రీవరదాచార్యులవారికి అత్యంత ప్రీతిపాత్రులు. 1968లో వీరికి షష్టి-పూర్తి జరిగినది. ఆ సందర్భమున శ్రీఆచార్యులవారు జ్యేష్ఠులుగా వీరిని అభినందించి ఆశీర్వదించినారు. ఆ అభినందనలో ఎన్నో చమత్కారములు తొణికిసలాడుచున్నవి.

---

1. ప్రా.క. పు. 26.

2. అందులోనే. పు. 26.

3. "దుర్భరాయ గురవే" అని గ్రంథకర్త ఇచ్చిన వివరణ.

భాగ్యవన్తం ప్రసూయేథాః మా శూరం మా చ పండితమ్।
మిథ్యేదం త్వయి సంప్రవృత్తం పండితే భాగ్యశాలిని॥[1]

ప్రపంచ ప్రసిద్ధమైన శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారి విద్యాన్వయంలో నేను అగ్రజుడను. నీవు అనుజుడవు.గురువు పరమపదించగా గురుకల్పుడైన ఈ వరదాచార్యులు నిన్ను ఇలా అభినందించుచున్నాడనడం ఎంత బాగుందో!

విద్యాన్వయే నః ప్రథితే పృథివ్యాం
ఆద్యోఽగ్రజస్త్వామనుజం వినీతమ్।
గురౌ ప్రమీతే గురుకల్ప ఏష
షష్ట్యబ్దపూర్తౌ వరదోఽభినందతి॥[2]

"నీవు త్రివిక్రముడవు మద్రాస్‌లోను, ఢిల్లీలోను, ఖండాంతరాల లోను సమంగా నీ ప్రతిష్ఠవ్యాపించినది"[3]అని సహృదయత పొంగిపొరలే టట్లు ఆయనను అభినందించడం ఆచార్యులవారి నిండైన మనస్తత్వాని కొక నిదర్శనం.

2.1.5.29 టి.కె.టి. షష్టిపూర్తి :

సంస్కృత భాషాప్రచారిణీ సభను చిత్తూరులో స్థాపించి తద్ద్వారా సంస్కృతభాషకు అనేక సేవలనొనర్చిన ధన్యజీవి శ్రీమాన్ టి.కె. తిరు వేంగడాచార్యులు. వారికి 1968లో షష్టిపూర్తి జరిగినది. వారిని వారి సేవలను అభినందించుచూ పంపిన మూడు శ్లోకములు ఇందులో ఉన్నవి.

"చదువుకొనుటద్వారా, ప్రచారముద్వారా ఇంతవరకు నీచే

---

1. ప్రా.క. పు. 28.

2. అందులోనే. పు. 28.

3. విక్రాంతం భవతా త్రేధా వ్యపుర్యాం దిహలీపురే।
ఖండాన్తరే సమం చేతి ప్రతిష్ఠా మహతీ తవ॥
అందులోనే. పు. 28.

రక్షింపబడిన దైవవాణి నిన్ను రక్షించుగాక!" అని సమయోచితమైన ఆశీస్సు ఈ ఖండికలో కనబడుచున్నది.

2.1.6.30 కప్పగంతులవారి గృహప్రవేశం :

ప్రాస్తావిక కదంబంలో చిట్టచివరి అంశమిది. ఇందులో ఒకే ఒక శ్లోకం ఉన్నది. అది శ్రీకప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారి నూతనగృహ ప్రవేశ సందర్భంలో వంపబడింది. శ్రీశాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రాచ్యభాషలకు డిప్యూటీ డిరెక్టర్‌గా పనిచేసినారు.

ఈ శ్లోకంలో "కప్పగంతులు" అనే వారి గృహనామమును సంస్కృతీకరించి "మండూకప్లుతి"గా మార్పుచేయుట బాగున్నది. అట్లే "గైర్వాణ్యాః శరణం తవాస్తు శరణం" అనుటలో "శరణం గృహ రక్షిత్రోః" అని శరణ శబ్దమునకుగల గృహమనే అర్థమును ఉపయోగించుకొనుట గమనార్హమైనది.

అట్లు మువ్వది ఖండికలలో శ్రీవరదాచార్యులవారి జీవితంలో అప్పుడప్పుడు జరిగిన సంఘటనలు, వారి సారస్వతారాధనము మిత్రాభినందనము, ఆత్మకథ మొదలైన ఎన్నో అంశములు విశదీకరింప బడినాయి. వారి జీవితమునకు సంబంధించిన అనేక విశేషములను తెలుసుకొనగోరువారికి ఈప్రాస్తావిక కదంబము కరదీపిక వంటిదనడంలో సందేహములేదు.

---

1. అధీత్య ప్రథమం యేన ప్రచారేణ తతః పరమ్।
రక్షితా త్వం చిరం తస్యాత్ దైవీవాక్ తిరువేంకటమ్॥
ప్రా. క. పు. 28

# 3 తృతీయాధ్యాయము

### 3.1 అనువాదములు - తులనాత్మక పరిశీలన :

రెండవ అధ్యాయమున శ్రీ వరదాచార్యులవారి స్వతంత్ర గ్రంథముల స్వరూప-స్వభావములను గూర్చి సోదాహరణముగ సమీ-క్షించితిని. ఈ అధ్యాయమున వారు తెలుగునుండి సంస్కృతభాష-లోనికి చేసిన అనువాదములను గూర్చి ప్రస్తావించుటకు ముందు, సాధారణముగ అనువాదముల ఆవశ్యకతను, అనువాదరీతులను గూర్చి తెలిసికొనుట ఉచితము.

### 3.1.1. అనువాదావశ్యకత :

సామాన్యముగ కవులు వారు పరిశ్రమించిన భాషలో కావ్యము-లను రచింతురు. ఆ భాషను మాట్లాడువారికి సన్నిహితులై హితము-నుపదేశింతురు. కావ్యానందము నందింతురు. కర్తవ్యమునుపదేశింతురు.

ప్రజలకు దగ్గఱై ప్రజాజీవితము ప్రతిబింబించుసాహిత్యము, ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేయజాలిన సాహిత్యము పదికాలములపాటు వారిమధ్య రాణించును. గ్రంథముచిన్నదా? పెద్దదా?అనునదిముఖ్యము కాదు. అది ప్రజల మనస్సులను ఎంతవఱకు అలరింపగలిగినదను అంశమే ఇక్కడ ప్రధానము.

ఒకభాషలో ఒకమహాకవి కావ్యమును రచించును. కొంతకాలము గడచిన తరువాత ఆ కావ్యములోని మాధుర్యమును అనుభవించి, సాహితీసౌరభము లాఘ్రాణించి ఆనందించిన సహృదయుడగు వేఱొక కవి ఇంతటి మధురపదార్థము ఇతర భాషల వారికికూడా అందుబాటులోనికి వచ్చిన ఎంతబాగుండును! అని ఆలోచించి తనకు బాగుగ పరిచయముగల వేఱొక భాషలోనికి దానిననువదించును. అట్లు అనువదించుటవలన ఒక భాషలో సుప్రసిద్ధమైన సాహిత్యము వేఱొకభాష మాట్లాడువారికి కూడా సులభముగా లభించి ఆ గ్రంథప్రయోజనమును వారు కూడా అనుభవించు అవకాశము కలుగును.

ఉదాహరణకు-తెలుగుభాషలో నీతి, భక్తి, శృంగారము మొ॥ అంశములపైని శతకములెన్నో కలవు. అవి తెలుగుభాషలో ఉండుట వలన తెలుగు తెలిసినవారు మాత్రమే ప్రయోజనమునుపొందుచున్నారు. ఆనందించుచున్నారు. కాని ఇతరభాషలవారికి వీటిలోగల కల్పనలు, భావనలు తత్త్వములు అందుబాటులో నుండుటలేదు. అట్లే తెలుగు వారికి ఇతరభాషా సాహిత్యముకూడా అందుబాటులో నుండదు. ఈ లోపము అనువాదమువలన తీరుచున్నది. ఏభాషలో రచననైనను ఇతర భాషలలోనికి అనువదించినచో సహృదయులగు పాఠకులు అందలి విజ్ఞానమును, సంస్కృతిని, కవితా మాధుర్యమును సులభముగా

అర్థము చేసుకొనగలుగుదురు.

కనుక అనువాదము నిర్దుష్టమైనచో అనువాదకుడు కవితాశక్తిగల పండితుడైనచో అతను చేసిన అనువాదము ఎంతగానో రాణించుటకు అవకాశమున్నది. అనువాదములను ప్రోత్సహించుటవలన ఇరుగు పొరుగు రాష్ట్రములమధ్య చక్కని స్నేహసంబంధములేర్పడి దేశము నందలి ప్రజలలో ఏకాత్మతాభావన ఏర్పడుటకు పునాదులు పడుచున్నవి. అనువాదములు ప్రాంతీయభాషలలో కాకుండా అంతర్జాతీయభాషగా రూపుదిద్దుకొనుచున్న సంస్కృతభాషలో జరిగినట్లైతే వసుధైక కుటుంబ భావన పెరిగి, ప్రపంచ దేశములన్నియు పరస్పర ప్రేమతో, అవగాహనతో జీవించుటకు సహకరించగలదు.

### 3.1.2 అనువాదరీతులు :

ఒక భాషనుండి ఇంకొక భాషలోనికి అనువాదము చేయునప్పుడు ప్రతి అనువాదకుడు కొన్ని నియమములను పాటించును. అనువాదకుని శక్తిసామర్థ్యములను, వ్యుత్పత్తిని అనుసరించి అతడు కొన్ని అనువాద రీతులను ఎన్నుకొనును. ఒకప్పుడు మూలగ్రంథ స్వభావము ననుసరించి కూడా అనువాదరీతులను అతడు ఏర్పరుచుకొనును.

మూలగ్రంథకర్త హృదయమునకు అన్యాయము జరుగకుండా, అనువాదము చేయుచున్న భాషలోని సాహిత్యరాశికి పరిపుష్టముగా నుండునట్లు వాసి తగ్గకుండా అనువాదకుడు జాగరూకత వహించవలెను. మూలము పద్యకావ్యమైనచో అనువాదము కూడా పద్యరూపమే అయినచో పాటించవలసిన నియమములు ప్రత్యేకముగా నుండును మూలము గద్యకావ్యమైనచో అనువాదముకూడా గద్యలోనేసాగుచున్నచో

అనువదించవలసిన నియమములు ఒకపద్ధతిలో ఉండును. అట్లుగాక గద్యమును పద్యములోగాని, పద్యమును గద్యములోకానీ అనువదించి నపుడు దృష్టిలో నుంచుకొనవలసిన రీతి ఇంకొక మాదిరిగా నుండును. ఏది ఏమైనను ప్రతి అనువాదకుడు పాటించవలసిన సామాన్యనియమములు కొన్ని ఉండును. వాటినిబట్టి ఆ అనువాదస్వరూపమును నిర్ధారణ చేయవలసియుండును.

స్థూలముగా ఈ అనువాదములను మూడు రకములుగా విభజించుకొనవచ్చును. 1. పదానువాదము, 2. భావానువాదము 3. స్వేచ్ఛానువాదము.[1]

1. పదానువాదము :

మూలమును ననుసరించి తుచ తప్పకుండా ప్రతి పదమును అనువదించుట పదానువాదమగును. దీనినే "పదశః అనువదించుట" అని లేక యథామాతృకానువాదమని కూడా పిలుతురు. ఈ పద్ధతిలో అనువాదకునికి స్వాతంత్ర్యముండదు. ఉన్న గ్రంథమును ఉన్నట్లు భాషాంతరమున చెప్పుటయే ఇందులో కనబడును.

2. భావానువాదము :

మూలకారుని హృదయమును బాగా అర్థము చేసికొని పదశః అనువాదము చేయకుండా అవసరమైన పట్టుల కొన్ని క్రొత్తపదములను చేసికొనుచు లేక మూలములోని కొన్ని పదములను వదిలివేయుచు అనువాదమును సాగించుట భావానువాదము. ఇందు వక్త్ర తాత్పర్యమును అనువాదములో అందించుట ప్రధానము. మూలము పద్యమైనచో అది ఏ ఛందస్సులో నున్నదో వీలైనంతవరకు అదే ఛందస్సులోగాని వీలులేకపోయినచో వేరే ఛందస్సులో కాని అను-

---

1. ఆం.సా.వి. పు. 733

వాదమును చేయవచ్చును. అనువాదకునికి మూలమునందలి భావముపై పూర్తిధ్యానముండును. కాన దీనిని భావానువాదమనిపిలుచుటఉచితము గానే ఉన్నది.

3. స్వేచ్ఛానువాదము :

ఇందులో అనువాదకునికి అన్నివిధముల స్వేచ్ఛగలదు. మూలము లోని భావమును పరిపుష్టినందించుటకు క్రొత్త పదములను అనువాదములో చేర్చుకొనవచ్చును. మూలము పద్యమయమైనచో గద్యములోనో గేయములోనో అనువాదము చేయవచ్చును. చాలావఱకు మూలార్థము చెడకుండ అనువాదము సాగవలెనను నియమమొక్కటి తప్ప మిగత నియమములన్నింటికి ఈ అనువాదములో వర్తింపులేదు.

3.2 ఆచార్యులవారి అనువాదములు :

శ్రీవరదాచార్యులవారు తెలుగుభాషలో సుప్రసిద్ధములైన ఈ క్రింది శతకములను సంస్కృతమున అనువాదము చేసిరి.

1. వేమన శతకము
2. సుమతి శతకము
3. దాశరథి శతకము
4. కృష్ణ శతకము
5. భాస్కర శతకము
6. శ్రీకాళహస్తీశ్వర శతకము
7. గాయత్రీ నీతి గీతావళి
8. నరసింహ శతకము
9. ఆంధ్రనాయక శతకము

ఈ శతకానువాదములన్నియు శ్రీఆచార్యులవారు అప్పుడప్పుడు చేసినవే. ఈ శతకములన్నింటిని 1954 నుండి 1969 లోపు సుమారు పదునైదు సంవత్సరముల కాలములో శ్రీఆచార్యులవారే శ్రీవారసింహ

సంస్కృత కళాశాల గ్రంథమాలద్వారా ప్రచురించిరి.

3.2.1 శతక స్వరూపము :

"శతం"అంటే నూరు,నూరుగానీ నూటికి దగ్గఱగానున్న సంఖ్యలో గానీ పద్యములున్న దానిని శతకమని అలంకారికులు వ్యవహరించిరి. క్రీ.శ. ఆరవశతాబ్దమునకు చెందిన అలంకారికుడు భామహుడు మొట్ట మొదట దీనిని అనిబద్ధకావ్యముగ గుర్తించెను.[1] గాథాసప్తశతిని అనిబద్ధకావ్యమునకుదాహరణముగ అలంకారికులు గుర్తించిరి. ఆ తరువాతివాడైన దండి ఏడవశతాబ్దమున సంఖ్యావాచక కావ్యములను కొన్నింటిని, ముక్తక,కులక, కోశ, సంఘాతములను పేర్లతో పేర్కొని నాడు. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దమునాటి అగ్నిపురాణము ముక్తకాదులను స్పష్టముగ గుర్తించినది[2] అదే శతాబ్దమునకు చెందిన ఆనందవర్ధనుడును ముక్తకాది కావ్యముల నుల్లేఖించెను.[3]

---

1. సర్గబంధోఽభినేయార్థం తథైవాఖ్యాయికా కథా|
అనిబద్ధం చ కావ్యాది తత్పునః పంచధోచ్యతే॥
కా. అ. 1.18.

2. శ్లోకైరనేకైః కులకం స్యాత్ సందానితకాని తత్|
ముక్తకం శ్లోక ఏకైకశ్చమత్కారక్షమం సతామ్॥
అ. పు. 337.36.

3. కావ్యస్య ప్రభేదాః— ముక్తకం సంస్కృతప్రాకృతాపభ్రంశ నిబద్ధమ్. సందానితక విశేషక కాలాపకాని పర్యాయబంధః పరికథా సకలకథా ఖండకథా సర్గబంధోఽభినేయార్థమాఖ్యాయికా కథే- త్యేవ మాదయః.

ధ్వన్యా. ఉ.3.7.

పదమూడవ శతాబ్దమునాటివాడగు వాగ్భటుడు ముక్తకాది కావ్య స్వరూపమును స్పష్టపరచెను. ఈ శతాబ్దమునకే చెందిన అమృతానంద యోగి అను అలంకారికుడు తన "అలంకారసంగ్రహము"న చాటు ప్రబంధ లక్షణములం చెప్పుచు సాక్షాత్తుగా శతకమును ఇట్లు పేర్కొనెను—

అథ చాటు ప్రబంధానాం లక్షణం కథ్యతేఽధునా।
ముక్తకం పద్యమేకం స్యాద్ద్వికం పద్యద్వయం మతమ్॥
త్రికం త్రయేణ పద్యానాం పంచరత్నాని పంచకమ్।
అష్టకం గజమాలా స్యాచ్చోడశేందుకళా మతా॥
సప్తవింశతి పద్యాని నామ్నా తారావళీ మతా।

... ...

ముక్తకస్యైవ విశేషణం సంస్కృతేత్యాది. ద్వాభ్యాం క్రియా సమాప్తౌ సందానితకమ్. త్రిభిర్విశేషకమ్. చతుర్భిః కలాపకమ్. పంచ ప్రభృతిభిః కులకమ్. ఇతి క్రియాసమాప్తికృతాభిద ఇతి ద్వంద్వేన నిర్దిష్టా. అవాన్తరక్రియా సమాప్తావపి వసన్తవర్ణనాద్యేకనిరూపోద్దేశేన ప్రవృత్తః పర్యాయబంధః- ఏకంచ ధర్మాది పురుషార్థముద్దిశ్య ప్రకార వైచిత్ర్యేణాసన్తవర్ణనప్రకారా పరికథా. ఏకదేశవర్ణనా ఖండకథా. సమస్తఫలాన్తేతివృత్తవర్ణనా సకలకథా. ద్వయోరపి ప్రాకృత ప్రసిద్ధ త్వాత్ ద్వన్ద్వేన నిర్దేశః. పూర్వేషాం తు ముక్తకాదీనాం భాషాయామ- నియమః మహాకావ్యరూపః పురుషార్థఫలః సమస్త వస్తువర్ణనాప్రబంధః సర్గబన్ధః సంస్కృత ఏవ. అభినేయార్థం దశరూపకం నాటికాత్రోటకరాసక ప్రకరణికాద్యవాన్తర ప్రపంచ సహితమనేక భాషావ్యామిశ్రరూపమ్. ఆఖ్యాయికోచ్ఛ్వాసాదినా చ యుక్తా. కథా తద్విరహితా వక్త్రాదినా ఉభయోరపి గద్యబంధ స్వరూపతయా ద్వంద్వేన నిర్దేశః. అదిగ్రహ ణాచ్చమ్పూః. యథాహ దండీ-"గద్య పద్యమయీ చంపూః" ఇతి.

ధ్వన్యా. లో. పు. 174-75.

త్రింశతా త్రింశికా సంధాశతా సంధాశికేష్యతే।
శతేన శతకం ప్రోక్తమష్టోత్తర శతం వరమ్।

మొత్తముమీద సంఖ్యానియమములు గల చాటు ప్రబంధము శతకమని తెలిసది. కాని కాలక్రమేణ ఈసంఖ్యానియమము సడలించబడినది. మూరు పద్యములున్నను అంతకంటే ఎక్కువగానున్నను శతకమను వ్యవహారము కలిగినది. ఏదో ఒక ఛందస్సులో మకుట నియమముతో శతకరచన సాగినది. ఈ మకుట నియమమునకు వైదికవాఙ్మయము కొంత దోహదపడినది. వైదిక వాఙ్మయమున చాలా మంత్రములలో ఒకే వాక్యము మకుటమువలె కనపడుచున్నది.

లౌకిక వాఙ్మయమున గూడ కొన్నిచోట్ల ఒకే వాక్యముతో కొన్ని శ్లోకములు కనపడుచున్నవి. వాల్మీకి రామాయణము వనవాసము దుఃఖకరమని శ్రీరాముడు సీతకు నచ్చచెప్పు సందర్భమున "దుఃఖమతో వనమ్" అను మకుటముతో కొన్ని శ్లోకములు గలవు. సంస్కృత శతకములలో గూడ మకుట నియమము కలదు. సంస్కృత ప్రాకృత స్తోత్రశతకముల ప్రభావమువలన కన్నడమున, తెలుగులో కూడ శతకములకు మకుటనియమమేర్పడినది.

కనుక 1. సంఖ్యానియమము 2. మకుట నియమము 3. ఛందో నియమము 4. రస నియమము 5. ఆత్మాశ్రయ కవితానియములతో సాగిన పద్యసమూహమును శతకమని వ్యవహరించవచ్చునని తెలియుచున్నది.

---

1. మరుద్భిరగ్న ఆగహి, ఋ.సం. 1.19.
అర్చన్ననుస్వరాజ్యమ్, " 1.80.
ఇంద్రాగ్నీ తస్య బోధతమ్, " 8.38.
మదేషు సర్వదా అసి, " 9.18.
తరత్సమందీ ధావతి, సా.సం 4.2.1-4

### 3.2.2 శతకోత్పత్తి-వికాసములు :

వైదికసూక్త మంత్రములు, రామాయణాది లౌకికవాఙ్మయము నందలి ఒకేముకుటముగల శ్లోకసముదాయములు, భక్తి ప్రబోధకమగు సంస్కృత, ప్రాకృత-కన్నడ స్తోత్ర వాఙ్మయము, తెలుగులో శతక వాఙ్మయోత్పత్తికి నిదానమైనది. సుమారు రెండువేల సంవత్సరము-లకు పూర్వుడైన హాలుని గాథాసప్తశతి ప్రాకృత వాఙ్మయములోని సంఖ్యాబద్ధ రచన. ఏడువందల పద్యములలో చేయబడిన ఈ రచన కూడ తరువాతి శతకవాఙ్మయమునకు మూలముగా గొనుటలో అనౌ-చిత్యము లేదు.

వైదికవాఙ్మయమునందలి మంత్రములను రామాయణాది లౌకి-వాఙ్మయమునందలి కొన్ని శ్లోకములను సంస్కృతభాషలో శతకము-లకు ప్రారంభస్వరూపముగా గుర్తించితిమి. ఆరవశతాబ్దమునందలి బాణభట్టు రచన చండీశతకము, అతనికి సమకాలికుడగు మయూరుని సూర్యశతకము ఆ తరువాత లెక్కకు వచ్చుచున్నవి. ఏడవ శతాబ్దమున ఏర్పడిన ఇతర స్తోత్రవాఙ్మయముతోపాటు అమరుకము మొదలైన సంస్కృత రచనలు ఈ వాఙ్మయమునకు స్పష్టస్వరూపము నొసంగి-నవి. కానీ సంస్కృతాలంకారికులు శతక వాఙ్మయమును దృష్టిలో నుంచుకొన్నట్లు స్పష్టమైన నిదర్శనములు లేవు.

పదకొండవ శతాబ్దమువాడగు నాగవర్మ కన్నడమున ప్రథమ శతకకర్త. ఇతని రచన చంద్రచూడామణి శతకము. దీనిని జ్ఞానసార-మనికూడ నందురు.

పన్నెండవ శతాబ్దపు చివరి భాగమునగల (క్రీ. శ. 1160–76) మల్లికార్జున పండితారాధ్యుడు ప్రథమాంధ్రశతకకర్తగా గుర్తింప

పొందెను. కాని కొందఱు క్రీ. శ. 1070 ప్రాంతమున జీవించియుండెనని భావింపబడుచున్న బద్దెన సుమతిశతకము మొట్టమొదటి తెలుగు శతకమని భావించుచున్నారు. కాని బద్దెన పన్నెండవ శతాబ్దము చివరివాడని చారిత్రకులు నిర్ణయించుటచే పూర్వ నిర్ణయము నిలబడుటలేదు గనుక ప్రథమాంధ్రశతకము పండితారాధ్యుడు రచించిన శ్రీగిరి మల్లికార్జున శతకమేనని నిర్ణయము.

### 3.2.3 ఆంధ్రశతక వాఙ్మయము :

ఇట్లు సంస్కృత ప్రాకృత కన్నడ సాహిత్యప్రభావముచే ఏర్పడిన ఆంధ్రశతక వాఙ్మయము ఎంతగానో వికసించినది. ఈ వాఙ్మయము ఉస్మానియా విశ్వవిద్యాలయమునందు పి హెచ్. డి. ఉపాధికొఱకు చక్కని పరిశోధన జరిపిన డా॥ కె. గోపాలకృష్ణరావు గారు ఈ క్రింది విధముగా దీనిని విభజించిరి.[1]

1. శైవభక్తి శతకములు
2. వైష్ణవభక్తి శతకములు
3. నృసింహ శతకములు
4. రామభక్తి శతకములు
5. కృష్ణభక్తి శతకములు
6. దేవీభక్తి శతకములు
7. వివిధభక్తి శతకములు
8. నానాదేవతాభక్తి శతకములు
9. శ్రీవేంకటేశ్వర శతకములు
10. శాస్త్రీయ శతకములు
11. నీతి శతకములు

---

1. ఆం.శ.సా.వి. పు. 1-8

12. అధిక్షేప శతకములు
13. హాస్య శతకములు
14. శృంగార శతకములు
15. ప్రకీర్ణ శతకములు
16. వివిధవస్తు శతకములు
17. చారిత్రక శతకములు
18. కథాత్మక శతకములు

పద్దెనిమిది వర్గములుగా విభజింపబడిన తెలుగు శతకములు సుమారు ఏడు వేలవరకు గలవు. అన్ని శతకములలోను అగ్రములపోట వానెడు శతకములు కొన్నిమాత్రమే. వాటిలో ముఖ్యశతకములు కొన్ని ఇతర భాషలలో అనువదించబడినవి.

3.2.4 అనూదిత శతకవైశిష్ట్యము :

శ్రీవరదాచార్యులవారు ఎనిమిది తెలుగుశతకములను సంస్కృత భాషలోనికనువదించిరి. గాయత్రీ నీతిగీతావళి అను పేరుతో హిందీ నుండి తెలుగులోనికి అనువదించబడిన శతకప్రాయమునఁదగిన నూరు తెలుగు పద్యములను గూడ సంస్కృతానువాదముచేసిరి. శ్రీఆచార్యుల వారు అనువాదమునకు తీసికొనిన ఈ శతకములు తెలుగుదేశమున ఎంతో ప్రసిద్ధి పొందినవి. అందులో కొన్ని ప్రధానముగా భక్తిప్రధానశతకములు, కొన్ని నీతిబోధకములు, ఇంకొన్ని లోకస్వభావవర్ణనపరములు, మఱి కొన్ని నిందాస్తుతి రూపములు. ఇట్లు వారు అనువాదమునకెన్నుకున్న శతకములలో వైవిధ్యము గోచరించుచున్నది.

సంస్కృతసాహిత్యమును ఆయా దేశభాషలలో అనువదించుట పరిపాటి. కాని ఆ సంప్రదాయమునకు విరుద్ధముగ తెలుగుభాషలోగల

కొన్ని శతకములను సంస్కృతమున ఆచార్యులవారు అనువదించిరి. అనువాదకారణమిట్లూహింపవచ్చును— తెలుగు సాహిత్యమున శతక వాఙ్మయము సంస్కృత సాహిత్యచ్ఛాయలలో ప్రారంభమైనప్పటికిని అతి త్రివిక్రమునివలె దినదినాభివృద్ధి గాంచి స్వతంత్రసాహితీ శాఖగా రూపొందినది. సుమారు మూడువందల శతకములు తెలుగులో వచ్చినవి. సంస్కృతమున చాలాకొద్ది శతకములు మాత్రమే వెలసినవి. తెలుగు శతకములలో భక్తి, నీతి, నిందాస్తుతి, శృంగారవైరాగ్యాది శతకములెన్నియో గలవు. కాని ఆచార్యులవారు అనువదించుటకు చేపి-కొనిన ఎన్నికలోగూడ ప్రత్యేకత కనబడుచున్నది. తెలుగునాడులో ప్రతినోట వినబడుచు సుప్రసిద్ధములైన శతకములనెనిమిదింటిని వారు తమ అనువాదమునకు తీసికొనిరి. ఆచార్యులవారు అనువాదము చేసినశతకముల వైశిష్ట్యమును ఇప్పుడు పరామర్శింతము.

3.2.4.1 వేమనశతకము :

ఆంధ్రదేశమున వేమనయోగి సుప్రసిద్ధుడు. ఇతని కాలమును గూర్చి నిర్ణీతాభిప్రాయములు లేవు. సి.పి.బ్రౌన్ ఇతనిని 1652-1725 మధ్యకాలమునవాడని పేర్కొనెను. వంగూరి సుబ్బారావు గారు 1412-1480 వేమనజీవితకాలమని చెప్పిరి. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1650 ప్రాంతమువాడనిరి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు 1700 సంవత్సరములో వేమన ఉన్నట్లు పేర్కొనిరి.[1] లౌకిక భోగపరవశుడై జీవిత పూర్వార్ధమును గడిపిన వేమన ఉత్తరార్ధమున తన భ్రమను గుర్తించి తత్త్వము నెఱింగి లోకహితమునకై చెప్పిన ఉపదేశములే వేమనపద్యములు పేర లోకమున సుప్రసిద్ధములైనవి. ఇతడెన్నియో పద్యములను

---

1. మన వేమన పు. 4

రచియించెను. ఇదమిత్థముగా ఇన్ని అని చెప్పుటకు వీలులేదు. అవి సుమారు 5,000 వరకు ఉన్నట్లు ఒక అంచనా.[1] తరువాతివారు కొన్ని పద్యములను వ్రాసి వేమన పేర ప్రచారము చేసినట్లును విమర్శకులు అభిప్రాయపడుచున్నారు. ఈ ఊహలకు తగిన ఆధారములు కనపడవు. కాని అందులో సమాజమునకు చక్కగా ఉపయోగించు పద్యములను కొన్నింటిని మనవారు వేమనశతకమను పేర పాఠశాలలలో చిన్న పిల్లలకు బోధించుచున్నారు. పాఠభేదములతో తెలుగులో వేమనశతక ప్రచురణలు కొన్ని ఏర్పడినవి.

వేమన వ్రాసిన పద్యములన్నియు "ఆటవెలది" ఛందస్సులో నడచినవి. యౌవనమున కలిగిన ఆటవెలదుల పొందు ఆయనకు యోగియైన పిదప కూడా ఈ రూపమున తప్పలేదు. భేదమేమన, భోగి వేమనను ఆటవెలదులు నడిపించిరి. యోగివేమన ఆటవెలదులను నడి-పించినాడు..

ఈ శతకమునందు "విశ్వదాభిరామ వినురవేమ" అను మకుటము గలదు. విశ్వదుడన ప్రపంచమును సృష్టించిన భగవంతుడు. ఆ భగ-వంతునకు ఇష్టుడైనవాడు విశ్వదాభిరాముడు, అతడే వేమన. అంటే "భగవంతునకు ప్రీతిపాత్రుడైన ఓ వేమా! వినుము!" అని తనకు తాను సంబోధించుకొనుచు చెప్పిన పద్యములే వేమనపద్యములు. ఈ మకుటమునందలి అభిరామపదము వేమన మిత్రుడైన అభిరామయ్యను జ్ఞప్తికి తెచ్చుచున్నదని కొందరు చెప్పుదురు. కాని అది కట్టుకథేనని చాలమంది విమర్శకులు తేల్చివేసినారు.

వేమన శతకమను పేరుతో ప్రసిద్ధమైన పద్యములు సమాజము

---

1. వేమన, పు. 26

లోని తప్పులను ఎత్తి చూపించునవి కొన్ని.[1] నీతిని బోధించునవి మఱి కొన్ని,[2] లోకస్వభావమును వివరించునవి ఇంకొన్ని.[3] మొత్తముమీద సమాజమునందలి అన్నివర్గముల వారిలోనున్న కపటమును వేమన కడిగి ఎండగట్టినాడు. అందువలననే ఆ పద్యములు ప్రతివానికి అవసరమైనవి. ఆదర్శమైనవిగా కూడా పరిణమించినవి. ఇన్ని గుణములున్నవి కనుకనే ఆదార్యులవారు సంస్కృతానువాదమునకు వేమన శతకమును ఎన్నుకొనిరి. నిజముగా ఇంత ముక్కుసూటిగా సులభముగా ప్రజలహృదయములలోనికి చొచ్చుకొనునట్లు చెప్పిన ప్రణాళికవులు ఇతరభాషలలో చాలా తక్కువగా కనిపింతురు.

### 3.2.4.2 సుమతి శతకము :

నీతిశతకవాఙ్మయమున ప్రసిద్ధమైనది సుమతి శతకము. దీని కర్తృత్వమును గూర్చి వివాదము కలదు. భద్రభూపాలుడు సుమతి శతకమును,నీతి శాస్త్రముక్తావళిని రచించెనని విమర్శకుల విశ్వాసము. ఈ రెండు గ్రంథములు ఏకకర్తృకములు కావని కూడ కొందఱి అభిప్రాయము. భద్రభూపాలుని బద్దెన అని వ్యవహరించుటయు గలదు. ఇతని కాలమును గూర్చి పలువురు పలురకములైన అభిప్రాయములను వెలిబుచ్చియున్నారు. వాటన్నిటిలో జయంతి రామయ్య పంతులుగారి

---

1. వే. శ. 8

2. అందులోనే. 25

3. ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు
చూడచూడ రుచుల జాడవేఱు
పురుషులందు పుణ్యపురుషులు వేఱయా
విశ్వదాభిరామ వినురవేమ.
అందులోనే. 17

అభిప్రాయమును విమర్శకులు చాలమంది అంగీకరించియున్నారు. వారి అంచనా ప్రకారము బద్దెన క్రీ.శ. 1261 ప్రాంతమున కాకతి రుద్రమదేవి సామంతుడుగా రాజ్యమేలెను. ఇతని రాజనీతి పరిజ్ఞానము అనన్యసామాన్యము. అట్లని సామాజిక నీతిలో ఈయన తక్కువవాదని అనుకొనరాదు. సుమతిశతకమున రాజనీతి-సామాజికనీతి ప్రతిపద్యమున మనకు ప్రత్యక్షమగుచున్నది

బద్దెన తన శతకమున రాజు, మంత్రి, అధికారము, ఉపాయము, రాజ్యరక్షణము, సేవకుడు, దుష్టుడు[1] దానము, వివేకము, కరణము, స్త్రీలు, వైద్యుడు,[2] కోమటి, ద్విజుడు, మొ॥ అంశములను దృష్టిలో నుంచుకొని తన అనుభవమును జోడించి లోకమునకుపదేశించిన నీతులు అపూర్వమైనవి.

ఈ శతకము తెలుగులో కందమను ఛందమున రచించబడినది. "సుమతీ" అని బుద్ధిమంతుని సంబోధించి చేయు ఉపదేశము ఈశతకమున కన్పడుచున్నది. చాలా సులభ శైలిలో నుండుటచే ఇది పిల్లలకెంతో ఆకర్షకమైనది.

ఇంత చక్కని చిక్కని ఉపదేశములుగల ఈ శతకములోని భావనలు రాష్ట్రేతరులకు కూడా తెలిసిన బాగుండునను సంకల్పముతోనే శ్రీఆచార్యులవారు ఈ శతకమును అనువాదమునకు పరిగ్రహించిరి.

3.2.4.3 దాశరథి శతకము :

శతకవాఙ్మయమునగల రామభక్తి శతకములు అరువదింటిలో "దాశరథిశతకము" అద్యము, అద్వితీయము. దీనిని రచించినవాడు

---

1. సు.శ. 54

2. అందులోనే. 6

కంచర్ల గోపన్నకవి. గోదావరి నదీతీరమున గల భద్రాచలక్షేత్రము ఈయన నివాసము. భద్రాచలమునగల సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాకారాదులు ఈ మహానుభావుని కైంకర్యమే.

తానీషా ప్రభుత్వమున భద్రాచలమున కంచెర్ల గోపన్న తహ-సీల్దారుగా పనిచేసెను. ఇతడు ఆదిశాఖీయుడు. ఆత్రేయసగోత్రుడు, లింగనమంత్రి కుమారుడు, శ్రీరఘునాథ భట్టాచార్యుల శిష్యుడు, గోలకొండలోని నవాబు "తానీషా" ఆస్థానమున మంత్రులుగానున్న అక్కన్న-మాదన్నలు ఈయన మేనమామలు. ఇతడు ప్రభుత్వ ధనమును వెచ్చించి భద్రాచలమున సీతారామచంద్రుల దేవాలయ గోపుర ప్రాకారాదుల నిర్మించి, నవాబు ఆగ్రహమునకు గురియై కారాగార శిక్షననుభవించెను ఈతడు పదునేడవ శతాబ్దములోనివాడు. ఇతడు "రామదాసు"గా ఆంధ్రదేశమున ప్రసిద్ధినొందినాడు.

దాశరథిశతకమునందలి రచనాశైలి, భావనలు చాలా ఉన్నత మైనవి. ఈతడు మహాకవి పోతనవలె శబ్దాలంకారప్రియుడు. ప్రతి పద్యమునందును నాల్గవపాదముచివర"దాశరథీకరుణాపయోనిధీ"అను సంబోధనలుండును. ప్రధానముగా శ్రీరామావతారవైశిష్ట్యము, రామ నామమహిమ, లోకనీతి, భక్తులచరిత్రలు ఈ శతకమున వర్ణించ బడినవి.

కొన్నిచోట్ల భద్రాచలక్షేత్రము మన కన్నులకగు పడునట్లు ఈ కవి వర్ణించును[1] అట్లే మానవునకు అంత్యకాలమున భగవన్నామ స్మరణ చేయుటకు వీలుకాని పరిస్థితిని ఈకవి వర్ణించిన తీరు చాలా ప్రశంసనీయము.[2]

---

1. దా.శ. 21

2 అందులోనే. 16

సహజముగానే శ్రీరామభక్తి తత్పరులైన శ్రీఆచార్యులవారు భిన్నగుణగణములుగల దాశరథి శతకమును తమ అనువాదమునకు తీసికొనిరి. రామదాసు పైన వారికి గల ఆదరము, భద్రాచల సీతారామ చంద్రుల పైన వారికిగల భక్తిప్రపత్తులు తరువాత భద్రాచలదేవాలయ జీర్ణోద్ధరణ సంఘమున వారు ఉపాధ్యక్షపదవిని అంగీకరించుటకు దోహదము చేసినవి.

3.2.4.4 కృష్ణ శతకము :

నీతిశతకములవలె లోకమున బహుళప్రచారమునొందిన శతకము కృష్ణశతకము. ఇది భక్తిశతకవాఙ్మయమున చాలాప్రసిద్ధమైనది. ఈ శతకమున పరిపూర్ణావతారమగు శ్రీకృష్ణుని తత్త్వము, అనేక కళ్యాణగుణగణములు శ్రీమహావిష్ణువు స్వీకరించిన ఇతర అవతారముల వైశిష్ట్యము, భక్తుని స్వరూపము మొ॥ అంశములు ఎంతో చక్కగా వివరించబడియున్నవి. దీనిని రచించినవాడు నృసింహకవి.[1] ఇతడు భారద్వాజసగోత్రుడు. చారిత్రకుల నిర్ణయము ప్రకారము ఈ శతకము క్రీ.శ. పదునెనిమిదవ శతాబ్దాంతమున రచించబడినది.

కృష్ణభక్తి శతకములు తెలుగు వాఙ్మయమున సుమారు డెబ్బది వరకు గలవు. అందులో కృష్ణశతకమునకున్న స్థానము అద్వితీయము. ఈ శతకము సుప్రసిద్ధమైన కందమను ఛందస్సులో రచించబడినది. నృసింహకవి కృష్ణుని సంబోధించుచున్నట్లే ప్రతిపద్యమునను అనేక విశేషణములను ప్రయోగించుచూ కృష్ణావతార మహాత్మ్యమును, శ్రీకృష్ణుని లీలలను ఈశతకమున ప్రతిపాదించుచున్నాడు. కొన్నిచోట్ల భగవంతుని తత్త్వమును ఎంతోచక్కగా ఈకవి తేటతెల్లముచేయును.[2]

---

1. కృ.శ. 102

2 అందులోనే. 35

ప్రపంచముయొక్క సృష్టి-స్థితి-లయములను కార్యములనను-సరించి భగవంతునకు బ్రహ్మ-విష్ణువు - మహేశ్వరుడు అను నామము లేర్పడినట్లు ఎంతో చక్కగా అభివర్ణించినాడు.

ఇంతేగాక ఈ శతకమున ఎందరో మహాభక్తుల చరిత్రలు, భగవంతుని మహానుగ్రహములు నిదర్శనముగా పేర్కొనబడినవి.[1] చిన్నపిల్లలకు సులభముగ ఉచ్చరించుటకు వీలుగానుండుటచే ఈ శతకము పాఠశాలలలో బహుళప్రచారమునొందినది. కనుకనే శ్రీ ఆచార్యులవారు దీనిని తమ సంస్కృతానువాదమునకు తీసికొనిరి.

3.2.4,5 భాస్కర శతకము :

తెలుగు శతకవాఙ్మయమునందు దృష్టాంత శతకములకు ఒక ప్రత్యేకస్థానము గలదు. దృష్టాంత శతకములలో "భాస్కర శతకము" ప్రథమగణ్యము. దీనికి కర్త ఒక్కడా? లేక ఇద్దరిచే ఇది రచింపబడినదా? అను అంశమున విమర్శకులలో అభిప్రాయభేదము గలదు. కాని ఈ శతకములోని చివరి పద్యమును చూచినచో ఈ శతకము ఒకే కవిచే రచింపబడినదని చెప్పుటకు వీలగుచున్నది. ఇది ఆ పద్యభాగము-

ఇంచుక నేర్పులేక విహనత చెందిన నాకవిత్వమున్
మించువహించెనీ కతన[2]...........................

అందులోని "నాకవిత్వమున్" అనుమాట ఈశతకము ఏకకర్తృకమని నిర్ధారణ చేయుచున్నది. ఈ శతకమునకు కర్త మారన. ఇతడు సూర్యోపాసకుడు.

---

1. అందులోనే. 67, 68, 70.

2. భా.శ. 101

భాస్కరశతకమునందలి పద్యములోకదానిని అప్పకవీయము నందు ఉదాహరించుటచే మారవికవి క్రీ.శ. 1660 కంటె పూర్వమే జీవించెనని చెప్పుటకు వీలగుచున్నది. మారవి క్రీ.శ. 1550–1660 మధ్యకాలమున జీవించియుండవచ్చును. ఈ శతకములోని "అంగన నమ్మరాదు" అను పద్యమున పేర్కొనబడిన చిత్రాంగి సారంగధర వృత్తాంతమునుబట్టి కూడా ఈ కవికాలము 16వ శతాబ్దపు చివరిభాగము అని నిర్ణయించుటకు అవకాశమున్నది.

భాస్కరశతకము దృష్టాంతశతకములలో ముఖ్యమైనదని ఇంతకుపూర్వమే చెప్పితిని. ఆ దృష్టాంతముల సందర్భోచితముగా కూర్పుటలో మారవికవి తన ప్రతిభా-పాండిత్యములను ఈ శతకమున చక్కగా ఉపయోగించుకొనినాడు. దుర్మార్గుని ప్రవృత్తిని వర్ణించుచు చీదపురుగును దృష్టాంతముగా మారవికవి వర్ణించిన తీరు ప్రశంసనీయము.[1] ఇట్లే ప్రతిపద్యమునందును చక్కని దృష్టాంతములను ఈ కవి పొందుపరచెను. దృష్టాంతశతకరచనలోని నూతన ప్రక్రియను ఆంధ్రేతరులకు అందించుటకే ఈ శతకమును ఆచార్యులవారు అనువదించుట.

3.2.4.5 శ్రీకాళహస్తీశ్వర శతకము :

చిత్తూరు జిల్లాలోని సువర్ణముఖీ నదీ తీరమున శ్రీకాళహస్తీశ్వరుడు వెలసిన క్షేత్రమునకే శ్రీకాళహస్తి అని పేరు. సాలీడు,సర్పము, ఏనుగు, పరమేశ్వరు నారాధించి ముక్తి నందిన క్షేత్రమిది. దీనికి "దక్షిణకాశి" అని ప్రసిద్ధిగలదు ఇక్కడ వెలసియున్నస్వామి "వాయులింగము" అని చెప్పుదురు.ధూర్జటిమహాకవి శ్రీ స్వామిపై కాళహస్తీశ్వర మాహాత్మ్యమును శ్రీకాళహస్తీశ్వర శతకమును రచియించెను.

---

1. భా.శ. 20

ఈతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడని అష్టదిగ్గజములలో ఒకడని ప్రసిద్ధికలదు. అట్లు కాదనికూడ కొందరు విమర్శకులు అను-చున్నారు.

ఇతడు యవ్వనమున వారాంగనాప్రియుడై సకల భౌతిక సుఖములననుభవించి విసుగుపడి చివరకు వార్ధకమున శ్రీకాళహస్తీశ్వరుని ఆరాధించి, వ్యర్థమైపోయిన గతజీవితమును, తనరచనలో ప్రస్తావించెను.[1]

ప్రభువులను,[2] ప్రజలను[3] సమాజములోని చెడును ధూర్జటి విమర్శించినంత ముక్కుసూటిగా ఇంకొకకవి విమర్శించలేదనుట సత్యము. సత్యము తెలియవలెనే కాని వేదవేదాంతాదిశాస్త్రపఠన మాత్రమున తత్త్వము అందుబాటులోనికి రాదని ఈ చదువులన్నియు పైపై చదువులని ధూర్జటి గట్టిగా ప్రతిపాదించును.[4]

మానవ జీవితమును అంచనావేయుటలో ధూర్జటి కడుదిట్ట. ఆకాలమున ప్రభువులను ఇంతగా విమర్శించిన కవులు చాల తక్కువ మంది. తన జీవితానుభవమును ప్రజలకు కానుకసిన మోటాదులో నీతిని

---

1. శ్రీ.కా.శ. 14

2. అందులోనే. 18,21,22,

3. అందులోనే. 28,68

4. ఏవేదంబు పఠించె లూత భుజగంబే శాస్త్రముల్సూచె దా
నేవిద్యాభ్యసనం బొనర్చెగరి: చెంచేమంత్ర మూహించెబో
ధావిర్భావనిదానముల్ చదువులయ్యా! కావు మీపాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!
శ్రీ.కా.శ. 13.

భక్తిని వైరాగ్యమును చక్కగా ఉపదేశించిన మహానుభావుడు ఈకవి. ఆంధ్రశతకవాఙ్మయమునకే మహాకవి ధూర్జటి రచించిన "శ్రీకాళహస్తీశ్వర శతకము" తలమానికము.

అందువల్లనే ఆచార్యులవారు ఆంధ్రేతరులకు ఈ శతకానువాదము ద్వారా వద్రనోపేతముగా విందు నందించినారు.

3.2.4.7 గాయత్రీ నీతిగీతావళి :

బందరు వాస్తవ్యులు "అభినవరామకృష్ణ" బిరుదాంకితులు, శ్రీఅద్దేపల్లి లక్ష్మణస్వామిగారు హిందీ సాహిత్యములోని అనేకనీతి పద్యములను తెలుగులోనికనువదించి "గాయత్రీ నీతిగీతావళి" అను పేరుతో 1957లో ప్రచురించిరి. ఎంతో గంభీరమైన భావములుగల ఈ శతకమును శ్రీవరదాచార్యులవారు సంస్కృతములోనికనువదించిరి. తర్వాతవారి అనువాదముతోపాటు మూలమునకు కూడ ఎంతోప్రసిద్ధి లభించినది.

ఈ శతకములోని నీతులు చక్కని దృష్టాంతములతో ప్రతివ్యక్తికి మార్గదర్శకములుగా నుండును.లోకస్థితిని అర్థము చేసికొనుటకు ఈపద్యము లెంతగనో ఉపయోగించును.[1]

3.2.4.8 నరసింహ శతకము :

తెలంగాణాలోని గోదావరి తీరమున గల క్షేత్రములలో "ధర్మపురి" గొప్పక్షేత్రము. ఇచ్చట నరసింహస్వామి వెలసియున్నాడు. ఈ క్షేత్రమునకు సంబంధించిన "శేషప్ప" అనుకవి "నృకేసరి శతకము" "నరసింహశతకము" అను రెండు శతకములను నరసింహస్వామిపై చెప్పినాడు. ఈకవి 19వ శతాబ్ద ప్రారంభమునాటివాడు.

---

1. గా.నీ.గీ. పు.1

ధర్మపురి శేషప్ప మొదటిరచన "నృకేసరి శతకము" రెండవ రచన "నరసింహ శతకము". శేషప్ప దారిద్ర్యబాధతో అతిదీనావస్థలో నుండి తన కొట్టబోయుమని నరసింహస్వామిని వేడినాడు. ఈశతకములో ఆనాటి సామాజిక పరిస్థితులు, ఆత్మీయాంశములు, సమాజమునకు కవి చేసినహితబోధ, శ్రీనృసింహస్వామిపై వ్యాజస్తుతి, విరక్తి ప్రతిపద్యము లోను ప్రతిఫలించుచున్నది.ఈ శతకమునందలి కొన్నిపద్యములు ఆంధ్ర దేశమున సుప్రసిద్ధములు.[1] ఈ శతకమునందు నృసింహమూర్తిపై. భక్తి, ఇతర భక్తులచరిత్రలు, లోకవృత్తము వైరాగ్యము మున్నగు అంశములు ఎంతో చక్కగా ప్రతిపాదించబడినవి. కనుకనే ఆచార్యుల వారు ఈ అనువాదమునకు ఈ శతకమును తీసికొనిరి.

3.2.4.9 ఆంధ్రనాయక శతకము :

కృష్ణాజిల్లాలో కృష్ణానది తీరమున "శ్రీకాకుళము"ను క్షేత్రమున ఆంధ్రవిష్ణువు అవతరించినాడు. శ్రీకృష్ణదేవరాయలకును ఈ క్షేత్రము నకును సంబంధమున్నట్లు చరిత్ర తెలియజేయుచున్నది. రాయల తర్వాత ఈక్షేత్రవైభవము సన్నగిల్లిపోయినది. స్వామికి ఉత్సవాది కైంకర్యములు జరుగుటలేదు. దేవాలయము వైభవము తగ్గి అతి దీనావస్థలోనున్నపుడు కాసుల పురుషోత్తమకవి ఆనాటి దేశ-కాల సామాజిక పరిస్థితులను విశదీకరించుచు సహజమైన తనవ్యాజోక్తి-వైభవమును చాటి చెప్పుచు ఆంధ్రవిష్ణువుపై ఒక శతకమును చెప్పెను. దానిని "ఆంధ్రనాయకశతక" మందురు. ఈ కవి క్రీ.శ. 1800 ప్రాంతమున జీవించెనని చారిత్రకుల అభిప్రాయము. నిందాస్తుతి ప్రయోగమున కాసుల పురుషోత్తమకవికి సాటి ఎవ్వరును లేరు.

పురుషోత్తమకవి ఆంధ్రనాయకశతకము, హంసలదీవి గోపాల శతకము,భక్తకల్పద్రుమశతకము, మానసబోధశతకము,అను నాలుగు

---

1. న.శ. 15-44

శతకములను రచించెను. వీటిలో మొదటిదైన గోపాలశతకము,ఆంధ్రనాయక శతకము పూర్తిగా లభించుచున్నవి మిగత రెండును అలభ్యములు.

ఈశతకమున నిందాస్తుతి రూపమున భారత-భాగవత-రామాయణములలోని సుప్రసిద్ధ కథాంశములను కవి ప్రస్తావించిన తీరు ఎంతో ప్రశంసనీయమైనది. పురుషోత్తమకవి భావనలు, భాష, ఎంతో మధురమైనవి. ఈ శతకములోని కొన్ని పద్యములు ఆంధ్రసాహిత్యమునందే కాక ఇతర సాహిత్యమునందును కన్పడని కమనీయ భావనలతో అలరారుచున్నవి.[1] శ్రీవరదాచార్యులవారు ఈ విశేషమును దృష్టిలో నుంచుకొని ఈ శతకమును సంస్కృతమున అనువదించిరి.

3.2.5. ఆచార్యులవారి అనువాద పద్ధతులు :

సామాన్యముగ ఒక భాషనుండి ఇంకొకభాషకు పద్యరూపములో నున్న శతకములకనువాదము చేయునపుడు అనువాదకులు కొన్ని నియమములను ఏర్పరుచుకొందురు. కొన్నినియమములకు అనుగుణముగా సాగిన అనువాదములలో ప్రత్యేకలక్షణములు కన్పడుచుండును.

శతకములను అనువాదము చేయువారు మూలమునందలి పద్యముల సంఖ్యను అనువాదములో కూడ మార్పులేకుండ తగిన పద్యములను రచించెదరు. ఇంకొందరు పద్యముల సంఖ్యను మార్చి మూలమునందలి ఒకపద్యమునకు అనువాదమున రెండు పద్యములను వ్రాయుట లేక మూలములోని రెండు పద్యములను ఒకే పద్యములో అనువదించుట మొదలగుమార్పులను చేయుచుందురు. ఇది సర్వ సాధారణ విషయము.

---

1. ఆం.నా.శ. 26 28

శ్రీఆచార్యులవారు తమ శతకానువాదమునందు ఒక తెలుగు పద్యమును సాధారణముగ ఒకే ఒక సంస్కృత శ్లోకమున అనువాదము చేసినారు. కాని నరసింహ–ఆంధ్రనాయకశతకములలో సీసపద్యముల కొక్కొక్కదానికి మూడు ఉపజాతులయందు అనువాదము చేసినారు. అట్లే తెలుగు శతకములలో వలెనే మకుటనియమమును కూడ అనువదింప బడిన సంస్కృత శతకములలో పాటించినారు. మూలమునందలి సంస్కృత పదములను కొన్ని సమాసములను గూడ వీలైనచోట్ల అట్లే సంస్కృతములో వాడుకొనినారు. మూలమునందుపయోగించబడిన తెలుగు ఛందస్సునకనుగుణముగా అనువాదమున సంస్కృత ఛందస్సును ఎన్నుకొనినారు.

వ్యాకరణ పరిపుష్టమైన భాషలో ఇది అనువాదమా లేక మూల గ్రంథమేనా అను సందేహము కలుగునట్లు శ్రీఆచార్యులవారి అనువాదము సాగినది. తెలుగు శతకమునందలి ప్రత్యేకతను గుర్తించి మూలకర్త హృదయమును బాగుగా ఆకళించుకొని అర్థపుష్టి తగ్గకుండా, అనర్థక ప్రయోగములు లేకుండ, ఔచిత్యము లోపించకుండా, సుప్రసన్నమైన భాషలో అనువాదములను చేసి వారి స్వతంత్రకావ్యలకు దీటుగా అనువాదములను నిలిపినారు. ఆంధ్రవాటికి-అమరవాటికి వారు చేసిన విశిష్టసేవ ఈ అనువాదములలో కనపడుచున్నది. తెలుగు పలుకుబడులలోని తియ్యదనము చెడకుండా కృతకముకాని సహజసుందరమైన బాటలో శ్రీఆచార్యులవారి వాణి సాగిపోయినది. వైదర్భీరీతిలో సముచితమైన అనువాదపద్ధతులతో సాగిన వారి అనువాదములు సహృదయుల హృదయావర్జనము చేయుటకు చాలినవై యున్నవి.

### 3.2 6. అనువాద వైశిష్ట్యము :

శ్రీవరదాచార్యులవారొనర్చిన తొమ్మిది అనువాదములు చాలా విశిష్టమైనవనుటలో సందేహము లేదు. తెలుగునాట ఆబాలగోపాలము

ప్రసిద్ధమైన నీతి, భక్తి ప్రబోధకములైన కొన్ని శతకములను ఎన్నుకొని మూలమునకు ఏ అంశములోను తగ్గనటువంటి చక్కని అనువాదము ను ఆచార్యులవారు వెలయించినారు. రాబోవు ప్రకరణములో తెలుగు-సంస్కృత శతకములను తులనాత్మకముగ పరిశీలించి వారి అను-వాదములోని గొప్పదనమును నిరూపింతును.

3.3 తులనాత్మక పరిశీలన :

ఒక భాషనుండి వేరొక భాషలోనికి అనూదితములైన గ్రంథముల విశిష్టతను నిరూపించవలెనన్న మూలగ్రంథములోని భాష-భావన, శైలి మొ॥ లక్షణములు అనువాదమునందు ఏస్వరూపమునందినవో పరిశీలించి తీరవలయును. మూలమునందలి గాంభీర్యము చెడకుండా అనువాదకుడు అంతకంటే గొప్పగా తన రచనను సాగించవచ్చును. అది మూలకారుని హృదయమును యథాతథముగ అనువాదకుడు గ్రహించుటపై ఆధారపడియుండును. ప్రకృతమున తెలుగుభాషలో సుప్రసిద్ధములైన శతకములను శ్రీఆచార్యులవారు సంస్కృత భాష లోనికి అనువదించిరి గాన, తెలుగు పలుకుబడులను తెలుగుభాషలోని తియ్యదనమును చెడిపోకుండా సంస్కృతభాషానియమములను అతి-క్రమించకుండా శ్రీఆచార్యులవారు తమ అనువాదమును సాగించి యుండవలెను. అందువలననే వారి అనువాదములు పండితుల ప్రశంస లకు పాత్రములైనవి. ఈ ప్రకరణమున తెలుగు శతకములలోని కొన్ని పద్యములను క్రమశః స్థాలీపులాకముగ పరిగ్రహించి వాటికి శ్రీఆచా-ర్యులవారొనర్చిన అనువాదములెట్లున్నవో తులనాత్మకముగపరిశీ-లింతము.

3.3.1 వేమన శతకము :

ఆంధ్రశతకవాఙ్మయమున వేమన శతకమునకు అగ్రస్థానము గలదు. వేమన పద్యములలో కొన్ని సమాజ వక్రగతిని నిరూపించునవి,

ఇంకొన్ని నీతిని ప్రబోధించునవి, లోకస్వభావమును విశ్లేషించి చూపు-నవి మఱికొన్ని ఉన్నవని ఇంతకుపూర్వపు ప్రకరణమునందు పేర్కొనినాము. అటువంటి వేమన వద్యములను ఆచార్యులవారు సంస్కృతమున ఎంతో చక్కగా అనువదించినారు. ఇచట కొన్ని పద్యములను పరిశీలింతము-

అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కు జల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?
విశ్వదాభిరామ వినుర వేమ!

తెలుగునాట, ప్రతిచిన్నవానినోట వినపడే పద్యరత్నమిది. దీనిని ఆచార్యులవారు, ఎంతో చక్కగా అనువదించినారు-చూడండి!

అల్పో వదతి సాటోపం ప్రశాన్తం సజ్జనః పునః|
కాంస్యవత్కిం స్వనేత్స్వర్ణం శ్రూయతాం వేమ విశ్వద॥

మూలమునందు రూపమును ప్రత్యేకముగా పేర్కొనక "ఒక్క పోలికమందు" అని కలదు. రుచిమాత్రము భిన్నభిన్నమని చెప్పబడినది. కాని అనువాదమున స్పష్టముగ "రూపం తుల్యం" అని పేర్కొని రసభేదము చెప్పబడినది మూలమున "పురుషులందు పుణ్య పురుషులు వేఱయా" అని పురుషశబ్దము రెండుసార్లురాగా అనువాదమున పురుషశబ్ద పునరుక్తి లేకుండా "పుణ్య-పాపనరేషు" అని విశదీకరించుట ఎంతో గొప్పగానున్నది. మూలముకంటెను అనువాదమున స్పష్టమగు ప్రతీతి ఏర్పడుచున్నది. ఇదే పద్యమునకు, ఇంకెవరోచేసిన సంస్కృతానువాదమునకు ఆచార్యులవారి అనువాదమునకు పోలికలేదు.[2]

---

1. వే శ. 9
2. కర్పూరే లవణేచైవ రూపమేకం రుచిః పృథక్,
   తథైవ పుణ్యపురుషః పరస్మాత్ భిద్యతే ధియా॥
   వే ప.సం. 3—15.

గుణహీనుడు ఎంత చదువు చదివినప్పటికి ప్రయోజనము శూన్యము బొగ్గును ఎన్నిపాలతో కడిగినప్పటికీ దాని నల్లదనము పోనేపోదు. ఈ సత్యమును వేమన ఎంతో చక్కగా బోధించినాడు-

ఎంత చదువుచదివి యెన్నియో విన్నను
హీనుడవగుణంబు మానలేడు
బొగ్గుపాల కడుగ బోపునా నైల్యంబు
విశ్వదాభిరామ వినుర వేమ![1]

ఈ పద్యమును ఆచార్యులవారిలా అనువదించినారు-

అధీత శ్రుతవిద్యోపి న నీచో దోషముజ్ఝతి,
క్షీరాన్నైర్మల్యమివాంగారః కుత్రయుతాం వేమవిశ్వద॥

మూలమునందు "బొగ్గుపాలఁగడుగ బోపునా నైల్యంబు" అను పాదమును "క్షీరాన్నైర్మల్యమివాంగారః" అని ఆచార్యులవారు అనువదించినారు. ఇందు పూర్వార్థమునందు ప్రతిపాదించిన నీచునకు, అంగారమును "ఇవ"అను ఉపమావాచకమును వేసి ఉపమానముగా చెప్పుట శోభావహముగా నున్నది.

ఐకమత్యముతో లోకమున సాధించలేనిదేదియులేదు. ఐకమత్యముగలవారు సకలసౌభాగ్యములనందగలుగుదురు. ఒక్క గడ్డిపరక ఏనుగును బంధించలేదుకానీ గడ్డిపరకలతో పేనిన త్రాడు ఏనుగును బంధించగలదను వేమన నీతిపద్యమును చూడుడు-

ఐకమత్యమొక్కటావశ్యకంబెప్డు
దానిఁబలిమి నెంతయైన గూడు

---

1. వే.శ 19

గడ్డివెంటిబెట్టి కట్టరా ఏనుగు
విశ్వదాభిరామ వినురవేమ![1]

ఐకమత్యముపేయంతః తజ్జాఃస్యుః సర్వసంపదః|
గజబన్ధీ గుణస్సార్థః శ్రూయతాం వేమ విశ్వద||

మూలమునందు "దానిబలిమినెంతయైనగూడు" అని ఉండగా అనువాదమున "తజ్జాఃస్యుః సర్వసంపదః" అని "ఐకమత్యప్రభవములే సర్వసంపదలను"అనువాదము ఎంతో రమ్యముగానున్నది. అట్లే"గడ్డివెంటిబెట్టి కట్టదా యేనుగు" అనుదానిని"సార్థఃగుణఃగజబన్ధీ" అని అనువదించుటయు ఉచితముగానున్నది. ఇంతసంక్షిప్తముగ శ్లోకవృత్తమున అంతభావమునుఇమిడ్చి అనువాదము చేయవలెనన్న భాషపై ఎంతటి అధికారము కావలెనో, వ్యాకరణశాస్త్రమునందెంత పరిచయము ముండవలెనో ఊహించవచ్చును.

విలువగలవస్తువు పరిమాణమున కొద్దియైనను చాలును. కాని విలువలేనివస్తువు ఎంతపెద్ద పరిమాణములోనున్నను నిష్ప్రయోజనమే. భక్తితో ఇచ్చినది కొద్దియైనను దానివిలువ దానిదే భక్తిలేక ఎంత ఎక్కువగా ఇచ్చినను దానికి విలువ ఏమియు నుండదని వేమన బోధించిన సత్యము–

గంగి గోవుపాలు గంటెడైనను చాలు
గడవడైననేమి ఖరముపాలు
భక్తిగలుగుకూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినుర వేమ![2]

1. వే.శ, 25.

2. వే.శ. 36

ఆచార్యులవారు ఈ పద్యమునెంతో చక్కగా అనువదించిరి-

దర్వీమాత్రం వరం గవ్యం కుంభమాత్రం న గార్దభమ్।
భక్త్యా దత్తం వరం చాల్పం ప్రూయతాం వేమ విశ్వద॥

మూలమున "చాలు" అనుదానిని అనువాదమున ఎంతో చక్కగా "వరం" అని, అనువాదమునకే అందముతెచ్చినారు. అట్లే "దర్వీమాత్రం" "గవ్యం" "కుంభమాత్రం" "గార్దభమ్" అను ప్రయోగములను చేయుటలో ఆచార్యులవారి వ్యాకరణశాస్త్రజ్ఞత్వము ప్రస్ఫుటమగుచున్నది.

లోకమున ఇతరుల తప్పులుపట్టువారు తండోపతండముగా ఉందురు. ప్రతివారిలోను కొన్నితప్పులు ఉండక తప్పదు కాని ఇతరుల తప్పులను వెదకువారు తమలోని తప్పులను తెలిసికొనలేరు. సామాన్యముగా లోకస్వభావము పైన వేమన వేసిన చురక ఈపద్యము-చూడుడు

తప్పులెన్నువారు తండోపతండము
ఉర్విజనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమతప్పెఱుగరు
విశ్వదాభిరామ వినుర వేమ![1]

దీనిని అనువదిస్తూ ఆచార్యులవారు ఎంతో చాకచక్యాన్ని ప్రదర్శించారు. ఇంతటి భావమును చిన్నదైన ఈ శ్లోకంలో ఇముడ్చుట ఎంతకష్టమో చెప్పవలసిన పనిలేదు. కాని అనువాదకులు ఎంతో జాగ్రత్తగా అనువదించినారు చూడండి.

పారోభాగ్యక్ఛృతః సర్వ స్స్వయం దోషస్య భాజనమ్।
దోషం వక్తా న వేత్తి స్వం ప్రూయతాం వేమవిశ్వద॥

ఈ అనువాదమున ఆచార్యులవారు "సర్వే" అను పదమును ప్రయోగించి మూలములోని "తండోపతండంబు" అనే బాహుళ్యార్థక

---

1. వే.శ. 69

ప్రయోగమును భూమిలోని వారికందఱికి అనే "ఉర్విజనులకెల్ల" అనే ప్రయోగమును అందులో ఇమిడ్చినారు.ఇది ఎంతో అనుభవము,పాండి-త్యము కలవారు చేయగలిగినపని. మఱల "తప్పులెన్నువారు తమ తప్పునెఱుగరు" అను మూడవ పాదమును ఎనిమిది అక్షరములతో "దోషం వక్తా న వేత్తి స్వం"అని అనువదించి మూలమునందు పునరా వృత్తమైన "తమతప్పును" అనే అయిదు అక్షరముల పదమును"స్వం" అని ఒకే ఒక అక్షరమున అనువదించి గంభీరమైన సంస్కృతశ్లోకమును అందించినారు. ఈ తెలుగుపద్యమును అర్థముచెడకుండా ఇంతకంటెను గంభీరముగా అనువదించుట చాలకష్టతరమైన విషయము. మొదటి పాదమున "పౌరోభాగ్యభృతః" అని చేసిన ప్రయోగము వారి వ్యాకరణ శాస్త్ర పరిజ్ఞానమును సూచించున్నది.[1]

హింసలేకుండా అహింసను పాటించుట ధర్మము. తిండికొఱకు జంతువులను చంపుట పాపము.ఆహారముకొఱకు తన పిల్లలను ఎవరైనను చంపగలరా? అని వేమన హింసించే వారిని హుంకరిస్తూ ప్రశ్ని-స్తున్నాడు-

హింస దక్కియుంట యెంతయు ధర్మంబు
పసుల తినగ గోర పాపమౌను
దినగగోరున చవి దనదు సంతానంబు
విశ్వదాభిరామ వినుర వేమ![2]

1. పురోభాగినః భావః పౌరోభాగ్యమ్, తత్ బిభర్తీతి పౌరోభాగ్య భృత్, తే-"పౌరోభాగ్యభృతః" అనగా "తప్పులెన్నువారు" అని భావము-"దోషైక దృక్పురో భాగీ".
అ.కో. 3-46

2. వే.శ. 101

వేమన పద్యబంధములలో ఎగిరే బంతులవలె భావములు వచ్చి వచ్చి పడుతుంటాయి. ఇన్ని భావములతో మిలమిల మెరిసే పద్య రత్నములను శ్రీఆచార్యులవారు తమసహజధోరణిలో ఎట్లు అనువదించినారో గమనించండి—

అహింసా పరమోధర్మః నాత్తుం వధ్యా హి జన్తవః।
కిం జిఘాంసత్యపత్యం స్వం? శ్రూయతాం వేమవిశ్వద॥

ప్రసిద్ధమైన శ్లోకపాదమును ప్రథమపాదముగా ఆచార్యులవారు తమ అనువాదమున తీసికొనినారు. రెండవపాదమున మూలమునందు "పసుల దినగ గోర పాపమౌను" అని వేమన చాలా సున్నితముగా సమాజమును హెచ్చరించగా - అనువాదమున, "నాత్తుం వధ్యా హి జన్తవః" అని స్పష్టంగా ఆహారం కొఱకు ప్రాణిహింస చేయరాదని అనువాదకులు శాసిస్తున్నారు. మూడవపాదంలోగల "జిఘాంసతి" అను ప్రయోగము వ్యాకరణశాస్త్ర నిష్ణాతులు మాత్రమే చేయునది.[1]

ఇటు వేమనశతకానువాదమున ఆచార్యులవారు ఆటవెలదిని అనుష్టుప్‌లో బంధించుటకు చేసిన ప్రయత్నము సఫలమైనది. ఇంతకు ముందే చెప్పినట్లు పరిణతమైన వేమన భావములను సుమారు నలుబది ఎనిమిది అక్షరములుగల ఆటవెలది పద్యములనుండి ముప్పదిరెండు అక్షరములుగల అనుష్టుప్ ఛందస్సులోనికి అర్థగాంభీర్యము చెడకుండా, వ్యాకరణశాస్త్రమునందు గాఢమైన పరిశ్రమ చేసిన వరదాచార్యులవారివంటి ఉద్దండ పండితులు అనువాదము చేయగలరు కాని

---

1. హన్తుమిచ్ఛతి జిఘాంసతి. హన—హింసాగత్యోః అను ధాతువునకు సన్ ప్రత్యయము చేరగా "అజ్ఝనగమాం సని" (6-4-16) అను సూత్రముచే దీర్ఘము రాగా ఈ రూపమేర్పడినది.

సామాన్యులు చేయుచేరు. అందువలననే కొన్ని సంస్కృతానువాదములు ఈ శతకమునకు వచ్చినప్పటికిని ఆచార్యులవారి అనువాదమువలె ప్రసిద్ధికి రాలేకపోయినవి. ఇంత చక్కని అనువాదమును సంస్కృత-లోకమునకు అందించినప్పటికి ఆచార్యులవారు ఇందలి తప్పులన్నియు నావి, ఒప్పులు మాత్రము వేమన మహాకవివని తమ వినయమును ఎంత చక్కగా ఆవిష్కరించుచున్నారో గమనించండి—

ఆంధ్రీనిబద్ధకృతితః కవి వేమనస్య
పద్యాని కానిచన లోకహితోదయుంకి।
గీర్వాణవాచి పరివృత్తిమవాపితాని
దోషా యదీహ పరివర్తయితుర్న కర్తుః॥[1]

3.3.2 సుమతి శతకము :

ఇంతకు పూర్వము ప్రకరణములో చెప్పినట్లు (3.2.4.2) సుమతి శతకము సమాజములోని అన్ని వర్గములలోని కౌటిల్యమును నిరూ-పించుచు నీతుల నుపదేశించుచు, సులభముగా నుండుటవలన చిన్న వయసుగల పిల్లలకు పాఠ్యమై ప్రసిద్ధినందినది. ఆచార్యులవారు ఈ శతకమును ఎంతో చక్కగా అనువదించిరి కొన్ని ఉదాహరణములతో వారి అనువాదములోని విశిష్టతను ఇచ్చట నిరూపింతుము.

సుమతిశతకమునకుకర్త భద్రభూపాలుడని అతడే బద్దెన అని కొందఱ మతము. కాని ఆచార్యులవారు ఆ వాదముతో ఏకీభవించినట్లు కనబడదు. సుమతిశతకము ఎవరు రచించిరో స్పష్టముగా తెలియదనే వారి అభిప్రాయమై యుండునని పించుచున్నది. అందువలననే వారు శతక ప్రారంభమున ఇట్లు చెప్పిరి—

---

1. వే.శ. 103

అవిదితాహ్వయకేన మనీషిణా
కృతిరియం కృతినాంధ్రగిరింతా।
తదనువాదమిమం శతకాత్మకం
సహృదయాః శృణుతాదరచోదితమ్॥

"కృతినా" "మనీషిణా" అను విశేషములద్వారా మూలకర్త పైన ఆచార్యులవారికెంత గౌరము కలదో మనకు స్పష్టమగుచున్నది. అట్లే అనువాద విషయమున వారికెంత ఆత్మప్రత్యయము కలదో "ఆదరచోదితమ్" అను విశేషణముద్వారా మనము తెలిసికొనవచ్చును.

సుమతిశతకమునగల పద్యములన్నియు ఆంధ్రదేశమున చిన్నతనముమండియు ప్రతివాని నోట నానుచున్నవై నప్పటికి, అందులో కొన్ని అనేక సందర్భములలో ప్రతివారు పేర్కొనునంతటి ప్రసిద్ధిని గడించినవి. వాటిని శ్రీఆచార్యులవారెట్లు సంస్కృతమున అనువదించిరో పరిశీలింతము—

అక్కరకురాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున దా
నెక్కిన పారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ।[2]

ఈపద్యమునకు శ్రీఆచార్యులవారి అనువాదమును గమనింతము.

ఆపద్యపోహ్యకృద్బంధుః వరాదాయీ సురోఽర్చితః॥
యుద్ధారూఢోఽచలన్నశ్వః త్యక్తవ్యాః సుమతేః ద్రుతమ్।

1. సు. శ. పు. 1

2. సు.శ. 2

తనకవసరమేర్పడినపుడుపయోగించని బంధువు అని తెలుగు పద్యములో "అక్కరకు రాని చుట్టము" అని ఉండగా సంస్కృతమున శ్రీఆచార్యులవారు సందర్భమును ఇంకొంచెము స్పష్టపరుచుటకు ఊరకే అవసరముకాదు, ఆపదలోకూడా సాహాయ్యమొసగనివాడని మెరుగులు దిద్దుచు అనువదించిరి. మూలమునందు "విడువంగవలయు" అని ఉండగా అనువాదమున "త్యక్తవ్యాః" అని తవ్యప్రత్యయాంతరూపమును ప్రయోగించి అవశ్యం త్యజించి తీరవలయునని సూచించినారు. ఇంత చిన్న ఛందస్సులో ఇంతటి గంభీరార్థమును కుదించి అనువదించుట చాలా కష్టతరమైన విషయము. మూలార్థము చెడిపోకుండా ఇంతను విశిష్టమైన రీతిలో అనువాదమును వెలయించి ఆచార్యులవారు అభినందనీయులైనారు. ఇట్లే ఇంకొక పద్యమును చూడుడు—

అధరము గదలియు గదలక
మధురములగు భాషలుడిగి మౌనవ్రతుడౌ
అధికారరోగ పూరిత
బధిరాంధక శవముజూడ పాపము సుమతీ![1]

తల దగ్గఱకు వచ్చిన వారిని చక్కగా పలుకరించక, అక్కరలేని గాంభీర్యమును ప్రదర్శించు అధికార వ్యామోహముగల వ్యక్తులను దుయ్యబట్టిన ఘట్టమిది. దీనికి ఆచార్యులవారి అనువాదమును గమనించుడు—

విరలస్ఫురితోష్ఠో యో మధురాలాపవర్జితః।
అధికారగదగ్రస్తః స మూకః సుమతే! శవః॥

"అధరము గదలియు గదలక" అను పాదమున అర్థము చెడి-

1. సు.శ. 5

పోతుండగా ఏడక్షరములలో "విరలమ్మురితోష్ఠ" అనువాదము చేయవలెనన్న ఎంత అనుభవము, భాషపై ఎంతటి అధికారముండవలెనో గమనించవలయును. అనువాదమున అట్లే "అధికారరోగపూరిత బధిరాంధక శవము" అను సమస్తపదమును విడగొట్టి "అధికారగదగ్రస్తః మూకః శవః" అని అనుట ఎంతయు సముచితముగనున్నది. అధికారమను రోగముతో నిండినవాడు అనుటకంటె అధికారమను వ్యాధికి చిక్కినవాడు అనడము ఎంతో బాగున్నది. ఆ వ్యక్తిలోగల అధికార వ్యామోహమను దౌర్బల్యము మనకు అనువాదమున తెలియుచున్నది. శవము అనుటవలన బధిరత్వము, అంధత్వము గతార్థమగుటచేత అనువాదమున బధిరత్వమును చెప్పుట అంతగా అవసరములేదని ఆచార్యులవారి అభిప్రాయమోనని అనిపించుచున్నది. అంతేగాక సర్వసాధారణముగా మూగవారికి చెవుడు తప్పక యుండును. చెవుడులేనిచో మూగతనము పెరుగుటకు అవకాశము తక్కువ. కనుక "మూకః" అని చెప్పుటవలన ఉపలక్షణముగా బధిరత్వము కూడా సిద్ధించునని వారి అభిప్రాయమైయుండవచ్చును. మరియు ఇంతచిన్నఛందస్సులో "సుమతీ"అను సంబోధనము తీసివేసినచో మిగులు అక్షరములు ఇరువదితొమ్మిది మాత్రమే. ఆ అక్షరములలో ఇంతటి భావమును నిక్షిప్తమొనర్చుట అశక్యమైనని. దానిని ఆచార్యులవారు సుశకము చేసినారు.

ఉపకారికి నుపకారము
విపరీతము గాదుసేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ![1]

---

1. సు. శ. 16

ఈ తెలుగు పద్యము ఎంతో ప్రసిద్ధిప్రాచుర్యములు గలది. దీని అనువాదమున ఆదార్యులవారి నేర్పును గమనింతుడు-

ఉపకర్తారముద్దిశ్య నోపకారేఽస్త్యపూర్వతా।
ఉపకర్తాపకర్తుస్తు సుమతే! సుజనో మతః॥

మూలమున ఉపకారము చేసినవానికి ప్రత్యుపకారముచేయుట వివరీతమేమియుకాదు, అని ఉండగా, అనువాదమున అంతకంటెను గంభీరముగనుండునట్లు "నాస్తి అపూర్వతా" అనినారు. మూలము-లోని "విపరింపంగా" అనుపదము ఎంత అవసరమనిపించుటలేదు. కనుక అనువాదమునందు దానిని వదిలివేసినారు. "అపకర్తుః ఉప-కర్తా తు" అని పందొమ్మిది అక్షరముల భావమును తొమ్మిది అక్షర-ములలో చక్కగా అనువదించినారు. అన్నిటికంటెను ఇచ్చట గమ-నించదగిన అంశమిది-మూలమున సందర్భమునకు అంతగా అతకని "నేర్పరి" అనుపదము కలదు. అది ప్రకృతమునకు సరిపడుటలేదని అనువాదమున "సుజనః" అను పదమును వేయుట ఎంతగానో ఔచిత్య-మును పరిపోషించినది. యథార్థస్థితికూడా సౌజన్యమున్నవాడే అప-కారినిసైతము మన్నించి అతనికి ఉపకారము చేయుగలడు. అక్కడ నేర్పుతో పనిలేదు. అపకారము చేసిన వానిని మత్యపెట్టుటకు, చీకాకు పెట్టుటకు నేర్పు కావలెను. అతని తప్పును క్షమించుటకు కావలసినది సుజనత్వము.

కమలములు నీట బాసిన
గమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్।
దమ తమ నెలవులు దప్పిన
దమమిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ![1]

---

1. సు.శ. 28

ఆచార్యులవారి అనువాదము చూడుడు-

జలజం సలిలాద్భ్రష్టం మ్లానం స్యాన్మిత్రరశ్మిభిః।
స్థానచ్యుతస్య మిత్రాణి భవన్తి సుమతేఽరయః॥

నీటబుట్టిన కమలమే నీటిని వదిలివేసినచో తనకు అప్తుడైన సూర్యుని కిరణముల వేడిమికి కమిలిపోవును. ఈ భావమును సంస్కృతీకరించుటలో ఆచార్యులవారు ఎంతో శ్రద్ధను కనబరచిరి. కమలమును జలజమనుటలో ఎంతో సహజత్వము కనబడుచున్నది. అట్లే "భ్రష్టం" అనుపదము పుష్కలమగు అర్థమును అందించుచున్నది. "మిత్రరశ్మిభిః" అని ప్రయోగించుటలో మిత్రపదమునకు గల సూర్యుడు-మిత్రుడు అను రెండు అర్థములను అనువాదకుల దృష్టియందున్నవనిపించుచున్నది. అట్లే మూలమున "తమతమనెలవులు" అని "తమ మిత్రులు" అని మూడుపార్లు "తమ" అను పదము ప్రయోగింపబడగా సంక్షిప్తముగా అదే భావము ముక్కసూటిగా బోధపడునట్లు "స్థానచ్యుతస్య" అని ఏకవచనమున అనువదించుట ఆచార్యులవారి ప్రతిభకు నిదర్శనము.

కరణము గరణము నమ్మిన
మరణాంతకమౌనుగాని మనలేడు సుమీ
కరణము దనసరి కరణము
మఱినమ్మక మర్మమీక మనవలె సుమతీ![1]

సంస్కృతానువాదము తిలకించుడు-

కరణో మరణం గచ్ఛేద్విశ్వసన్ కరణాంతరమ్।
జిజీవిషుః సజాతీయం ప్రతీయాత్సుమతేః న సః॥

మూలమున పూర్వార్థమువరకు బాగున్నది కానీ ఉత్తరార్థమును

---

1. సు.శ. 29.

పరిశీలించినచో మూలం కరణమను పదము రెండుసార్లు వచ్చినది. అది అంత ఉచితముగా కన్పడుటలేదు. దానిని మార్చి తచ్ఛబ్దముతో చెప్పుటలో ఎంతో గంభీరమైన పొందిక కలుగుచున్నది. కనుకనే అనువాదమున శ్రీఆచార్యులవారు- "సః జిజీవిషుః (చేత్) వశాతీయం న ప్రతీయాత్"అని ఎంతో చక్కగా చెప్పిరి. "జిజీవిషుః"[1] అను ప్రయోగము చేయుటలో ఆచార్యులవారి వ్యాకరణ శాస్త్రాభిమానము చెప్పక చెప్పినట్లైనది.

చింతింపకు గడచిన పని
కింతలు వలతురని నమ్మకెంతయుమదిలో
నంతఃపురకాంతలతో
మంతనములు మానుమిదియె మతముర సుమతీ![2]

దీని అనువాదము పరికింపుడు-

మానుశోచీరతీతం త్వం మా శ్రద్ధాః కామినీరతిమ్।
మావరోధ జనైర్గుప్తః భాషణం సుమతే కృథాః॥

ఈ పద్యమున గడచిపోయిన దానిని గూర్చి విచారించవద్దని. కామినులు ప్రదర్శించు ప్రీతిని నమ్మవద్దని, అంతఃపురస్త్రీలతో రహస్యముగ సంభాషించవద్దని మూడు ఉపదేశములను చేయుచున్నాడు కవి. ఆ ఉపదేశములను పరిపుష్టమైనభాషలో స్ఫూర్తినిచ్చు చక్కని క్రియలతో ఆచార్యులవారు అనువదించినారు. ఇచ్చట "అనుశోచీః" "శ్రద్ధాః" అను క్రియలు అవైయాకరణులకు అందుబాటులో నుండవు.

---

1. జీవితుమిచ్ఛుః జిజీవిషుః "సనాశంసభిక్ష ఉః" (3-2-168) అను సూత్రముచే సన్నంతధాతువునకు "ఉ" ప్రత్యయము రాగా ఈ రూపము సిద్ధించుచున్నది.

2. సు.శ. 44

చేతులకు తొడవు దానము
భూతలనాథులకు దొడవు బొంకమి ధరలో
నీతియె తొడవెవ్వారికి
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ!।

ఈ పద్యమును అనువదించుటలో శ్రీఆచార్యులవారు కనబరచిన నేర్పు ఎంతో ప్రశంసనీయమైనది. అనువాదమును వీక్షించుడు-

హస్తయోర్భూషణం దానం భూభృతాం సత్యభాషణమ్।
పాతివ్రత్యం తథా స్త్రీణాం సర్వేషాం సుమతే! నయః॥

ఈ సంస్కృత శ్లోకము అనువాదమన్నచో ఎవ్వరును నమ్మరు. సంస్కృతభాషలో గల నీతి శ్లోకముల వరుసలో భావపుష్టి, భాషాపుష్టి-గల ఈ పద్యము స్వతంత్రముగనే ప్రకాశించుచున్నది.

మూలమున భూషణము అను అర్థము నిచ్చు"తొడవు"అను పదము నాలుగుపాదములందును నాలుగుసార్లు ప్రయోగింపబడినది. కాని సంస్కృతభాషలో గల గొప్పదనముచేత "భూషణం" అను పదమును ఒకేసారి ప్రయోగించి, దానిని నాలుగు పాదములతో సంబంధమును కల్పించుట నిజముగా అనువాదకుల అనుభవమును నిరూపించు-చున్నది. అట్లే మూలమునందు "భూతలనాథులకు దొడవు బొంకమి" అని చేసిన ప్రయోగము తృప్తికరముగా లేదని "భూభృతాం సత్య-భాషణం"అని అనువాదము చేసినారు.అబద్ధములాడకుండట అని చెప్పుట కంటె "సత్యమును భాషించుట" అని చెప్పుటలో ప్రత్యేకత కలదు. "నీతియె తొడ వెవ్వారికి"అని చెప్పిన తరువాత విడిగా"నాతికి మానంబు తొడవు" అని చెప్పుట అంతగా సమంజసముగా లేదని అనువాదకులు క్రమమును మార్చిరి.

---

1. సు.శ. 47

అట్లే ఈ పద్యమును అవలోకించుడు-

తలనుండు విషము ఫణికిని
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
దలదోక యనక నుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ![1]

దీని సంస్కృతానువాదమిది-

విషం స్యాత్ఫణినో మూర్ధ్ని పుచ్ఛాగ్రే వృశ్చికస్య చ।
ఆచూడపాదం సర్వత్ర ఖలస్య సుమతే! విషమ్॥

మూలమున ఒకటి, నాలుగు పాదములలో విషము అనే పదము ప్రయోగింపబడినది. అనువాదమున గూడా అట్లే విషపదప్రయోగము రెండుసార్లు కలదు. అట్లే "తలతోక యనకనుండును" అనే వాక్యమును ఎంతో అందముగా సంగ్రహముగా "ఆచూడపాదం" అని అనుట వారి వ్యాకరణ శాస్త్రవ్యుత్పత్తిని తెలియజేయుచున్నది. "ఆపాదచూడం" అను ప్రసిద్ధప్రయోగమును "ఆచూడపాదం" అని మూలమునను-సరించి అనువాదకులు మార్చినారు.

నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలి వానినటువెలయాలిన్
నమ్మకు మంగలి వానిని
నమ్మకుమీ వామహస్తు నవనిని సుమతీ![2]

ఈ పద్యమున నాలుగుపాదములందును "నమ్మకు" అను పదము వచ్చినది. ఇది ఇన్నిపార్లు అనువాదమున రాకుండా ఎంతో జాగ్రత్తగా ఆచార్యులవారి అనువాదము సాగినది-

1. సు.శ. 54
2. అందులోనే. 62

కరగ్రాహో ద్యూతకరః స్వర్ణకారః పణాంగనా।
వామహస్తః పణాజీవః శ్రద్ధేయాః సుమతే న హి॥

కరమనగా పన్ను. కరగ్రాహుడనగా పన్నువసూలు చేయువాడు. వెలయాలు అనుపదమునకు "పణాంగనా"[1] అనునది యథాతథమైన అనువాదము "పణాజీవః"[2] అనుపదమును అనువాదములో ప్రయోగించిన ఆచార్యులవారికి వ్యాకరణశాస్త్రము హస్తామలకమని వేఱే చెప్పనక్కఱలేదు.

సిరిదా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళసలిలము భంగిన్
సిరిదా బోయిన బోవును
కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ![3]

లక్ష్మీదేవి రాకపోకలను చక్కని ఉదాహరణలతో వివరించిన అనర్ఘమైన పద్యమిది. దీని అనువాదమును పరికించుడు-

అయాత్యేవ స్వయం సంపన్నారికేళజలం యథా।
అపైతి కరిణా జగ్ధం కపిత్థం సుమతే యథా॥

నీళ్ళు కొబ్బరికాయలో చేరినట్లు సిరిసంపదలు మనకు లభిస్తుంటాయి. అట్లాగే ఏనుగు మ్రింగిన వెలగపండు పైకి బాగుగా కనబడినప్పటికి లోపల ఏమీ ఉండనట్లు సిరిసంపదలు ఎవ్వరికి తెలియకుండా సమయంలో వెళ్ళిపోతుంటాయి.

---

1. పణాంగనా పణేన నిష్క్రీతా లభ్యా అంగనా పణాంగనా.
2. పణాజీవః-పణ్యతే వ్యవహ్రియతే ఇతి పణః. పణ-వ్యవహారే స్తుతౌచ, పణేన ఆజీవతి ఇతి పణాజీవః. జీవ-ప్రాణధారణే.
3. సు.శ. 106

ఇచ్చట మూలమునకు యథాతథమైన అనువాదమును ఆచార్యుల వారొసగిరి. "జగ్ధం!"[1] అను ప్రయోగము ఆచార్యులవారి వ్యాకరణజ్ఞతను తెలియజేయుచున్నది.

### 3.3.3. దాశరథిశతకము :

శ్రీరామభక్తి శతకములలో దాశరథిశతకము అగ్రగణ్యము. మహాభక్తుడగు కంచర్లగోపన్న, తన సర్వస్వమును శ్రీరాముని కైంకర్యమునకర్పించి, ప్రభుత్వపు ఖజానాలోని ధనమునంతను భద్రాచల శ్రీరాముని ఆలయగోపుర ప్రాకారాదుల నిర్మాణమునకు ఖర్చుచేసి, మొదట తానీషా ఆగ్రహమునకు, పిదప శ్రీరాముని అనుగ్రహమునకు పాత్రుడై "రామదాసు"గా ప్రసిద్ధినందెను. ఆ మహానుభావుని రచన ఈ దాశరథిశతకము.

భద్రాచలరామాలయ పునరుద్ధరణ సంఘమునకు ఉపాధ్యక్షులుగ నియుక్తులైన శ్రీవరదాచార్యులవారు అచట కొన్నాళ్ళు సకుటుంబముగా నుండి దేవాలయ పునరుద్ధరణము చేయించిరి. అంతకు ముందే (1955) వారు దాశరథిశతకమును సంస్కృతీకరించిరి. వారి అనువాదము మూలమునకు మెరుగులు దిద్దినట్లుండును.

రామదాసు "దాశరథీ! కరుణాపయోనిధీ!" అని నాల్గవపాదమున కొద్దిభాగమును మకుటముగా దీసికొని శతకమును పూర్తిచేసెను. కాని శ్రీఆచార్యులవారు నాల్గవ పాదము పూర్తిగా మకుటముగా దీసికొని "శ్రీమన్! దాశరథే! దయాజలనిధే! భద్రాద్రి భాగ్యావధే!" అని తమ అనువాదమును సాగించినారు. దాశరథిని "శ్రీమన్" భద్రాద్రి భాగ్యావధే" అని సంబోధించుట, "థే,ధే,ధే,"అని పదాంతమున "థే"తో పాటు "ధే" అను అక్షరమునావృత్తిచేయుట ఈ మకుటమునకు ఎంతో వన్నె

---

1. జగ్ధం-జక్ష్యతే స్మ, అన్నం జగ్ధంచ "అదోజగ్ధి"(3-2-68) ఇతి జ్ఞాపకాజ్జగ్ధిః.

దెబ్బతది. అనువాదములోని చాలా పద్యములు మూలమునకంటె సుందరముగా వచ్చినవని ఇట నోదాహరణముగా వారి అనువాదములోని కొన్ని విశేషములను నిరూపింతును.

భద్రాచలక్షేత్ర సమీపమునకు చేరిన వెంటనే కనపడు గోదావరి నది, శ్రీవారి ఆలయము, లోపలకు వెళ్ళగనే కనపడు సీతాదేవి, స్వామి వారి ఆయుధములు సీతారామస్వామి, లక్ష్మణుడు-ఇట్లు ఈవాతా-వరణమును మన కనులకు కట్టినట్లు వర్ణించిన మూలములోని ఈ పద్య-మును తిలకించుడు-

కంటి నదీతటంబు బొడగంటిని భద్రనగాధివాసమున్
గంటి నిలాతనూజ సురకార్ముకమార్గణ శంఖచక్రముల్
గంటిని మిమ్ము లక్ష్మణుని గంటి కృతార్థుడనైతి నో జగ
త్కంటక దైత్యనిర్దళన దాశరథీ కరుణాపయోనిధీ!

ఈ పద్యమునకు ఆచార్యులవారొనర్చిన సంస్కృతానువాదము కడుంగడు ప్రశంసనీయముగా నున్నది. చూడుడు-

అద్రాక్షం తటినీతటం వసతిరప్యాలోకి భద్రాచలే
పృథ్వీజా దదృశే త్వదాయుధచయో వీక్షాంబభూవే మయా।
సౌమిత్రిశ్చ విలోకితః త్వమపి చేత్యేవం కృతార్థోఽభవం
శ్రీమద్దాశరథే! దయాజలనిధే భద్రాద్రిభాగ్యావధే॥

మూలమునందు "కంటిని" అను ఒకే క్రియ ఐదుసార్లు ప్రయోగించబడగా అనువాదమున "అద్రాక్షం" "ఆలోకి" "దదృశే" "వీక్షాంబభూవే" "విలోకితః" అని నాలుగుక్రియాపదములు ఒక క్రొత్తప్రయోగ-ముగ చేయబడినవి, దృశిర్ ప్రేక్షణే, లోకృ-దర్శనే, ఈక్ష-దర్శనే అను మూడు ధాతువులకు సంబంధించిన విభిన్నక్రియలను అనేక రూపములలో వైవిధ్యముండునట్లు ప్రయోగించుట ఆచార్యులవారి వ్యాకరణశాస్త్ర పరిజ్ఞానమును చెప్పక చెప్పుచున్నది. ఒకసారి ప్రయో-

---

1. దా.శ. 21.

గించిన రూపమును ఇంకొకసారి ప్రయోగించకపోవుట అనువాదమున కెంతో అందమును సాధించిపెట్టినది.

ఆచార్యులవారు అస్పష్టముగానున్న మూలార్థమును అనువాదమున స్పష్టపరచిన సందర్భములును లేకపోలేదు-చూడుడు-

భ్రమరము కీటకంబుగొని పొల్పడి ఝుంకరపోపకారియై
భ్రమరముగానొనర్చునని పల్కుటజేసి భవాది దుఃఖసం
తమసమెడల్చి భక్తిసహితంబుగ జీవుని విశ్వరూపత
త్త్వమున ధరించుటేమరుదు దాశరథీ! కరుణాపయోనిధీ!'

సంస్కృతానువాదము-

అహుర్లోకవిదో ద్విరేఫ వశగం కీటం ద్విరేఫాత్మతాం
కిం వాచ్యం భవదుఃఖసంతతితమో నిష్కాసనాహస్కరః।
స్వాశ్రిన్నం వితనోషి మామితి విభో సంక్రామయన్స్వాన్గుణాన్
శ్రీమన్! దాశరథే! దయాజలనిధే! భద్రాద్రి భాగ్యాపధే।

భ్రమరము ఒకకీటకమును దెచ్చి తన గూటిలో పెట్టుకొని ఝుంకారమును జేయుచు కొన్నాళ్ళకు ఆ కీటకమును గూడ భ్రమరముగా నొనర్చునని భ్రమరకీటక న్యాయము చెప్పుచున్నది. అటువంటప్పుడు భవాబ్ధిని మునిగిపోవుచున్న జీవులనుద్ధరించి నీగుణములను సంక్రమింపజేసి సరూపులుగ చేయుచున్నావనుటలో ఆశ్చర్యమేమున్నది.

ఇచ్చట మూలమునందు "భవాది దుఃఖసంతమసమెడల్చి" అని యుండగా "భవదుఃఖసంతతితమో నిష్కాసనాహస్కరః" అని అనువదించి వన్నెగూర్చిరి. అట్లే "భక్తిసహితంబుగ జీవుని విశ్వరూపతత్త్వమును ధరించుట" అను మూలములోని అస్పష్టమైన కల్పనము

1. దా.శ. 99

"సంక్రామయన్ స్వాన్గుణాన్ స్వాభిన్నం వితనోషి" అనినారు. భ్రమర కీటన్యాయమును వైజ్ఞానికులు అంగీకరించరు. అందువల్లనే ఆ అన్వ-రసము మనస్సునందుంచుకొని "అహం" అనిరి.

ఇట్లే ఇంకొక పద్యమును అనువదించుటలోను శ్రీఆచార్యులవారు మూలమునకంటె ఎంతో గంభీరమగు అర్థమును అతిసంగ్రహముగ స్పష్టముగ అందించినారు. చూడుడు-

తరువులు పూచి కాయలగు దట్టుకుసుమంబులె పూజగా భవ
చ్చరణము సోకి దాసులకు సారములౌ ధనధాన్యరాములై
కరిభటఘోటకాంబర నికాయములై విరజానదీ సము
త్తరణమొసర్చు చిత్రమిది దాశరథీ కరుణాపయోనిధీ![1]

సంస్కృతానువాదము-

వృక్షాణాం కుసుమం శలాటుఫలతాం గచ్ఛత్క్రమాద్దృశ్యతే
త్వత్పాదాన్తికగం తదేవ పరిపక్వార్థత్వమాపాదితమ్।
అదౌ ధాన్యగవాది సంపదతులా నిశ్శ్రేయసం స్యాత్తతః
శ్రీమద్దాశరథే దయాజలనిధే భద్రాద్రి భాగ్యావధే

చెట్లకు పూసిన పూలు అట్లు చెట్లకే ఉండినచో కాయలగునని మూలములో నున్నది. అనువాదమునందు "శలాటు ఫలతాం" అని కాయలతో ఆగక పండ్లవరకు వాటి పరిణామము చెప్పబడినది. నీ పాద పూజకొఱకు ఆ పూవులనుపయోగించినచో ఐహికములగు ధనధాన్య-గవాది సంపదల ననుగ్రహించి, చివర ఆముష్మికఫలమగు నిఃశ్రేయ-సమునుదయచేయును. "విరజానదీ సముత్తరణమొసర్చు" అనుమాటను

1. దా. శ. 100

నిఃశ్రేయసముగా పరిణమించుటకును ఎంతో ఉచితముగా నున్నది. అట్లే "పూజగా తపశ్చరణముపోకి" అని మూలములోనుండగా "త్వత్పాదాన్తికగం తదేవ పరిపహ్యార్థత్వమాపాదితం" అని విశదపరచుటలో ఎంతో స్పష్టత కనపడుచున్నది. అనువాదములో "క్రమాత్ దృశ్యతే" అను మాటలుకూడ మూలార్థమును వివరించుటకు పోషకములు చక్కని అవగాహనను కలిగించుట కుపయోగించుచున్నవి. ఇచ్చట కలాపు స్థానీయములు ఐహికసంపదలు, ఫలస్థానీయము, నిఃశ్రేయసమని ఆచార్యులవారే వివరించిరి.

### 3.3.4 కృష్ణశతకము :

భక్తి శతకములలో కృష్ణశతకమునకుగలస్థానము అద్వితీయము. లోగడ చెప్పినట్లు (3.2.4.4) ఈ శతకము భారద్వాజసగోత్రుడు వెంగమాంబ తనయుడునగు నృసింహకవిచే రచించబడినది. ఇందు శ్రీకృష్ణావతార విశేషములు, కృష్ణభక్తుల చరిత్రలు, దశావతార వర్ణనలు, కృష్ణనామ సంకీర్తనఫలము, భక్తులస్వరూపము ఇట్లనేక విశేషములు కందపద్యమున వర్ణించబడినవి. ప్రతి పద్యమునందును నాల్గవ పాదమున కృష్ణ సంబోధనముండును.

ఆచార్యులవారు దీనిని అనువాదము చేసినప్పటికి ఇది స్వతంత్ర రచనవలె కన్పడును. ఉపజాతివృత్తమున వారి అనువాదము నడచినది. సంస్కృతశ్లోకములను చదువుచున్నప్పుడు మూలమును చదువుచున్న అనుభూతియే మనకు గలుగును. అనేకచోట్ల మూలమును మించి అనువాదము నడచినది, ఆచార్యులవారికి ఈ శతకముపై కడుప్రీతి అని విదితము. ఇచట కొన్ని తెలుగు పద్యములను వారి అనువాదములను ఒకచోట చేర్చి పరిశీలింతము.

పదునాలుగు భువనంబులు

అదరుగ నీకుక్షి నిల్పుకొను నేర్పరివె
విదితంబుగ నా దేవకి
యుదరములో నెట్టులొదిగి యుంటివి కృష్ణా![1]

యస్యోదరే సన్తి జగన్తి లీనా
న్యమూని చత్వారి దశావ్యనాది।
కథం ను దేవక్యుదరే స్థితస్త్వం
అణోరణీయానభవాసి కృష్ణ।

పదునాలుగు భువనములను పొట్టలో నిలుపుకొనినవాడవు కావున యుక్తప్రయోగముతో అనువాదమున చెప్పుటవలన ఎంతో వాక్చమత్కారము సిద్ధించినది. అట్లే అంతటివాడవైన నీవు ఆ దేవకి పొట్టలో ఎట్లు ఒదిగి ఒదిగి ఉన్నావయ్యా? అని అడుగుట మూలంలో అనువాదంలోకూడా ఉన్నది. అలా ఒదిగి ఉండే శక్తి భగవంతుడైన కృష్ణునకు ఎందువల్ల కలిగినదో అనువాదమున ఆచార్యులవారు వివరించినారు. ఇది మూలమున లేదు. "అథవా అణోరణీయాన్ అసి" అని అంటూ అనువాదకులు "అణోరణీయాన్మహతో మహీయాన్" అను ఉపనిషద్వాక్యమును[2] గుర్తుచేయుచు, ఆయన అణువుకంటె అణువు కావున అలా ఒదిగి ఉండగలిగినాడని చక్కని వివరణను అందించినారు. ద్వ్యణుకోదరి దేవకి, ఆమె ఉదరమున అణురూపుడై భగవానుడున్నాడు. ద్వ్యణుకమునందు పరమాణువుండుట న్యాయశాస్త్రసమ్మతమని ఆచార్యులవారు వివరించినారు.[3] ఇది ఆచార్యులవారి మూలాతిశాయియైన అనువాద ధోరణి.

---

1. కృ. శ. 11
2. క. ఉ. 2.20
3. సాహిత్యగోష్ఠి, STGV క్యాసెట్, 18-10-1978

ఆచార్యులవారి అనువాదము మూలమునకుకూడ అందచందముల అధికముగ తమకూర్పునదైయుండుననుటకు కృష్ణశతకములోని అను వాదపద్యములు చక్కని ఉదాహరణములు. ఈ పద్యమును గమ నించుడు–

అంసాలంబిత కుండల
కంసాంతక! నీవు ద్వారకాపురిలోనన్
సంసారి రీతినుండి ప్ర
శంసార్హద్వైతవహా! జగతిన్! కృష్ణా!

ఈ పద్యమునకు ఆచార్యులవారి అనువాదమొకతూరిపరికింపుడు–

త్వం ద్వారకాయాం నివసన్నగర్వాం
బిభ్రన్మనుష్యాన్తర సామ్యమేవ।
విజ్ఞిషేకైస్త్యై రవిజ్ఞిషేకైస్త్యైః
స్వస్వాధికారానుగుణం హి కృష్ణ।

భగవదవతారభూతుడగు శ్రీకృష్ణపరమాత్మ ద్వారకయందు సామాన్య మానవునివలె నుండి వారి వారి ఆత్మ సంస్కారమునను- సరించి కొందఱిచే భగవంతుని అవతారముగ తెలిసికొనబడినాడు, ఇతరులచే సామాన్య మానవుడు, గొల్లడని అవమానించబడినాడని అనువాద సారాంశము.

మూలమునందు “అంసాలంబితకుండల” అను విశేషము ఈ పరమార్థమును బోధించుటకు ఉపయోగపడదు. కాన అనువాద–

---

1. కృ. శ. 22

మున వదలివేయబడినది. అట్లే "కంసాంతక" అనువిశేషణ సారమును దీసికొని "అవజజ్ఞిషే"[1] అని అనువదించినారు. అలాగే "ప్రశంసార్హుడ వైతివి" అనుటకంటె "భగవదవతారుడవుగా తెలియబడితి" వనుట ఎంతైనను ఉచితమని "విజజ్ఞిషే" అని ప్రయోగించిరి. "విజజ్ఞిషే"[2] "అవజజ్ఞిషే"[3] అను ప్రయోగములద్వారా "అన్యైః అన్యైః" అనుటద్వారా ఆచార్యులవారికి వ్యాకరణసాహిత్య శాస్త్రములందుగల తలస్పర్శిపాండిత్యము స్పష్టమగుచున్నది. భగవంతుని తెలియుటకు, తెలియలేకపోవుటకు కారణము "స్వస్వాధికారానుగుణం" అని చెప్పుట ఎంతో సమంజసముగానున్నది.[4]

మూలములోని అనౌచిత్యములనుకూడా అనువాదమున పరిహ-రించుచు ఆచార్యులవారి అనువాదము కొన్నిచోట్ల నడచినది. ఉదాహరణకు ఈ క్రింది పద్యమును గమనించుడు-

దుర్జనులగు నృపసంఘము

---

1. అవజానన్తి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్।
   పరంభావమజానన్తః మమ భూత మహేశ్వరమ్॥
   భ.గీ. 9.11

2. విజజ్ఞిషే-వీత్యుపసర్గాత్ జ్ఞా అవబోధనే ఇతి ధాతోః కర్మణి లిటి మధ్యమపురుషైకవచనరూపమిదమ్. బాగుగా తెలిసికొనబడితి వని అర్థము.

3. అవజజ్ఞిషే-అవేత్యుపసర్గపూర్వకత్వమాత్ర విశేషః శిష్టం సమానమ్. అవ అను ఉపసర్గవలన అవమానింపబడితి వను అర్థము లభించినది.

4. సాహిత్యగోష్ఠి S.T.G.V. క్యాసెట్-18-10-78.

నిర్జింపగల దలచి నీవు నిఖిలాధారా!
దుర్జనులను వధియింపను
నర్జునురథ చోదకుండ వైతివి కృష్ణా!

"కృష్ణా! దుర్జనులగు నృపసంఘము నోడింపదలచి నిఖిలాధారుడవైన నీవు దుర్జనులను చంపుటకు అర్జునునికి రథచోదకుడవైతివని భావము. అందు "దుర్జనులగు నృపసంఘము నిర్జింపదలచి నీవు దుర్జనులను వధియించుటకు అర్జును రథచోదకుడవైతివనుట"లో ఔచిత్యము కనపడుటలేదు. పై పెద్ద ప్రాసకొఱకు రెండవసారి దుర్జన పదమునుపయోగించుట కూడా పునరుక్తియగుచున్నది. వీటిని పరిహరించుచు"దుష్టశిక్షణ చేయనిదే లోకమున శిష్టులకు రక్షణము కల్పించుట సాధ్యముకాదని, నీవు దుష్ట క్షత్రియులను చంపగోరి పార్థసారధివైనావని" ఎంతో ఉచితముగ అనువాదము చేసినారు. చూడుడు-

న శక్యరక్షో భువి శిష్టలోకః
శత్రూంస్త్వదీయానవినాశ్య దుష్టాన్।
ఇత్యేవ దుష్ట క్షితిపాన్ జిఘాంసుః
పార్థస్య సారథ్యమువోఢ కృష్ణ॥

భగవద్గీతలో తన అవతారప్రయోజనమును వివరించుచు భగవానుడు చెప్పిన మాటలు ఇచట స్మరణీయములు.[2] "శక్యరక్షః"[3]

---

1. కృ.శ. 28
2. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।
   ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥
   భ.గీ. 4.8.
3. శక్యమైన రక్షణ కలది. విలక్షణమైన వ్యాకరణప్రయోగము.

"జిఘాంసుః"[1] మొదలగు ప్రయోగములు ఆచార్యులవారి వ్యాకరణ శాస్త్రపాటవమును తెలియజేయుచున్నవి.

వటపత్రశాయిని వర్ణించు తెలుగు పద్యమును ఆచార్యులవారు అనువదించిన పద్ధతి ఎంతో రమణీయమైనది. చూడుడు-

కుక్షిని నిఖిల జగంబుల
నిక్షేపము చేసి ప్రళయ నీరధి నడుమన్
రక్షక వటపత్రముపై
దక్షత బవళించునట్టి ధన్యుడ కృష్ణా![2]

కల్పావసానే భువనాని సర్వా
ణ్యాధాయ కుక్షౌ జలధౌ శయానమ్।
పత్రేవటద్రో రమణీయమూర్తిం
ధ్యాయామ్యకామం హృదయేన కృష్ణ॥

మూలమునందు ప్రాపకోటకు నాల్గవపాదమున వేసిన "దక్షత" అను పదమునకు "ధన్యుడ" అను సంబోధనకు అంతగా సార్థక్యములేదు. వటపత్రశాయి యొక్క రూపమును కన్నులకు గట్టునట్లున్న అను వాదమున "రమణీయమూర్తిం" అనుట సందర్భమునకు వన్నెతెచ్చి- నది. అట్టి అణువంటిమూర్తిని దర్శించినంతనే హృదయము దానంతట అది ఏకోరిక లేకుండనే అయనను ధ్యానము చేయునను సత్యమును అనువాదమునందలి "అకామం" అను పదము అవిష్కరించుచున్నది.

---

1. జిఘాంసుః=హన్తుమిచ్ఛుః జిఘాంసుః.

2. కృ.క. 33

ఇచట ముండకోపనిషద్వాక్యములనెన్నింటినో మనముదాహరించు కొనవచ్చును.[1]

పంచేంద్రియముల వెంటబడి విషయలోలుడనై కొన్నిరోజులు గడిపినాను. సజ్జన సాంగత్యము కొద్దిగా కలిగి నిన్ను ఇప్పుడే తెలిసి కొనగలుగుచున్నానని మూలమునందలి తెలుగు పద్యము-

పంచేంద్రియ మార్గంబుల
గొంచెపు బుద్ధిని జరించి కొన్నిదినంబుల్
ఇంచుక సజ్జన సంగతి
నెంచుక మిమ్మెఱిగినాడ నిప్పుడె కృష్ణా![2]

దీనికి ఆచార్యులవారి సంస్కృతానువాదమును గమనింపుడు-

అజస్రసక్తం విషయేషు నిత్యః
కదధ్వనీమం జనమింద్రియాణి।
అతీంద్రియం త్వామధునైవ వేత్తి
త్వద్భక్త సాంగత్యవశాత్స కృష్ణ॥

మూలమునందు తాను పంచేంద్రియవిషయములందు కొన్ని దినములు సంచరించినట్లుండ అనువాదమున- "ఇంద్రియములు, శబ్దాదివిషయములందు ఎల్లపుడు ఆసక్తుడైన ఇతనిని చెడుమార్గమున పెట్టినవి. ఇంద్రియ ప్రభావమును తప్పించుకొని అతీంద్రియుడవైన నిన్ను నీభక్తుల సాంగత్యమువలన ఇప్పుడే ఇతడు తెలుసుకొనగలుగు

---

1. భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యన్తే సర్వసంశయాః।
క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥
ముం. ఉ. 2.9

2. కృ.శ. 51

చున్నాడు" అని సహేతుకమైన ప్రతిపాదన చేయబడినది. "కదధ్వని" అను ప్రయోగము చాలా విశిష్టమైనది.[1] అవైయాకరణులకు ఇది సాధ్యము కాదు.

భగవంతుని స్మరించినవారికి క్రతువులు, తీర్థయాత్రలు,వ్రతములు, దానములు, చేయకనే పుణ్యములభించునని తెలుగు పద్యమిట్లు తెలియజేయుచున్నది.

క్రతువులు తీర్థాగమములు
వ్రతములు దానములు సేయవలెనా? లక్ష్మీ
పతి మిము దలచిన వారికి
నతులిత పుణ్యములు గలుగుటరుదా కృష్ణా![2]

ఆచార్యులవారి అనువాదమును పరిశీలించండి-

కిమధ్వరైస్తీర్థవిగాహనైః కిం?
వ్రతైశ్చ కిం కిం మహితైశ్చ దానైః।
భజన్తి యే త్వాం న భజన్తి యే చ
తేషాం చ తేషాం చ రమేశ! కృష్ణ!

పూర్వార్థమున మామూలుగా సాగిన అనువాదమును ఉత్తరార్థమున ఆచార్యులవారు చమత్కారపూర్ణముగా మార్చినారు. నిన్ను సేవించువారికి గాని,సేవించని వారికి గాని అధ్వరములు, తీర్థయాత్రలు వ్రతములు, దానములు వీటివలన ఏమియు ప్రయోజనములేదు. ఎందువలననగా నిన్నుసేవించు వారికి వాటిని ఆచరించకపోయినను

---

1. కుత్సితః అధ్వా కదధ్వా. తస్మిన్. "కోః కత్తత్పురుషే౽చి" (6-3-101) "ఈషదర్థే చ" (6-3-105)ఇతి కాదేశః।

2. కృ.శ. 56

ఆ పుణ్యము సిద్ధించునుగాన అవి నిష్ప్రయోజనములు. విష్ణు నసలే సేవించని వారికి ఇటువంటివాటిని ఎన్నింటిని ఆచరించినను ప్రయో-జనములేదు.

అనువాదమున మూడు నాలుగు పాదములలో ఆచార్యులవారి ప్రజ్ఞ వ్యక్తమగుచున్నది. ఈ అనువాదము కౌముది కంఠస్థమైనచో భాష్యపరిశ్రమ వ్యర్థము, కౌముది కంఠస్థ కాకపోయినను భాష్యపరి-శ్రమ వ్యర్థమను ప్రసిద్ధశ్లోకమును జ్ఞాపకము చేయుచున్నది.[1]

ఇతరులను యాచించువాడు ఎప్పుడును తక్కువే అగునని నిరూ-పించుచు పొట్టివాడైన వామనమూర్తిపై బలిని మూడడుగులు యాచించితివని తెలుగు పద్యము-

పరులను నడిగిన జనులకు
గురుచ సుమీ! యిదియటంచు గురుతుగ నీవున్
గురుచవై వేడితి మును
ధర పాదత్రయము బలిని దద్దయు గృష్ణా![2]

దానికి ఆచార్యులవారి సంస్కృతానువాదము ఎంతో రమణీయ-ముగనున్నది. చూడుడు-

హ్రస్వో లఘుః స్యాద్భువి యాచమాన
ఇత్యుద్వహన్వామన రూపమేవ।
పాదత్రయ న్యాసమిమం ప్రదేశం
అయాచథాస్త్వం బలిమాద్య కృష్ణ॥

---

1. కౌముదీ యది కంఠస్థా వృథా భాష్యపరిశ్రమః।
కౌముదీ యద్యకంఠస్థా వృథా భాష్యపరిశ్రమః॥
"నివేదనా", భగవాన్ దేవ ఆచార్య, మహాభాష్యమ్,
హర్యానా సాహిత్య సంస్థ, హర్యానా, 1962

2. కృ.శ. 83

మూలమునందు యాచకుడు గురుని యనియే యుండగా అను వాదమున దానితోపాటు తేలికగూడ నగునని చెప్పుట ఎంతయో యుక్తియుక్తముగా నున్నది.[1]

3.3.5 భాస్కరశతకము :

భాస్కరశతకకర్త మారవికవి. దృష్టాంత శతకవాఙ్మయము నందు భాస్కరశతకమునకొక ప్రత్యేక స్థానము కలదు. ఈ శతకము ఆంధ్రదేశమున సుప్రసిద్ధము. దీనికి శ్రీవరదాచార్యులవారి సంస్కృతానువాదము ఎంతో గంభీరముగా సాగినది. చూడుడు-

అంగన నమ్మరాదు తనయంకెకు రాని మహాబలాఢ్యుని
భంగుల మాయలొడ్డి చెఱునందలపెట్టు, వివేకియైన సా
రంగధరుం బదంబులు గరంబుల గోయగజేసె దొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువరాని కుయుక్తులబన్ని భాస్కరా![2]

దీని సంస్కృతానువాదమును గమనించుడు-

వశ్యాస్త్వన్న కదాపి యౌవతజనం కాపట్యదోషాస్పదం
భూయిష్టం పురుషం బలేన చ గుణైర్దూరం చరత్యం చ నః।
మాయాభిర్వ్యతతే వశంగమయితుం సారంగధారం పురా
చిత్రాంగీ వినికృత్తపాద చరణం మోహాతకరోద్భాస్కర॥

"స్త్రీలను నమ్మరాదు, వారు కపటవర్తనులు, వారి అభిలాష నెరవేర్చనిచో ఎంతటివానినైనా కాలారాచుదురు" అను సత్యమును ఈపద్యమున ఎంతో చక్కగ మూలకారుడు వర్ణించినాడు. దానిని అనువాదకుడు"కాపట్యదోషాస్పదం" "బలేన చ గుణైర్దూరం చరన్తం" "మోహా" అను మాటలను అధికముగా చెప్పి మూలములోని

---

1. తృణాదపి లఘుస్తూలః తూలాదపి చ యాచకః।
వాయునా కిం న నీతోఽసౌ మామయం ప్రార్థయేదితి॥
సు.త. భాం పు. 73

2. భా.శ. 2

అభిప్రాయమునకు పరిపుష్టమొనర్చినారు. కాని "చెఱువందలపెట్టు" అను భావము అనువాదమున రాలేదని పైకి అనిపించినప్పటికి "మాయాభిర్యతతే వశంగమయితుం" అను మాటలద్వారా పైభావముకూడా ఏర్పడుచున్నదని అనిపించుచున్నది.

ఎంత చదువు చదువుకొన్నప్పటికిని రసజ్ఞతలేనివానిని సజ్జనులెవ్వరు మెచ్చరు. ఎంతటి నలపాకము చేసినప్పటికిని కూరలో ఉప్పు వేయకపోయినచో దానిని ఎవరు మెచ్చుకొనెదరు? ఆహా! ఎంతచక్కటి దృష్టాంతము! మూలమునవలోకించుడు-

చదువరి ఎంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా.[1]

ఈ పద్యమును ఆచార్యులవారు ఎంత చక్కగ అనువదించినారో చూడుడు-

పాండిత్యం మహితం భవేదపి పరస్యానన్యసాధారణం
వ్యర్థం తద్ధి రసజ్ఞతా విరహితం గర్హ్యం రసజ్ఞైస్సదా।
కిం ప్రాజ్ఞైః రహితేన చారువపుషాలంకారయుక్తేన వా
కిం వా భీమకృతైర్విలుప్తలవణైః పాకైర్గురో! భాస్కర!

ఇచ్చట మూలమునందు లేని కల్పన ఒకటి చోటు చేసుకొన్నది. "కిం ప్రాజ్ఞైరహితేన చారువపుషాలంకారయుక్తేన వా" అనునది అనువాదకులు అధికముగా చేర్చినారు. ఇది మూలమునందు లేదు.

1. భా. శ. 42

అలంకారవిలసితము, అతిసుందరము, అయిన శరీరమునందు ప్రాణ-ములు లేకపోయినచో దానికి విలువేమున్నది? అలాగే ఎంత పాండి-త్యమున్నవ్వానికి రసజ్ఞులు కాకపోయినట్లైతే ఆ పాండిత్యమునకు విలువలేకుండా పోగలదు. మూలమునందలి నలపాకము అనువాదమున భీమపాకమైనది కాని నలభీమపాకములను కలిపి ప్రయోగించుటవలన ఒకదానిని పేర్కొన్నచో రెండవది అయత్నసిద్ధముగనే అందుబాటు లోనికి రాగలదని మూలకర్త, అనువాదకుల భావమై యుండవచ్చును

అయోగ్యుడు అందలమెక్కగా, యోగ్యుడు గుర్తింపులేకుండా ఎక్కడో పడివుంటాడు. అది కోతి కొమ్మెక్కి కూర్చుండగా చెట్టుక్రింద గండభేరుండములు, ఏనుగులు, సింహములు గూర్చున్నట్లుండును. అంతమాత్రముచేత వాటికి అవమానములేనట్లే యోగ్యులకుకూడా ఎటు వంటి అవమానములేదని మూలకవి ఎంతో చక్కగా వర్ణించినాడు—

వందితులైనవారు దిగువందగ నుండగ నల్పుడొక్కడు
ద్దండత నీఠమెక్కిన బుధప్రకరంబులకేమి యొగ్గయున్
కొండొక కోతి చెట్టుకొనకొమ్మలనుండగ క్రింద గండభే
రుండ మదేభ సింహ నికరంబులు నుండవె చేరి భాస్కరా!¹

దీనిని ఆదార్యులవారెట్లు అనువదించినారో చూడుడు—

అసీనేష్వథ ఏవ వందితవరేష్వల్పోఽధికో దర్పతః
పీఠే తిష్ఠతి చేత్సమున్నతిరమే తేషామవజ్ఞా కథమ్?
శాఖాగ్రం గహనేఽధితిష్ఠతి తరోః శాఖామృగే హేలయా
నీచైః సన్తి మృగేన్ద్రహస్తి శరభవ్యాఘ్రాదయో భాస్కర!

---

1. భా. శ 61

ఇచ్చట మూలాతిరిక్తమగు సంస్కృతానువాదము ఎంత సరళముగా సాగినదో గమనింపవచ్చును.

ఒకనికి విద్యవలన విభవము సమకూరినదని అందరును ఐశ్వర్యముకొరకు విద్యనభ్యసించిన మాత్రమున అది అదృష్టములేకని ఎన్నటికి లభించదు. చెవిని పెంచుకున్నంతమాత్రమున కర్ణభూషణము లెట్లు ప్రాప్తించును? అని మూలమున తెలుగు పద్యము—

వానికి విద్యచేత సిరివచ్చెనటంచును విద్యనేర్వగా
బూనిన బూనుగాక, తన పుణ్యము చాలక భాగ్యరేఖకున్
బూనగ నెవ్వడోపు నరిలో చెవి పెంచుముగాకదృష్టతా
హీనుడు కర్ణభూషణము లెట్లు గడింపగనోపు భాస్కరా![1]

ఈ పద్యమెంత చక్కగా అనువదింపబడినదో పరికింపుడు—

విద్యోపార్జనతో జగాను విభవం కశ్చిత్ప్రపేదే తతో
విద్యాసాగరపారగోఽస్తు నియతేస్సాహ్యద్వినా నైతి తమ్।
కర్ణేరంధ్ర వివర్ధనం తు సుకరం లభ్యం కథం కుండలం
పర్యాప్తం న హి పౌరుషం ఫలకృతే దైవం వినా భాస్కర।

అనువాదమునందు "కృతి" అని ప్రయోగించుట ఎంతో సార్థకముగా నున్నది. "విద్యనేర్వగా బూనిన బూనుగాక" అను మూలమును అంతకంటె పుష్కలమైన అర్థమునిచ్చునట్లు "విద్యాసాగరపారగోఽస్తు" అని అనువదించినారు "చెవిపెంచుముగాక" అను మూలమును అంతకంటె స్పష్టముగా "కర్ణే రంధ్రవివర్ధనం తు సుకరం" అని అనువదించుట ఎంతో బాగున్నది. మూలమునందలి భావమును అనువాదమున ఇట్లు చొప్పించినారు—

---

1. భా. శ. 93

“నర్తాప్తం న హి పౌరుషం ఫలకృతే దైవం వినా” దైవానుగ్రహములేకుండా పురుషప్రయత్నము మాత్రమే ఏ కార్యమును సాధింపదను సత్యమును జోడించి అనువాదమునకు గొప్ప అందమును సంధించినారు.

### 3.3.6 శ్రీకాళహస్తీశ్వర శతకము :

తెలుగు శతకవాఙ్మయమునకు ప్రతిష్ఠను పెంచిన కొద్ది శతకములలో శ్రీకాళహస్తీశ్వర శతకము ముఖ్యమైనది. ఇది మహాకవి ధూర్జటి రచన. పాండిత్యము, కవిత, లోకానుభవముల త్రివేణీసంగమము[1] శ్రీకాళహస్తీశ్వరశతకము సామాజికనీతి, భక్తి, విరక్తి, ప్రతిపద్యము నందును ప్రస్ఫుటముగా గోచరించును. చూడుడు–

ఏ వేదంబు పఠించె లూత? భుజగం బే శాస్త్రముల్ సూచె? దా
నే విద్యాభ్యసనం బొనర్చె గరి? చెంచే మంత్రమూహించె? బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా! కావు మీపాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

ఈపద్యమును సంస్కృతమున అనువదించుచు శ్రీవరదాచార్యుల వారు తమ వ్యాకరణశాస్త్ర పాండిత్యమును గుప్పించినారు. చూడుడు–

లూతా కాం శ్రుతిమధ్యగీష్ట? భుజగోఽధారి చ్ఛాస్త్రం ను కిం?
కాం విద్యాం గజ అదితాథ? శబరోఽధ్యక్షచ్చ మంత్రం తు కమ్
బోధోత్పత్తి నిదానకాం జనయయుర్విద్యా యథా వ్యక్తిరీశాని వ
త్వత్పాదార్చనరాగితా విరహితః శ్రీకాళహస్తీశ్వర!

మూలము నతిక్రమించకుండా అనువాదము నడచినది. “లూతా

---

1. శ్రీ కా.శ. 13

శ్రుతి" అనుటలో శబ్దాలంకారము సిద్ధించినది. ఇచ్చట శ్రీఆచార్యుల వారు ప్రయోగించిన "అధ్యగీష్ట"[1] "అపాఠీత్"[2] "అదిత"[3] "అభ్యా-స్థత్"[4] అను క్రియాపదములు వారి వ్యాకరణశాస్త్ర పాండిత్యమును తెలియయుచున్నవి. ఇట్టి క్రియా వైవిధ్యమును వారు ఔచిత్యనిర్భర-ముగ నిర్వహించుట ఎంతో శోభను కలిగించుచున్నది. "వేదములను అధ్యయనము చేయవలెను. శాస్త్రములను పఠించవలెను. విద్యలను పరిగ్రహించవలెను. మంత్రములను అభ్యసించవలెను". కనుకనే వారు అటువంటి క్రియలను ప్రయోగించిరి.

ఈ సంసారము రోత పుట్టినదయా! నాకు విరక్తిని కలిగింపుమని ధూర్జటి తన హృదయావేదనను వ్యక్తీకరించు పద్యము-

కాయల్గాచె వధూ నఖాగ్రములచే గాయంబు వక్షోజముల్
రాయన్ రాపడె రొమ్ము మన్మథ విహారక్లేశ విభ్రాంతిచే
ప్రాయంబాయను బట్టగట్టిదల చెప్పన్ రోత సంసారమే
చేయంజాల విరక్తుజేయగదవే శ్రీకాళహస్తీశ్వరా![5]

---

1. నిత్యముగ అధి పూర్వకమైన ఇఙ్ ధాతువునకు లుఙ్ ప్రథమ పురుషైకవచనము.
2. పఠవ్యక్తాయాం వాచి అను ధాతువునకు లుఙ్ ప్రథమ పురుషైకవచనము.
3. ఆఙ్ అను ఉపసర్గమువందుగల, దాఞ్ దానే అను ఆత్మనే పది ధాతువునకు లుఙ్ ప్రథమపురుషైకవచనము.
4. అభి అను ఉపసర్గముందుగల అసు క్షేపణే అనుధాతువునకు లుఙ్ ప్రథమపురుషైకవచనరూపము.
5. శ్రీ.కా.శ. 14

దీనికి సంస్కృతానువాదము గమనించుడు-

రాయో జాతికిఁ బో వధూకరరుహైర్గ్లానః ప్రసూనైర్దూషణాత్
వక్షోస్వేదితం వయశ్చ గలితం పుష్పైము సంక్రీడితైః।
ఆక్రాన్తం జరయా శరీరమఖిలం జాతా జుగుప్సా చ మే
సంసారాత్త్వవిరక్త మేవ కురు మాం శ్రీకాళహస్తీశ్వర।

అనువాదమున ఆచార్యులవారు "కరరుహైర్గ్లానః"[1] "జాతకిణః"[2] అను కాళిదాస ప్రయోగములను జేసిరి "తలబట్టగట్టె"అను దాని భావార్థమును దీసికొని "ఆక్రాన్తం జరయా శరీరమఖిలం" అని అను-వదించిరి. మొత్తముపైన అనువాదము చక్కగా జరిగినది.

మాయతో లోకములను సృజించి వినోదించుచున్నావు. వాసన చూచుట, రుచిచూచుట,చూచుట, తాకుట, వినుట అను అయిదుపనులు చేయుటకేనా నీవు ఈ జీవులను సృష్టించినది? అని ధూర్జటి భగవంతుని ఇట్లు ప్రశ్నించుచున్నాడు-

చవిగా జూడ వినంగ మూర్కొన దమా పంఘర్షణాస్వాదమొం
దవి నిర్మించెదవేల జంతువుల నేతత్క్రియాలే పాతక
వ్యవహారంబులు సేయనేమిటికి మాయా విద్యచే బ్రొద్దుపు
చ్చి వినోదింపగ దీననేమిఫలమో శ్రీకాళహస్తీశ్వరా![3]

ఆచార్యులవారి సంస్కృతానువాదము గమనించుడు-

---

1. అనాఘ్రాతం పుష్పం కిసలయమలూనం కరరుహై ః అ.శా.1.10
2. జ్ఞాప్యసి కియద్భుజో మే రక్షతి మౌర్వీ కిణాంక ఇతి. అందులోనే-1.13
3. శ్రీ కా.శ. 75

అఘ్రాతుం త్వవితుం విలోకితుమపి ప్రష్టుం గ్రహీతుం ధ్వనిం
జంతూన్ కిం సృజసి త్వదీయ భజనాయాకుర్వతః కాః క్రియాః
సూదం త్వేష తవేంద్రజాల మహిమా కాలాతివాహం నిజం
ప్రేక్ష్యోః స్వీయ వినోదనేన కిమతః శ్రీకాళహస్తీశ్వరః

పంచభూతముల క్రమము మూలమునందు పాటించలేదు. కాని అనువాదమున అది పాటించబడినది. పృథివి, జలము, తేజస్సు, వాయువు,ఆకాశము అను భూతముల గుణములను అఘ్రాణించి,ఆస్వాదించి, దర్శించి, స్పృశించి, వినుటకేనా ఈ జీవులను సృష్టించినది.అని అనువాదమున పేర్కొనబడినది. "మాయావిద్య" అనునది "ఇంద్రజాల మహిమా" అని వివరించబడినది. "కాలాతివాహం" అని ప్రొద్దుపుచ్చుట చెప్పబడినది. ఇట్లు మూలమునకు తగ్గుండా అనువాదము చేసిరి.

3.3.7 గాయత్రీ నీతిగీతావళి :

మచిలీపట్టణములోని హిందూ కళాశాలోన్నత పాఠశాలలో ప్రధానాంధ్రాధ్యాపకులుగా పనిచేయుచున్న అద్దేపల్లి లక్ష్మణస్వామి గారు హిందీ సాహిత్యములోని కొన్ని విశిష్టభావనలను తీసికొని తెలుగు పద్యములను వ్రాసి"శ్రీగాయత్రీ నీతిగీతావళి" అను పేర 1957లో ప్రకటించిరి.అందులోని పద్యములు తనహృద్యములై పిన్నలకు పెద్దలకు కూడా నీతిని బోధింప జాలినవి. విలక్షణమైన ఆ భావనలకు ముగ్ధులైన శ్రీవరదాచార్యులవారు అదే సంవత్సరము ఆ పద్యములను సంస్కృతమున అనువదించి" గాయత్రీ నీతిగీతావళిః" అను పేరుతోనే ప్రకటించిరి. మూలము అనువాదము పరిసమానముగా నడచినవి. ఇచ్చట కొన్ని పద్యము- ఎ అనువాదములెంత మధురముగా సాగినవో నోదాహరణముగ నిరూపింతుము.

జాలు రువ్వెడు దుష్టజనాలి పైన
నామ్ర మిసుమంత కినియక యమృతపద్భక

ఫలములందిచ్చి సంతోషపఱచు సతము
భువిని సజ్జను దద్దాని బోలఁగాదె![1]

మూలములోని భావము సరళసుందరము. దీని అనువాదమును గమనింపుడు-

పాషాణైః ప్రహరత్యేవం సహకారో న కుప్యతి।
ఫలం చ మధురం దత్తే తాదృశః ఖలు సజ్జనః॥

మూలమునందు ఆమ్రమనియేకలదు, కాని అనువాదమున తియ్య మామిడిచెట్టు అను అర్థము వచ్చునట్లు "సహకారః" అని ప్రయోగించుట ఎంతో సమంజసముగా నున్నది. రాళ్ళదెబ్బలు తినికూడా మధుర ఫలముల నిచ్చుటలో వైశిష్ట్యము కలదు. అందువలననే అను- వాదమున "మధురం" అని ప్రయోగించిరి అట్లే ఇంకొక సందర్భమును పరిశీలింపుడు.

ఏ వస్తువునెక్కడ ఉంచవలెనో తెలిసికొని దానినక్కడ ఉంచ వలెను. కళ్ళకుపెట్టుకొను కాటుకను కాళ్ళకు, పెదవికి పెట్టుకొను దాదును నేత్రములకు పెట్టుకొనవచ్చునా? అని ఎంతోచక్కని భావమును తెలియ జేయు ఈ పద్యమును చూడుడు-

ఏది యెక్కడనుండిన నింపుగూర్చు
నదియు యక్కడనుంట ముఖ్యంబు, నేత్ర
ములకు బెట్టెడు నంజనమును ఐదంబు
లకును బెదవుల జాదు నేత్రముల కగునె.[2]

---

1. గా.నీ.గీ. 3

2. అందులోనే. 27

దీనిని ఆచార్యులవారు సంస్కృతమున నెట్లనువదించినారో గమనింతము-

యత్ర యద్వారుతాహేతుః తత్తు తత్రైవ నిక్షిపేత్।
నార్హ్యం నేత్రాంజనం పాదే నేత్రే పాధర వర్ధకమ్॥

మూలములోని ముఖ్యంబు అను పదము అనువాదమున వదలి వేయబడినది. "నిక్షిపేత్" నార్హ్యం "అనుటలో విధి కనపడుచున్నది. అట్లే "అధరవర్ధకం" అను ఎంతో విశిష్టమైన ప్రయోగము ఇచ్చట చేయబడినది.

3.3.8 శ్రీనరసింహ శతకము :

శేషప్పకవి ధర్మపురీశుడగు శ్రీనరసింహస్వామిని సంబోధించుచు రచించిన శతకము నరసింహ శతకము. నరసింహ శతకములెన్నియున్నను ధర్మపుర నివాసియగు నరసింహునిపై రచించిన ఈ శతకమునకు ఎంతో ప్రాముఖ్యము వచ్చినది. ఇందులకు కారణము ఇందులోని ప్రతిపద్యమునందుగల భక్తి, విరక్తి, తత్త్వచింతన, ఆర్తి, నీతి మొ॥ లక్షణములు, ఈ శతకమును సర్వజన ప్రియమొనర్చినవి, కనుకనే శ్రీవరదాచార్యులవారు ఈ శతకమును సంస్కృతమున అను వదించిరి. మూలమునందలి పద్యములన్నియు పండినకవి అనుభవమునకు తార్కాణములైతే అనువాదమునందలి శ్లోకములన్నియు కవితకు, పాండితికి, అనుభవమునకు, మణి-పూసలవంటివి. కొన్ని మూల పద్యములను వాటి సంస్కృతానువాదములను చూపి శ్రీఆచార్యులవారి అనువాద వైదగ్ధ్యమును నిరూపింతును.

తల్లిగర్భమునుండి ధనము తేడెవ్వడు
వెళ్ళిపోయెడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమెకాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జనచేసి విఱ్ఱవీగుటెకాని

కూడబెట్టిన సొమ్ము కూడ రాదు
పొందుగా మరుగైన భూమిలోపలబెట్టి
దాన ధర్మములేక దాచి దాచి

తుదకు దొంగలకిత్తురో దొరలకవునొ
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు
భూషణవికాస శ్రీధర్మపుర నివాస
దుష్టసంహార! నరసింహ! దురితదూర!!

మూలము సీసపద్యములో నున్నది. శ్రీఆదాద్యులవారు ప్రతి పద్యమును మూడు ఉపజాతివృత్తములలో సంస్కృతమున అనువదించిరి. అనువాదము అనువాదమువలెగాక స్వతంత్రగ్రంథమువలె సాగినది. చూడుడు—

స్వమాతృగర్భాద్భవమాహరేత్కో
నయేచ్చ తత్ స్వేన సమం మృతౌ కః।
దారాన్నమేవాత్తి జనస్సంక్షో
న కాంచనం వా న మణీన్ స భుంక్తే॥

విత్తార్జనాద్గర్వముదౌ భవేతాం
నాత్మానమన్వేష్యతి సంచితం స్వమ్।
ఆదాయ సంవర్ధిత విత్తమన్త
ర్నిఖాయ భూమౌ పరిరక్ష్యతే యత్॥

తద్పోరసాత్ స్యాద్ధరణీశసాద్వా
మధ్వశ్యగం స్యాత్ మధుమక్షికాత్తమ్।
శ్రీరమ్య ధర్మాఖ్య పురాధిదేవ
రంహో హరాంహో నరసింహదేవ।

1. స.శ. 15

తెలుగులో ప్రతి పద్యమునందును మకుటము ఇట్లున్నది-

భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార నరసింహ! దురితదూర!

సంస్కృతానువాదమునందలి మకుటము ఇట్లున్నది-

శ్రీరమ్య ధర్మాఖ్య పురాధిదేవ!
రంహో హరాంహో నరసింహదేవ!

మూలమునందు ఈ పద్యము తెలుగునాట సుప్రసిద్ధమైనది. ధన మెంతగొప్పదైనను పుట్టినపుడు తెచ్చేదిగాని పోవునప్పుడు తీసికొని వెళ్ళేదికాని లేదు ఇది మధ్యలో పోవునది మాత్రమే.శాశ్వతమైనదికాదు ఎన్ని లక్షల రూపాయలు గడించినను మానవుడు తినునది ఉప్పు కలిసిన (కూరలతో) అన్నమే కాని బంగారమును ఎవ్వడూ మింగేది లేదు.సొమ్ము కూడబెట్టి నేనింతడబ్బుకలవాడినని విఱ్ఱవీగవలసినదిగాని చనిపోయినప్పుడు వాడివెంట చిల్లిగవ్వైనా వెళ్ళదు. ఏ దానధర్మమూ చేయక నేలలో పాతిపెట్టి, దాచిదాచి, తేనెటీగలు తేనెనుదాచి ఎవరికో ఇచ్చినట్లు చివరకు దొంగలకో, ప్రభువులకో అప్పగించుట అగునుకాని, లోభిమానవుడు తనకుతాను అనుభవించి ఇతరులకు ఇచ్చి దానిని సార్థ-క్యమును కలిగించలేడు.

ఈ పద్యంలో ఎంతో సత్యాన్వేషణ కనపడుతుంది. శ్రీఆచార్యుల వారు తమ అనువాదమున కొంత మెఱుగులు దిద్దినారు."మెఱుగు బంగా-రంబు" అనుదానిని ఉపలక్షణం లాగా తీసికొని "న కాంచనం వా న మణీన్" అని అనువదించినారు అట్లాగే "విఱ్ఱవీగుట" అనుదానిని"గర్వ-మదౌ ధ పేతాం" అనుట ఎంతో సమంజసముగా మున్నది. ధనగర్వము ధనమదమనునవి లోకప్రసిద్ధములు వానిని దృష్టిలోనుంచుకొని "గర్వ-మదౌ"అనినారు."దొంగలకితురో"అనునది అంత సమంజసముగా లేదని

"చోరసాత్"[1] "ధరణీశసాత్"అను చక్కని ప్రయోగములను చేసినారు. దొంగలకు రాజులకు మనమివ్వవలసిన పనిలేదు. వారే లాగివేసి కొందురు. కనుక ఈ ప్రయోగములు సరిపోయినవి.

ఇట్లు ఆచార్యులవారు చక్కని చిక్కని భాషలో మంచి వ్యాకరణ ప్రయోగములతో ఈ శతకమును అనువదించిరి.

మానవసమాజమున అధికముగా కనపడు తప్పులను తప్పిదములను ఆశ్రయముగా శతకకవి అభివర్ణించును. ఈ ధోరణి శేషప్పకవిలో హెచ్చుగా కనపడుచున్నది. చూడుడు-

అతిశయంబుగ గల్లలాడ నేర్చితిగాని
పాటిగా సత్యములు పలుక నేర
పరకార్య విఘ్నములు సలుప నేర్చితిగాని
యిష్టమొందగ నిర్వహింప నేర
నొకరి సొమ్ముకు దోసిలొగ్గ నేర్చితిగాని
చెలువుగా ధర్మంబు సేయ నేర
ధనములియ్యంగ వద్దనగ నేర్చితిగాని
శ్రమమిచ్చేటట్లు చెప్పనేర

వంకజాక్ష నేనెంతో పాతకుడను
తప్పులన్నియు క్షమియింపు తండ్రి నీవె

---

1. చోరసాత్: చోరాధీనమిత్యర్థః "తదధీన వచనే" (5.4.54) ఇత్యనేన సూత్రేణ సాతిః కృభ్వస్తిభిః సంపదా చ యోగే. ధరణీశసాత్: ధరణీశాధీనమిత్యర్థః.

భూషణ విశాల! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర!।

ఈ పద్యమును చదివి ఎటు చూసినప్పటికి దీనికి లక్ష్యభూతులు మనకు పక్కనే సాక్షాత్కరిస్తారు. ఇది ఈ నాటికి పెరిగిపోతున్న దుష్ట స్వభావము. దీనిని ఆచార్యులవారి భాషలో చూడండి-

అభ్యాసమాభ్యాతు మనత్యవాచో
నాదిన్త్రయం భాషితుమేక సత్యమ్।
పఠాక్కర్య విఘ్నాతరణం వ్యతాని
నాకారి కించిజ్జనతోపకారి॥
వర్యగ్రహీషం వరకియమర్థం
న వర్యస్తైషం వ్యధవ్రదానమ్।
దానం పరేషాం న మయా విషీహి
న దావనే త్రైర్విదధే మయాల్పమ్॥

పంకేరుహాక్షాస్మి మహాపరాధః
క్షమస్వ సాపాన్యఖిలాని దేవ
శ్రీరమ్య ధర్మాఖ్య పురాధిదేవ
రంహో హతాంహో నరసింహదేవ॥

మూలమునందలి "సత్యముల్పలుకనేర" అను స్థానమున ఏక-వచనముతో ఒక్క సత్యమును కూడా పలుకవలెనని చింతించనేలేదని" "భాషితుమేక సత్యం"అనుట ఎంతో ఉచితముగనున్నది. అట్లే"వ్యతాని"[1]

---

1. న.శ. 24

2. "వి" అను ఉపసర్గముండగల తను-విస్తారే అను ధాతువునకు కర్మార్థక లుఙ్ ప్రథమపురుషైకవచనము.

"అకారి"[1] "పర్యగ్రహిషం"[2] "పర్యచైషం"[3] "విషేహే"[4] "విదధే"[5] అను ప్రయోగములు శ్రీవరదాచార్యులవారి వ్యాకరణశాస్త్ర పారంగతత్వమును చెప్పకనే చెప్పుచున్నవి.

అట్లే"వాకారి కించిజ్జనతోపకారి "పర్యగ్రహిషం""పతకియుమర్థం" "న పర్యచైషం" అనుచోట్ల అయత్న సిద్ధములుగ ఏర్పడిన శబ్దాలంకరములు మూలాతిశాయిన్యైన శోభను అనువాదమునకు చేకూర్చినవి.

శేషప్పకవి పద్యాలయందుగల పమాజస్వరూపమునకు అద్దము పట్టుచున్నట్లున్న ఇరువది అరవ పద్యమును ఆచార్యులవారు చాలా పరశముగను, సుందరముగను అనువదించినారు-

విద్యాధికా సైత జలోర్థకార్థాః
సభాగ్రగణ్యాస్తు నిరక్షరాస్యాః।
యథార్థవాచో జనతా విరుద్ధాః
అప్తా జనా యే వితథం వదన్తి॥

దారిద్ర్యభాజః ఖలు దానశీలాః
అర్థాః పునర్లుబ్ధతమా భవన్తి।
వ్యాధ్యాదిపీడాః కృతపుణ్యకార్యా
దుష్టాః పునర్వృద్ధిముపేయివాం సః॥

---

1. డుకృఞ్-కరణే అను ధాతువునకు కర్మర్థక లుఙ్ ప్రథమపురుషైకవచనము.

2. "పరి" అను ఉపసర్గముందుగల గ్రహ-ఉపాదానే అను ధాతువునకు లుఙ్ ఉత్తమపురుషైకవచనరూపము.

3. "పరి" అను ఉపసర్గముందుగల చిఞ్-చయనే అను ధాతువునకు లుఙ్ ఉత్తమపురుషైకవచనము.

4. వి + షహ-మర్షణే,కర్మణి లిట్

5. వి + డు ధాఞ్-ధారణపోషణయోః, కర్మణి లిట్.

త్వద్యాచకానామపి దుర్లభత్వం
త్వం కేవలో నః శరణం శరణ్య।
శ్రీరమ్య ధర్మాఖ్య పురాధిదేవ
రంహో హతాంహో నరసింహదేవ॥

ఇది ఈనాడు మనచుట్టూ ఉన్న పరిస్థితులకుకూడా గీచినబొమ్మ-వలె కనబడుచున్నది. అనువాదము హాయిగా సాగినది. మూలము నందలి "ధర్మవాదనపరుల్" అనునది తరువాతి పాదమునందలి "పరమ లోభులు" అను దానితో సరిపోవుట లేదని "దానశీలాః"అని అనువదించిరి. అట్లే "ధనప్రాప్తులైరి" అనుటకంటె 'ఆఢ్యాః' అనుట ఎంతగానో సరిపోయినది. ఇటువంటి పరిష్కారములు ఆచార్యులవారి అనువాదము నందు ఎన్నియో గలవు.

ఇట్లే ఈశతకములోని 44, 71, 85 పద్యముల అనువాదములను

---

1. అధిక విద్యావంతులప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతుల మాట జనవిరోధంబాయె
వదరుబోతుల మాట వాసికెక్కె
ధర్మవాదనపరుల్ దారిద్ర్యమొందిరి
పరమలోభులు ధనప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగభూతపీడితులైరి
దుష్టమానవులు వర్ధిష్ణులైరి
పక్షివాహన మావంటి భిక్షుకులకు
శక్తి లేదాయె నిక నీవె దిక్కుమాకు
భూషణవికాస శ్రీధర్మపుర నివాస
దుష్టసంహార నరసింహ దురితదూర

వ. శ. 26

పరికించినచో ఆచార్యులవారి విశిష్టమైన అనువాదధోరణి విశద-
మగుచున్నది.

3.3.9 ఆంధ్రనాయక శతకము :

కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళక్షేత్రమున అధివసించియున్న ఆంధ్ర-
విష్ణువును నిందాస్తుతి చేయుచు కాసుల పురుషోత్తమకవి చేసిన రచన
ఆంధ్రనాయకశతకము. పేరు విచిత్రముగా నున్నది. కవితకూడ చిత్ర
విచిత్రమైన వక్రోక్తులతో, నిందాస్తుతులతో నలరారుచున్నది. దీనికి
శ్రీఆచార్యులవారొనర్చిన సంస్కృతానువాదము ఎందఱి ప్రశంసలకో
పాత్రమైనది. కొన్ని సందర్భములయందు మూలము అనువాదము
పోటీపడుచున్నట్లుండును-చూడుడు.

భిల్లాంగనా దంతపీడిత ఫలభుక్తి
హేయంబు దోచలేదింత నీకు
సక్రందనాత్మజ స్యందన సారథ్య
మెఱుసుగా దోచలేదింత నీకు
గోపాలకానేక గోవత్సపాలనం
బెగ్గుగా దోచలేదింత నీకు
వ్రజ బాలికామూర్త వస్త్రాపహరణము
హీనమై తోచలేదింత నీకు
నుచ్చనీచంబు లెఱుగక నిచ్చజేయు
చేష్టలివి భక్తహితమతిజేసి తండ్రి
చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్యభావ
హతవిమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ![1]

---

1. ఆం.నా.శ. 21

మూలమునందలి మకుటమును అనువాదమున ఇట్లు మార్చిరి-

చిత్రప్రభావ ప్రథితాంధ్రదేవ!
శ్రీకాకుళేశ! క్షపితాఘలేశ!

పైపద్యమునకు సంస్కృతానువాదమును పఠింపుడు-

భిల్లాంగనా భుక్త సముజ్ఝితేషు
ఫలేషు నాసీత్తవ హేయభావః।
ఇంద్రాత్మజస్యందన సారథిత్వం
న నింద్యమీషత్ భవదీయదృష్టౌ।

గోపాల గోపాంగన మల్పతోఽపి
వాదిన్త్రయస్త్వం ప్రవిగీతకర్మా।
నిష్ఠాను గోపీ వసనాపహారే
నావద్యతా బుద్ధిరుదేతి తే స్మ।

గుణాగుణజ్ఞాన విహీనచేష్టాః
భక్తాస్త్వమేతా ఇతి తు బ్రువన్తి
చిత్రప్రభావ! ప్రథితాంధ్రదేవ!
శ్రీకాకుళేశ! క్షపితాఘలేశ!

అనువాదము సరళముగా సుందరముగా సాగినది. అనువాదమున "బ్రువన్తి" అను క్రియను ప్రయోగించి అస్వారస్యమును సూచించినారు

శ్రీమహావిష్ణువును నిందాస్తుతిచేయు నీ క్రింది పద్యము ఆంధ్రనాయకశతకమున సుప్రసిద్ధమైన పద్యములలో నొకటి-

ఆలు నిర్వాహకురాలు భూదేవియై
యఖిల భారకుడను నాఖ్యదెచ్చె
నిష్ఠనవమ్మురాలిందిర భార్యయై
కామితార్థుడన్న ఘనతదెచ్చె

కమలగర్భుడు సృష్టి కర్తతనూజుడై
బహుకుటుంబకుడన్న బలిమిదెచ్చె
కలుష విధ్వంసిని గంగ కుమారియై
పతిత పావనుడన్న ప్రతిభదెచ్చె

నాంధ్రుబిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిగాని
మొదటినుండియు నీవు దామోదరుడవె
చిత్రచిత్రప్రభావ! దాక్షిణ్యభావ!
హత విమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ![1]

ఈపద్యమును శ్రీవరదాచార్యులవారు సంస్కృతీకరించిన తీరుతెన్నులు గమనించుడు-

విశ్వంభరాయాం మహితే తంత్రే
త్రైలోక్య భర్త్రేతి భవాన్ ప్రసిద్ధః।
దారైశ్చ లక్ష్మ్యాఽమిత సంపదా తే
కామప్రదాతేతి యశస్త్వమాపః॥

ప్రజాపతౌ స్రష్టరి తే తనూజే
జగత్కుటుంబీత్యభిధా తవాసీత్।
వినాశితాఘా తనయా చ గంగా
పాపాపహత్వం భవతశ్చకార।

దారాత్మజాపాదిత కీర్తిమాంస్త్వం
దామోదరో జన్మన ఆదితోఽపి।
చిత్రప్రభావ ప్రథితాంధ్రదేవ
శ్రీకాకులేశ! క్షపితాఘలేశ!!

1. ఆం.నా.శ. 26

వస్త్రమీ ప్రయోగములతో మూలమునందలి భావము చెడకుండా ఆచార్యులవారు చేసిన అనువాదము అభినందనీయమైనది. అనువాదమున కొన్ని అనౌచిత్యములు పరిహరింపబడినవి. మూలమున "అఖిల భారకుడు" అను పదము కవిహృదయము నావిష్కరించలేకపోయినది. విశ్వంభర నీ భార్య గనుక నీవు త్రైలోక్య భర్తగా ప్రసిద్ధినందినావనుట ఎంతో బాగున్నది. భార్యాశబ్దము మూలమునందున్నది. అది సందర్భమునకు తగినట్లు లేదని "దారా" శబ్దము ప్రయోగించినారు. "కమలగర్భుదను" మూలమునందలి ప్రయోగము నిరర్థకమైనది. కాని అనువాదమున "ప్రజాపతి" అను ప్రయోగము ఎంతో గంభీరమగు అర్థమును అందించుచున్నది. "ప్రతిభదెచ్చె" అనుటకన్న "యశస్త్వమాపః" అనుట ఎంతైనా యుక్తముగా నున్నది. "దారాత్మజాపాదిత కీర్తి" అను సమాసము ఎంతో చక్కగా కుదిరినది. మూలములోని "తెచ్చె" అను క్రియకంటే "అపాదిత" అనుట ఎంతో సుందరముగా నున్నది.

ఇట్లు శ్రీవరదాచార్యులవారు ఎనిమిది సుప్రసిద్ధశతకములను ఒక పద్య సంకలనముగ తెలుగునుండి సంస్కృతమునకు అనువదించి అనువాదకవితామార్గమునగూడ లబ్ధప్రతిష్ఠులైరి. మూలమునకంటె అనువాదమున కవి హృదయమునకు మెరుగులుదిద్దబడినవి. మూలములోని తెలుగుభాషయొక్క ప్రమాణమునకంటె అనువాదమునందలి సంస్కృత భాషయొక్క ప్రమాణము చాల ఉన్నతమైనదని ఎందరో కవిపండితులు ఆచార్యులవారిని ప్రశంసించిరి.

# 4 చతుర్థాధ్యాయము

## 4.1 శ్రీవరదాచార్యులవారిపై జాతీయోద్యమప్రభావము :

ఇరువదవ శతాబ్దపూర్వార్ధమున జీవించిన భారతీయులపై గాంధీ మహాత్ముని ప్రభావము, ఆయన తన సహచరులతో కలిసి నడిపిన జాతీయోద్యమప్రభావము ఏకొంతో ఉండకతప్పదు. గత శతాబ్దాంతమున జన్ములైన శ్రీవరదాచార్యులవారిపైన మహాత్ముని ప్రభావము జాతీయోద్యమ ప్రభావము ఒకింత కలదు.

ఇంతకుముందు అధ్యాయములలో వారి వ్యక్తిగత జీవితము నందును సారస్వతజీవితమునందును రచనలయందును జాతీయోద్యమ ప్రవృత్తిని రేఖామాత్రముగ తీసికొని వచ్చితిని. అది సందర్భము కాదు గనుక సంక్షిప్తముగ దానిని ప్రస్తావించి విడిచితిని. ఈ ప్రకరణమున ప్రత్యేకముగ ఆచార్యులవారి జీవితముపైన రచనలపైనను సమకాలీనోద్యమముల ప్రభావమెంతవరకు కలదని విశదముగ పరిశీలింతును.

4.1.1 జీవితము :

పూర్వపు అధ్యాయములో చెప్పినట్లు (1.1.1.2) శ్రీవరదాచార్యులవారు అగర్భ శ్రీమంతులైన జమీందారీ కుటుంబమున జన్మించినను అతిసామాన్యమైన జీవితమును గడిపినారు. ఆడంబరములు, అట్టహాసములు వారికి నచ్చెడివికావు. జీవితము సామాన్యముగను భావనలు సమున్నతముగను ఉండవలెనని వారి నిర్ణయము. 1914వ సంవత్సరము నాటికే మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో చదువుకొని అత్యున్నతమైన ఎమ్. ఏ (ఆనర్స్) పరీక్షలో సర్వప్రథముడుగ ఉత్తీర్ణులయ్యెను, వారిమనస్సు పాశ్చాత్య నాగరికతా విషవాయు మూర్ఛితము గాక జాతీయభావనా పరిమళ సముల్లాసితమైనది. భారతమాతను దాస్యశృంఖలలనుండి విముక్తినొనర్చుటకు గాంధిమహాత్ముడు చేపట్టిన ప్రతి ఉద్యమము వారిపై కొంత ప్రభావమును చూపినది అసలు మహాత్ముని ప్రభావము వారి జీవితముపైనను వారి రచనలపైనను చాలా హెచ్చుగా కలదు. ఈప్రకరణమున దానిని సంగ్రహముగ విశ్లేషింతును.

4.1.1.1 వేష-భాషలు :

తెల్లవారిని తన సత్యాగ్రహాస్త్రముతో ఈ దేశమునుండి పారద్రోలి భారతజాతికి స్వాతంత్ర్యమును సంపాదించుటకుమహాత్ముడుద్యమించెను. ఆయన తన ఉద్యమమును అనేకరూపములలో సాధించుటకుపక్రమించెను. అందు విదేశీవస్తుబహిష్కరణమొక మార్గము. స్వదేశీ వస్తువులనే భారతీయులుపయోగింపవలెను రాట్నముతో నూలుతీయుట ప్రతి భారతీయునకు ఒక పవిత్ర యజ్ఞమయ్యెను. దీని ప్రభావము ఆచార్యులవారిపై ఎంతగనో కలదు. వారి వేషము నిర్మలమై స్వచ్ఛమైన తెల్లటి ఖాదీబట్టలతో సర్వజనాకర్షణీయముగా నుండెడిది, పంచ, జుబ్బాపైన ఉత్తరీయము,ముఖమున శ్రీవైష్ణవచిహ్నములగు ఊర్ధ్వ-

పుండ్రములు గోష్పాదమంత వెనుక జుట్టు, కాళ్ళకు అతు చెప్పులతో వారు ప్రెసిడెన్సీలో చదువుకొనునాటినుండి చివరివరకు ఒకే వేషముతో నుండెడివారు భారతీయ సంప్రదాయమును తాను గౌరవించి, ఇతరులచే కూడా గౌరవింపజేయవలెనను పట్టుదల వారిలో దృఢముగా నుండెడిది.

దేశమునందు అత్యున్నతమైన ఎమ్.ఏ. (ఆనర్సు) పట్టభద్రులైన ప్పటికిని, పాశ్చాత్యపండితులవద్ద, హూణభాషను నేర్చినప్పటికిని, వారికి దైవవాణియైన సంస్కృతభాషపైగల మక్కువ హెచ్చెనే కాని తగ్గలేదు, సరిగదా వారిదృష్టిలో ఇంగ్లీషుభాష దేవవాణికి సేవచేయవలెనను భావముకూడా కలదు. దీనిని వారు "హూణీ మయా శేగభిగా హి దాస్యం" అని స్పష్టము చేసినారు.

ఆచార్యులవారి సంభాషణ సరణిని గూర్చి ఒకఅంశమును వారితో సన్నిహిత పరిచయముగల పెద్దలు చాలామంది చెప్పెదురు-ఈనాడు పాఠశాల చదువులు ముగిసీ ముగియక ముందే వచ్చీరాని ఇంగ్లీషు మాటలను వికృతముగ బలుకుచు తమ ఆంగ్లభాషాపాండిత్యమును బయటపెట్టుకొన విశ్వప్రయత్నములోనున్న మిత్రులనుచూచుచున్నాము. కాని ఇంగ్లీషువారివద్ద ఆ భాషను నేర్చితిననిగానీ, ఉన్నతోపాధి పట్ట భద్రుడనైతిననిగాని, నాలుగు రాష్ట్రముల కధికారిగ పనిచేసితినని గాని ఆచార్యులవారు తమ సంభాషణములలో ఇంగ్లీషును వాడి దాబును, దర్పమును ప్రదర్శించెడివారు కాదట. వారితో నెంతసేపు మాట్లాడినను పల్లెపట్టులందు మాట్లాడు స్వచ్ఛమైన తెలుగు, సంస్కృత పదములే గాని ఎంగిలి ముక్కలవలె ఇంగ్లీషు పదములు దొర్లెడివికావు.

భారతీయులమైన మనకు స్వకీయమైన వేషము, స్వకీయమైన

---

1. ను.వ్య. పు. 2

భాష ఉండవలెను గానీ ఇతరులను అనుకరించి దీనాతిదీనులముగా బ్రతకరాదను వారి భావనకు జీవము పోసినది.మహాత్మాగాంధి మహోదయుడనుటలో సందేహము లేదు.

4.1.1.2 గాంధీజీ ప్రశంస :

ప్రెసిడెన్సీలో ఆదార్యులవారు ఎమ్.ఏ. (ఆనర్స్) చేయుచునపుడు గాంధీమహాత్ముడు దక్షిణాఫ్రికాలో ఉద్యమమును నడుపుట, దానికి సాహాయ్యము చేయవలెనని భారతీయులు తమ తమ శక్తివంచన లేకుండా చందాలను వసూలు చేయుట, ఆ సందర్భమున మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పనిచేయు అధ్యాపకులు,విద్యార్థులు తమకు తోచినంత చందాలను పోగుచేయుట, అప్పుడు శ్రీవరదాచార్యులవారు 500 రూపాయలను ఆ పవిత్ర కార్యమునకు చందాగా ఇచ్చి కళాశాలాధ్యక్షులను, అధ్యాపకులను, విద్యార్థులను ఆశ్చర్యచకితులనొనర్చుట లోగడ (1.1.1.8) పరిశీలించి యున్నాము.

ఆ తరువాత గాంధీమహాత్ముడు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల వారు పంపిన చందాల పద్దులను చూచి శ్రీవరదాచార్యులవారిని గూర్చి తెలుసుకొని, ఎంతో సంతోషపడి ఒక యోగ్యతాపత్రమునిట్లు పంపిరట-

> "దక్షిణ హిందూదేశములో ఒక నక్షత్రము
> ఇపుడిపుడే ఉదయించుచున్నది. ఇది అనేక
> విద్యాసంస్థలకు, ధర్మసంస్థలకు, వైద్యసంస్థలకు,
> దేవస్థానములకు ఆలవాలము కాగలదు."

యువకులుగనే ఆచార్యులవారు మహాత్ముని వలనను ఆయన నడుపు ఉద్యమముల వలనను ప్రభావితులై త్యాగము, క్షమ,దేశభక్తి అంకిత భావములను అలవరచుకొని అవర్ణజీవితమును గడుపసాగిరి

### 4.1.1.3 ఆంధ్రజాతీయ కళాశాల :

కృష్ణాజిల్లాలో సాంస్కృతికముగ బందరునకొక ప్రత్యేకతకలదు. అచ్చట దేశభక్తులు కొందఱుకలసి భారతీయవిద్యలను జాతీయపద్ధతిలో నేర్పు సంస్థనొకదానిని స్థాపించిరి. ఈసంస్థకు సంబంధించిన వివరము లను లోగడ ప్రథమాధ్యాయమున (1.1 I.9) వివరించితిని.

నూనూగు మీసాల నూత్నయౌవనములో ఎమ్.ఏ, (ఆనర్స్) ప్రథమశ్రేణిలో సర్వప్రథములుగ పట్టభద్రులైన వ్యక్తి ఎంతదర్జాతోనో ఉండవలసియుండగా శ్రీవరదాచార్యులవారు జాతీయోద్యమ ప్రభావ భావితమైనమన స్తత్త్వముతో సేవాభావము పొంగిపొరలు ఒకసామాన్య సేవకునివలె బందరులోని ఆంధ్రజాతీయ కళాశాలలో వేతనము తీసికొన కుండా సంస్కృతాధ్యాపక వృత్తిలో చేరిరి. దీనికి కారణము- వారికి మహాత్ముడు నడుపుచున్నజాతీయోద్యమము పైనను, దేశీయమైన విద్యపై నమగల భక్తిప్రపత్తులు మాత్రమే.

తరువాత కొన్ని మాసములకు ఆచార్యులవారికి విజయనగర-ప్రభువుల ఆహ్వానము వచ్చినది. వారి ఆహ్వానమును మన్నించి విజయ నగరమున సంస్కృత కళాశాలాధ్యక్ష్యమును నిర్వహించుచునే, శ్రీవరదాచార్యులవారు తాము ప్రథమోద్యోగమునునిర్వహించిన బందరు లోని ఆంధ్రజాతీయకళాశాల బాగోగులను గమనించుచునేయుండిరి. అంతేకాదు, అచట పనిచేయు ఒక అధ్యాపకునకు జీతము చాలక అవస్థ పడుటను గమనించి, ఉద్యోగమును వదలి వెళ్ళవద్దని, ఆయనకు ధైర్యము చెప్పి కొంతకాలము నెలకు 50 రూపాయల చొప్పున సాహా-య్యము చేసిరి.

శ్రీవరదాచార్యులవారికి ఆంధ్రజాతీయ కళాశాలపై అభిమానము కలుగుటకుగాని, దాని పరిపాలనమున శ్రద్ధ తీసికొనుటకుగాని, తోడ-

అధ్యాపకుడు అవస్థలలో ఉన్నవ్వారు అతనిని ఆదుకొనుట తనకర్తవ్య-మను భావన కలుగుటకు గాని వారిపైగల జాతీయోద్యమ ప్రభావము ముఖ్యకారణమగుచున్నది.

4.1.1.4 దక్షిణభారత పర్యటనము :

అవిభక్త మద్రరాష్ట్రమువగల ఆంధ్ర, తమిళ, కర్నాటక, కేరళ ప్రదేశములలోగల సంస్కృతకళాశాలలను పాఠశాలలను పర్యవేక్షించు-టకగాను 1920 సంలో ఆచార్యులవారిని బ్రిటిషు ప్రభుత్వము "సూప రింటెండెంట్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్" అను హోదాలో అత్యున్నత-పదమున నియమించినది. ఆచార్యులవారికి ప్రభుత్వోద్యోగముపై ఆసక్తిలేకపోయినను సంస్కృత భాషాభివృద్ధికి తనకు చేతనైన సాహాయ్యము చేయుటకు తన జీవిత లక్ష్యమైన సంస్కృతభాషా సేవను నిరాంటకముగ కొనసాగించుటకు ఈ పదవి ఉపయోగించునని అందు ప్రవేశించిరి.

అంతటి ఉన్నతపదవిలో నుండియు వారు ఎంతో సామాన్య వ్యక్తివలె సంస్కృతభాషా సేవకునివలె పల్లెలు గ్రామములు పట్టణ-ములు తిరుగుచు ఒక బంట్రోతు వెంటరాగా, దక్షిణభారతదేశమువగల సంస్కృత విద్యాసంస్థలన్నింటిని సందర్శించి, సాహాయ్యమునందించి సంస్కృతబోధనమునకు అవకాశములేనిచోట్ల కొన్ని కొత్తసంస్థలను పాదుకొల్పిరి. వారు ఉద్యోగము నంగీకరించుటలోగాని, సామాన్య వ్యక్తివలె అన్ని సంస్థలను నిరాడంబరముగ సందర్శించుటలోగాని భారతజాతికి, సంస్కృతభాషకు యథాశక్తి సేవచేయవలెననెడు జాతీ-యతా దృష్టియే ప్రధానకారణమగుచున్నది.

4.1.1.5 ప్రభుత్వోద్యోగమునకు రాజీనామా :

దక్షిణ భారతదేశములోని నాలుగుప్రాంతములలోగల సంస్కృత

కళాశాలలు, సంస్కృత పాఠశాలల స్థితిగతులన్నియు సూపరింటెండెం-ట్గా ఆచార్యులవారి చేతిలో కలవు. అధికారము చాలా గొప్పది. అంతకంటెను వారు మనసారా సంస్కృతభాషకు సేవచేసికొను అవ-కాశము పరిపూర్ణముగా గల ఉద్యోగము. అయినప్పటికిగాంధీమహాత్ముడు ఇచ్చిన పిలుపునకు ప్రతిస్పందించి సహాయ నిరాకరణోద్యమమును అమలు చేయుటకై ఆచార్యులవారు సూపరింటెండెంట్ పదవికి రాజీ-నామా చేసిరి. వారి నిర్ణయమునకు బంధుమిత్రులందరు ఆశ్చర్యపడిరి. దేశభక్తులు సెబాసు పలికిరి.

దీనిద్వారా ఆచార్యులవారికి మహాత్మునిపైగల శ్రద్ధ, ఆయన ఉద్యమములపైగల ఆదరము తెలియుచున్నది. మహాత్మునిప్రభావము, జాతీయోద్యమ ప్రభావము శ్రీవరదాచార్యులవారిపై పుష్కలముగ కలదని నిరూపించుటకు ఇటువంటి సంఘటనలు ప్రముఖోదా-హరణములు.

4.1.1.6 సంస్కృత కళాశాలా స్థాపనము :

విదేశీయులనుండి ఎన్నిఆహ్వానములు వచ్చినప్పటికిని, శ్రీవరదా-చార్యులవారు మొదటనుండియు స్వదేశీయులకు సేవ చేయవలయు-ననియు, స్వదేశీయులు బానిసలుగ నిరక్షరాస్యులుగ నిరర్థకమైన జీవితమునను భవించుచుండగా తాము విదేశముల కేగుట అనుచిత-మనియు తలంచెడివారు. తన శక్తిసామర్థ్యములను తనవారికొఱకు వెచ్చించి వారిని అభివృద్ధికి తీసికొని రావలయునను పట్టుదల, దీక్ష వారిలో ఎప్పుడూ కనపడుచుండెడివి. గాంధీమహోదయుని ప్రభావము పూర్తిగా ఆచార్యులవారిపైనుండుటవలననే తన చదువు సంస్కారము-తెలివితేటలుచుట్టూ ఉన్న స్వదేశీయులకు ఉపయోగించి మాతృ-

భూమి ఋణము తీర్చుకొనవలెనని వారి మనసు ఎప్పటికప్పు-డువిప్పొంగుచుండెడిది.

ఈ దేశమునకు వెన్నెముక అధ్యాత్మిక చింతన, అదిలేనినాడు ఇతర దేశములలోవలెనే మనదేశమునందును స్వార్థపరుల ఆగడములు మితిమీరిపోయి, అసూయ, ద్వేషము, హింస, విలయతాండము చేయును, కనుక అధ్యాత్మిక వాఙ్మయము అందటికి అందుబాటులోనికి రావలయును. అనాటి సమాజమున సంస్కృతభాషను అందఱును నేర్వకూడదను విపరీతభావనలుండెడివి. అధ్యాత్మికవాఙ్మయమంతయు సంస్కృతభాషలోనే కలదు. కనుక ఈ దేశమునకు పట్టిన పీడ విరగడ కావలెననిన ప్రతివారును సంస్కృతభాషను నేర్వవలెను. అట్లు అందటికిని సంస్కృతభాషను నేర్పుటకు ఎందఱు పండితులు ముందుకు వత్తురు? ఒకరిద్దరుకూడా అట్లు ముందడగు వెయువారు కనుపడలేదు. కనుకనే శ్రీవరదాచార్యులవారు నడుము కట్టినారు. "నా వారైన భారతీయులు అజ్ఞానులుగ నుండరాదు జ్ఞానమును సంపాదించుటకు అందఱికిని అధికారము కలద"ని స్వతంత్రముగ చిట్టిగూడూరు అను తమ స్వగ్రామమైన ఒక కుగ్రామమున తండ్రిపేరుతో "శ్రీనారసింహ సంస్కృత కళాశాల"ను స్థాపించిరి. సంస్కృత కళాశాల స్థాపించు-టయేగాక దానికొక భవనమును కట్టించి స్థిర-చరాస్తులను ఏర్పాటు చేసిరి ఆంధ్రదేశము నలుమూలలనుండి వీరు వారను భేదములులేక అన్ని వర్గములవారు వచ్చి చిట్టిగూడూరు సంస్కృత కళాశాలలో విద్యార్థులై చదువుకొనిరి.

శ్రీవరదాచార్యులవారి కృషి విశేషమువలన మూరుమూల పల్లె-

యైన చిట్టిగూడూరునకు దేశమంతట చాలా మంచిపేరు వచ్చెను. చిట్టి-గూడూరు కళాశాల విద్యార్థియని చెప్పుకొనిన చాలు దేశమునందన్ని చోట్లను మంచి గౌరవప్రతిపత్తులుండెడివి

ఇట్లు శ్రీవరదాచార్యులవారు స్వదేశమును, స్వదేశీయులను దేశభాషను గౌరవాదరములతో సేవించుటకు, సంస్కృత కళాశాలను స్థాపించుటకును, వారి జీవితమునంతటిని స్వదేశీయుల సేవకు అంకిత మొనర్చుటకును ముఖ్యకారణము-మహాత్ముని ఆదర్శములను ఆదేశ-ములను వారు అనుసరించుటయే. వారు పాల్గొనిన అనేక జాతీయోద్య-మముల ప్రభావము ఆయన మనస్తత్త్వముపై చెరగని ముద్రను వేసి-నది. దానివలననే వారు జీవితాంతమును ఆ ఆదర్శములకు కట్టుబడియే యుండిరి.

4.1.1.7 మహాత్మా గాంధీకి జై !

చిట్టిగూడూరు శ్రీనారసింహ కళాశాలకు శ్రీపురాణం సూరిశాస్త్రి గారు వర్ధశాలలో గల తమ భవనములను ఇచ్చినారు వర్ధశాల బందరు-విజయవాడ రోడ్డులో చిట్టిగూడూరునకు దగ్గఱలో కలదు. కొంతకాలము కళాశాల ఆ భవనమునందే జరిగినట్లు ఇంతకు పూర్వమే (1.1.1.20) వివరించినాము. ఆ రోజులలో వర్ధశాలలోగల విద్యార్థులు కొందఱు, ఒక ప్రభుత్వాధికారి వాహనములో ఆరోడ్డుపై పోవుచుండగా బిగ్గఱగా "మహాత్మా గాంధీజీకి జై" అని జయనినాదము చేసినారు. కొంత సేపటికి మిలటరీ పోలీసులు గుంపులు గుంపులుగా విద్యార్థులపై దూకినారు. కనపడిన వారందఱిని చావచితక గొట్టినారు.ఈ విషయము చిట్టి గూడూరులో గల శ్రీవరదాచార్యుల వారికి తెలిసినది వారు వెంటనే వర్ధశాలకు వచ్చి పోలీసులకు సర్దిచెప్పి పంపినారు.కాని జిల్లాకలెక్టరు ఆ అంశమును విడువక చాలా రోజులవరకు కళాశాలపై నిఘా యుంచినాడు.

కొంతకాలమునకు వరదాచార్యులవారు జిల్లా కలెక్టరును స్వయముగ కలిసినారు. అతడు పాశ్చాత్యుడు. ప్రభుత్వపు ఆదేశమునను సరించి మహాత్మునికి అనుకూలముగా నున్న వారందరిని హింసించుటలో వెనుదీయనివాడు. ఆచార్యులవారు అతనితో చర్చించి ఒప్పించి ఆ అభియోగమునుండి అతనిని విరమింపజేసినారు.

అపుడు ఆచార్యులవారు తమ కళాశాలనుగూర్చి, దానిని తాను ప్రారంభించి అభివృద్ధికి తీసికొని వచ్చిన తీరునుగూర్చి తమ విద్యార్థులనుగూర్చి భారతీయసంస్కృతినిగూర్చి కలెక్టరుతో మాట్లాడిన పైఖరి న్యాయబద్ధముగ వారొనర్చిన వాదము పాశ్చాత్యుడైన ఆ జిల్లాధికారిని సైతము ఆశ్చర్యమునముంచెత్తినదట. వారిలో ఎంతటి జాతీయదృక్పథము సాహసములు కలవో ఈసంఘటననుబట్టి మనమూహింపవచ్చును.

4.1.1.8 ఎ.జె. కళాశాల :

బందరులోని ఆంధ్రజాతీయ కళాశాల ఈ శతాబ్దారంభమున పట్టాభి, ముట్నూరి, కోపల్లెవంటి ప్రముఖులద్వారా జాతీయవిద్యావ్యాప్తికొఱకు స్థాపించబడినదని ఇంతకుపూర్వము(1.1.1.9) చెప్పితిని. ఆ కళాశాలయందే శ్రీవరదాచార్యులవారి ప్రథమోద్యోగము. బందరులోని పెద్దలందరును ఆ కళాశాలకు కొంతఆస్తినికూడ సంపాదించిపెట్టిరి. అటువంటి జాతీయకళాశాల ఎక్కువకాలము సక్రమముగ జరుగలేదు. దానికి సంబంధించిన ఆస్తులన్నియు అన్యాక్రాంతములై పోయినవి. పరిపాలకుల ఆదరరాహిత్యము అసమర్థత, అలసత్వములవలన దాని స్వరూపమే మారిపోయినది.

1949వ సం॥ దానినుద్ధరించుటకు బందరులోని పెద్దలు, పెద్దలైన శ్రీవరదాచార్యులవారినే ఆహ్వానించిరి. వారు జీతము తీసికొనకుండా కళాశాలకు అధ్యక్షులుగ, పనిచేయుచు ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు

అనుబంధ కళాశాలగా దానిని రూపొందించిరి. సమాజమునకు అవసర-మైన చదువులను అందించు సంస్థగా దానిని తీర్చిదిద్దిరి. ఆ సంస్థకు గల అప్పులన్నింటిని అన్యాక్రాంతముగానీయక తిరిగి సంపాదించి, కళాశాలను ఉన్నతస్థితిలోనికి తీసికొనిపోయిరి.

అప్పటినుండి ఎ.జె. కళాశాలగా బందరులోగల మిగత కళాశాలల కంటే మిన్నగా ఈ కళాశాల తీర్చిదిద్దబడినది. దానికనుబంధముగా వారి ప్రేరణతో ఆంధ్రరాష్ట్రమున ఏర్పడిన ఓరియంటల్ ఉన్నతపాఠశాలను ఏర్పాటుచేసిరి. తరువాత కొంతకాలమునకు వారు ఆంధ్రజాతీయ కళా-శాలకు కార్యదర్శిగా ఎన్నుకొనబడిరి. వారి కార్యదర్శిత్వమునందే ఎ. జె. బి.ఇడి, కళాశాలనుగూడ బందరులో స్థాపించిరి. ఇట్లు సంస్థయొక్క అప్పులను కట్టుదిట్టము చేయుటయేగాక, ఇంకను రెండు సంస్థలను దానికనుబంధముగ తయారుచేయుటలోను, వేతనరహితముగ తన దారిఖర్చులనుకూడా తానే భరించుచు చాలా సంవత్సరములు సేవ చేయుటలోను వారిలోని జాతీయమగు అంకితభావము, మహాత్ముని మార్గమున పయనించుట అను లక్షణములు స్పష్టముగ తెలియు చున్నవి.

4.1.2 రచనలు :

ఇంతవరకు గాంధీమహాత్ముని ఆదర్శముల ప్రభావము అయన నడిపిన జాతీయోద్యమప్రభావముల శ్రీవరదాచార్యులవారిజీవితముపై ఎంతవరకు గలదను అంశమును సోదాహరణముగ నిరూపించితిని. ఈ ప్రకరణమున వారి రచనలలో అక్కడక్కడ పైప్రభావములెంతవరకు కనబడుచున్నదను విషయమును సంగ్రహముగా పరిశీలింతును.

ఇంతకు పూర్వమే (1.1.2.5) చెప్పినట్లు ఆచార్యులవారు కొన్ని స్వతంత్ర రచనలను కొన్ని అనువాదములను సంతరించి సంస్కృత

భారతిని సమారాధనమొనర్చిరి. అందులో భాషాశాస్త్రముపైసంస్కృత భాషలో రచించిన "భాషాశాస్త్ర సంగ్రహము"వారి ప్రథమ రచన. ఇది కేవలము భాషల స్వరూప పరిశీలనము చేయునదిగాన ఇందు పై ప్రభావముండుటకు వీలులేదు. కానీ అప్పటివఱకు అంగ్లభాషలో ఎన్నో విధములుగ విస్తరించిన భాషాశాస్త్ర సిద్ధాంతములను అంగ్లభాషా-నభిజ్ఞులగు భారతీయ సంస్కృత పండితులకుకూడా అందుబాటులోనికి తీసికొనిరావలెనను జాతీయదృష్టితోనే సంస్కృతమున వారు భాషా-శాస్త్రసంగ్రహమును రచియించియుందురని ఊహించుటకు వీలగు-చున్నది.

భాషాశాస్త్రమును రూపొందించినవారు మొదట పాశ్చాత్యులైన-సను, ఎవరిలోనైనను గుణమును గౌరవింపవలెనను భావముతో ఆచార్యులవారు ఆ శాస్త్రమును సంస్కృతమునందు సంగ్రహముగ వ్రాయుట, ఇతరులలోని గుణములను మాత్రము గ్రహించు ఆదర్శము వారికి కలదని నిరూపించుచున్నది.

వారి రెండవరచన సుప్తిప్వృత్తము. ఇది కేవలము జాతీయ దృష్టితో అవతరించిన భారతదేశాభ్యుదయ కావ్యము అందుమహాత్ము-నిపై వారికిగల భక్తి-శ్రద్ధ, స్వదేశముపై వారికిగల గౌరవము ప్రతిపదమునందును స్పష్టమగుచున్నది. దీనిని ముణ్ముందు (4.1.2.1) పరిశీలింతము.

మూడవరచన "న వేద్వాల్మీకి రథవిష్యత్" అను లఘుకృతి, ఇందు సాక్షాత్తుగా జాతీయతా భావనలను ఆవిష్కరించు అవకాశము లేకపోయినను ఒకటి రెండు తావులలో జాతీయతా స్పర్శ లేకపోలేదు.

నాల్గవ రచన "సత్యవిజయము" గాంధీజి సత్యమును నమ్మి బాల్యమునుండియు దానికొఱకు తన జీవితమును అంకితము చేసి

మహాత్ముడైనాడు. కనుక ఆ మహాత్ముని బాల్యసంఘటన. దానివలన ఆయనలో వచ్చిన మార్పును అర్థము జేసికొని, తన జీవిత సర్వస్వమును సత్యాసిధారావ్రతమునకు నిలబెట్టిన సత్యహరిశ్చంద్రునికథను ఇతివృత్తముగా తీసికొని రచించినకావ్యమే సత్యవిజయము. భారతీయులకు సంబంధించిన మౌలికమైన విలువలలో సత్యమే ప్రధానమైనది కాబట్టి, మహాత్మునిలో దానిని పరిపూర్ణముగా అనుభవించిన ఆదార్యుల వారు తత్ప్రభావముచేతనే ఈ కావ్యమును రచించినారని చెప్పుటకు వీలగుచున్నది.

ప్రాస్తావికకదంబమున కొద్ది ఖండికలలో జాతీయ ప్రభావము మనకు కనపడుచున్నది.

శ్రీవరదాదార్యులవారు తొమ్మిది శతకములను తెలుగునుండి సంస్కృతమునకు అనువదించిరి. అనువాదములలో జాతీయతాదృష్టికి అవకాశములేదు. కాని ఒక సాహిత్యములోగల మాధుర్యమును, నీతిని ఇరుగు పొరుగు సాహిత్యముల వారికి పరిచయము చేయుటకు వారు సంస్కృతానువాదములను చేపట్టి కృతకృత్యులైరి. ఇరుగు పొరుగు రాష్ట్రముల వారికికూడా తెలుగుశతక సాహిత్యములోని గొప్పదనమును పరిచయము చేయవలెనను ఉదాత్తాశయము కలుగుటకు "భారతజాతి అంతయు ఒక్కటే" అను జాతీయభావన చాలా అవసరము. కనుక శతకానువాదములు చేయుటయందును వారికిగల విశాలదృష్టిని మనము అర్థము చేసికొనవచ్చును.

4.1.2.1 సుప్తిప్రవృత్తము :

అనాది దేశపరిస్థితులు ప్రాచీన భారత వైభవమును దిగజార్చివేసినవి. కాని బ్రిటిషువారి పరిపాలనలో ఎవరును నోరుతెరచి ప్రభుత్వమును విమర్శించుటకువీలులేదు. మనదేశము స్వతంత్రదేశముకావలె-

పని కోరుకొనుటయు ఆనాడు రాజద్రోహముగా పరిగణింపబడినది. ఉన్నతోద్యోగములన్నియు పరిపాలకుల చేతిలో నుండినవి. భారతీ-యులు గుమాస్తాలుగా పనిచేయుటయేగాని అధికారులుగ పనిచేయు హక్కులేదు. మనవారు బానిసలుగ అలమటించవలసిన దీనస్థితిలో నుండిరి. భేదోపాయముతో తెల్లవారు నాటకములాడుచున్నను నోరు తెరచి చెప్పుటకు ఎవ్వరికిని సాహసములేదు. 1835లో మెకాలే చెప్పి-నట్లు[1] మనవారు ఆకారమున భారతీయులేగాని భావనలలో దాదాపు ఇంగ్లీషువారుగనే మారిపోవుచుండిరి. అటువంటి విషమపరిస్థితులలో దేశమున్నపుడు తన స్వప్నమునందు జరిగిన వృత్తాంతమును ఇతి-వృత్తముగా తీసికొని శ్రీవరదాచార్యులవారు "సుషుప్తివృత్త"మను కావ్యమును రచించిరి. ఇందు శ్లేషాదులద్వారా, వ్యంగ్యముగాను, వాచ్యముగాను ఆనాటి స్థితిగతులను మహాత్ముని ఔన్నత్యమును అభి-వర్ణించిరి. ఈ కావ్యమునకు కేవలము జాతీయస్పృహయే నిదాన-మగుచున్నది.

4.1.2.1.1 ఖద్దరు

గాంధీజీ పిలుపునందుకొని విదేశీవస్త్ర బహిష్కారము చేసిన స్వాతంత్ర్యయోధులందఱు ఆనాడు ఖద్దరునే ధరించెడివారు. మహాత్ముడు తన ఆశ్రమమున తాను నూలు వడికి, అందఱి చేతను నూలు వడికిం-చెడివాడు. ప్రతిపట్టణమున, ప్రతి గ్రామమున అందఱును సూత్రయజ్ఞ మనుపేర రాట్నములతో నూలు తీసెడివారు, ఆనేత వస్త్రములనే చాలా

---

1. The aim is to produce a class of persons Indian in Blood and colour but English in taste, opinions in morals and intellect.

Balu, V., The glory of Puttaparthi, P. 116.

మంది ధరించెడివారు. స్వచ్ఛమైన తెల్లటి నూలువస్త్రములను ధరించుట ఆనాటి దేశభక్తులకు ఒక వ్రతమైనది.

శ్రీవరదాచార్యులవారు ఈ ఖద్దరు వస్త్రములను ప్రశంసించు సందర్భ మీ కావ్యమున కలదు-

గాంధీమహాత్ముని ఉద్యమమును,ఆయన పురుషోత్తమత్వమును ప్రశంసించుచు కావ్యమును వ్రాయుడని ఆచార్యులవారికి ప్రేరణనిచ్చిన వారు విజయనగరం మహారాణిగారు. ఆ మాట వాచ్యముగ చెప్పకనే ధ్వనించునట్లు కావ్యారంభమున ఆచార్యులవారు ఆమె నిట్లు స్మరించిరి-

వినిర్మలం లోకహితం విధాత్రు
వాసః స్వచేతస్సదృశం వసానామ్।
స్మితానుయాతేన సుసంస్కృతేన
ప్రహర్షయిత్రీం వచనోపచేష్టిమ్॥

మహాత్మ నామ్నో గ్రహణే శ్రుతౌ చ
ప్రఫుల్లనేత్రాం వినిమీలితాక్షీమ్।
సత్సంగ సమ్మోద నికామ తృష్టాం
పరేంగితజ్ఞామిహ తాం స్మరామి॥

విజయనగరం మహారాణి గాంధీమహాత్మునియందు ఎంతో భక్తి-ప్రపత్తులు గలది.ఆమె స్వచ్ఛమైన తెల్లఖద్దరు చీరలను ధరించెడిదట. ఆ ఖద్దరును "లోకహితమును కలిగించునది నిర్మలమైన ఆమె మనస్సు-నకు ప్రతిబింబమువంటిది" అని చెప్పారు ఆచార్యులవారు మహాత్ముని

---

1. ఆద్యయా రామభక్తానాం రాజమౌళేర్ద్వితీయయా।
తృతీయయా రమావాచోః రీశ్వర్యాస్మిహ చోదితః॥
సం.స్వ. 1

ఉపదేశములను మనకు జ్ఞాపక మొనర్చుచున్నారు. మన వస్త్రములను మనమే తయారు చేసుకొనినచో ఇతర దేశములపై ఆధారపడవలసిన అవసరముండదని "లోకహితం విధాత్ర" అని చెప్పినారు.

అర్లే మహాత్మ శబ్దమును ప్రయోగించి గాంధిమహాత్ముని ప్రతీతి కలుగుజేసి, ఆనాడు ఆయనపేరుమ ఉచ్చరించినపుడు, వినినప్పుడు ప్రజలకు ఎంత ఆనందము కలుగుచుండెడిదో వివరించినారు.

4.1.2.1.2 మహాత్మ నమస్కారము :

గాంధీమహాత్మునకు నమస్కరించుచున్నట్లు ఆనాటి తెల్లప్రభుత్వమునకు తెలియకుండగనే ఆయనకు ఆదార్యులవారు నమస్కరించినారు. అదెట్లు కుదురును? సమాజశ్రేయస్సును ఆకాంక్షించు సత్కవులకు కుదురనిదేముండును?

మహాబలియైన బలిచక్రవర్తి దర్పమును కపటయాచకుడై పోగొట్టిన పురుషోత్తముని వామనమూర్తికి ఇట్లు ప్రణమిల్లినారు-

"నమః కపటయాచిత్రే ధృతవామనమూర్తయే!
పురుషోత్తమ భూతాయ బలిదర్పవిదారిణే!"

ఈ శ్లోకమున సహజముగ పొట్టివాడు పురుషోత్తముడు కపటముగ సత్యాగ్రహ నినాదముతో దేశస్వాతంత్ర్యమును యాచించి, బలవంతుడైన బ్రిటిష్ వారి దర్పమును అణచినవాడగు సుమస్తివృత్త కథానాయకుడు గాంధీమహాత్ముడు గోచరించినాడు. నమస్కారమునందు కొనినాడు. ఈ శ్లోకమునందు నమస్కరింపబడిన పురుషోత్తముడే ద్వితీయసర్గలోని పరంజ్యోతి. తృతీయసర్గలోని పురుషోత్తమ సందేశము ఈ మహామహుని సందేశమే.

మన దేశమునకు 1947లో స్వాతంత్ర్యము లభించినది అప్పటికి పది సంవత్సరములకు ముందు అనగా 1937 నాటికి మహాత్ముడు

ఈ దేశమునకు స్వాతంత్ర్యమును గొనివచ్చుటకు అవతరించిన పురుషోత్తమునిగనే భారతీయులు భావించిరి. తెల్లదొరతనము వారి దుష్పరిపాలనలోనే మహాత్ముని యందలి భక్తి శ్రద్ధలను దేశభక్తిని ప్రకటించి శ్రీవరదాచార్యులవారు ఎంతటి సాహసము చేసినారో మనము గ్రహింపవచ్చును.

4.1.2.1.3 శ్రీరాముని త్యాగశీలము :

కావ్యనాయకుడైన మహాత్మునకు కవియైన ఆచార్యులవారికిని ఆరాధ్యదైవము అయోధ్యాధిపతి రఘుపతియైన శ్రీరామచంద్రుడు. మహాత్ముడన్నివేళలయందు "రఘుపతి రాఘవ రాజారాం పతితపావన సీతారాం" అను దివ్యనామమును జపించునట్లు చివరి ఘడియలలో కూడా "హే రామ్" అనుచు అసువుల బాసినట్లును మనము తెలిసికొనుచున్నాము.

ఆచార్యులవారికి కూడా శ్రీరామచంద్రునియందు భక్తిప్రపత్తులు కలవు. రామాయణము వారికి నిత్యపారాయణ గ్రంథము. రఘువంశము వారికెంతో ఇష్టమైన కావ్యము. వారి రచనలలో "న వేద్వాల్మీకి రథపిష్యత్" అనురచన-వాల్మీకి, రామాయణము, శ్రీరామచంద్రుడు అను మూడుఅంశములపైన నడచినది. సత్యవిజయ కావ్యమును వారు తమ ఇష్టదైవమగు శ్రీరామచంద్రునకు అంకితము చేసిరి. అనూదితములగు శతకములలో దాశరథి శతకమునకు వారొనర్చిన అనువాదము మహోన్నతమైనది వార్ధకమున కొద్దిసంవత్సరములు వారు భద్రాచలమునందుండి శ్రీసీతారామచంద్ర ప్రభువుల సేవలో తమ జీవితమును ధన్యమొనర్చుకొనినారు. జీవితాంతమున శ్రీమద్రామాయణమును అహర్నిశలు అనేకమార్లు పారాయణము చేయుచు మౌనముగ గడిపినారు.

అంతటి రామభక్తి వారిలో కలుగుటకు ముఖ్యముగా వారినాకర్షించినది శ్రీరామునిలోని త్యాగగుణము, అదియే మహాత్మునికి

కూడా మార్గదర్శకమైనది. శ్రీరామునిలోని త్యాగమును వారు మూడు దశలుగ విభజించి ఈ శ్లోకమున వర్ణించిన తీరు సంస్కృత సాహిత్యము నందే అద్వితీయము.

సంత్రాతుమిష్టం పితరం స్వకాత్యే
పితుర్వచః పాలయితుం ప్రజాశ్చ।
ప్రజాస్సమారాధయితుం చ దారాన్
తత్యాజయస్తం ప్రణమామి భూపమ్॥

విశ్వామిత్ర యాగసంరక్షణ కొఱకు తండ్రిని, తండ్రిమాటను నిలబెట్టుటకు అయోధ్యలోని ప్రజలను, ప్రజారాధనము కొఱకు నిండు చూలాలగు భార్యను పరిత్యజించిన భూపతికి నమస్కరించుచున్నానని శ్రీరామచంద్రుని వ్యంజింప జేసినారు.

అనాటి దేశవిమోచనోద్యమమునకు మహాత్మునకు గాని, ఆయన అనుయాయులకు గాని కావలసినది త్యాగశీలము. దానికి ఆదర్శ పురుషుడు మర్యాదా పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు. కనుకనే వారి రామభక్తి అచంచలమై లోకకళ్యాణమును సాధింపగలిగినది.

4.1.2.1.4 భారతదేశ వర్ణనము :

సుషుప్తివృత్తమున భారతీయ ప్రాచీన వైభవమును కొన్ని శ్లోకములలో వర్ణించి, అనాడు దేశమునకు పట్టిన అధోగతిని గూడ ఎంతో ఖేదముతో ఆచార్యులవారు అభివర్ణించినారు. ఇటువంటి వర్ణనము చేయవలెనన్న ఎంతో జాతీయ భావనగల హృదయము కావలెను.

అంతగొప్ప సంపదగల భారతభూమి ఈనాడు, భూకంపము వలన పూర్వవైభవము అడుగంటిపోగా, క్రొత్తగా నిర్మాణములు జరుగు

చున్న ప్రదేశమువలె నున్నదని[1] డబ్బుతో విద్యార్థి గురువునుండి విద్యను కొనుచున్నాడని[2] నిజమైన జ్ఞానమునిచ్చు వేదాది విద్యలను విడచి విప్రులు విత్తము నిచ్చువిద్యల వెంటపడుచున్నారని[3] ఇతరు-లకు ఉపకారమొనర్చుటకు చేపట్టిన గృహస్థాశ్రమము స్వభోగానుభవము కొఱకే మిగిలిపోవుచున్నదని[4] వానప్రస్థాశ్రమమున ప్రవేశించు

---

1. అయం స దేశః స్పృహణీయ సంపత్
అన్యాదృశీమద్య బిభర్తి రీతిమ్।
భూకంపతో నష్ట పురాణభూతిః
ప్రక్రాన్త నిర్మాణ ఇవ ప్రదేశః॥
సు.వృ. 1-26

2. భిక్షామటన్ వీతసుఖో గురోర్యః
శుశ్రూషయాఽభూత్సముపాత్త విద్యః।
స భోగ తృష్ణశ్చ మహాభిమానీ
క్రీణాతి విద్యాం గురుతో ధనేన॥
అందులోనే 1.28

3. వేదాంస్తదఙ్గాని చ యాని సర్వే
ద్విజన్మను జ్ఞానకృతే సపాఠః
వీత స్పృహస్తేషు స కాన్యధీతే
విద్యాస్పృహో విత్తకరీషు రక్తః॥
అందులోనే 1.29

4. యో బ్రహ్మచర్యవ్రతపారణాదిః
ధర్మ ప్రజోత్పత్తి పరాపరశ్చ।
సర్వోపకారార్థమనుప్రవిష్టః
నిజోపభోగాయ స ఆశ్రమోఽస్తి।
అందులోనే 1-30

వారే ఎవ్వరూ లేరని[1] తురీయాశ్రమమునందు ప్రవేశించు విరక్తుల సంఖ్య తగ్గిపోయినదని[2], చాతుర్వర్ణ్యము వారి వారి గతులను తప్పినదని,[3] ఎంతో ఖేదముతో వివరించి, అందువలన ఈ దేశము ఇతరులకు దాస్యము చేయవలసి వచ్చినదని ఇట్లు స్పష్టమొనర్చినారు-

తదస్య దిష్టం విషయస్య దాస్యం
అసీత్పరేణ క్రమశః పరేషామ్।
క్షీణే వటుత్వే జరయాహి దేహం
వశ్యత్వ మాయాతి రుజాక్రిమీణామ్॥[4]

---

1. నిర్విశ్య భోగాననుభూయ దుఃఖం
ప్రసూతిముత్పాద్య గృహీ చ యత్ర।
పత్న్యా ద్వితీయో వనమావివేశ
శాన్తం ప్రశాంత్యై ప్రవిలుప్త విషః॥
సు.వృ. 1.31.

2. సమీక్ష్య సంసారమసారమస్మాత్
విరజ్య సంన్యస్త సమస్త సంగః।
యథా స్థితో ద్వంద్వచయో వ్యతీత్య
బ్రహ్మాశ్రితోఽభూద్విరలోఽస్తి తుర్యః॥
అందులోనే 1.32

3. స్వధర్మచర్యాచ్యుతి మేవ మేత్య
ధనార్థినః స్వార్థపరాశ్చ సర్వే।
యుద్ధ్వా మిథః శ్వాన ఇవామిషాయ
నీచాః పరైస్తే వ్యవశం సృగాలైః॥
అందులోనే. 1.48

4. అందులోనే 1.49

ఇచ్చట ఉత్తరార్ధమున ప్రయోగించిన అర్థాంతరన్యాసాలంకారమున తెల్లవారిని రోగముల బెంచు పురుగులని ధ్వనింపజేయుటలో వారికి గల జాతీయదృష్టి, దేశభక్తి, భారతదేశము ఇంతగా చెడిపోయినదను బాధ విశదమగుచున్నది.

**4.1.2.1.5** భేదోపాయము :

జాతీయోద్యమమువలన ప్రభావితులైన శ్రీవరదాచార్యులవారు తెల్లవారి కూటనీతి నిట్లు వ్యంగ్యముగ వివర్ణించిరి.

తమ స్వార్థమునకు అడ్డురాని విధముగ విద్యావంతులకు "సర్" అని "మహామహోపాధ్యాయ" అని బిరుదు ప్రదానములను చేయుచును, బహుమతుల ప్రకటించుచును, శూరులైన సంస్థానాధీశులకు "రావు బహద్దర్" మొ॥ బిరుదుల నిచ్చుచును, దానోపాయముతో వారిని తమ వశమునందుంచుకొని, కుటిలనీతిలో రాజ్యము నేలుచున్న బ్రిటిషువారు, భేదోపాయ ప్రయోగమునందును సిద్ధహస్తులు. ప్రజలు ఐకమత్యముతో నున్నచో తమ రాజ్యమంతరించగలదను సత్యమును తెలిసికొన్న తెల్లవారు, దాక్షిణాత్యులు, ఔత్తరాహులను, దేశభేదము, వర్ణభేదము, హిందూ ముస్లిం అను మతభేదము, భాషాభేదము మొ॥ భేద భావనలకు భారతీయులలో బీజావాపము జేసిరి. వారు ప్రయోగించిన భేదోపాయము వారి పరిపాలనకు ఎవరి అడ్డులేకుండా విజయము సాధించి పెట్టినది.[1]

---

1. నృపా యదాత్మస్థిరతా విలోపి
   ప్రజాసు జిఘ్రుస్త్యపి భేదవశ్యమ్।
   వైమత్య బీజాని వపన్తి తత్ర
   భేదో హి నీతిర్విజయే బహూనామ్॥
   ము.వృ. 1.52

మనదేశమునకు స్వాతంత్ర్యము సంపాదించి 41 సంవత్సరములు గడచినప్పటికిని వారు ఆనాడు నాటిన అనైక్యతా బీజములు అంకురించి, పెరిగి పెద్దవై మహావృక్షములై ఈనాటికిగూడ ఐకమత్యములేకుండా భారతజాతి భిన్నాభిన్నమగునట్లు చేయుచున్నవి.

4.1.2.1.6 పరంజ్యోతి :

దాస్యాంధకారమగ్నమైన భారతజాతినిసముద్ధరించుటకు ఉద్భ-వించిన పరంజ్యోతి గాంధీమహాత్ముడని ఆ తరపు భావన. దానినే ఆచార్యులవారు ఆలంకారికముగ సుషుప్తివృత్తమునందలి ద్వితీయ-సర్గలో అభివర్ణించినారు. దగ్గఱకుచేరి చూడగా అది జ్యోతికాదు సాక్షాత్ పురుషోత్తముడేనని తెలిసినదని స్పష్టము చేసినారు.[1] ఈ దేశభాగ్యము నకు భారతజాతి బంగారుకలలను నిజము చేయుటకుదయించిన పురు-షోత్తముడు మహాత్ముడని "పురుషోమత్తమ భూతాయ" అని కావ్యా-రంభమున ఆచార్యులవారొనర్చిన ప్రతిజ్ఞతో ఇచ్చట సమన్వయము కుదురుచున్నది.

4.1.2.1.7 దేశదుఃస్థితి :

పరతంత్రమైన భారతదేశ దుఃస్థితి శ్రీఆచార్యులవారి మనసును కలచివైచినది. ఈ కలతతోనే వారు నిద్రించి స్వప్నమున పరంజ్యోతి-యైన పురుషోత్తముని దర్శించినారు. పురుషోత్తమ దర్శనమైనందుకు

---

1. ఆసీదతేదం హ మయా పరార్ధః
ఆరోహయుక్తః పరిణాహవాంశ్చ।
తతః కరాద్యావయవైశ్శరీరీ
క్రమాద్విబుద్ధం పురుషోత్తమశ్చ॥
సు. వృ. 2.8

సంతోషపడి ఆయనను స్తుతించినారు. ఇంతవరకు రెండుసర్గలు పూర్తియైనవి. ఇక మూడవసర్గలో పురుషోత్తమసందేశము ప్రారంభమైనది. అందు ఆచార్యులవారితో పురుషోత్తముడు చెప్పిన మాటలు మహాత్ముడు వారితో అనిన మాటలే అని అనిపించుచున్నవి.

"ఈదేశదాస్యమును మనసారా భావించి ఖిన్నుడవై నావద్దకు వచ్చితివి."[1]

"నీదేశ దుఃస్థితికి కారణములను వివరించుచున్నాను- స్వకీయ వస్తువులపైనను స్వసంప్రదాయములపైనను అనాదరము, ద్వేషము' ఇతరులకుసంబంధించిన వాటిపై దురభిమానము భారతీయసంస్కృతిపై అవిశ్వాసము, కామార్థముల రెండింటినే పురుషార్థములుగా ఎంచుట, కొందఱిని అంటరానివారని దూరముగా నుంచుట మొ॥ కారణముల వలన ఈ దేశమునకు ఇంతటి దుఃస్థితి వాటిల్లినది.[2]

ఈ భావనములన్నియు మహాత్ముడు అనేకచోట్ల తన ఉపన్యాస-ములలోను రచనలలోను ఈ దేశ దుఃస్థితినిగూర్చి అవిష్కరించినవే. వాటినే ఆచార్యులవారు పరోక్షముగా పురుషోత్తమ సందేశమున అభి-వర్ణించినారు.

---

1. స్వదేశదాస్యం ప్రవిచిన్త్య ఖిన్నో
మామేవ గచ్ఛస్ శరణం హృదిత్యమ్।
సాక్షాత్కృతిం తత్ప మమ ప్రపన్నః
ఆవర్జనీయస్య మదీశచిత్తైః॥
పు.స. 3.2
2. అనాదరం ద్వేషమపి స్వకీయే
ప్రాచ్యాఖిలే వస్తుని పీతబుద్ధిః।
పరస్య సంబంధిని బద్ధరాగో
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

శబ్దప్రమాణం చ తథాపవర్గః
పరప్రకారాయ ఫలస్య వృష్టిః।
ఇత్యన్యమాత్మానమపి ప్రకార్య
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

ప్రత్యక్షమానం చ తథానుమానం
ప్రమాణయన్ కుత్సిత తర్కధీరః।
కామార్థయోరేవ నిబద్ధదృష్టిః
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥

మదాత్మజాతేషు జనేషు కాంశ్చిత్
ఉపేక్ష్య శక్తావపి దుఃస్థితాన్యః।
దయావిహీనో నిజకర్మ భోజీ
నీచైః స్థితావత్ర జనోఽస్తి మూలమ్॥
సు. వృ. 3. 8-11

4.1.2.1.8 యంత్రప్రభావము :

శరీర-బుద్ధి-ఆత్మబలములను ప్రస్తావించి ఆత్మబలముకల మహాత్ముడే శరీర-బుద్ధులను తన వశములో నుంచుకొని బుద్ధి బలదర్పితులగు దుష్టులనుండి ఈ జగత్తును కాపాడును. ఇపుడు బుద్ధిబలముచే మదించిన అహంకారులు, "సృష్టి రహస్యము తెలిసిపోయినదని, సృష్టిని జయించితిమని, సంతోషమును ఉన్మాదమును కూడ పొందుచున్నారు. వారి తీక్ష్ణబుద్ధితో యాదవకుల వినాశహేతువగు ముసలము వలె యంత్రము పుట్టినది. దానివలన ప్రశాంతమైన లోకము క్షోభతో దుఃఖముతో నిండిపోయినది. అందువలన జాగరూకతతో ఉండి ఆ అజ్ఞాన నిద్రనుండి లేచి, లోభపిశాచగ్రస్తులుగాక లోకమంగళముకొఱకు వివేకమును పెంపొందించుకొనుచు ఐకమత్యముతో ముందుకు నడచి, కూటనీతిని కూలదోసి స్వాతంత్ర్యమును సంపాదించుకొనుడు."

ఇది సుషుప్తివృత్తములోని పురుషోత్తమసందేశమునకు సంగ్రహము. ఇందులో చెప్పబడిన మహాత్ముడు గాంధీ మహాత్ముడే. ఈసందేశము ఆయన ఆనాడు భారతదేశ స్వాతంత్ర్యముకొఱకు భారతజాతికందించిన సందేశమే.

4.1.2.1.9 మహాత్మస్తుతి :

స్వప్నాంతమున పురుషోత్తముని స్తుతించుచు వచ్చిన జనసమూహము ఆచార్యులవారికి దృగ్గోచరమైనది. వారి స్తుతి వినవ పడినది. ఆ స్తుతియంతయు గాంధీమహాత్ముని గుణగణములకు ఎత్తిన అద్దమువలె కనబడుచున్నది. ఇందు ఈ క్రింది అయిదు శ్లోకము లవు. అవి కేవలము మహాత్ముని పేరు చెప్పక ఆయనను స్తుతి-

చేసినట్లు కనపడుచున్నవి.[1] క్రింది మూడు శ్లోకములు మహాత్ముని మనస్తత్త్వమును ఆచరణమును ఇట్లు వర్ణించుచున్నవి.[2]

---

1. జయ జయ దుష్ట నిబర్హణ
జయ జయ శిష్ట జనావన।
జయ జయ దృప్త విమర్దన
జయ జయ పతితపావన॥
జయ జయ భారతమండల
జయ జయ భూతమహోదయ।
జయ జయ భంగుర దుఃఖిత
జయ జయ సుస్థిరభావిత॥
సువృ. 3. 35-36

2. హన్తర్యహింసాం విషమే చ సత్యం
జయే చ నమ్రత్వముపాదధానమ్।
దోషం ద్విషన్తం న తు దోషవన్తం
మృష్యన్తమాత్మన్యపథాపమానమ్।
స్వం శోషయన్తం పరపోషణాయ
స్వతోఽల్పవస్త్రం పరవస్త్రవృద్ధ్యై।
పత్నీద్వితీయం స్వజితాత్మతాయై
పరత్ర దోషే కథితాత్మదోషమ్॥
స్వయం తరన్తం పరతారణాయ
పునానమాత్మాన మథాన్యశుద్ధ్యై।
జగత్ప్రదీపం యశసా సుగన్ధిం
భద్రాయ నః పాతు స దేవదేవః॥
అందులోనే. 3. 37-39

హింసకుని విషయమున అహింసను, విషమ సమయముల సత్యమును, విజయప్రాప్తి కలిగినపుడు వినయమును కలిగి, దోషము కలవానిని కాక దోషమును మాత్రమే ద్వేషించువాడు, తనను దూషిం-చిన వానిని సైతము క్షమించువాడు—

ఇతరులను పోషించుట కొఱకు తనను శోషింప చేసికొనువాడు, ఇతరులకు పుష్కలముగ వస్త్రములుండవలెనని తాను చిన్న కొల్లాయిని కట్టుకొనువాడు, జితేంద్రియుడుగా నుండుటకు పత్నితో కలిసియుండువాడు, ఇతరులలోగల తప్పును తనపై వేసికొనువాడు.

ఇతరులను తరింపజేయుటకు ముందు తాను తరించువాడు, ఇతరుల శుద్ధికొఱకు తనను తాను శుద్ధి చేసికొనువాడు, జగత్తునకు జ్యోతివంటివాడు, సుగంధములతో గుబాళించువాడు, అగు మహాత్ముని కీర్తిసుగంధములతో లోకకళ్యాణముకొఱకు ఆ దేవదేవుడు కాపాడుగాక!

ఈ శ్లోకములు కేవలము గాంధిమహాత్ముని స్తుతిరూపములే. వీటి ద్వారా గాంధీమహాత్ముని విషయమున వారికి గల మహోన్నతభావన వ్యక్తమగుచున్నది.

**4.1.2.2 న చేద్వాల్మీకిరభవిష్యత్ :**

శ్రీవరదాచార్యులవారు జాతీయోద్యమ ప్రభావముచే ఈరచన చేసినారని చెప్పుటకు వీలులేదు. కాని ఈ రచన జరుగునప్పటికే వారిలో దేశభక్తి, మహాత్మునియందు శ్రద్ధ హెచ్చుగా కలవని చెప్పు-టకు సందేహపడవలసిన పనిలేదు.

ఈ అనుకావ్యమున ఒక శ్లోకము ఆనాటి తెల్లవారి ప్రభుత్వ-మునుకూడ దృష్టిలో నుంచుకొని చెప్పినట్లు కనబడుచున్నది-

కామక్రోధే జుగుప్సాంచ భయం చోత్పాదయన్తి యే।
తాన్ జిహాసతి సర్వోఽపి జంతుః సర్వే ప్రజాపతే॥

అది నిజమే కదా! ఎవరు శోక, క్రోధములను, జుగుప్సను, భయమును కలిగింతురో వారిని పరిత్యజించుటకు ప్రతివ్యక్తి ప్రయత్నించును. ఇచట అనాటి తెల్లవారిని భారతీయులను మనస్సులో నుంచుకొనినట్లు తోచుచున్నది.

4.1.2.3 ప్రాస్తావిక కదంబము :

ప్రాస్తావిక కదంబము శ్రీఆచార్యులవారి జీవితమున అప్పుడప్పుడు జరిగిన సంఘటనలను గూర్చి, వారు రచించిన ఖండికల సంకలనము వారి జీవితముపై జాతీయోద్యమ ప్రభావమును పరామర్శించినపుడే ఇందులోని సంఘటనలు గతార్థములైనవి. కనుక ప్రత్యేకముగ ఇచట ప్రస్తావించుటలేదు

4.1.2.4 సత్యవిజయము :

సత్యవిజయకావ్యము యొక్క ఇతివృత్తమును ఎన్నుకొనుటలోనే ఆచార్యులవారిపై మహాత్ముని ప్రభావము కనపడుచున్నది. అంతకు మించి ఆ కావ్యములో జాతీయోద్యమ ప్రభావము ప్రత్యేకముగ ప్రతిపాదించదగినది కనపడుటలేదు.

# 5. పంచమాధ్యాయము

**5.1 సంస్కృతభాషా-సాహిత్యములు-ఆచార్యులవారి అనుదానము :**

ఇంతవఱకు జరిగిన అధ్యాయములలో శ్రీవరదాచార్యులవారి వ్యక్తిగత-సారస్వత జీవితములను, స్వతంత్రరచనలలోని విశిష్టతను, అనువాదములలోని విశేషములను వివరించితిని. జాతీయోద్యమ ప్రభావము వారిపై ఎంతవఱకు కలదో, మహాత్ముని ఆదర్శములకు వారెట్లు కట్టుబడిరో పరామర్శించితిని. ఈ అధ్యాయమున సంస్కృత భాషకు, సంస్కృత సాహిత్యమునకు శ్రీవరదాచార్యుల వారొనర్చిన విశిష్టసేవలను సంగ్రహముగ సమీక్షింతును.

**5.1.1. సంస్కృతభాషా ప్రచారము :**

సంస్కారవంతమైన భాష సంస్కృతభాష. ఆ భాషలోని గొప్పదనమును బాల్యమునందే గ్రహించిన శ్రీవరదాచార్యులవారు, తన జీవితమునంతను దానిసేవకే అంకితము చేయవలెనను నిర్ణయమునకు

వచ్చిరి. ఉన్నతవిద్యవలకు సంస్కృతమును అధ్యయనముచేసిన ఆచార్యులవారు ఎఫ్.ఏ.లో సంస్కృతము లేకపోయెనే అని విచారపడిరి. ఎఫ్. ఏ. ద్వితీయ వర్షమున బందరు నోబుల్ కళాశాలలో సంస్కృతము విశిష్టాధ్యయనాంశముగా ప్రవేశపెట్టబడినపుడు వారి ఆనందమునకు అంతులేదు. చదివిన మొదటి సంవత్సరమును వదలివేసి సంస్కృతముతో మరల ఎఫ్.ఏ. మొదటి సంవత్సరమును చదివిరి.

ఆ తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఎమ్.ఏ. (ఆనర్సు) పరీక్షకొఱకు వ్యాకరణశాస్త్రము ప్రధానాంశముగ చదివి ప్రథమశ్రేణిలో సర్వప్రథములుగ ఉత్తీర్ణులైరి. వారి ప్రథమరచనయగు భాషాశాస్త్ర-సంగ్రహము ఉపోద్ఘాతాంతమున "సంస్కృత సేవనైక జీవితప్రయోజనః" అని వ్రాసుకొనిరి. దీనిని బట్టి వారు తమ జీవితమునంతను సంస్కృతసేవకు అంకితము చేయదలచినారని దానికి కావలసినవిద్యా-ర్హతలను సంపాదించుకొనినారని అర్థమగుచున్నది.

5.1.1.1 నిర్వేతనికోద్యోగము :

మరుగున పడిపోవుచున్న సంస్కృత భాషనుద్ధరించి దానికి తగిన ప్రచారమును కలిగింపవలెననెడు పట్టుదల ఆచార్యులవారిలో మొదటి నుండియు కలదు. లక్ష్యసాధన కొఱకు ఆచార్యులవారు ఎన్ని ఇబ్బందులనైనను లక్ష్యపెట్టరు. బందరులోని ఆంధ్రజాతీయ కళాశాలలో దేశీయమైన కళలను అభ్యసించు విద్యార్థులకు సంస్కృతభాష నేర్పిన బాగుండునను ఆలోచన వారికి కలిగినది. ఆ కళాశాల యాజమాన్యమువద్దకుపోయి "మీ విద్యార్థులకు నేను సంస్కృత సాహిత్యమును బోధింతును" అని వారంతట వారే తెలియజేసిరి. జీతము ప్రస్తావమురాగా "నాకు మీరు జీతమేమియు ఇవ్వవలసిన పనిలేదు.

నేను నిర్వైతనికముగనే సంస్కృతభాషను ప్రచారము చేయదలచితి" నని చెప్పిరి యువకులు స్ఫురద్రూపులు, ఉత్సాహవంతులైన ఆచార్యులవారిని కళాశాల పరిపాలకులు స్వాగతించి సంస్కృతాధ్యాపకులుగ నియమించిరి. అప్పటి వారివయస్సు కేవలము ఇరువది రెండు సంవత్సరములు మాత్రమే. వేతనము తీసికొనకపోగా తామే అప్పటి విద్యార్థులకు సహాయపడుచు కొన్ని దినములు అచట సంస్కృతాధ్యాపకులుగ పనిచేసి సంస్కృతభాషా ప్రచారమొనర్చిరి.

5.1.1.2 విజయనగరము :

చిన్నవయసునుంచే ఆచార్యులవారి కీర్తిప్రతిష్ఠలను ప్రతిభా-పాండిత్యములను, దేశభక్తిని ఆనోట ఆనోట వినిన విజయనగర ప్రభువులు తమ సంస్కృతకళాశాలకు వారిని అధ్యక్షులుగ చేయదలచి ఆహ్వానము పంపిరి. శ్రీవరదాచార్యులవారు సంస్కృత కళాశాలకు అధ్యక్షులుగ విజయనగరమునందున్న ఆరుసంవత్సరములలో ఎందరో ఉత్తమ విద్యార్థులు వారివద్ద భాషాశాస్త్ర-వాఙ్మయ చరిత్రాదుల యందు, అలంకారశాస్త్రమునందు తర్ఫీదు పొందిరి. కళాశాల యాజమాన్యమువారు తమకివ్వదలచిన వేతనమును తాము తీసికొనక యోగ్యులగు విద్యార్థులకు ఉపకారవేతనముగ నిచ్చుచుండిరి.

అంతేగాక కళాశాలకు అనుబంధముగానున్న ఛాత్రావాసపు (Hostel) నిర్వహణము కూడా ఆచార్యులవారే చూచుచుండిరి. విద్యార్థులనందఱిని తన కన్నబిడ్డలవలె చూచుకొనుట వారికి అప్పటినుండియే అలవాటు. అట్లు సంస్కృత కళాశాలాధ్యక్షులుగ ఆరు సంవత్సరములు పనిచేసి ఆచార్యులవారు సంస్కృతభాషా ప్రచారమునకు ఎంతో దోహదము చేసిరి.

5.1.1.3 నాలుగు రాష్ట్రములు :

ఈనాడు ఆంధ్ర-తమిళ-కర్ణాటక-కేరళ రాష్ట్రములుగా విభక్తమైన

నాలుగు భాగములు అప్పుడు అవిభక్త మద్రాసు రాష్ట్రముగా ఒకటిగా నుండెడిది. ఈ నాలుగు దేశములలో గల సంస్కృత కళాశాలలను-పాఠశాలలను పర్యవేక్షించి క్రమబద్ధమైన సంస్కృత విద్యావిధానమును నడిపించవలెనని అనాటి ప్రభుత్వము తలపెట్టినది. సంస్కృత భాషాప్రచార పథమున బద్ధకంకణులగు శ్రీవరదాచార్యులవారిని ప్రభుత్వము సూపరింటెండెంట్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్‌గా నియమించినది. అహోవాలో వారు దక్షిణభారత దేశమునందంతటను సంస్కృతభాషాప్రచారము బాగుగా జరుగునట్లు కృషిచేసిరి. కళాశాలలకు తగిన ప్రోత్సాహమునందించి,కొత్త కొత్త పాఠ్యప్రణాళికలను ప్రవేశపెట్టించిరి. సంస్కృత భాషాధ్యయనమునకు తగిన కళాశాలలు లేనిచోట్ల కళాశాలలను పెట్టించిరి. ప్రభుత్వసాహాయ్యమందనిచోట సాహాయ్యము సక్రమముగ అందునటుల కృషిచేసిరి. యోగ్యతగల పండితులకు తగిన వేతనముల నిప్పించిరి. ప్రతి కళాశాలయందును గ్రంథాలయము తప్పనిసరిగనుండవలెనని పూనికతో నేర్పాటుచేసిరి ఊరూర తిరుగుచు, పండితుల కష్టనష్టములను శ్రద్ధతో విచారించుచు సంస్కృత భాషాసేవకు అంకితము కావలసిన ఆపదవిని అన్వర్థమొనర్చిరి. అనాడు శ్రీవరదాచార్యులవారు నాటిన బీజములు దక్షిణ భారతదేశమున ఇప్పటికిని దిన దిన ప్రవర్ధమానములై పెరిగి మహావృక్షములై విలసిల్లుచున్నవి.

5.1.1.4 కొప్పూరు :

గాంధీజీ పిలుపునందుకొని ఆచార్యులవారు సహాయనిరాకరణోద్యమమున తనకు అభిమానపాత్రమైన సంస్కృతభాషాసేవను, దాని కాశ్రయమగు సూపరింటెండెంట్ పదవిని రాజీనామాతో వదలివేసి స్వగ్రామమైన చిట్టిగూడూరు చేరిరి వారి జీవితలక్ష్యమునకు తాత్కాలి-

కముగ విఘ్నమేర్పడినది. కాని ఇంతలో కొవ్వూరులోగల ఆంధ్ర గీర్వాణ పీఠమువారు శ్రీవరదాచార్యులవారిని తమ సంస్థకు అధ్యక్షు-లుగ నుండుడని ఆహ్వానించిరి. దక్షుడైన అధ్యక్షుడు లేక అప్పటివరకు పీఠము వెలవెలబోవుచుండెను. కాని శ్రీఆచార్యులవారు అధ్యక్షపదము స్వీక-రించినంతనే, మంచి అధ్యాపకులు, ఉత్తమవిద్యాబోధనము, యోగ్యు-లైన విద్యార్థులతో ఆకళాశాల కళకళలాడసాగెను. ఆ సంవత్సరము విద్యార్థులందరికినితర్ఫీదు నొసంగి విశ్వవిద్యాలయ పరీక్షలకు పంపిరి. అహర్నిశముఆచార్యులవారుసంస్కృతభాషా ప్రచారమునకే అంకితమై కళాశాలనుఎంతో అభివృద్ధిపరచిరి. యాజమాన్యము నిర్బంధించినను ఆచార్యులవారు వారివద్ద ఏ కొంచము వేతనమును తీసికొనలేదు తమ ఖర్చులన్నింటిని తామే భరించెడివారు. ఇట్లు సంస్కృతభాషా-వ్యాప్తికివారెంతగనో అచట కృషిచేసిరి.

**5.1.1.5 సంస్కృతకళాశాలా స్థాపనము :**

వారి స్వగ్రామమైన చిట్టిగూడూరులో 1923లో శ్రీనారసింహ సంస్కృత కళాశాలను స్థాపించుట వారి జీవితమున ఒక ముఖ్యమైన మలుపుగా పరిణమించినది. వారు ఏ పరిస్థితులలో ఆ కళాశాలను స్థాపించినది. ఇదివరకే (1.1.1 19) వివరించితిని. ఆ కళాశాలను స్థాపించి దానిని కేంద్రబిందువుగా నిడుకొని ఆంధ్రదేశమున సంస్కృత-భాషాప్రచారమునకు వారొనర్చిన ప్రయత్నములు బహుముఖమైనవి. సంస్కృతభాషకు వారొనర్చిన అముదానములలో చిట్టిగూడూరులోని శ్రీనారసింహ సంస్కృత కళాశాల చాలా ముఖ్యమైనది. అప్పటికి వారికి సంతానములేదు. కాబట్టి కళాశాలయే వారికి ప్రథమ సంతాన-మైనది. విద్యార్థులనందరును వారు పుత్రనిర్విశేషముగ భావించి,

పోషించి, చదువుచెప్పి ఆదరించెడివారు. కనుకనే శ్రీవరదాచార్యుల వారిని తరువాతి కాలమున "కులపతి"గా ఆంధ్రదేశము గౌరవించినది.

తమకుగల ఆస్తిలో కొంతభాగమును కళాశాల నిర్వహణమునకు వ్రాసి ఇచ్చిరి. కళాశాలకు స్వంతభవనమును గ్రంథాలయ భవనమును నిర్మించిరి. విద్యార్థులకు వారి భవనములనే వసతిగృహములుగా నిచ్చిరి. అధ్యాపకులకు వారే వసతుల నేర్పాటు చేసిరి. ఇదియది యననేమి కళాశాలకు ఏది కావలసినను వారే ఏర్పాటు చేసి జీవితాంతమువరకు కళాశాలద్వారా సంస్కృతభాషా ప్రచారము సల్పిరి.

శ్రీనారసింహ సంస్కృత కళాశాలకు అధ్యక్షులుగ వేతనము తీసికొనక విద్యార్థులకందఱకు ఉపకారవేతనముల నొసంగి బుద్ధిమంతులగు విద్యార్థులను వేలకొలదిని తయారుచేసి ఆంధ్రదేశము నాలుగు చెరగులకు భాషాపండితులుగ పంపిరి. ఈనాడు మనదేశమునగల విశ్వవిద్యాలయములందును, కళాశాలలలోను, పాఠశాలల్లోను వారి శిష్యులు ప్రశిష్యులు అసంఖ్యాకులుగ నున్నారు. ఇది సంస్కృతభాషా ప్రచారరంగమున వారొనర్చిన ముఖ్యమగు దానము.

5.1.1.6 మోడేకుఱ్ఱు :

శ్రీవరదాచార్యులవారు తాను శ్రీనారసింహసంస్కృతకళాశాలను స్థాపించి సంస్కృతాంధ్ర పండితులను తయారుచేసి దేశమునకు సేవ చేయుటకు అంకితము చేయుటయేగాక ఆంధ్రప్రదేశమున ఇంకకొన్ని సంస్థలను స్థాపించుటలో కూడ దోహదము చేసిరి అటువంటి సంస్థలలో ఒకటి గోదావరి జిల్లాలోగల మోడేకుఱ్ఱు అను గ్రామమున స్థాపింపబడిన సంస్కృతకళాశాల ఈకళాశాలకు శ్రీఆచార్యులవారు ప్రారంభోత్సవము.

చేసిరి. అది ఈనాటికిని దినదినప్రవర్ధమానముగ అనేకమంది సంస్కృతాంధ్ర పండితులను తయారుచేయుచున్నది.

5.1.1.7 సంస్కృత భాషాప్రచారిణీసభ :

ఆంధ్రదేశమున సంస్కృతభాషా ప్రచారముకొఱకు ఏర్పడిన సంస్థలలో చిత్తూరులోని సంస్కృతభాషా ప్రచారిణీసభ అద్వితీయమైనది. దీనికి వ్యవస్థాపకులు శ్రీమాన్ టి.కె. తిరువేంగడాచార్యులు గారు వారు శ్రీవరదాచార్యులవారికి శిష్యకల్పులు. వారు ఆంధ్రప్రదేశము నందలి బాలబాలికలకు స్వతంత్రముగ పరిచయ, అభిజ్ఞ, విచక్షణ, సమర్థ, కోవిద అను పరీక్షలకు నిర్వహించుచు వాటికి కావలసిన పాఠ్యాంశములను స్వయముగ ముద్రించుచు, "గైర్వాణి" అను మాసపత్రికను నడుపుచు మారుమూలల పల్లెలలోకూడ సంస్కృతభాష వ్యాపించునట్లు జీవితాంతము కృషిసల్పిన ధన్యజీవులు. అటువంటి వారు ఎదిపెదె ఆచార్యులవారి మార్గదర్శనమునకై వారి సన్నిధికేతెంచియు, పత్రవ్యవహార రూపమునను వారి ఉపదేశములను తీసికొనుచు ఆ సంస్థను తీర్చిదిద్దిరి. పరోక్షముగ "సభ" వారు ఇంతటి సంస్కృతభాషా ప్రచారము చేయుటకు శ్రీవరదాచార్యులవారి అండదండలు దండిగా కలవు.

5.1.1.8 ఆంధ్ర విశ్వవిద్యాలయము :

ఆంధ్ర విశ్వవిద్యాలయము ప్రారంభించిననాటి నుండియు సుమారు నలుబది సంవత్సరములపాటు శ్రీవరదాచార్యులవారే బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా ఉండిరి. బోర్డులో దిగ్గంతులవంటి సంస్కృత పండితులున్నట్లు ఇంతకు పూర్వమే (1.1.1.27) వివరించినాము.

ఆంధ్ర విశ్వవిద్యాలయమున సంస్కృతభాషా సాహిత్యములకు సంబంధించిన అంశమేదైన పరిశీలనకు వచ్చినచో అప్పటి వైస్-ఛాన్సలర్ శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు గాని లేకతరువాత వచ్చిన వైస్-ఛాన్సలర్లు గాని శ్రీవరదాచార్యులవారితో తప్పక సంప్రదించ-వలసినది. పరీక్షా పాఠ్యములు, పరీక్షా పద్ధతులు, అధ్యాపకుల నియా-మకములు వీటన్నిటియందు శ్రీవరదాచార్యులవారి నిర్ణయమే తుది-నిర్ణయము.

అట్లే మద్రాసు, అన్నామలై, మైసూరు, తిరువనంతపురము మొ॥ విశ్వవిద్యాలయములందలి సంస్కృతబోర్డులతో ఆచార్యులవారికి గల సంబంధము ఆయా విశ్వవిద్యాలయములద్వారా సంస్కృత-భాషాభివృద్ధికి పరోక్షముగా దోహదము చేసెడిది. ఇట్లు ఆచార్యుల-వారు ప్రత్యక్షముగా ఆంధ్ర విశ్వవిద్యాలయమునందును పరోక్షముగ ఇతర దాక్షిణాత్య విశ్వవిద్యాలయములందును, సంస్కృతభాషా-ప్రచారమునకు అనేకవిధముల తమ అమదానమును అందించినారు.

5.1.1.9 జాతీయ కళాశాల :

శ్రీవరదాచార్యులవారు జాతీయకళాశాల అస్తులను చక్కబరచి 1949లో దానిని ఎ.జె. కళాశాలగా ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు అనుబంధ సంస్థగా రూపొందించినట్లు లోగడ (4.1.1 8) చెప్పి యున్నాము. ఆ కళాశాలకు వారు వేతనము తీసికొనకనే ఎనిమిది సం॥లు అధ్యక్షులుగాను ఆపై చాలాకాలము కరస్పాండెంట్ గాను పనిచేసిరి. అధ్యక్షులుగా నున్నప్పుడు డిగ్రీ క్లాసులలో సంస్కృతమును చదువు వారికి వారు ఉపన్యాసేతనముల నిచ్చెడివారు, అట్లు చాలామంది

విద్యార్థులు వారివద్ద ఉపకారవేతనము తీసికొని డిగ్రీలో సంస్కృతమును చదువుకొని తరువాత జీవితమున- "ఆ రోజులలో ఆచార్యుల వారు సంస్కృతమును నేర్పుటవలన ఈనాడు ఇంతవారమైతిమని' ఆనందించెడివారు.

ఒకప్పుడు ప్రభుత్వపు విరాళమురాక ఉపాధ్యాయులకు వేతనములిచ్చుటకు ఎ.వి. కళాశాల యాజమాన్యమునకు ఇబ్బంది కలిగినది. వెంటనే శ్రీవరదాచార్యులవారు ఆ కళాశాలలోనే సంస్కృతోపన్యాసకుడుగా పనిచేయుచున్న తన కుమారునితో సంప్రదించి కొంత విరాళముగా ప్రకటించి అధ్యాపకుల జీతములను ఇచ్చుఏర్పాటు చేసిరి. ఇటువంటి సందర్భములయందు వారి లోకజ్ఞత, వదాన్యత, విద్యా వ్యసనిత మనకు స్పష్టమగును.

5.1.1.10 నిరంతరాధ్యాపనము :

ఆచార్యులవారికి సంస్కృతభాషను బోధించుటయన్న మిక్కిలి మక్కువ. వారు ప్రథమోద్యోగమునుండి తొంబది సంవత్సరముల వయస్సు వచ్చినపుడు కూడ ప్రతినిత్యము చిన్నపిల్లలకు బాలరామాయణమువంటి చిన్నపుస్తకములను, పెద్దవారికి మహాభాష్యమువంటి ఉద్గ్రంథములను అధ్యాపనము చేసెడివారు. ఈ "శిష్యకామేష్టి"ని యావజ్జీవము వ్రతముగానిర్వహించిన పూర్ణకాములు శ్రీవరదాచార్యులవారమటలో ఎటువంటి అతిశయోక్తియులేదు.

విద్యార్థులమనస్సు నెఱిగి బోధించుటలో ఆచార్యులవారద్వితీయులని ప్రసిద్ధి కలదు. వారి పాఠము ఎన్నడును ఒక గంటకు మించి యుండెడిది కాదట. మరుసటిరోజు పూర్వపాఠము విద్యార్థులకు వంట వచ్చినదా? లేదా? యను పరీక్షయుండును; ఆపైననే క్రొత్తపాఠము. అట్లు విద్యార్థులకు విసుగులేకుండా అర్థమగురీతిలో పాఠప్రవచనముచేసి మహోపాధ్యాయులుగా గణుతికెక్కినారు.

సంస్కృత భాషను నేర్తుననిన చాలును. వారు ఎంతో ఆనందపడి విద్యార్థులకు సకల సౌకర్యములను ఇచ్చి చదువు చెప్పెడివారు. విద్యార్థి ఎవరు? జాతికులములేవి? ఏ ప్రాంతమువాడు? అను వివరములతో వారికి పనిలేదు. ఎవ్వరైనను సంస్కృతమును నేర్చుకొనవలెననియే వారి ఆకాంక్ష. సంస్కృత భాషను అధ్యాపన రూపమున ఆచార్యులవారు ఆరాధించినారు.వారు ఎవ్వరో చెప్పినట్లు వారు నేర్చిన అంగ్లమును, పరంపరా ప్రాప్తమైన లక్ష్మిని వారు దేవవాణి దాస్యములో వినియోగించి[1] ధన్యజన్ములైనారు.

5.1.2 సాహిత్య ప్రసారము :

శ్రీహర్షుడు నైషధీయ చరితమున పేర్కొన్నట్లు అధ్యయనము, బోధ, ఆచరణము, ప్రచారము అని నాల్గు విద్యోపాధులు.[2] ఈ నాల్గింటి యందు శ్రీవరదాచార్యులవారు సిద్ధహస్తులు. అంతే కాదు వారికి దేవవాణి అనుగ్రహము పరిపూర్ణముగ కలిగినది. లలిత లలితమైన వారి సాత్మైనది. వారు చిన్నవయసు నుండియే చక్కని కవితా

---

1. హానీ మాయా తే గమితా హి దాస్యం
సముజ్ఝితా శ్రీరపి సుప్రసన్నా।
అనన్యచిత్తో భవతీం భజామి
ప్రసీద తస్మాన్మయి దైవివాణి॥
సు.వృ. పు. 2

2. అధీతి బోధాచరణప్రచారైః
దశాశ్చతస్రః ప్రణయన్నుపాధిభిః।
చతుర్దశత్వం కృతవాన్ కుతస్స్వయం
న వేద్మి విద్యాసు చతుర్దశ స్వయమః
నై.చ. 1.4.

ఖండికల సంస్కృతభాషలో వెలయించి సహృదయులకు ఆనందమును కలిగించెడివారు. వారి కవిత అత్యుత్తమమైన వైదర్భీరీతిలో సాగునని వారి గురువర్యులు ప్రొఫెసర్ ఎస్. కుప్పుస్వామి శాస్త్రిగారే వారిని ప్రశంసించిరి.[1] అధ్యయన అధ్యాపన-ప్రచారముల ద్వారానే కాక రచనల ద్వారాకూడా వారి అనుదానము సంస్కృత సాహిత్యక్షేత్రమున విశిష్టముగ నిలిచిపోయినది.

### 5.1.2.1 స్వతంత్ర రచనలు :

శ్రీవరదాచార్యులవారు నాలుగు స్వతంత్ర రచనలను చేసిరని ఇంతకు పూర్వమే (2.1) వివరించితిని. అవి 1. భాషాశాస్త్ర సంగ్రహము 2, సుషుప్తివృత్తము 3. న వేద్వాల్మీకిరభవిష్యత్ 4 సత్యవిజయము.

ఇందు భాషాశాస్త్రసంగ్రహము విమర్శ ద్వారా భాషాశాస్త్రమును గూర్చి సంప్రదాయ పద్ధతిలో సంస్కృత భాషనధ్యయనము చేసినవారు ఆలోచించుటకు, అర్థము చేసికొనుటకు వీలును కల్పించిరి. అనాటికి సంస్కృతభాషలో భాషాశాస్త్రమును గూర్చిన గ్రంథములు రాలేదు. కనుక ఈ క్షేత్రమున భాషాశాస్త్రసంగ్రహముయొక్క అనుదానము అనల్పము.

దూతకావ్యములు మహాకవి కాళిదాసోపజ్ఞములైనట్లు దేశభక్తి కావ్యములకు శ్రీకారము చుట్టినవారు శ్రీవరదాచార్యులవారు. దేశము స్వతంత్రము కానిరోజులలో పరాయిపాలనలోనే సుషుప్తివృత్తమను ధ్వని కావ్యమును రచియించి మహాత్ముని యందు ఆయన ఉపదేశము

---

1. వైదర్భీ వల్లభస్యేమాం కాళిదాసస్య పద్ధతిమ్।
పశ్యన్తః స్వప్నవృత్తేఽస్మిన్ దిష్ట్యా వర్ధామహే వయమ్॥
సు.వృ. FORE WORD.

వందురు, ఆయన ప్రారంభించిన జాతీయోద్యమములయందును తనకు గల భక్తి-విశ్వాసములను ధైర్యముగ ప్రకటించినారు. కనుక సంస్కృతసాహిత్యమున ఈ శతాబ్దమునందు దేశభక్తి కావ్యవాఙ్మయమునకు శ్రీవరదాచార్యులవారు ఆద్యులనుటలో విప్రతిపత్తి లేదు.

మూడవ కావ్యము "న చేద్వాల్మీకిరభవిష్యత్". ఈ కల్పనయే నూతనమైనది. సామాన్యముగ ఎవ్వరికిని ఇటువంటి ఆలోచనలు రావు. కాని! వాల్మీకిపైన రామాయణముపైన శ్రీరామచంద్రునిపైన వారికి గల దృఢమైన భక్తి-విశ్వాసములు, అభిమానమే శ్రీఆచార్యుల వారికి అటువంటి భావనను కలిగించియుండును. సంస్కృత సాహితీరంగమునకు ఈ లఘుకృతి ఒక భూషణము వంటిది. ఇంతకు పూర్వమే (2.1.3) ఈకృతి విశిష్టతను నిరూపించియున్నాను.

నాల్గవ కావ్యము సత్యవిజయము. ఆచార్యులవారి ఆరాధ్య దైవము శ్రీరామచంద్రుడు. ఆయునకు ఎన్నో తరములకు పూర్వుడు హరిశ్చంద్రుడు. అతడు సత్యనిష్ఠకు నిలబడి సత్యహరిశ్చంద్రుడైనాడు. మహాత్మునకు ఎంతో ఆదరముగల పాత్ర సత్యహరిశ్చంద్రుడు. ఆచార్యులవారివలె మహాత్మునకును శ్రీరాముడు ఆరాధ్యదైవము. కనుక సత్యహరిశ్చంద్రుని కథను తీసికొని వారు సత్యవిజయమను కావ్యమును వెలయించినారు.

ఈ కావ్యమునందలిభాష, భావనలు, అలంకారములు ప్రతి పదమునందును కాళిదాసును స్మరింపజేయుచున్నవి. ఇరువదవ శతాబ్దమునందలి సంస్కృత సాహితికి కలికితురాయి ఆచార్యులవారి సత్యవిజయమనుటలో అసత్యమావంతయు లేదు.

5.1.2.2 అనువాదములు :

శ్రీవరదాచార్యులవారు సంస్కృత సాహితికొసగిన విశిష్టాముదానమే వారి శతకానువాదములు లోగడ చెప్పినట్లు (3.2) వారు

తొమ్మిది శతకములను తెలుగు నుండి సంస్కృతమునకు అనువదించిరి. చాలాశ్లోకములు అనువాదములని చెప్పినను విజ్ఞులు నమ్మరు. అవి మూలమునకంటె అతిశయించియుండును. తెలుగుభాషకు అపురూపమైన శతకవాఙ్మయములోని మణిపూసలవంటి శతకములను ఎన్నుకొని వారు ఉద్యోగవిరమణ చేసిన నాటినుండి పరిణతమైన వ్యుత్పత్త్యభ్యాసములతో వెలయించిన అనువాదములు సంస్కృత సాహితికి పెట్టని అలంకారములు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమి వాటిని ప్రచురించినది.[1] ఉత్తరప్రదేశ్ సాహిత్య ఎకాడమి వారి ఉద్యమమును అభినందించి వారిని గౌరవించినది భారతదేశములోని ప్రసిద్ధ సంస్కృత పండితులందరును వారి అనువాదములను చూచి తెలుగు శతకములలోగల గొప్పదనమును గ్రహించి ఆనందించి, వారిని మనసారా అభినందించిరి. అందువలన శతకానువాదములు సంస్కృతసాహితికి వారి అనుదానములలో విలక్షణమైనవని విజ్ఞులు భావించుచున్నారు.

5.1.2.3 శిలా లేఖనము :

ఇంతవరకు సంస్కృత సాహితీచరిత్రలో ఏ కవి చేయని పనిని శ్రీవరదాచార్యులవారు నిర్వహించినారు. వారు చేసిన అనువాదములలో దాశరథి, శ్రీకాళహస్తీశ్వర, ఆంధ్రనాయక, నరసింహశతకములను మూలములతోకూడా కలిపి భద్రాచల, శ్రీకాళహస్తి, శ్రీకాకుళ, ధర్మపురి క్షేత్రములలో శిలాఫలకముపై చెక్కించి స్తంభములపైనను, గోడలపైనను బిగించినారు. అది ఒక విలక్షణమైన అనుదానము

1 శతకపత్రకమ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమి, హైదరాబాద్, 1963.

సాహితీపరముగ దేవాలయ పరముగ కూడ శాశ్వతమైన సాహిత్య స్వరూపమునచట ఆయా శతకములకు కలిగించినారు

5.1.2.4 ఉపోద్ఘాతములు :

ఎందఱో రచయితలు తపుటు అనేక గ్రంథములను సంస్కృతాంధ్రములలో వ్రాసి కులపతులగు శ్రీవరదాచార్యులవారి ఆశీస్సులను పొందిన వారున్నారు. అందులో ఆంధ్రులు ఆంధ్రేతరులు కూడా చాలా మంది కలరు. అవి అసంఖ్యాకములుగ నుండుటచే అన్నిటిని పేర్కొనుట లేదు, ఉదాహరణకు కొన్నింటిని మాత్రమే ఇచట పేర్కొనుచున్నాను.

1. శబ్దార్థ కల్పతరువు
2. కౌముదీ శరదాగమము మొ॥నవి.

5.1.2.5 ఆకాశవాణీ ప్రసంగములు :

శ్రీమాన్ వరదాచార్యులవారు సంస్కృత సాహిత్యముపై కొన్ని ఆకాశవాణీ ప్రసంగములను చేసినారు. అవి కొన్ని సంస్కృతభాషలోను కొన్ని తెలుగులోను నడచినవి. ఉదాహరణకు-

"ఉత్తరరామ చరిత ప్రశస్తిః"

అను ప్రసంగము సంస్కృతభాషలో ఆకాశవాణి విజయవాడ కేంద్రముమండి ప్రసారము చేయబడినది. అందు వారు ఉత్తరరామాయణ కథను భవభూతి తన నాటకమున ఎట్లు మార్చినాడో, అందుకు ఆలంకారికుల అంగీకారమునెట్లు ప్రతిపాదింపవచ్చునో విశదపరచిరి.

ఇట్లే సంస్కృత సాహిత్యమును గూర్చి భారతీయ సంస్కృతిని గూర్చి ఆకాశవాణి ప్రసంగములు కలవందురు, కాని వాటి వివరములు తెలియరాకున్నవి.

5 1.2.6 ఉపన్యాసములు :

ఆచార్యులవారు అనేక సాహితీ సంస్థలచేతను, ధార్మిక సంస్థల చేతను ఆహ్వానించబడి సంస్కృత సాహిత్యముపైన, ధర్మముపైన, ఎన్నియో వేదికలపైన గంభీరోపన్యాసములను చేసినారు. ఉదాహరణకు కొన్ని—

1. భారతం పంచమోవేదః
2. కాళిదాసస్య ప్రతిభా
3. పద–భాషాశాస్త్ర సమన్వయః మొదలగునవి.

—o—

# 6 షష్ఠాధ్యాయము

**6.1 ఉపసంహారము :**

శ్రీమాన్ ఎస్.టి జి. వరదాచార్యులవారి జీవితమునందలి ముఖ్య ఘట్టములను రచనలలోని విశేషములను సమగ్రముగా పరిశీలించిన తరువాత దీనిద్వారా నిగ్గుదేలిన ముఖ్యాంశములను కొన్నింటిని మాత్ర-మిచ్చట ఉపసంహారరూపమున పేర్కొనుచున్నాను.

**6.1.1** శ్రీఆచార్యులవారికి సంస్కృతభాషపైన ప్రత్యేకాభి-మానము బాల్యమునుండియే కలదని ఆయా ఘట్టములద్వారా నిరూ-పించబడినది.

**6.1.2** వికారహేతువులెన్నియో చుట్టుముట్టినను ధీరులైన శ్రీ ఆచార్యులవారు భారతీయ సంప్రదాయములను విడనాడలేదని విపుల-ముగ ప్రతిపాదించబడినది.

6.1.3 "పువ్వుపుట్టగనే పరిమళించు"నన్నట్లు ఆచార్యులవారికి త్యాగనిరతి అజన్మసిద్ధమని సోదాహరణముగ వివరింపబడినది.

6.1.4 మహాత్ముని పిలుపు విని అత్యున్నత పదవికి రాజీనామా నిచ్చిన ఆచార్యులవారికి జాతిపిత పైన దేశముపైనను ఎంతటి భక్తి ప్రపత్తులుగలవో నిరూపించబడినది.

6.1.5 ఆచార్యులవారి దేశభక్తిని సుషుప్తివృత్తముద్వారాను, సత్యనిష్ఠను సత్యవిజయముద్వారాను, దేశీయసాహిత్యముపై గల ఆదరాభిమానములను శతకానువాదములద్వారాను విశదపరచిరని ప్రతిపాదించబడినది.

6.1.6 అనువాద పద్ధతులను సమీక్షించి, ఆచార్యులవారనుసరించిన అనువాదవిధానమును పేర్కొని, మూలమునకు వారెట్లు వన్నెలు దిద్దిరో సోదహరణముగ ప్రతిపాదించబడినది.

6.1.7 ఆచార్యులవారి వేష, భాషాదులయందును, సేవాతత్పరతయందును, త్యాగభావనయందును, ప్రతిబింబించుచున్న జాతీయోద్యమ ప్రభావము విశ్లేషింపబడినది.

6.1.8 సుషుప్తివృత్తాది రచనలయందు జాతీయోద్యమప్రభావ మెట్లు కనపడుచున్నదో సోదాహరణముగ నిరూపించబడినది.

6.1.9 సంస్కృతభాషావ్యాప్తికి సంస్కృతసాహిత్య ప్రసారమునకు ఆచార్యులవారు తమ సర్వస్వమునెట్లు అంకితమొనర్చినారను అంశము విభిన్నఘట్టములద్వారా ఈ పరిశోధన ప్రబంధమున సమగ్రముగ విశదీకరించబడినది.

## —శ్రీఆచార్యులవారి లేఖ—

చిట్టిగూడూరు
24-10-78

శ్రీరస్తు చిరంజీవియైన ఛాత్రవరేణ్యుడగు చక్రవర్తికి-

అనేక మంగళాశాసనపూర్వకముగ వ్రాయునది. ఉభయకుశలోపరి. మేమిద్దరము క్షేమముగా మరునటి యుదయమున నింటికి చేరితిమి. మీయింట పత్నీసమేతముగ నీవిచ్చిన యాతిథ్యము చిరస్మరణీయము. నీతో జరిగిన సాహిత్యగోష్ఠులు ఇప్పటికిని ప్రతిధ్వనించుచున్నవి. నారచనలు నీకెంత ప్రీతికలిగించినవో నీవు Recarder మీద వానిని తద్వ్యాఖ్యానమును ఆరోపించుటయే స్పష్టముచేయుచున్నది. నీ పురుషకారముచేతనే అచ్చట సభలు రెండును జరిగినవి. శ్రీఅర్కసోమయాజులు గారికి నాధన్యవాదములను, కృతజ్ఞతను అందించవలెను. సన్మానము మరుసటిదినముననే ఢిల్లీ తెలుగువార్తలలో ప్రకటించబడిన దనినమ్మి కలసినప్రతివారును చెప్పుచున్నారు వీటిన్నిటికిని నీవేనిదానభూతుడవు. మీశిష్యుడు సురేంద్రనాథునకును నాయాశీస్సులనందజేయవలెను. అతడు జిజ్ఞాసువు, సహృదయుడు, విమర్శకుడు ఇట్లే కొంతకాలము నీశిక్షణములోనున్నయెడల మంచియభివృద్ధిని పొందగలడు. కాళిదాసకావ్యముల పౌర్వాపర్యము విషయమై నేను రచించినశ్లోకముల యనంతరము ఇయ్యది చేర్పదగినది-

ఇతిచేన్న-ఆదౌ దేవనమస్కారః స్వానర్హత్వప్రకాశనమ్।
శబ్దాలంకృతిరక్తిశ్చ రఘోః ప్రాథమ్యయుక్తయః॥

గ్రంథాదియందు పార్వతీ పరమేశ్వరవందనము, "క్వచాల్ప విషయామతిః", "మందః కవియశఃప్రార్థీ", "మణౌవజ్రసము

తీక్ష్ణర్థే సూత్రస్యైవాస్తి మే గతిః", "తనువాగ్వైభవోఽపిసన్", "చావలాయ ప్రచోదితః", అనియు, తాను ఉదువమని, వామనుడని, సూత్రమని త్రివిధముగ ఈ కావ్యమునందే చెప్పుట ఈ కావ్యముయొక్క ప్రాథమ్యమునకు అప్రతిసంఖ్యేయమగు యుక్తి. ఇతి శబ్దాలంకారప్రియత్వముకూడ. వధాయవధ్యస్య శరం శరణ్యః, దీనానిదీనోద్ధరణో చితవ్యః, కృతాంజలిః కృత్యవిత్. నవమసర్గలోకాటోలు. ప్రతిశ్లోకము చివరను "యమవతామావతాం" అను అనుప్రాసలుకూడ ఈకావ్యము ప్రథమమని చాటుచున్నవి. ఈ శబ్దాలంకారప్రియత్వము ప్రారంభమున కవులందరిలో కన్పడును. కొందరియందు ఇది అస్తము నిలచి యుండును (గౌడీ) కొందరిలో (వైదర్భీవల్లభులలో) కొద్దికాలములోనే అదృశ్యమగును. చిరంజీవులయిన నీ పుత్రీపుత్రులకు, నీభార్యకు నా యాశీర్వాదములు. చి॥ శాస్త్రి సూర్యనారాయణకు నా యాశీస్సులను తెలుపవలెను. ఇట్లే శ్రీబాలసుబ్రహ్మణ్యముగారికికూడ.

—ఎస్. టి. జి. వరదాచార్యులు

ఇది శ్రీవరదాచార్యులవారు డా॥ ఎస్. బి. రఘునాథాచార్యులు గారికి వ్రాసిన లేఖ.

"కళాప్రపూర్ణ" శ్రీమాన్ ఎస్.టి.జి.వరదాచార్యులవారి
జీవితమునందలి
ము ఖ్య ఘ ట్ట ము లు

| | |
|---|---|
| 1892 | జననము |
| 1908-1911 | ఉన్నతవిద్య |
| 1911-1914 | ఎమ్.ఏ. (ఆనర్సు) |
| 1914 | ప్రథమోద్యోగము |
| 1914-1920 | విజయనగర కళాశాలాధ్యక్ష్యము |
| 1920-1921 | సూపరింటెండెంట్ పదవి |
| 1922-1923 | కొవ్వూరు కళాశాలాధ్యక్ష్యము |
| 1923 | శ్రీనారసింహ సంస్కృతకళాశాలాస్థాపనము |
| 1927 | పుత్రోదయము |
| 1939 | పుత్రీవియోగము |
| 1947 | శ్రీనారసింహ సంస్కృతకళాశాలా భవననిర్మాణం |
| 1949 | ఎ.జె. కళాశాలాధ్యక్ష్యము |
| 1952 | షష్ఠిపూర్తి |
| 1958-1964 | భద్రాచల నివాసము |
| 1961 | రాష్ట్రపతి సన్మానము |
| 1968 | శ్రీనారసింహ సంస్కృతకళాశాలా గ్రంథాలయ భవననిర్మాణము |
| 1982 | పరమపదప్రాప్తి |

# ఉపయుక్త గ్రంథావళి

(BIBLIOGRAPHY)

## మూల గ్రంథములు

(ORIGINAL WORKS)

అగ్ని పురాణమ్
(6,7. సంచికలు)
వీరాస్వామి శాస్త్రి & వెంకటరామార్య
వర్తమాన తరంగిణీ ప్రెస్
చెన్నపట్టణము, 1880.

అభిజ్ఞానశాకున్తలమ్
రామదాస్ అయ్యంగార్, నెలటూరు
వేదం వెంకటరాయ శాస్త్రి బ్రదర్స్
చంద్రికా ముద్రణాలయము
మద్రాసు, 1957.

అమరకోశః
హరగోవింద శాస్త్రి
చౌఖంబా సంస్కృత సంస్థాన్
వారణాసీ, 1982.

ఆంధ్రనాయక శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1968.
ఆంధ్రనాయక శతకము
పురుషోత్తమకవి, కాసుల
నిర్మలా పబ్లికేషన్స్
విశాఖపట్టణము, 1975.

ఋగ్వేదసంహితా
శ్రీపాద దామోదర సాత్వలేకర్
స్వాధ్యాయ మండల్
పారడీ, 1956.

కఠోపనిషత్
[ఈశాద్యష్టోత్తరశతోపనిషదః]
వాసుదేవ శర్మ
నిర్ణయసాగర్ ప్రెస్
బొంబాయి, 1925.

కావ్యాలంకారః
పండిట్ దుర్గాప్రసాద్
వాసుదేవ లక్ష్మణ్ శాస్త్రి పణ్శీకర్
మోతిలాల్ బనారసీదాస్
ఢిల్లీ, 1983.

కుమారసంభవమ్
(కాళిదాస గ్రంథావళీ)
రేవాప్రసాద్ ద్వివేదీ
కాశీ హిందూ విశ్వవిద్యాలయః
వారాణసీ, 1976.

కృష్ణశతకమ్
వరదాచార్యులు, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1954.

కృష్ణశతకము
గొల్లపూడి వీరాస్వామి & సన్స్
రాజమండ్రి.

గాయత్రీ నీతిగీతావళిః
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1957.

గాయత్రీ నీతిగీతావళి
లక్ష్మణస్వామి, అడ్డేపల్లి
గాయత్రి & కో
మచిలీపట్టణము, 1957.

చంద్రాలోకః
సుబోధ చంద్ర పంత్
మోతిలాల్ బనారసిదాస్
ఢిల్లీ, 1987.

చిత్రమీమాంసా
జగదీశ చంద్ర మిశ్రః
చౌఖంబా సాంస్క్రిట్ సిరీస్
వారాణసీ, 1971.

తత్త్వకథనమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1935.

తైత్తిరీయోపనిషత్
(ఈశాద్యష్టోత్తరశతోపనిషదః)
వాసుదేవ శర్మ
నిర్ణయసాగర్ ప్రెస్
బొంబాయి, 1925.

ధ్వన్యాలోకః
(లోచన సహితః)

దుర్గాప్రసాద్ & పాండురంగవరబ్
నిర్ణయసాగర్ ప్రెస్

న చేద్వాల్మీకి రతవిష్కృత్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1939

నరసింహ శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1969

నరసింహ శతకము
ఎస్.ఐ. గోపాల్ & కో
మద్రాసు, 1977

నవరత్నమాలా
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1935

నాట్యశాస్త్రమ్
పండిట్ కేదారనాథ్
భారతీయ విద్యాప్రకాశన్
ఢిల్లీ, 1983

నైషధకావ్యమ్
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్
మద్రాసు, 1927

ప్రతాపరుద్ర యశోభూషణమ్

వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్
మద్రాసు, 1927

ప్రాస్తావిక కదంబః
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1930

భగవద్గీతా
రఘునాథాచార్య, ఎస్.బి.
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1985

భామహీయ కావ్యాలంకారః
తాతాచార్య, డి.టి.
శ్రీనివాస ప్రెస్
తిరుపతి, 1934

భావప్రకాశనము
మాధవరామశర్మ, జమ్మలమడక
సంగీతనాటక అకాడమీ
హైదరాబాద్, 1978

భాస్కర శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1955

భాస్కర శతకము
గొల్లపూడి వీరాస్వామి & సన్స్
రాజమండ్రి, 1986

భాషాశాస్త్ర సంగ్రహః
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు. 1933

మహాభాష్యమ్
భగవాన్ దేవాచార్య
హర్యానా సాహిత్యసంస్థా, రోహతక్
హర్యానా, 1962

మాళవికాగ్నిమిత్రమ్
[కాళిదాస గ్రంథావళీ]
రేవాప్రసాద్ ద్వివేదీ
కాశీ హిందూ విశ్వవిద్యాలయః
వారాణసీ, 1976

ముండకోపనిషత్
(ఈశాద్యష్టోత్తరశతోపనిషదః)
వాసుదేవ శర్మ
నిర్ణయసాగర ప్రెస్
బొంబాయి, 1925

రఘువంశమ్
(కాళిదాస గ్రంథావళీ)
రేవాప్రసాద్ ద్వివేదీ
కాశీ హిందూ విశ్వవిద్యాలయః
వారాణసీ, 1976

రసగంగాధరమ్
భట్ట మథురానాథ శాస్త్రి

మోతీలాల్ బనారసీదాస్
ఢిల్లీ, 1988

రామవిజయః
రఘునాథాచార్య, ఎస్. బి.
పద్మశ్రీ పబ్లికేషన్స్
తిరుపతి, 1976

వేమన శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1954

వేమన శతకము
శ్రీ అరుణా బుక్ హౌస్
మద్రాసు, 1972

వైయాకరణ సిద్ధాన్తకౌముది
గోపాలశాస్త్రి నేనే
చౌఖంబా సాంస్క్రిట్ సిరీస్
వారాణసీ, 1977

శతకత్రయమ్
(సుమతి, వేమన, దాశరథి శతకాని)
వరదాచార్య, ఎస్.టి.జి.
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1973

శతక సప్తకమ్
వరదాచార్య, ఎస్.టి.జి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాద్, 1963

శిశుపాలవధమ్
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్
మద్రాసు, 1923

శ్రీకాళహస్తీశ్వర శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1956

శ్రీకాళహస్తీశ్వర శతకము
గొల్లపూడి వీరాస్వామి & సన్స్
రాజమండ్రి

శ్రీదాశరథి శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1955

శ్రీదాశరథి శతకము
శ్రీ అరుణా పబ్లికేషన్స్
మద్రాసు, 1976

శృంగారప్రకాశః
రాఘవన్. వి.
వసంత ప్రెస్, అడయార్,
మద్రాసు, 1978

సత్యవిజయమ్

వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1972

సామవేద సంహితా
శ్రీపాద దామోదర సాత్వలేకర్
స్వాధ్యాయ మండల్
పారడీ, 1956

సాహిత్యదర్పణమ్
దుర్గాప్రసాద్ ద్వివేది
మెహర్‌చంద్ లక్ష్మణ్‌దాస్
న్యూఢిల్లీ, 1982

సుమతీ వేమన శతకాలు
(సంపూర్ణానువాదము)
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాద్

సుభాషిత రత్నభాండాగారమ్
నారాయణరామ ఆచార్య
ఎస్.ఎస్. ప్రకాశన్
బొంబాయి, 1952

సుమతీ శతకమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1954

సుమతీ శతకము

సూర్యరత్న ఆర్ట్ ప్రింటర్స్
రాజమండ్రి, 1975

సువర్ణ పుష్పమాల
రఘునాథాచార్య, ఎస్. బి.
తిరుపతి, 1980

సుషుప్తివృత్తమ్
వరదాచార్య, ఎస్.టి.జి.
చిట్టిగూడూరు, 1937

# పరిశీలనలు
(STUDIES)


అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి. — వేమన (IV Edition)
ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్
వాల్తేరు, 1971

ఆంజనేయశర్మ, వి. — విమర్శపత్త్రపద్ధతి రేవ II
సూతనాః కేచన అలంకారాః
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయః
తిరుపతి, 1986

ఆరుద్ర. — మన వేమన
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము
తిరుపతి, 1985

గోపాలకృష్ణారావు, కె. — ఆంధ్రశతకసాహిత్య వికాసము
హైదరాబాద్, 1976

నరసింహాచార్య, టి. — సాహిత్య సుధాలహరి
కల్పవల్లి పబ్లికేషన్స్
గూడూరు, 1979

పాండురంగవిఠల్, ఎస్. — కుసుమాంజలిః
గోపీరమణ పబ్లికేషన్స్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ సంస్కృత్
ఎస్.వి. యూనివర్సిటి
తిరుపతి, 1986

రామమూర్తి, జి. — వేమన

| | |
|---|---|
| | తిరుమల తిరుపతి దేవస్థానములు<br>తిరుపతి, 1982 |
| రాజవంశసహాయ హీరా. | భారతీయ సాహిత్యకోశ్<br>బీహార్ హిందీ అకాడమీ<br>పాట్నా, 1973 |
| వేంకటరమణశాస్త్రి, దుప్పూరి. | స్వీయచరిత్ర<br>రచయితల సహకారసంఘము<br>గుంటూరు–1976 |
| వేంకటరామశాస్త్రి, ఆర్.ఎస్. | భాషాశాస్త్ర ప్రవేశినీ<br>బాలమనోరమా ప్రెస్<br>మద్రాసు, 1938 |
| వేంకటావధాని, దివాకర్ల. | విశిష్టసత్యల ప్రకంప<br>ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ<br>పు. 97-100 హైదరాబాదు, 1973 |
| శ్రీరామదేశికన్, ఎస్.ఎస్. | వేమనపద్య సంస్కృతానువాదః<br>మద్రాసు, 1962 |
| సత్యనారాయణచౌదరి, కొత్త | కులపతి<br>భాషాపోషక గ్రంథమండలి<br>నిడుబ్రోలు, 1931 |
| | వైదిక వాఙ్మయచరిత్రము<br>భాషాపోషక గ్రంథమండలి<br>నిడుబ్రోలు, 1931 |

| | |
|---|---|
| Balu, V. | The Glory of Puttaparti |
| Bloomfield, Leonard | Language<br>George Allen & Unwin Ltd,<br>London, 1969 |
| Brown, C.P. | Verses of Vemana<br>Andhra PradeshSahitya Akadami<br>II edition, Hyderabad, 1977 |
| Burrow, T. | The Sanskrit Language<br>faber and faber<br>24 Russel square<br>London |
| De, S.K. | Studies in the History of<br>Sanskrit Poetics,<br>Culcutta, 1960 (II Edition) |
| Kamalam, S. Unni | Comparitive Philology<br>Madras, 1973 |
| Kane, P.V. | History of Sanskrit Poetics<br>Motilal Banarasi dass<br>Delhi, 1961 |
| Mani, Vettam | Puranic Encyclopaedia<br>Motilal Banarasi dass<br>Delhi, 1975 |
| S.N. Murti, M. | An Introduction to Sanskrit<br>Linguistics,<br>D K. Publications<br>Delhi, 1984 |
| Sharma, M.M. | The Dhvani theories in<br>Sanskrit Poetics, |

Chowkhamba Publications
Varanasi, 1968

Taraporawala, J.S. — Elements of the Science of Language
Culcutta University
1962 (3rd edition)

Tucker, T.G. — Introduction to the National History of Language,
London, 1908

(B) ENGLISH

Katre, S.M. — Panini and Indian Linguistics
Dr. B R. Sharma
Felicitation Volume
PP. 115-127, K.S. Vidyapeetham
Tirupati, 1986

Krishna Moorthy, K. — Dhvani and Rasa
Kavisekhar Badrinath jha
felicitation volume
PP. 267-281
Darbhanga, 1974

Varadacharya, S.T.G. — State of Sanskrit Studies in Andhra State
PP. 54-56
The Sanskrit Viswa
Parishat Souvenir
Tirupati, 1955

Raghavan, V. — Sanskrit lyrics
vedanta kesari
PP. 54-61,
Ramakrishna Mutt
Vol. XLV
Madras-1958

## (C) తెలుగు


| | |
|---|---|
| నరసింహశాస్త్రి, పోరి. | ధూర్జటి (సమీక్ష) భారతి, అక్టోబర్, 1972 |
| రామకోటీశ్వరరావు, కోలవెన్ను. | భారతవర్షచరిత్ర—జాతీయవాదుల సిద్ధాంతము, భారతి, సెప్టెంబర్, 1927 |
| వెంకటేశ్వర్లు, బులుసు. | శ్రీకాళహస్తీశ్వర శతకము (ధూర్జటి) ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రిక, 1960 |
| వేంకటకృష్ణశర్మ, వేదము. | శతకవాఙ్మయసర్వస్వము, కిన్నెర, ఫిబ్రవరి, 1955 |
| వేంకటరమణశాస్త్రి, దువ్వూరి. | సందేశము [అముద్రితము] మసకపల్లి, ద్రాక్షారామ, తూర్పుగోదావరి |
| శేషగిరిరావు. | శతకములు, వైదికావైదిక మతసమన్వయము భారతి, ఆగస్టు, 1940 |
| సుబ్రహ్మణ్యశాస్త్రి, కోటకూచి. | వాల్మీకి-కాళిదాసు భారతి, జనవరి, 1943 |

హనుమచ్ఛాస్త్రి, జానమద్ది
భాషాశాస్త్రద్రష్ట – మహాకవి
పాణిని
తెలుగువైజ్ఞానిక పత్రిక
పు. 9–16
తెలుగు అకాడమీ
హైదరాబాద్, 1979.

★

# సంకేత పద సూచి
## (ABBREVIATIONS)

| | |
|---|---|
| అ.పు | అగ్నిపురాణము |
| అ.కో | అమరకోశః |
| అ.శా | అభిజ్ఞానశాకున్తలమ్ |
| ఆం.నా.శ. | ఆంధ్రనాయక శతకము |
| ఆం.శ.సా.వి | ఆంధ్రశతక సాహిత్యవికాసము |
| ఋ.సం | ఋగ్వేద సంహితా |
| క.ఉ | కఠోపనిషత్ |
| కా.అ | కావ్యాలంకారః |
| కు. | కులపతి |
| కు.సం | కుమారసంభవమ్ |
| కు.సు | కుసుమాంజలిః |
| కృ.శ | కృష్ణ శతకమ్ |
| కృ.శ | కృష్ణ శతకము |
| గా.నీ.గీ | గాయత్రీ నీతిగీతావళి |
| గా.నీ.గీ | గాయత్రీ నీతిగీతావళిః |
| చంద్రా | చంద్రాలోకః |
| చి.మీ | చిత్రమీమాంసా |
| త.క | తత్త్వకథనమ్ |
| తై.ఉ | తైత్తిరీయోపనిషత్ |
| ధ్వ.న్యా | ధ్వన్యాలోకః (సలోచనః) |
| న.మా | నవరత్నమాలా |
| న.వా | న చేద్వాల్మీకిరభవిష్యత్ |
| న.శ | నరసింహ శతకమ్ |
| న.శ | నరసింహ శతకము |
| నా.శా | నాట్యశాస్త్రము |

| | |
|---|---|
| నై.కా | నైషధకావ్యమ్ |
| ప్ర.య.భూ | ప్రతాపరుద్రీయ యశోభూషణమ్ |
| ప్రా.క | ప్రాస్తావిక కదంబః |
| భ.గీ | భగవద్గీతా |
| భా.కా | భామహీయ కావ్యాలంకారః |
| భా.ప్ర | భావప్రకాశము |
| భా.శ | భాస్కర శతకమ్ |
| భా.శ | భాస్కర శతకము |
| భా.శా.ప్ర | భాషాశాస్త్ర ప్రవేశినీ |
| భా.శా.సం | భాషాశాస్త్ర సంగ్రహః |
| భా.సా.కో | భారతీయ సాహిత్యకోశ్ |
| మ.భా | మహాభాష్యము |
| మ.వే | మన వేమన |
| మాళవి | మాళవికాగ్నిమిత్రమ్ |
| ముం.ఉ | ముండకోపనిషత్ |
| ర.వం | రఘువంశమ్ |
| ర.గం | రసగంగాధరమ్ |
| రా.వి | రామవిజయః |
| వి.త. | విమర్శప్రత్యప్రదైరేవ |
| వి.స.ప్ర | విశిష్టసభ్యుల ప్రశంస |
| వే. | వేమన |
| వే.స.సం | వేమనసద్యసంస్కృతానువాదః |
| వే.శ | వేమన శతకమ్ |
| వే శ | వేమన శతకము |
| వై.వా.చ | వైదికవాఙ్మయ చరిత్రము |
| వై.సి.కౌ | వైయాకరణ సిద్ధాన్తకౌముది |
| శ.త్ర | శతక త్రయమ్ |
| శ.స | శతక సప్తకమ్ |

| | |
|---|---|
| శి.వ | శిశుపాలవధమ్ |
| శ్రీ.కా.శ | శ్రీకాళహస్తీశ్వర శతకమ్ |
| శ్రీ కా.శ | శ్రీకాళహస్తీశ్వర శతకము |
| శ్రీ.దా.శ | శ్రీదాశరథి శతకమ్ |
| శ్రీ.దా.శ | శ్రీదాశరథి శతకము |
| శృ.ప్ర | శృంగార ప్రకాశః |
| స.వి | సత్యవిజయమ్ |
| సా.సం | సామవేద సంహితా |
| సా.ద | సాహిత్యదర్పణమ్ |
| సా.సు.ల | సాహిత్యసుధాలహరి |
| స్వీ.చ | స్వీయ చరిత్ర |
| సు ర.భాం | సుభాషితరత్నభాండాగారమ్ |
| సు.శ | సుమతి శతకమ్ |
| సు.శ | సుమతి శతకము |
| సు.పు | సువర్ణపుష్పమాలా |
| సు.వృ | సుషుప్తివృత్తమ్ |
| సు.వే.శ | సుమతీ-వేమన శతకాలు |

# పరిశోధన పత్రములు
# (RESEARCH PAPERS)

## (A) संस्कृतम्


उमारमण झा.　स्वातन्त्र्योत्तर संस्कृतरूपकेषु दार्शनिक तत्त्वानि
डा. बि. आर. शर्मणाम् अभिनन्दन ग्रन्थः
पृ. १५४–१६६. केन्द्रीय संस्कृतविद्यापीठम्,
तिरुपति, १९८६.

नरसिंहाचार्यः, टि.　कुलपतेः परिचयः,
साहित्यसुधालहरी, पृ. ७३–७८
कल्पवल्ली पब्लिकेषन्स्, गूडूरु, १९७९.

शङ्करभट्टः, उ.　रसादिरलङ्कारः
डा. बि. आर. शर्मणाम् अभिनन्दनग्रन्थः
पृ. १९०–१९६, केन्द्रीय संस्कृतविद्यापीठम्
तिरुपति, १९८६.

श्रीकृष्णशर्मा.　काव्यं सृष्टिः न कला
डा. बि. आर. शर्मणाम् अभिनन्दनग्रन्थः
पृ. २०५-२१५, केन्द्रीय संस्कृतविद्यापीठम्
तिरुपति, १९८६.

| | |
|---|---|
| C.P | : Comparitive Philology |
| D.S.P | : Dhvani Theories in Sanskrit Poetics |
| F.S.I | : Elements of Science of Language |
| G.P | : The Glory of Puttaparti |
| H.S P. De | : History of Sanskrit Poetics |
| H.S.P Kane | : History of Sanskrit Poetics |
| I.N.H.L | : Introduction to the National History or Language |
| I.S L | : An Introduction to Sanskrit Linguistics |
| L. | : Language |
| P E | : Puranic Encyclopaedia |
| S-L | : The Sanskrit Language |
| V.V | : Verses of Vemana |



Name : Dr. S. Panduranga Vithal
M A ,Ph D., Vyakarana Siromani

Present Position ; Research Associate [UGC]
Department of Sanskrit,
S.V. University, TIRUPATI.

Topic of Research : A study of 'Kalaprapurna'
S.T.G. Varadacharya's works

Publications :
Books : 1. Kusumanjali
2. Vyasasudha

Research Papers : 25 on Various Subjects